# బంగారు తెలంగాణ దిశగా

## తొలి అడుగులు




# తెలంగాణ సామాజిక ఆర్థిక చిత్రం 2015

**తెలంగాణ ప్రభుత్వం**

**ప్రణాళికాశాఖ**

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సామాజిక ఆర్థిక చిత్రం - 2015

© TELANGANA STATE DEVELOPMENT PLANNING SOCIETY

Planning Department,

Government of Telangana

3rd Floor, D-Block, Secretariat, Hyderabad - 500 022

Phone - 040 - 2345 4588

2nd Print

Copies - 2000

September - 2015

**Price - 250/-**

# విషయ సూచిక


| వరుస సంఖ్య | | పేజీలు |
|---|---|---|
| | **అధ్యాయం 1** | |
| | **బంగారు తెలంగాణ దిశగా** | |
| 1.1 | తొలి అడుగులు | 3-8 |
| 1.2 | తెలంగాణ సామాజిక-ఆర్థిక చిత్రం మరియు అభివృద్ధి చిత్రణ | 9-19 |
| | **అధ్యాయం 2** | |
| | **వ్యవసాయం, సంబంధిత రంగాల ప్రక్షాళన** | |
| 2.1 | వ్యవసాయ రంగం - సవాళ్లు, అవకాశాలు | 23-42 |
| 2.2 | ఉద్యాన వన పోషణ - సరికొత్త ప్రయత్నాలు | 43-47 |
| 2.3 | పశుగణాభివృద్ధి, మత్స్యాభివృద్ధి | 48-54 |
| 2.4 | అటవీ విస్తీర్ణం, విస్తరణ | 55-58 |
| | **అధ్యాయం 3** | |
| | **సంక్షేమం & సామాజిక అభివృద్ధి** | |
| 3.1 | సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ | 61-78 |
| 3.2 | సామాజిక అభివృద్ధి | 79-96 |
| | **అధ్యాయం 4** | |
| | **ఆర్థిక మౌలిక సదుపాయాలు మరియు పారిశ్రామిక విధానం** | |
| 4.1 | ఆర్థిక, మౌలిక సదుపాయాల మెరుగుదల | 99-115 |
| 4.2 | నూతన పారిశ్రామిక విధానం | 116-142 |
| | **అధ్యాయం 5** | |
| | **విశ్వనగరంగా హైదరాబాద్** | |
| 5.1 | విశ్వ నగరం - ఒక దార్శనికత | 145-148 |
| 5.2 | ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాల అభివృద్ధి | 149-152 |
| | **గణాంకాలలో తెలంగాణ** | **153-190** |

# అధ్యాయం 1

# బంగారు తెలంగాణ దిశగా

# 1.1 తొలి అడుగులు

*"వెయ్యి అడుగుల ప్రయాణం సైతం ఒక్క అడుగుతోనే మొదలవుతుంది..."*
*- ఇజ్రాయెల్‌మోర్ అయివోర్, షేపింగ్ ది డ్రీమ్*

భారత రిపబ్లిక్‌లో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం ఒక చరిత్రకు ముగింపు. ఒక నూతనాధ్యాయానికి శ్రీకారం. రాజకీయంగా, సాంస్కృతికంగా తమకొక ప్రత్యేకమైన గుర్తింపును కోరుతూ తెలంగాణ ప్రజానీకం ఆరు దశాబ్దాల పాటు సాగించిన సుదీర్ఘ పోరాటానికి ఇది ముగింపు. ఈ ప్రాంతపు ప్రత్యేక అవసరాలను తీర్చడానికి, ఇక్కడి ప్రజల మేధాసంపత్తికి దీటుగా ఒక కొత్త గుర్తింపును, విధానాలను, కార్యక్రమాలను రూపకల్పన చేసుకునే ప్రక్రియకు ఇది శ్రీకారం. గతంలోని ప్రభుత్వ పథకాలలో చాలా భాగం పక్షపాతంతో కునారిల్లిపోయాయి. ఫలితంగా తప్పుల దిద్దుబాట్లు, సరైన దృక్పథం కోసం శ్రద్ధాసక్తులతో చేయాల్సిన మార్పులు, సరికొత్త రూపకల్పనలు నేడు అత్యవసరమయ్యాయి. నూతన రాష్ట్ర ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాలు ఇదే. గౌరవనీయులైన ఆర్థిక మంత్రి శ్రీ ఈటెల రాజేందర్ 2014 నవంబర్ 5వ తేదీన చేసిన బడ్జెట్ ప్రసంగంలో ఈ అంశాన్నే ఇలా వ్యక్తం చేశారు:

"ఆరు దశాబ్దాలకు పైగా, రెండు తరాల ప్రజలు జరిపిన సుదీర్ఘ పోరాట ఫలితంగానే మన తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఈ పోరాటంలో చాలా మంది తమకున్న కొద్దిపాటి ఆస్తిపాస్తులను, ఆదాయాలనూ సైతం కోల్పోయారు. కొందరు తమ ప్రాణాలనే కోల్పోయారు. వారందరికీ మేం వందనం చేస్తున్నాం. అలాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో అన్ని వర్గాల ప్రజలనూ విజయవంతంగా నడిపించడంలో గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారు అందించిన ప్రాణప్రదమైన సేవలను కూడా చరిత్ర ఎన్నటికీ గుర్తుంచుకుంటుందని స్పష్టం చేస్తున్నాం."

"ఈ తరమే కాదు. రాబోయే తరాల ఆశలనూ, ఆకాంక్షలనూ నెరవేర్చేలా రాష్ట్ర వనరులను అత్యంత వివేకవంతంగా వినియోగించే బాధ్యత ఈ తరుణంలో ప్రభుత్వం మీద ఉంది. దానికి అనుగుణంగానే, తెలంగాణ ప్రజలకు సముజ్జ్వల భవిష్యత్తును ఇవ్వడానికి అత్యంత ప్రాముఖ్యతనిస్తూ, ప్రభుత్వం ఈ బడ్జెట్‌ని ప్రవేశపెడుతోంది."

"చేజారిన అవకాశాల గురించి, తెలంగాణను పనిగట్టుకుని నిర్లక్ష్యం చేసిన ఫలితంగా పేరుకుపోయిన సమస్యల గురించి మనకు అవగాహన ఉంది. చారిత్రక తప్పిదాలను సరిదిద్దడం ఒక్కటే కాదు. జనాభాలో అత్యధిక భాగానికి అత్యంత శీఘ్రంగా సామాజిక, ఆర్థిక న్యాయాన్ని అందించడం కూడా ప్రభుత్వం ముందున్న తక్షణ కర్తవ్యం."

"తెలంగాణ అన్ని రంగాలలోనూ దెబ్బతినిపోయింది. ప్రత్యేక రాష్ట్ర సాధన సాకారంతో స్వయం పరిపాలన ఫలాలను ప్రజలు గుర్తిస్తున్నారు. రాష్ట్ర వ్యవహారాల మీద మనకు ప్రత్యక్ష నియంత్రణ ఉన్నప్పటికీ, రాష్ట్రాభివృద్ధికి మనం చేస్తున్న ప్రయత్నాలకు అడ్డంకులను సృష్టించడానికి ఎన్నో పరోక్ష- శక్తులు కాచుకుని ఉన్నాయి."

"అభివృద్ధి పథంలో ఎదురు నిలచిన అన్ని అడ్డంకులనూ ప్రజల క్రియాశీలమైన అండదండలతో అధిగమించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. కృతనిశ్చయంతో ఉంది. ఏ దీక్ష, అంకిత భావాలతో మనం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామో, అదే స్ఫూర్తిని కొనసాగించుకుని 'బంగారు తెలంగాణ' లక్ష్యసాధన దిశగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తామని నేను ప్రగాఢమైన నమ్మకంతో ఉన్నాను."

"రాష్ట్రాన్ని పునర్నిర్మించడం కోసం మనం తెలంగాణకు కొత్త దిశను నిర్దేశించుకోవలసి ఉంది. తెలంగాణను పునరావిష్కరించుకోవలసిన అవసరముంది. ఇందుకు అడ్డదారులు, సుఖోపాయాలు ఏవీ లేవని అందరికీ తెలిసిన సంగతే. నిర్లక్ష్యం వలన గతమంతటికీ కలిగిన గాయాలకు చికిత్స చేయడానికి మనం దృఢదీక్షా దక్షతలతో చర్యలు తీసుకోవలసి ఉంది."

2014 నవంబర్‌లో సమర్పించిన బడ్జెట్ ఏదో పద్దుల ప్రకటన ఎంతమాత్రం కాదు. ఉబికి వస్తున్న ప్రజల అవసరాలను తీర్చడానికి, వృద్ధి అవకాశాలను గరిష్ఠ స్థాయిలో సద్వినియోగం చేయడానికి, వివిధ రంగాలలో అభివృద్ధి పథం తొక్కడానికి తెలంగాణ చేపట్టిన

ప్రయత్నమది. ప్రతి ఒక్క రంగంలోనూ పరిష్కారం అవసరమైన సమస్యలను, తిరిగి వాటిలో తెలంగాణకు ప్రత్యేకమైన అంశాలను గుర్తించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇది ఖచ్చితంగా గతంలోని నిర్లక్ష్యపు విధానాల నుంచి పనిగట్టుకుని తెస్తున్న మంచి మలుపు. గడచిన కొన్ని నెలలలోనే వివిధ రంగాలలో కొన్ని గణనీయమైన తొలి చర్యలను తీసుకోవడమూ, అవి అప్పుడే ఫలితాలను ఇవ్వడమూ కూడా మొదలయింది. ఈ కొత్త పథకాలలో కొన్నింటి ప్రభావాన్ని విశ్లేషించడానికి, అవసరమైన తదుపరి చర్యలను గుర్తించడానికీ ఈ పత్రం ఉద్యుక్తమవుతోంది. కొత్త పథకాలు నిలదొక్కుకోవడం, లబ్దిదారులుగా ఉద్దేశించిన వ్యక్తులు / బృందాల వరకు వాటి ఫలాలను తీసుకువెళ్లడమే అసలైన సవాలు. ప్రణాళికా ప్రక్రియకు ప్రజలనే కేంద్రబిందువుగా చేసేలా ప్రభుత్వ విధానాల స్థితిగతులను మార్చవలసిన అవసరముంది. ఈ లక్ష్య సాధనకు తెలంగాణ ప్రభుత్వం కృతనిశ్చయంతో కట్టుబడి ఉంది. గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర రావు గారు చెప్పినట్లుగా, ''సమాజంలో అణగారిన వర్గాలు వెనుకబాటుతనంతోనే గనుక ఉండిపోయినట్లైతే, వృద్ధి, న్యాయం అనే మాటలకు అర్థమేలేదు'' అని దృఢంగా నమ్ముతాను. ''అట్టడుగు వర్గాలను కూడా కలుపుకొని అభివృద్ధి చెందడం అంటే ప్రయోజనాలు, ఆర్థికపరమైన అవకాశాలు వారివరకూ విస్తృతంగా ప్రవహించాలి. అంతే కాదు, అభివృద్ధిలో వారు భాగస్వాములు కావాలి. వారి సాధికారత పెంపొందాలి - అనే భావాలతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. ఇవన్నీవిడువరాని కీలక అంశాలు. ఈ ఏడాది జూన్‌లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలన్నీ పూర్తిగా వీటి ఆధారంగా జరుగుతున్నవే.''

విధాన ప్రకటనల పురోగతి, విశ్లేషణలు, కార్యక్రమాల శ్రీకారాలను తెలంగాణ పునరావిష్కరణలో తొలి అడుగులుగా చెప్పుకోవచ్చు. ప్రగతి బాటలో, 'బంగారు తెలంగాణ' స్వప్న సాకార పథంలోని మైలురాళ్లకు, దార్శనికతకు ఈ కార్యక్రమాలు, ప్రగతి ప్రకటనలు ఉపయోగకరమైన సూచికలుగా నిలుస్తాయి. నూతన దార్శనికతను స్థూలంగా ఒక్క ముక్కలో 'పురోగతి - అందరికీ న్యాయం'గా పేర్కొనవచ్చు. కొత్త నాయకత్వం దృష్టిలో ప్రగతి అనేది కేవలం స్థూల జాతీయోత్పత్తి అంకెలు సూచించే భౌతికమైన అభివృద్ధి కాదు. అది ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కోణాలన్నింటితో సహా ప్రజల నిరంతర యోగక్షేమాలను, నిలకడ అయిన అభివృద్ధితో కూడిన ప్రగతి. అంతే కాదు. ఈ ప్రగతి, అభివృద్ధులలో నిలదొక్కుకునే కృషిలో రాష్ట్రం, భవిష్యత్ తరాల అవసరాలను తీర్చే సామర్థ్యంలో ఏమాత్రం కుంటుపడకూడడానికీ వీల్లేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మొదలు పెట్టిన అనేక నూతన ప్రయత్నాలు, చేసిన విధాన ప్రకటనలలో రాష్ట్ర నాయకత్వం ఈ దార్శనికతను పొందుపరచింది. ఈ పరిణామాలను, విధానపరమైన నూతన ప్రయత్నాలను సంక్షిప్తంగా సమీక్షించడం ఇక్కడ సందర్భోచితంగా ఉంటుంది.

తాజా అంచనాల ప్రకారం 2014-15లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.ఎస్.డి.పి) వృద్ధి 5.3 శాతం ఉండగలదని లెక్కతేలుతోంది. 2013-14లో ఈ వృద్ధి రేటు 2004-05 స్థిర రేట్ల ప్రాతిపదిక మీద 4.8 శాతంగా నమోదయింది. దీనితో గడచిన మూడేళ్లలో నమోదైన పతన ధోరణి మార్పు చెంది, అభివృద్ధివైపు మళ్లిందని తేటతెల్లమవుతుంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా గత ఏడాదిలో వ్యవసాయ వృద్ధి దెబ్బతింది. అయినప్పటికీ పశుసంపద, అటవీ సంపద, మత్స్య సంపద వంటి అనుబంధ రంగాలలో వరుసగా 6.5, 2.7, 11.4 శాతం వృద్ధి నమోదయింది. గణనీయమైన స్థాయిలో పారిశ్రామిక వృద్ధి 4.1 శాతం రేటును, ఆరోగ్య సేవల రంగం వృద్ధి 9.7 శాతం రేటును సాధించాయి. ఇవి రాష్ట్ర జి.ఎస్.డి.పి మొత్తం మీద పెరగడానికి ప్రధానంగా దోహదం చేశాయి.

వర్తమాన ధరల వద్ద రాష్ట్ర మొత్తం జి.ఎస్.డి.పి 4 లక్షల కోట్ల రూపాయల స్థాయిని అధిగమించడం ఒక గణనీయమైన అంశం. జి.ఎస్.డి.పిలోని ఈ సానుకూల వృద్ధి 2014-15లో తలసరి ఆదాయాన్ని కూడా పెంచింది. 2013-14లో వర్తమాన ధరల వద్ద నమోదైన రూ. 95,361 కోట్లతో పోలిస్తే, రాష్ట్ర తలసరి ఆదాయం 2014-15లో రూ. 1,03,889లకు పెరిగింది. ఇది అఖిల భారత స్థాయి తలసరి ఆదాయం రూ. 88,533కన్నా గణనీయంగా ఎక్కువ.

తెలంగాణను పునరావిష్కరించాలన్న నూతన దార్శనికతకు, తెలంగాణ ప్రజల అవసరాలనూ, ఆకాంక్షలను నెరవేర్చాలన్న దృక్పథానికీ అనుగుణంగా ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసింది. ప్రత్యేకించి వెనుకబడిన వర్గాలైన ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ వర్గాల మీద ప్రత్యేక శ్రద్ధతో ఈ పథకాలను ముందుకు తెచ్చింది.

ప్రభుత్వం చేపట్టిన అత్యంత ముఖ్యమైన సంక్షేమ ప్రయత్నాలలో ఒకటి గత ఏడాదిలో ప్రారంభించిన 'ఆసరా' పింఛన్ పథకం. అది పేద వర్గాలకు, విధివంచితులైన వితంతువులు, నేత పని వారు, కల్లుగీత కార్మికులు, వృద్ధులు, ఎయిడ్స్ రోగులు సమాజంలో కనీసపాటి హుందాతనంతో జీవించడానికి ఉద్దేశించినది. ఈ పథకం ద్వారా వారికి నెలనెలా 1,000 రూపాయలను సహాయంగా అందజేస్తారు. అదే రీతిలో బీడీ కార్మికులలో అర్హులైన ప్రతి ఒక్కరికి నెలకు 1,000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేయడానికి సంక్షేమ చర్యల ప్రకటన జరిగింది. ఆర్థికంగా నిస్పృహ చెందిన మరొక వర్గం మరమగ్గాల నేత కార్మికులకు సంబంధించినది. వారికి ప్రత్యేక రుణమాఫీ పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

కొత్త ప్రభుత్వం చేపట్టిన మరొక విశిష్టమైన సంక్షేమ కార్యక్రమం భూమి కొనుగోలు పథకం. అది భూమి లేని ఎస్.సి మహిళలు నికరమైన జీవనోపాధిని పొందడానికి వీలుగా మూడెకరాల వ్యవసాయ భూమిని సమకూరుస్తుంది. దానితో పాటు సేద్యపు నీటి సదుపాయాలనూ, ఎత్తిపోతల సాధనాలనూ, భూమి అభివృద్ధి, ఇతర వ్యవసాయ అవసరాలనూ సమకూర్చుతుంది.

ఏ ఇంటిలోనైనా ఆడపిల్ల పెళ్లి ఒక పెద్ద శుభకార్యం. చాలా కుటుంబాలు రుణగ్రస్తం కావడానికి మూలం కూడా అదే. ప్రత్యేకించి పేద కుటుంబాలు ఈ సందర్భంగా అప్పుల ఊబిలో దిగబడిపోతాయి. వివాహ శుభకార్యం సందర్భంగా ఎస్.సి, ఎస్.టి కుటుంబాలకు సాయపడడానికి, రుణగ్రస్తులు కాకుండా వారిని కాపాడడానికి 'కళ్యాణ లక్ష్మి పథకాన్ని' ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికింద ఎస్.సి, ఎస్.టి కుటుంబాలు తమ ఆడపిల్లల పెళ్లి చేసేటప్పుడు, వివాహ సమయంలో వధువుకు రూ. 51,000 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. అదే రీతిలో ముస్లింలు, క్రైస్తవులు, సిక్ఖులతో సహా అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన ఇళ్లలో ఆడపిల్ల వివాహం జరిగేటప్పుడు 'షాదీ ముబారక్' పథకం కింద ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తుంది.

రాష్ట్ర జనాభాలో 2.97 శాతం మంది వైకల్యాలతో సతమతమవుతున్నారు. వారికి నెల నెలా రూ. 1,500 పింఛన్ ఇచ్చే విధానాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అదే విధంగా వృద్ధ కళాకారులకు ఇచ్చే నెలవారీ పింఛన్‌ను రూ. 1,500కి పెంచింది.

మన రాష్ట్ర జనాభాలో మహిళలు దాదాపు 50 శాతం ఉన్నారు. ప్రగతికి, అభివృద్ధికి వారి సంక్షేమం, భద్రత అత్యంత కీలకమైనవి. గర్భిణులకు, బిడ్డలకు పాలిస్తున్న తల్లులకు పోషకాహారం ఎంతో అవసరం. ఇట్టి ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని మహిళలకు ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పుష్టికరమైన ఒక సంపూర్ణ భోజనాన్ని సమకూర్చడానికి ప్రభుత్వం 'ఆరోగ్య లక్ష్మి' కార్యక్రమాన్ని ఇటీవలనే ప్రారంభించింది.

రాష్ట్రంలోని పేద కుటుంబాలకు ఆహార భద్రతను, తగినంత పోషణను సమకూర్చడానికి ప్రభుత్వం చౌకధరలకు సరఫరా చేసే బియ్యం పరిమాణాన్ని పెంచింది. అర్హుడైన పేద వ్యక్తికి దీని ప్రకారం 2015 జనవరి 1వ తేదీ నుంచి కిలో రూపాయి ధరకు నెలకు 6 కిలోల బియ్యం లభిస్తాయి. కుటుంబంలో ఎందరు సభ్యులుంటే అంతమందికీ ఈ లెక్క ప్రకారం చౌకబియ్యం లభిస్తాయి. గతంలో ఈ బియ్యం పొందడానికి గ్రామీణ ప్రాంతాలలో వార్షిక ఆదాయం రూ. 60,000 మించి ఉండకూడదు. ఇప్పుడు ఈ హద్దును రూ. 1.50 లక్షలకు సడలించారు. అలాగే పట్టణ ప్రాంతాలలో రూ. 75,000 నుంచి రూ. 2.00 లక్షలకు సడలించారు.

ఒక హాలు, వంటగది, స్నానాల గది, మరుగుదొడ్డిలతో రూ. 3.5 లక్షల ఖర్చుతో రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి, పేదకుటుంబాల ఆవాస అవసరాలను తీర్చడానికి కూడా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

ప్రభుత్వ ఉద్యోగులు అందించిన సహకారాన్ని గుర్తిస్తూ ప్రభుత్వం, వారి వేతనాలను 43 శాతం ఫిట్‌మెంట్‌తో ఉదారంగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. నగదు జమ చెయ్యాల్సిన అవసరం లేని రీతిలో, నిర్ణీత ఆస్పత్రులలో చికిత్స పొందడానికి వీలుగా ఆరోగ్య కార్డులను జారీ చేసింది.

పోరాటంలో పాత్రికేయులు, న్యాయవాదులు నిర్వహించిన పాత్రను కూడా గుర్తిస్తూ ప్రభుత్వం వారికి సముచిత రీతిలో ప్రతిఫలాలను అందజేసింది.

అత్యంత కీలకమైన సాంఘిక రంగాలు విద్య, వైద్యం. అవి లేకుండా ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యం కాదు. దశలవారీగా, ఒక విధానం ప్రకారంగా కె.జి నుంచి పి.జి వరకు ప్రభుత్వ విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయడానికీ, పటిష్ఠం చేయడానికీ ప్రభుత్వం పూనిక వహించింది. ప్రజా ఆరోగ్య వ్యవస్థలను పునరుద్ధరించడానికి, వాటి మీద సామాన్య పౌరుడు ఆధారపడగలిగేలా, అతడి స్థోమతకు అవి అందుబాటులో ఉండేలా చేయడానికి కూడా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. 'బంగారు తెలంగాణ' లక్ష్యాన్ని సాకారం చేయడానికి వీలుగా ప్రజలను విద్యావంతులుగా చేయడానికీ, వారి ఆరోగ్యాన్ని, యోగక్షేమాలను అభివృద్ధి చేయడానికీ ఈ రెండు ముఖ్య రంగాలలో తగినన్ని పెట్టుబడులు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్ర ఆదాయంలో వ్యవసాయ భాగం తగ్గుతోంది. అయినప్పటికీ, ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో వ్యవసాయరంగం కీలకమైనది అనడానికి సందేహం అక్కర్లేదు. కారణం రాష్ట్ర జనాభాలో ఎక్కువ భాగం ఇప్పటికీ గ్రామాలలోనే నివసిస్తున్నారు. వారు తమ జీవనోపాధి కోసం, ఆహార భద్రత కోసం వ్యవసాయం మీద, దాని అనుబంధ రంగాల మీదనే ఆధారపడుతున్నారు. అయితే భూమి ఉత్పాదకత తగ్గిపోవడం, నీటి కొరత, గిట్టుబాటు కాని ధరలు, వ్యవసాయం ఖర్చులు భారంగా మారిపోవడం, వాతావరణ మార్పుల ప్రభావం అన్నీ కలసి ప్రస్తుతం ఈ రంగం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ పునరావిష్కరణలో భాగంగా వ్యవసాయ రంగాన్ని పునరుజ్జీవింపజేయాల్సిన అవసరముంది. గ్రామాలలో నిస్పృహను, రైతుల ఆత్మహత్యలను నివారించడానికి సేద్యాన్ని గిట్టుబాటయ్యే వ్యవసాయంగా మార్చాల్సి ఉంది. అన్నింటి కన్నా ముందుగా రైతు కుటుంబాలలో నిస్పృహను రూపుమాపటానికి తక్షణ స్పందనగా ప్రభుత్వం కుటుంబానికి లక్ష రూపాయల వరకు రుణమాఫీని ప్రకటించింది. తదుపరి, పండించిన పంటకు గానూ రైతుకు గిట్టుబాటు ధరలను అందించడానికి, మార్కెట్‌లోని హెచ్చుతగ్గుదలను తట్టుకోవడానికి రూ. 400 కోట్లతో ప్రభుత్వం నిధిని నెలకొల్పింది.

వ్యవసాయాన్ని పునరావిష్కరించే దీర్ఘకాల చర్యగా, 'మిషన్ కాకతీయ' పేరుతో ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాన్ని కొత్త ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో సాగునీటి, మంచి నీటి రంగాలకు ప్రయోజనం కలిగేలా సంప్రదాయకమైన చెరువులనూ, చిన్న తరహా

సేద్యపు నీటి సదుపాయాలనూ ప్రభుత్వం పునరుద్ధరిస్తుంది. రాష్ట్రంలో సాగునీటితో జరిగే వ్యవసాయాన్నిపెంచడానికి వీలుగా చెరువు నీళ్ల లభ్యతను, భూగర్భ జలాల లభ్యతను మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం ఉపకరిస్తుంది.

వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న వివిధ రంగాలను విస్తరించడం ద్వారా, వ్యవసాయోత్పత్తుల విలువను పెంచడం ద్వారా సేద్యాన్ని లాభసాటిగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా విత్తనాభివృద్ధికి రాష్ట్రాన్ని నెలవుగా చేయడం మీద దృష్టిని కేంద్రీకరించింది. తద్వారా రాష్ట్రాన్ని "విత్తన భాండాగారం" (సీడ్ బౌల్)గా అభివృద్ధి చేయాలని తలపెట్టింది. ఇంకా గ్రీన్‌హౌస్ సాంకేతిక ప్రక్రియల ద్వారా, ఆధునిక సేద్యపు ఉపాయాల ద్వారా ఉద్యాన వన విభాగాన్ని అభివృద్ధి చేయాలని కృతనిశ్చయంతో ఉంది. సేద్యం గిట్టుబాటు కావడానికి వీలుగా కమతాలను ఒక పరిమాణానికి తగ్గకుండా చూడాలనీ, అందుకు గానూ పక్క పక్క కమతాలను కలిపి, ఆర్థికంగా పటిష్ఠం చేయాల్సిన అవసరముందనీ ప్రభుత్వం ప్రబోధిస్తోంది. రాష్ట్రంలో పాడి, మత్స్య రంగాలకు కూడా ప్రభుత్వం అండదండలనిస్తోంది. ప్రభుత్వ పాడి సమాఖ్యకు పాలను సరఫరా చేస్తున్న పాడి రైతులు లీటరుకు అదనంగా 4 రూపాయలను పొందుతారు. చెరువులను, చిన్న తరహా సేద్యపు నీటి వనరులను పునరుద్ధరించడం వల్ల రాష్ట్రంలో మంచినీటి చేపల సంపద బాగా విస్తరించగలదని ఆశిస్తున్నారు. వ్యవసాయ ఖర్చులను తగ్గించడానికి, భూమి ఉత్పాదనను పెంపొందించడానికి, వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ట్రాక్టర్ల మీద, ట్రెయిలర్ల మీద పన్నులను తగ్గించింది.

ఆర్థిక వృద్ధిని, అభివృద్ధిని వేగంగా సాధించడానికి, ఆర్థిక, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి పునాది. కీలకమైన ఈ అవసరాన్ని తీర్చడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దీనికనుగుణంగా ఈ రంగాలలో కీలకమైన పెట్టుబడులకు ప్రభుత్వం పథకాలు వేస్తోంది.

తాగు నీరు ఒక ప్రాథమిక అవసరం. తాగు నీరు ప్రతి ఒక్క పౌరుడి స్థోమతకూ అందుబాటులో ఉండాలి. ఈ లక్ష్యాన్ని నెరవేర్చడానికి సేద్యపు నీటి ప్రాజెక్టులలో 10 శాతం నీటిని ప్రభుత్వం తాగునీటికి ప్రత్యేకించింది. నీటి గొట్టాలను కలపడం ద్వారా, అన్ని ప్రాజెక్టులనూ, నివాస ప్రాంతాలనూ అనుసంధానం చేసి, ప్రతి ఒక్క ఇంటికీ నీటి గొట్టాల ద్వారా మంచి నీటిని సరఫరా చేయడానికి "తెలంగాణ తాగు నీటి సరఫరా ప్రాజెక్టు"ను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు గానూ రూ. 40,000 కోట్లను ప్రభుత్వం కేటాయించి వచ్చే మూడు, నాలుగేళ్లలో దీనిని అమలు చేయాలని ప్రతిపాదించింది.

పారిశ్రామికీకరణకు, సర్వతోముఖాభివృద్ధికీ కీలకమైనది విద్యుచ్ఛక్తి. గతంలో పెట్టుబడులు తగినన్ని జరగని కారణంగా, విభజన అనంతరం కొత్త రాష్ట్రంలో విద్యుచ్ఛక్తికి తీవ్రమైన కొరత ఏర్పడింది. ఈ లోటును అధిగమించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. వర్తమాన అవసరాలను తీర్చడానికి పొరుగు రాష్ట్రాల నుంచి, జాతీయ స్థాయి వనరుల నుంచి విద్యుచ్ఛక్తిని కొనుగోలు చేయడంతో పాటు, వచ్చే అయిదేళ్లలో కొత్తగా 20,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సృష్టించడానికీ ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. అదే సమయంలో రాష్ట్రంలో సౌరశక్తిని బాగా వినియోగించుకోడానికీ, ఇతర నిత్యనూతన ఇంధన వనరులను ఉపయోగంలోకి తీసుకురావడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.

ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో రహదారుల వ్యవస్థకు గల ప్రాముఖ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ వ్యవస్థను విస్తృతపరచడానికి, పటిష్ఠం చేయడానికి ఇతోధికమైన ప్రాధాన్యాన్ని ఇవ్వడం జరిగింది. రహదారుల అనుసంధానాన్ని మెరుగుపరచడానికి ఈ రంగంలో అవసరమైన పెట్టుబడులు పెట్టడం జరుగుతోంది. ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడానికి రైలు మార్గాల వ్యవస్థను విస్తృతం చేయడానికి కూడా రాష్ట్రం చురుగ్గా కృషి చేస్తోంది. హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు నిర్మాణం త్వరలోనే పూర్తి కానుంది. మెట్రో ప్రాంతాలలో మౌలిక సదుపాయాల వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో ఈ ప్రాజెక్టు విశేషపాత్రను పోషించబోతోంది.

ఇతోధికమైన వృద్ధి లక్ష్యాలను సాధించడంలోనూ, ఉపాధికల్పనలోనూ పారిశ్రామికీకరణ విశేష పాత్రను పోషించబోతోంది. దీనిని గుర్తించిన కొత్త ప్రభుత్వం రాష్ట్రాన్ని శీఘ్రగతిన పారిశ్రామికీకరించడానికి చక్కని ప్రాధాన్యాన్నిస్తోంది. సహజ వనరుల లభ్యత, నైపుణ్యం కలిగిన కార్మికుల అందుబాటు, సాంకేతికపరమైన పునాదులకు ఈ రాష్ట్రం నెలవు. ఈ కారణంగా దేశ, విదేశాలకు చెందిన ఎంతో మంది పెట్టుబడిదారులకు ఎంతో ప్రీతిపాత్రమైన గమ్యంగా రాష్ట్రం ఇప్పటికే అవతరించింది. ఈ ప్రయోజనాలను సద్వినియోగం చేయడం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడుల వాతావరణాన్ని మెరుగుపరచడానికి కొత్త నాయకత్వం ఎన్నెన్నో చర్యలను తీసుకుంటోంది.

తెలంగాణ పారిశ్రామికీకరణ కోసం ఉద్దేశించిన దార్శనికతతో కొత్తగా 'పారిశ్రామిక విధాన ఆలంబన - 2014'ని ప్రభుత్వం ఆవిష్కరించింది. దీనికి "పరిశోధన నుంచి నూతన ఆవిష్కరణలు, నూతన ఆవిష్కరణల నుంచి పరిశ్రమ, పరిశ్రమ నుంచి సిరిసంపదలు" అని నామకరణం చేసింది. I & PR ద్వారా "తెలంగాణలో ఆవిష్కరించండి - పెంపొందించండి - మహావ్యవస్థగా వికసించండి" అనే పిలుపునే ఈ పారిశ్రామిక విధాన ఆలంబనను ముందుకు నడిపించే నినాదంగా చేపట్టింది. వ్యాపారాన్ని సులభతరం చేసే వ్యాపార నియంత్రణ వాతావరణాన్ని అందించడమే ఈ విధాన ఉద్దేశ్యం. నూతన ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలను కొత్త పుంతలు తొక్కిస్తాయి.

ప్రభుత్వ ఆమోదాలను శీఘ్రగతిన అందించడానికి దోహదం చేసేలా ఝుళిపింపు విభాగాన్ని (ఛేజింగ్ సెల్‌ని) ప్రభుత్వం నెలకొల్పింది. పారిశ్రామిక సంబంధమైన ఆమోదాలను పర్యవేక్షించడం ఈ విభాగం బాధ్యత. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని పెంచడానికి పరిశ్రమలకు అనువైన 2లక్షల ఎకరాలకు పైగా నేలతో 'భూ నిధి'ని నెలకొల్పడానికి ప్రభుత్వం పథకాలు రూపకల్పన చేస్తుంది. రాష్ట్రంలో పెట్టుబడి వాతావరణాన్ని తమ కళ్లతో తాము గమనిస్తున్న, దేశ, విదేశాలకు చెందిన ఎన్నో ప్రైవేట్ రంగ అగ్రగామి సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చాయి.

సేవా రంగం పారిశ్రామికీకరణ విషయంలో రాష్ట్రానికి సానుకూలతలు బాగా ఉన్నాయి. ఇక, రాష్ట్రంలో 'సమాచార సాంకేతిక రంగ పెట్టుబడి ప్రాంతం' (ఐ.టి.ఐ.ఆర్)ను నెలకొల్పడానికి భారత ప్రభుత్వం ఆమోదాన్ని తెలిపిన నేపథ్యంలో ఇక్కడి సేవారంగ పారిశ్రామికీకరణ కొత్త ఊపు పొందే అవకాశాలు బాగా కనబడుతున్నాయి. తెలంగాణలో చేపట్టిన మరో పెద్ద జాతీయ ప్రాజెక్టు 'జాతీయ పెట్టుబడి, వస్తూత్పత్తి మండలం' (ఎన్.ఐ.ఎం.జడ్). మెదక్ జిల్లాలోని ఈ మండలం రాష్ట్రంలో వస్తూత్పత్తి రంగాన్ని పెంపొందింపజేయడానికి ఉద్దేశించినది. పారిశ్రామికాభివృద్ధిని రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య పంపిణీ చేయాలన్న ఆశయానికి తగినట్లుగా, వరంగల్‌లో జౌళి పార్క్‌ని నెలకొల్పడానికి ప్రణాళికా రూపకల్పన జరుగుతోంది. ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిలో హైదరాబాద్‌కు గల ఆకర్షణను నిలిపేలాగా అక్కడ, దాని చుట్టుపక్కల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ప్రభుత్వం ఇతోధికంగా ప్రణాళికలకు రూపకల్పన చేస్తోంది. హైదరాబాద్‌ను సురక్షితమైన, మురికివాడరహితమైన స్మార్ట్ నగరంగా చేయడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అవసరమైన తావులకు పోలీసులు శీఘ్రగతిన చేరుకోడానికి కల్పిస్తున్న సదుపాయాలను, హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో సి.సి.టి.వి నిఘా వ్యవస్థలను నెలకొల్పే ఏర్పాట్లను ప్రభుత్వం చేయడం ద్వారా నగరంలో భద్రతా వ్యవస్థలు పటిష్ఠమవుతున్నాయి. హైదరాబాద్ మెట్రో రైల్ వ్యవస్థ ఉపయోగంలోకి రావడంతోటే నగరంలోనూ, దాని ఇరుగుపొరుగున మౌలిక సదుపాయాల వ్యవస్థ సామర్థ్యం మరింత మెరుగుకావడం తథ్యం.

రాష్ట్రంలో చెట్టుచేమలను పెంపొందించడానికి, జీవవైవిధ్యాన్ని కాపాడడానికి కొత్త నాయకత్వం ఆకాంక్షభరితమైన కార్యక్రమాలను చేపట్టింది. 'తెలంగాణకు హరిత హారం' అనే పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 33 శాతం చెట్టూచేమతో ఉండాలన్న లక్ష్య సాధన కోసం 230 కోట్ల మొక్కలతో వచ్చే మూడు నాలుగేళ్లలో భారీగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని అమలు చేస్తారు. పలుచనైపోతున్న అడవులను పునరుజ్జీవింపజేయడానికి, ఇప్పుడున్న అడవులను గట్టిగా కాపాడడానికి, నేల, తేమ పరిరక్షణ చర్యలను ముమ్మరంగా చేపట్టడానికి, సామాజిక వన పెంపకానికి బహుముఖ విధానాన్ని అమలు చేయాలని తలపెట్టారు.

తెలంగాణ పునరావిష్కరణకు ఒక ముఖ్యమైన సామాజిక-సాంస్కృతిక కోణం ఉంది. సాపేక్షంగా చూస్తే, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల పట్ల నిర్లక్ష్యం వహించారు. తెలంగాణ సుసంపన్నతకు సంబంధించిన ఘనకీర్తిని తొక్కిపెట్టారు. అందుకే సుసంపన్నమైన తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాల పునరుద్ధరణ మీద, పునర్వైభవం మీద గౌరవనీయులైన ముఖ్యమంత్రి నేతృత్వంలో కొత్త నాయకత్వం అపారంగా శ్రద్ధ వహించాలని కంకణం కట్టుకుంది. ఈ దిశలో మొదటి అడుగుగా ప్రభుత్వం బతుకమ్మ, బోనాలు పండుగలను రాష్ట్ర పండుగలుగా ప్రభుత్వం ప్రకటించింది. వీటిని అంగరంగ వైభవంగా నిర్వహిస్తోంది. ఈ ప్రయత్నంలో భాగంగానే హైదరాబాద్‌లో 'తెలంగాణ కళాభారతి', వరంగల్‌లో 'కాళోజీ కళా కేంద్రం' నెలకొల్పాలని తలపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలలో చైతన్యాన్ని వ్యాపింపజేయడానికి 'తెలంగాణ సాంస్కృతిక సారథి' అనే వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పింది.

దేశ విదేశాల నుంచి పర్యాటకులను ఆకర్షించే సత్తా పర్యాటక రంగానికుంది. పర్యాటక రంగం కారణంగా సాంస్కృతిక వారసత్వ సంపదకు, పర్యావరణకు పర్యాటకులలో ప్రచారం పెంపొందగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెరగడానికి, ఉపాధి కల్పన పెంపొందడానికి ఇది దోహదం చేస్తుంది. పర్యాటకులను పెంచాలనే ఉద్దేశ్యంతో అన్ని సాంస్కృతిక, మత, సహజ సుందర తావులకూ సొబగులు దిద్దే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేస్తోంది. యాత్రా ప్రదేశాలను, పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడానికి మౌలిక సదుపాయాలను కల్పించడానికి అవసరమైన పెట్టుబడులను పెట్టడం జరిగింది. హుస్సేన్ సాగర్ ప్రక్షాళన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మరో బృహత్‌పథకం. ఇది అమూల్యమైన నీటి తావుని కాలుష్యం నుంచి, దుర్వినియోగం నుంచి కాపాడుతుంది. పరిసరాలను మెరుగుపరుస్తుంది. ప్రాధాన్యతా ప్రాతిపదిక మీద ఈ సరస్సును శుభ్రం చేయడానికి పెట్టుబడులను తలపెట్టారు. ఈ చర్యలన్నీ హుస్సేన్ సాగర్ చెరువు వద్ద కూడా పర్యాటకుల సంఖ్యను ఇతోధికంగా పెంచుతాయి.

ఇక ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించడానికి గానూ హైదరాబాద్‌కు చేరువలో ఉన్న పుణ్య క్షేత్రం యాదగిరి గుట్టని ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తలపెట్టారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో భక్తులను కలిగినది ఈ పవిత్ర ప్రదేశం. వర్తమాన సంవత్సరంలో 'గోదావరి పుష్కరాల' ఉత్సవాలను నిర్వహించడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నిధులను కేటాయించింది.

ప్రజలే కేంద్రబిందువుగా, సమర్థమైనదిగా పరిపాలనను తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకు వ్యవహార పద్ధతులను,

నియమనిబంధనలను సవరించ సంకల్పించింది. ఈ ప్రయత్నాలన్నింటిలోనూ, అలాగే రాష్ట్ర నాయకత్వ దార్శనికతను సాకారం చేయడంలోనూ సాంకేతిక విజ్ఞానం అపారంగా సాయపడగలదు.ముందరి అధ్యాయాలలో రంగాలవారీగా అభివృద్ధిని, విధాన పరమైన ప్రయత్నాలను సమీక్షించడంతో పాటు, పురోగతిని విశ్లేషించడం జరుగుతుంది. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత, మొదటి బడ్జెట్‌ను ప్రకటించిన తర్వాత, పథకాలను అమలు చేయడానికి లభించిన వ్యవధి చాలా తక్కువ. పైపెచ్చు, వివిధ పథకాల అమలుపై క్షేత్రస్థాయి సమాచారం రావడం మొదలైనది కూడా ఇటీవలనే. కనుక, సమగ్రమైన, సంపూర్ణమైన విశ్లేషణ ఈ దశలో చాలా కష్టం. స్థూలంగా ఈ నివేదిక నిర్మాణం ఈ విధంగా ఉంటుంది:

తెలంగాణను పునరావిష్కరించవలసిన అవసరాన్ని పరిచయ అధ్యాయంలోని మొదటి భాగం స్థూలంగా తెలియజేస్తుంది. దానితోపాటు ఈ లక్ష్య సాధనకు ప్రభుత్వం చేపట్టిన తొలి చర్యలను స్థూలంగా ప్రస్తావిస్తుంది. ఇక ఈ అధ్యాయంలోని రెండో భాగం తెలంగాణ రాష్ట్ర సామాజిక-ఆర్థిక తీరుతెన్నులను విహంగవీక్షణ చేస్తుంది. దానితో పాటు ఇటీవలి కాలపు వృద్ధి చిత్రణను విశ్లేషిస్తుంది. దీనిలో జి.ఎస్.డి.పికి ఒక్కొక్క రంగం అందించిన ఊతం వివరాలను అందిస్తుంది. రెండో అధ్యాయం వ్యవసాయం మీద, దాని అనుబంధ రంగాల మీద దృష్టి సారిస్తుంది. తెలంగాణ రైతుల నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం ప్రారంభించిన కొత్త ప్రయత్నాలను, విధానపరమైన జోక్యాలను ఈ అధ్యాయంలోని చివరి భాగం చాటుతుంది. పర్యావరణ సంరక్షణ, పచ్చదనం విస్తృతిలను కూడా ఈ భాగం పరిశీలిస్తుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో వెనుకబాటుతనానికి ఆలవాలమై ఉన్న వర్గాలకు ప్రయోజనం చేకూర్చడానికి ప్రభుత్వం ప్రారంభించిన వివిధ సంక్షేమ చర్యలను, వారి వారి అవసరాలను మూడో అధ్యాయం తెలియజేస్తుంది. అందరికీ కనీసం అవసరమైన హుందా అయిన జీవితాన్ని, మెరుగైన జీవన పరిస్థితులను అందించాలనే లక్ష్యం మీద ఈ పథకాల ప్రభావాన్ని కూడా పరిశీలించడం జరిగింది. సామాజిక రంగం మీద వివిధ ప్రభుత్వ శాఖలు చేస్తున్న వ్యయాన్ని కూడా ఈ అధ్యాయంలో విశ్లేషించడం జరిగింది. ఆర్థిక పరమైన మౌలిక సదుపాయాలు, జి.ఎస్.డి.పికి ఇతోధికంగా దోహదం చేసే సేవారంగానికి, పారిశ్రామిక రంగానికి ఇస్తున్న ప్రోత్సాహం మీద నాలుగో అధ్యాయం దృష్టి సారిస్తుంది. పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్రం ప్రారంభించిన కొత్త పారిశ్రామిక విధానాన్ని, వ్యాపారవేత్తలు హాయిగా వ్యాపారం చేసుకోవడానికి ఉపకరించే విధానపరమైన ప్రయత్నాలను ఈ అధ్యాయంలో చాటడం జరిగింది. 'మిషన్ కాకతీయ', 'తెలంగాణ మంచి నీటి సరఫరా పథకం' పేర్లతో రాష్ట్రం చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలను కూడా ఈ అధ్యాయంలో ప్రస్తావించడం జరిగింది. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మలచడానికి చేపట్టిన ప్రయత్నాలకు సంబంధించిన విభాగంతో ఈ నివేదిక ముగుస్తుంది. ఆఖరి అధ్యాయంగా తెలంగాణలో వివిధ రంగాలకు, పథకాలకు సంబంధించిన గణాంక చిత్రణను అందించడం జరిగింది.

> *"కలలను నిజం చేసుకునే ప్రయాణంలో చాలా కష్టమైనది మొదటి అడుగే...."*
>
> *- మొఫ్ఫత్ మచింగురా 'లైఫ్ క్యాప్స్యూల్స్'*



*గోల్కొండ కోట వద్ద స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు*

# 1.2 తెలంగాణ సామాజిక-ఆర్థిక చిత్రం మరియు అభివృద్ధి చిత్రణ

నూతన రాష్ట్రం తెలంగాణ అటు విస్తీర్ణం పరంగా, ఇటు జనాభా పరిమాణం పరంగా దేశంలో 12వ పెద్ద రాష్ట్రం. ఈ రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 1,14,840 చదరపు కిలోమీటర్లు కాగా, 2011 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడి జనాభా 3,51,93,978 మంది. రాష్ట్ర సరిహద్దులను ఆనుకుని ఉత్తరాన మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు, పశ్చిమాన కర్నాటక, దక్షిణాన, తూర్పున ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలున్నాయి. వ్యూహాత్మకమైన రీతిలో దక్కన్ పీఠభూమిలో నెలకొని ఉన్న ఈ రాష్ట్రం అతి తక్కువ వర్షపాతంతో గొంతెండుతున్న దాహార్తి ప్రదేశం. ఇక్కడి వాతావరణం ప్రధానంగా వేడిగా, పొడిగా ఉంటుంది.

రెండు పెద్ద జీవనదులు కృష్ణ, గోదావరి ఈ రాష్ట్రం గుండానే ప్రవహిస్తాయి. గోదావరి పరీవాహక ప్రాంతం ఈ రాష్ట్రంలో 79 శాతం కాగా, కృష్ణా పరీవాహక ప్రాంతం 68.5 శాతం. ఇంత పెద్ద భూభాగం మీదుగా ఈ నదులు రాష్ట్రంలో ప్రవహిస్తున్నప్పటికీ, మునుపటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నిర్లక్ష్యం కారణంగా ఈ నదీజలాలలో రాష్ట్రం వినియోగించే భాగం చాలా తక్కువగా ఉన్నది. రాష్ట్ర జనాభా తీరుతెన్నులను, సామాజిక, ఆర్థిక చిత్రణను దిగువ సమర్పించడమైనది.

### జనాభా

రాష్ట్ర జనాభాలో 61.33 శాతం గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. ఆ ప్రకారం రాష్ట్ర జనాభాలో అత్యధికులు గ్రామీణులే. తక్కిన 38.67 శాతం ప్రజలు పట్టణాలలో నివసిస్తున్నారు. మొత్తం రాష్ట్ర జనాభా వృద్ధి 2001-2011 దశాబ్దంలో 13.58 శాతం. ఇది అంతకు ముందరి దశాబ్దంలోని రాష్ట్ర జనాభా వృద్ధి 18.77 శాతంతో పోలిస్తే తగ్గినట్లుగా స్పష్టమవుతుంది. కాగా, విడిగా పట్టణ జనాభాను పరిశీలించినప్పుడు అది గణనీయంగా వృద్ధి చెందుతోందని అర్థమవుతుంది. 2001-2011 దశాబ్దంలో పట్టణ జనాభా 38.12 శాతం వృద్ధి చెందింది. అంత క్రితం దశాబ్దంలో పట్టణ జనాభా వృద్ధి 25.13 శాతం మాత్రమే. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ జనాభా వృద్ధి 2.13 శాతం మాత్రమే. పట్టణ జనాభా పెరగడానికి ప్రధాన కారణం పూర్వపు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సీమాంధ్ర ప్రాంతం నుంచి ప్రజలు పెద్దయెత్తున తరలడమే. రాష్ట్రంలోనే జరిగిన వలసలు, దేశంలోని ఇతర ప్రాంతాల వారు తరలి రావడం పట్టణ జనాభా పెరగడానికి పాక్షిక కారణాలు. రాష్ట్రం మొత్తం మీది పట్టణ జనాభా (2011 జనాభా లెక్కల ప్రకారం)లో పూర్తిగా పట్టణ ప్రాంతమైన హైదరాబాద్ రాజధాని నగరపు జనాభా 29 శాతానికి పైగానే. పట్టణ జనాభాలో వేగవంతమైన పెరుగుదల, ఆ జనాభా ఎక్కువగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలోనే కేంద్రీకృతం కావడం కారణంగా పట్టణ మౌలిక సదుపాయాల మీద వత్తిడి గరిష్ఠ స్థాయిలో పెరిగిపోయింది.

### జన సాంద్రత

రాష్ట్రంలో జన సాంద్రత సంగతికి వస్తే, ఆదిలాబాద్ జిల్లాలో అతి తక్కువ స్థాయిలో చదరపు కిలోమీటరుకు 170 మంది నివసిస్తుండగా, హైదరాబాద్ జిల్లాలో అత్యధిక స్థాయిలో చదరపు కిలోమీటరుకు 18,172 మంది నివసిస్తున్నారు. రాష్ట్ర సగటు జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 307 మంది కాగా, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాలు చదరపు కిలోమీటరుకు వరుసగా 170, 175, 220 జనసాంద్రతలతో అత్యల్పస్థాయిలో ఉన్నాయి.

### ఆడ, మగ నిష్పత్తి

ప్రతి వెయ్యి మంది మగవారికి, ఆడవారు ఎందరనే సంఖ్యను లైంగిక నిష్పత్తిగా నిర్వచించారు. జాతీయ స్థాయి సగటు లైంగిక నిష్పత్తి 2011లో 943 కాగా, తెలంగాణ రాష్ట్రంలో అది జాతీయ స్థాయి కన్నా ఎక్కువ స్థాయిలో 988 వరకు ఉంది. ప్రత్యేకంగా కానవచ్చే ఒక పరిస్థితి ఏమిటంటే నిజామాబాద్, ఆదిలాబాద్, కరీం నగర్, ఖమ్మం జిల్లాలలో లైంగిక నిష్పత్తి 1,000 మించింది. 1991 నాటి 967 నుంచి 2001 నాటికి లైంగిక నిష్పత్తి 971కి కొద్దిగా మెరుగైంది. మొత్తం జనాభాకి సంబంధించి లైంగిక నిష్పత్తి సానుకూలంగానే ఉన్నప్పటికీ, భవిష్యత్తుకి సమస్య పొంచి ఉంది. 0-6 ఏళ్ల మధ్య వయసు బాలల విషయంలో లైంగిక నిష్పత్తి ఆందోళనకరంగా ఉంది. అది 2001 నాటి 957 నుంచి, 2011 నాటికి 933కి తగ్గిపోయింది. 2011 నాటి రాష్ట్ర సగటు 988తో పోలిస్తే, ఎస్.సి జనాభా

లైంగిక నిష్పత్తి 1,008 చాలా ఎక్కువ. రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్ నగర్ జిల్లాలను మినహాయిస్తే, రాష్ట్రంలో తక్కిన ఏడు జిల్లాలలో ఎస్.సి జనాభా లైంగిక నిష్పత్తి 1000 కన్నా ఎక్కువే. ఎస్.టి జనాభా లైంగిక నిష్పత్తి రాష్ట్ర స్థాయి సగటు కన్నా కొంత తక్కువగా 980 వద్ద ఉంది. కానీ, ఆదిలాబాద్ (1003), నిజామాబాద్ (1017), ఖమ్మం (1022)లలో అది చాలా ఎక్కువే.

## జనాభాలో సామాజిక కూర్పు

రాష్ట్ర జనాభాలో అత్యధిక భాగం వెనుకబడిన తరగతుల వారు, సామాజిక నిచ్చెనపై దిగువ మెట్ల మీద ఉన్న వారే. రాష్ట్ర మొత్తం జనాభాలో షెడ్యూల్డు కులాలకు చెందిన వారు 15.44 శాతం కాగా, షెడ్యూల్డు తెగలకు చెందిన వారు 9.34 శాతం. జాతీయ స్థాయి సగటు 8.60 శాతంతో పోలిస్తే రాష్ట్రంలో షెడ్యూల్డు తెగల జనాభా శాతం ఎక్కువ. 1961లో మొత్తం జనాభాలో గిరిజనుల శాతం 2.81 కాగా, 1981 నాటికి అది 8.19 శాతానికి, 2011 నాటికి అది మరింత ఎక్కువగా 9.34 శాతానికి పెరిగింది. అయితే, కొన్ని కొన్ని కులాలను షెడ్యూల్డు తెగల జాబితాలోకి మార్చిన ఫలితంగా ఈ శాతాలు ఇంతగా పెరిగాయి.

రాష్ట్ర జనాభాలో ఎస్.సిలు, ఎస్.టిలు, అల్పసంఖ్యాక వర్గాలు, ఇతర వెనుకబడిన తరగతుల వర్గాలతో సహా మొత్తం మీద దాదాపు 80 శాతం మంది వెనుకబడిన తరగతులకు చెందిన వారే. మొత్తం జనాభాలో వీరి శాతం అత్యధికంగా ఉన్న కారణంగా ఇతర కులాల వారితో సమానంగా పైకి రావడానికి వీలుగా వీరికి సాయమందించి, సాధికారతను పెంచే విషయంలో రాష్ట్రప్రభుత్వం మీద ఎనలేని బాధ్యత ఉంది. జనసాంద్రత, లైంగిక నిష్పత్తి, ఎస్.సి, ఎస్.టి జనాభాల శాతాలను దిగువ పట్టిక చూపిస్తుంది.

**పట్టిక 1 : రాష్ట్ర జనాభాలో వివిధ వర్గాలు**

| వరుస సంఖ్య | జిల్లా | జనసాంద్రత (చ.కి.మీ.కు జనాభా) | లైంగిక నిష్పత్తి | జనాభాలో ఎస్.సి.ల శాతం | జనాభాలో ఎస్.టి.ల శాతం |
|---|---|---|---|---|---|
| 1 | మహబూబ్‌నగర్ | 220 | 977 | 17.49 | 8.99 |
| 2 | రంగారెడ్డి | 707 | 961 | 12.31 | 4.13 |
| 3 | హైదరాబాద్ | 18,172 | 954 | 6.29 | 1.24 |
| 4 | మెదక్ | 313 | 992 | 17.73 | 5.57 |
| 5 | నిజామాబాద్ | 321 | 1,040 | 14.54 | 7.56 |
| 6 | అదిలాబాద్ | 170 | 1,001 | 17.82 | 18.09 |
| 7 | కరీంనగర్ | 319 | 1,008 | 18.8 | 2.83 |
| 8 | వరంగల్ | 273 | 997 | 17.54 | 15.11 |
| 9 | ఖమ్మం | 175 | 1,011 | 16.55 | 27.37 |
| 10 | నల్గొండ | 245 | 983 | 18.27 | 11.3 |
| | **తెలంగాణ రాష్ట్రం** | **306** | **988** | **15.44** | **9.34** |
| | **మొత్తం భారతదేశం** | **382** | **943** | **16.64** | **8.62** |

ఆధారం : భారత జనాభా లెక్కలు, 2011

## సమగ్ర కుటుంబ సర్వే, 2014

ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో 2014 ఆగస్టు 19వ తేదీన రాష్ట్రమంతటా ముమ్మరమైన స్థాయిలో ఇంటింటి సర్వేని నిర్వహించింది. ఒకే ఒక్క రోజులో ఈ సర్వేని పూర్తిచేసింది. గణాంక సమాచార సేకరణపరంగా దేశంలోనే ఇది ఒక విశిష్టమైన ప్రక్రియ. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు సంబంధించి పటిష్ఠమైన ఒకే ఒక గణాంక సమాచార నిధిని సిద్ధం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యం. అర్హతకలిగిన లబ్దిదారులను గుర్తించి, వారి వ్యక్తిగత అవసరాలు లక్ష్యంగా సమర్థమైన అభివృద్ధి కార్యక్రమాలను నిర్మించడం దీని ద్వారా తెలంగాణ ప్రభుత్వానికి సాధ్యమవుతుంది.

గ్రామీణ, పట్టణ కుటుంబాల సమాచారం అంతటినీ ప్రభుత్వం ఈ సర్వేతో క్రోడీకరించింది. కుటుంబాల వివరాలు, వారి ఆవాస వసతి, కుటుంబ సభ్యుల వివరాలు, వైకల్యాలు, దీర్ఘవ్యాధులు, భూ వసతి, పశుసంపద మొదలైన వివరాలను సేకరించడానికి 3,85,892 మంది గణికులను ప్రభుత్వం నియోగించింది. ఈ సర్వేలో పాల్గొని సమాచారాన్ని ఇవ్వడం పూర్తిగా స్వచ్ఛందమే. కుటుంబాల వివరాలను జిల్లాల వారీగా ఇక్కడ ఇచ్చాము.

**పట్టిక 2 : జిల్లా వారీగా కుటుంబాలు, జనాభా**

(లక్షలలో)

| క్ర.సం. | జిల్లా | కుటుంబాలు | జనాభా |
|---|---|---|---|
| 1 | మహబూబ్‌నగర్ | 9.67 | 42.84 |
| 2 | రంగారెడ్డి | 16.56 | 61.37 |
| 3 | హైదరాబాద్ | 9.77 | 37.94 |
| 4 | మెదక్ | 8.52 | 30.93 |
| 5 | నిజామాబాద్ | 6.97 | 24.67 |
| 6 | అదిలాబాద్ | 8.17 | 28.25 |
| 7 | కరీంనగర్ | 12.02 | 38.38 |
| 8 | వరంగల్ | 10.91 | 36.47 |
| 9 | ఖమ్మం | 8.31 | 26.23 |
| 10 | నల్గొండ | 11.03 | 35.95 |
| | **మొత్తం** | **101.83** | **363.03** |

**సగటు కుటుంబాల పరిమాణం 3.56**

**2011 జనాభా లెక్కల ప్రకారం మొత్తం కుటుంబాల సంఖ్య: 83.58 లక్షలు**

పింఛన్లు, ఆహారభద్రత మొదలైన ప్రభుత్వ అగ్రగామి పథకాలు అన్నింటిలోనూ ప్రభుత్వంలో అభివృద్ధి పథానికి సంబంధించిన అన్ని శాఖలు ఈ సమాచార నిధిని ఉపయోగించుకుంటున్నాయి.

## అక్షరాస్యత

రాష్ట్రంలో అక్షరాస్యత స్థాయి 66.46 శాతం. ఇది జాతీయ స్థాయి సగటు 72.99 శాతంతో పోలిస్తే తక్కువ. అల్పాదాయ రాష్ట్రాలైన ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్‌ల కన్నా కూడా అక్షరాస్యత స్థాయి తెలంగాణలో తక్కువగా ఉండడం ఆందోళన చెందవలసిన విషయం. అక్షరాస్యత స్థాయి మహబూబ్‌నగర్‌లోని 55.04 శాతం నుంచి, హైదరాబాద్‌లోని 83.25 శాతం వరకు వేర్వేరు తీరులలో ఉంది. అక్షరాస్యత స్థాయిలు పురుషులకు, స్త్రీలకు మధ్య కూడా తీవ్ర వ్యత్యాసంతో ఉన్నాయి. పురుషులలో అక్షరాస్యత స్థాయి 74.95 శాతం కాగా, మహిళల అక్షరాస్యత స్థాయి వారి కన్నా చాలా తక్కువగా 57.92 శాతం మాత్రమే. ఎస్.సి, ఎస్.టిల అక్షరాస్యత స్థాయిలు వరుసగా 58.90, 49.51 శాతం మాత్రమే. స్థూలంగా అక్షరాస్యత స్థాయిని పెంచడం, ప్రత్యేకించి ఎస్.సి, ఎస్.టిల అక్షరాస్యత స్థాయిని పెంచడం రాష్ట్ర ప్రభుత్వం ముందున్న పెద్ద సవాలు. రాష్ట్రంలో అక్షరాస్యత స్థాయిని పట్టిక 3లో సూచిస్తున్నాము.

**పట్టిక 3 : జిల్లాల వారీగా, విభాగాల వారీగా అక్షరాస్యతా శాతాలు - 2011**

| క్ర.సం. | జిల్లా | మొత్తం | పురుషులు | స్త్రీలు | పట్టణవాసులు | గ్రామీణవాసులు | ఎస్.సి.లు | ఎస్.టి.లు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | మహబూబ్‌నగర్ | 55.04 | 65.21 | 44.72 | 77.96 | 50.92 | 47.72 | 42.29 |
| 2 | రంగారెడ్డి | 75.87 | 82.11 | 69.4 | 82.31 | 60.6 | 64.72 | 56.05 |
| 3 | హైదరాబాద్ | 83.25 | 86.99 | 79.35 | 83.25 | -- | 77.28 | 69.34 |
| 4 | మెదక్ | 61.42 | 71.43 | 51.37 | 78.57 | 56 | 53.42 | 44.73 |
| 5 | నిజామాబాద్ | 61.25 | 71.47 | 51.54 | 77.22 | 56.5 | 52.88 | 45.92 |
| 6 | అదిలాబాద్ | 61.01 | 70.81 | 51.31 | 75.63 | 55.29 | 58.46 | 51.35 |
| 7 | కరీంనగర్ | 64.15 | 73.65 | 54.79 | 77.77 | 59.61 | 58.84 | 51.49 |
| 8 | వరంగల్ | 65.11 | 74.58 | 55.69 | 81.03 | 58.83 | 61.79 | 48.45 |
| 9 | ఖమ్మం | 64.81 | 72.3 | 57.44 | 81.26 | 59.75 | 62.9 | 51.59 |
| 10 | నల్గొండ | 64.2 | 74.1 | 54.19 | 81.69 | 60.07 | 60.75 | 48.08 |
| | **తెలంగాణ** | **66.46** | **74.95** | **57.92** | **81.09** | **57.25** | **58.9** | **49.51** |

ఆధారం : భారత జనాభా లెక్కలు, 2011

అక్షరాస్యత సాధనలో మరో పెద్ద సవాలు రాష్ట్రంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో బడిని అర్ధాంతరంగా మానివేయడం. ముఖ్యంగా 1 - 10 తరగతులలో ఎస్.సి, ఎస్.టి విద్యార్థులు చదువును మధ్యలోనే విరమిస్తున్నారు. ఎస్.సి విద్యార్థులు చదువును మధ్యలో మానేయడం 40.3 శాతం ఉండగా, ఎస్.టి విద్యార్థులలో అది 62.8 శాతం ఉంది.

## తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల వారీ అక్షరాస్యతా స్థాయిలు




ఆధారం : భారత జనాభా లెక్కలు, 2011

## ఆరోగ్య సూచికలు

తెలంగాణలో మెరుగుదలకు నోచుకోవలసిన ఆరోగ్య సూచికలు అనేకం ఉన్నాయి. రాష్ట్రంలోని పది జిల్లాలకూ ఆరింటిలో శిశు మరణాల రేటు (ఐ.ఎం.ఆర్) జాతీయ సగటు 40 కన్నా చాలా ఎక్కువగా ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో మాతా మరణాల రేటు (ఎం.ఎం.ఆర్) 152, జాతీయ స్థాయి సగటు కన్నా చాలా ఎక్కువగా ఉంది. వెనుకబడిన జిల్లా అయిన ఆదిలాబాద్‌లో ఇళ్ల వద్ద జరుగుతున్న కాన్పులు అత్యధికంగా ఉన్నట్లుగా కనుగొన్నారు. ముంబయ్‌కి చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాప్యులేషన్ సైన్సెస్ నిర్వహించిన జిల్లా స్థాయి కుటుంబ సర్వే 2012-13 ప్రకారం ఇవి 11.5 శాతం. ఎంపిక చేసిన ఆరోగ్య సూచికలను జిల్లాలవారీగా ఇక్కడ సమర్పిస్తున్నాము.

పట్టిక 4 : ఆరోగ్య సూచికలు

| క్ర.సం. | జిల్లా | ఐ.యం.ఆర్* (2013) | యం.యం.ఆర్* (2011-13) | ఇళ్ళల్లో జరిగిన కాన్పుల శాతం | రక్తహీనతతో ఉన్నట్లుగా గుర్తించిన గర్భిణులు (15-49ఏళ్ళ మధ్య వయస్కులలో) |
|---|---|---|---|---|---|
| 1 | మహబూబ్‌నగర్ | 53 | 98 | 4.7 | 65.7 |
| 2 | రంగారెడ్డి | 33 | 78 | 5.0 | 64.5 |
| 3 | హైదరాబాద్ | 20 | 71 | 1.4 | 74.5 |
| 4 | మెదక్ | 49 | 90 | 3.5 | 52.5 |
| 5 | నిజామాబాద్ | 48 | 79 | 4.6 | 64.8 |
| 6 | అదిలాబాద్ | 48 | 152 | 11.5 | 71.2 |
| 7 | కరీంనగర్ | 37 | 74 | 0.1 | 52.0 |
| 8 | వరంగల్ | 39 | 78 | 1.7 | 53.0 |
| 9 | ఖమ్మం | 45 | 99 | 4.3 | 73.3 |
| 10 | నల్గొండ | 47 | 90 | 5.2 | 65.7 |
| | **రాష్ట్రము** | **39** | **92** | **5.4** | **61.9** |
| | **అఖిల భారత స్థాయిలో** | **40** | **167** | | |

గమనిక : ఐ.ఎం.ఆర్ (వెయ్యి సజీవ జననాలలో); ఎం.ఎం.ఆర్. (ప్రతి లక్ష జనాభాకీ)

ఆధారం : *ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమీషనర్, హైదరాబాద్

# జిల్లాస్థాయి ఇంటింటి సర్వే 2012-13, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాప్యులేషన్ సైన్సెస్

## వృద్ధి చిత్రణ

రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మదింపులో స్థూల రాష్ట్రోత్పత్తి (జి.ఎస్.డి.పి) లేదా రాష్ట్ర ఆదాయం చాలా ముఖ్యమైన సూచిక. ఒక రాష్ట్ర భౌగోళిక హద్దుల మధ్య, నిర్ణీత కాల వ్యవధిలో ఉత్పత్తి చేసిన వస్తువుల, సేవల మొత్తం విలువను డబ్బు రూపంలో కూడినప్పుడు స్థూల రాష్ట్రోత్పత్తి (జి.ఎస్.డి.పి) వస్తుంది. లెక్కించినదే తిరిగి లెక్కలలోకి రావడం వంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహిస్తూ ఈ మదింపు చేస్తారు.

ఒక స్థూల కాలవ్యవధిని తీసుకుని, దాని మధ్య ఆర్థిక స్థితిగతుల అంచనాలను మదింపు చేసినప్పుడు, ఏ మేరకు ఆర్థికాభివృద్ధి జరిగినదీ, ఏ దిశలో మార్పు వస్తున్నదీ, అలాగే ఆర్థిక వ్యవస్థకు సాయపడే కోణంలో ఏయే రంగాలు ఏమేరకు పనితనాన్ని చూపినదీ వెల్లడి అవుతుంది. స్థూల రాష్ట్రోత్పత్తిలో వివిధ రంగాల పాత్ర ఏవిధంగా ఉన్నది పరిశీలించినప్పుడు, ఆర్థిక వ్యవస్థలో ఆయారంగాల ప్రాముఖ్యానికి సంబంధించి కూడా ఒక అంచనా ఏర్పడుతుంది. నిర్ణీత కాల వ్యవధుల మధ్య ఈ పరిశీలన జరిపినప్పుడు ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మకమైన మార్పులు ఏ విధంగా వస్తున్నదీ స్పష్టం కావడమే గాక, స్థూల ఆర్థికాభివృద్ధికి విధానాలను రూపకల్పన చేయడానికి కూడా సాయపడుతుంది. రాష్ట్ర మొత్తం జనాభాతో పోల్చి సాపేక్షంగా అధ్యయనం చేసినప్పుడు రాష్ట్రంలో తలసరిన ఒక్కొక్కరి నుంచి జరుగుతున్న వస్తు లేదా సేవల ఉత్పత్తి సూచితమవుతుంది. దీనితో పాటే రాష్ట్ర ప్రజల సాపేక్ష జీవన ప్రమాణం కూడా స్పష్టమవుతుంది. వీటినే తలసరి ఆదాయం (పి.సి.ఐ)గా ప్రస్తావిస్తున్నాము.

## 2014-15 పరిస్థితి - వీక్షణ

స్థిరంగా తీసుకున్న 2004-05 ధరల ప్రాతిపదిక మీద 2014-15లో స్థూల రాష్ట్ర ఉత్పత్తి రూ. 2,17,432 కోట్లు ఉండగలదని అంచనా. అదే 2013-14లో జరిగిన స్థూల రాష్ట్రోత్పత్తి సంగతికి వస్తే అది రూ. 2,06,427 కోట్లు. దీనిని బట్టి 5.3 శాతం వృద్ధిని అంచనా వేస్తున్నారు. గతంలోని పతన దిశ నుంచి కోలుకుని 2012-13 లగాయతు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలోకి మరలిన సంగతి

దీనిని బట్టి విశదమవుతోంది. 2012-13లో తెలంగాణ 4.1 శాతం అభివృద్ధిని సాధించగా, 2013-14లో (స్థిర ధరల ప్రాతిపదిక మీద) 4.8 శాతం అభివృద్ధిని సాధించింది.

**2004-05 ప్రామాణిక ధరల వద్ద రాష్ట్ర స్థూల ఉత్పత్తి వార్షిక వృద్ధి శాతాలు**




టి.ఆర్.ఇ. : మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ.: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటిసారి సవరించిన అంచనాలు, ఏఇ : ముందస్తు అంచనాలు.

రాష్ట్ర జి.ఎస్.డి.పి 2004-05 స్థిర ధరల వద్ద 2005-06 నుండి 2008-09 మరియు 2010-11 సంవత్సరాల మధ్య రెండంకెల స్థాయిలో వృద్ధి చెందింది. కానీ, 2009-10లో అట్టడుగు స్థాయిలో 1.1 శాతం మాత్రమే వృద్ధి చెందింది.

వర్తమాన ధరల వద్ద 2014-15 జి.ఎస్.డి.పిని రూ. 4,30,599 కోట్లుగా అంచనా వేశారు. 2013-14 సంగతికి వస్తే, అది రూ. 3,91,751 కోట్లు మాత్రమే. దీనిలో వృద్ధి 9.9 శాతం. ఇటు వర్తమాన ధరల వద్ద, అటు 2004-05 స్థిర ధరల వద్ద రాష్ట్ర జి.ఎస్.డి.పిలను పట్టిక 5 చూపుతుంది.

**పట్టిక 5 : తెలంగాణ రాష్ట్ర జి.ఎస్.డి.పి., వర్తమాన మరియు 2004-05 స్థిరమైన ధరల ప్రాతిపదికగా**

| సంవత్సరం | వర్తమాన ధరల వద్ద | | ప్రామాణికమైన 2004-05 ధరల వద్ద | |
|---|---|---|---|---|
| | జి.ఎస్.డి.పి. (కోట్ల రూ.లలో) | క్రితం ఏడాదిపై మార్పు శాతం | జి.ఎస్.డి.పి. (కోట్ల రూ.లలో) | క్రితం ఏడాదిపై మార్పు శాతం |
| 2004-05 | 89,946 | - | 89,946 | - |
| 2005-06 | 1,08,335 | 20.4 | 1,04,233 | 15.9 |
| 2006-07 | 1,26,971 | 17.2 | 1,16,343 | 11.6 |
| 2007-08 | 1,52,452 | 20.1 | 1,28,618 | 10.6 |
| 2008-09 | 1,89,382 | 24.2 | 1,45,902 | 13.4 |
| 2009-10 | 2,03,508 | 7.5 | 1,47,577 | 1.1 |
| 2010-11 | 2,63,898 | 29.7 | 1,74,185 | 18.0 |
| 2011-12(టి.ఆర్.ఇ.) | 3,05,622 | 15.8 | 1,89,269 | 8.7 |
| 2012-13(ఎస్.ఆర్.ఇ.) | 3,47,082 | 13.6 | 1,97,056 | 4.1 |
| 2013-14(ఎఫ్.ఆర్.ఇ.) | 3,91,751 | 12.9 | 2,06,427 | 4.8 |
| 2014-15(ఎ.ఇ.) | 4,30,599 | 9.9 | 2,17,432 | 5.3 |

టి.ఆర్.ఇ. : మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ.: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటిసారి సవరించిన అంచనాలు, ఏఇ : ముందస్తు అంచనాలు.




ఆధారం : సంచాలకులు అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## వర్గాల వారీగా వృద్ధి సరళి

జి.ఎస్.డి.పి వృద్ధి స్థాయి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పనితనాన్ని తెలియజేస్తాయి. కాగా, వర్గాల వారీ వృద్ధి సరళి, నిర్ణీత కాలవ్యవధిలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో జి.ఎస్.డి.పి పరిమాణంలో, కూర్పులో వచ్చిన మార్పును ప్రతిఫలిస్తుంది. జి.ఎస్.డి.పిలో వర్గాల వారీ వాటాలలో వస్తున్న సాపేక్షమైన మార్పు, ఆర్థిక వ్యవస్థలో వస్తున్న నిర్మాణపరమైన మార్పును ఆవిష్కరిస్తుంది. ఆర్థిక వ్యవస్థను వ్యవసాయం, పరిశ్రమ, సేవలు అనే మూడు రంగాలుగా వర్గీకరించడం జరిగింది. వ్యవసాయరంగంలో వ్యవసాయంతో పాటు పశు సంపద, జీవోత్పత్తులు, అటవీ సంపద, మత్స్య సంపదలు కూడా జోడించి ఉంటాయి. పారిశ్రామిక రంగంలో గనులు, తవ్వకాలు, వస్తూత్పత్తి, విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటి సరఫరా, నిర్మాణ రంగాలు భాగాలు. సేవా రంగంలో వాణిజ్యం, హొటళ్లు, రెస్టారెంట్లు, రైల్వేయేతర మార్గాల ద్వారా రవాణా, గిడ్డంగులు, రైల్వేలు, కమ్యూనికేషన్‌లు, బ్యాంకు వ్యవహారాలు, బీమా సేవలు, స్థిరాస్తి వ్యాపారాలు, స్వీయ నివాసవసతి కల్పన, వ్యాపార సేవలు, ప్రజా పరిపాలన, ఇతర సేవలు వస్తాయి.

వర్గాలవారీ వృద్ధి సరళి విశ్లేషణలో వెల్లడవుతున్నది ఏమిటంటే 2014-15లో జి.ఎస్.డి.పి వృద్ధి రేటు 9.7 శాతంతో సేవారంగం అగ్రశ్రేణిలో ఉంది. 4.1 శాతం వృద్ధితో పారిశ్రామిక రంగం రెండో స్థానంలో ఉంది. ఇక వ్యవసాయ రంగంలో (-)10.3 శాతం ప్రతికూల దిశలో ఉన్నప్పటికీ జి.ఎస్.డి.పి. 5.3 వద్ద నమోదైనది. ప్రతికూల ఋతు పరిస్థితుల కారణంగా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల యొక్క అభివృద్ధి పతన దిశలో ఉందని భావిస్తున్నారు. విడివిడిగా చూస్తే, వ్యవసాయ రంగం మరీ దెబ్బతినిపోవడంతో -21.3 శాతం పతనం చవిచూసింది. జీవోత్పత్తుల రంగంలో 6.5 శాతం, అటవీ సంపద, కలప ఆదాయాలలో 2.7 శాతం, మత్స్య సంపదలో 11.4 శాతం వృద్ధి జరిగిన కారణంగా మొత్తం మీద ఈ రంగం కొద్దిగా మెరుగుపడింది.

నిరుటి సంవత్సరంలో వ్యవసాయ రంగం 15.1 శాతం మేరకు సాయపడితే అది ఈ ఏడాదిలో 12.8 శాతానికి క్షీణించింది. పారిశ్రామిక రంగం అందించిన సాయం 24.3 శాతంగా అంచనా వేస్తున్నారు. ఇది గత ఏడాదిసాయం కన్నా పెద్దగా ఎక్కువ గానీ, తక్కువ గానీ కాదు. ఇక సేవారంగానికి వస్తే 2013-14 నాటి 60.3 శాతం వాటా నుంచి 62.9 శాతం వాటాకి పెరిగిందని అంచనా. వర్తమాన ధరల వద్ద, స్థిరంగా తీసుకున్న 2004-05 ధరల వద్ద 2014-15లో వివిధ రంగాల సహాయ శాతాలను వర్ణపటాల సాయంతో ఇక్కడ చూపిస్తున్నాము:







ఆధారం : సంచాలకులు అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణపరమైన కూర్పు గడచిన దశాబ్దంలో గణనీయమైన మార్పులకు లోనయ్యింది. 2005-06, 2014-15 సంవత్సరాల మధ్య వ్యవసాయ రంగం 2005-06లో అత్యధిక స్థాయిలో 25.2 శాతం వృద్ధిని సాధించగా, సేవారంగం 2010-11లో 18.3 శాతం గరిష్ఠ వృద్ధిని, పారిశ్రామిక రంగం 2006-07లో 17.1 శాతం గరిష్ఠ వృద్ధిని సాధించాయి.

కొన్ని ఏళ్ల కాల వ్యవధిలో వ్యవసాయ రంగం తీరుతెన్నులను పరిశీలించినప్పుడు, దాని తోటి రంగాలలో ఒక్క జీవోత్పత్తులు మాత్రమే నికరంగా సానుకూలమైన వృద్ధి రేటును చూపాయి. తక్కిన అనుబంధ రంగాలు ఒకసారి అటూ మరోసారి యిటూగా వృద్ధిని చూపాయి.

కొన్ని ఏళ్ల కాలక్రమంలో సేవారంగంలో(రైల్వేయేతర) రవాణా సాధనాలు, గిడ్డంగులు, కమ్యూనికేషన్‌లు, బ్యాంకింగ్, బీమా, స్థిరాస్తులు, స్వగృహ కల్పన, వ్యాపార సేవలు, ఇతర సేవలు సానుకూలమైన వృద్ధి రేటును సాధించాయి. వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు, రైల్వేలు, ప్రజా పరిపాలన అటుయిటూగా వృద్ధిని చూపాయి. పారిశ్రామిక రంగంలో కూడా 2005-06, 2014-15 సంవత్సరాల మధ్య అన్ని ఉపరంగాలూ వృద్ధిలో మిశ్రమముగా యున్నవి.

స్థిరమైన 2004-05 ధరల వద్ద, 2005-06, 2014-15 సంవత్సరాల మధ్య, జి.ఎస్.డి.పి రంగాల వారీ వృద్ధి రేట్లు ఇక్కడ పటంలో తెలిపిన మాదిరిగా ఉన్నాయి.

**రంగాల వారీగా జి.ఎస్.డి.పి. వృద్ధిరేట్లు, ప్రామాణికమైన 2004-05 ధరలు ప్రాతిపదికగా**




| | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 (TRE) | 2012-13 (SRE) | 2013-14 (FRE) | 2014-15 (AE) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Agriculture Sector | 25.2 | -0.5 | 16.3 | 6.0 | -12.5 | 19.4 | -0.4 | 11.5 | 8.4 | -10.3 |
| Industry Sector | 13.8 | 17.1 | 6.4 | 16.0 | 2.3 | 16.8 | 5.7 | -4.1 | 0.1 | 4.1 |
| Services Sector | 13.9 | 13.2 | 10.9 | 14.6 | 4.8 | 18.3 | 12.5 | 6.3 | 5.9 | 9.7 |

టి.ఆర్.ఇ. : మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ.: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటిసారి సవరించిన అంచనాలు, ఏఇ : ముందస్తు అంచనాలు.

ఆధారం : సంచాలకులు అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## ఆర్థిక వ్యవస్థ నిర్మాణం

ఏళ్లు గడుస్తున్నకొద్దీ జి.ఎస్.డి.పి కూర్పు గణనీయంగా మారుతోంది. వర్షపాతం మీద, ఋతువుల ఆగ్రహానుగ్రహాల మీద భారీగా ఆధారపడుతున్న వ్యవసాయ రంగం అతలాకుతలమవుతోంది. జి.ఎస్.డి.పిలో వ్యవసాయ రంగం వాటా వర్తమాన ధరల వద్ద, 2005-06, 2014-15ల మధ్య 16.5 శాతం, 20.6 శాతం మధ్య ఊగిసలాడింది. మొత్తం మీద స్థూల జి.ఎస్.డి.పిలో కూడా వ్యవసాయరంగం వాటా పతనం కావడాన్ని, గడచిన కొన్నేళ్లలో అటుయిటూ ఊగిసలాడడాన్ని రాష్ట్రం గమనించింది. వ్యవసాయరంగ పతనధోరణి రాష్ట్రంలో ఇటీవలి ఏళ్లలో మరింత అయింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఇది ప్రాధాన్యరంగంగా కొనసాగుతోంది. కారణం ఉపాధి కల్పనకు, ఆహారభద్రతకు, పేదసాదలు సైతం అభివృద్ధిలో భాగం కావడానికి, వృద్ధి నిలదొక్కుకోడానికి ఆలంబన అయిన రంగమిదే. శ్రామికులలో దాదాపు 55.7 శాతం మంది పూర్తిగా గానీ, పాక్షికంగా గానీ రాష్ట్ర వ్యవసాయ రంగం మీదనే ఆధారపడి జీవితం గడుపుతున్నారు.

ఇతర ఆర్థిక వ్యవస్థలకు చెందిన సాధారణ అభివృద్ధి తరహాలోనే రాష్ట్ర జి.ఎస్.డి.పిలోని వ్యవసాయరంగం వాటా కూడా క్షీణిస్తోంది. కానీ, ఉపాధి కల్పనకు, ఆదాయాల అభివృద్ధికి, అంతిమంగా అందరికీ ఆహారభద్రతను సమకూర్చడానికి శీఘ్రతరమైన వ్యవసాయ వృద్ధే కీలకంగా నిలుస్తోంది.

ఇటీవలి దశకంలో వ్యవసాయ ఆధారితంగా, పరిశ్రమ ఆధారితంగా, సేవారంగ ఆధారితంగా జి.ఎస్.డి.పి కూర్పు పలురకాలుగా మార్పు చెందడాన్ని అర్థం చేసుకోడానికి, ఈ పరిస్థితి అంతటినీ కలిపి చూడాల్సిన అవసరముంది. వ్యవసాయరంగ వాటా పతనం, అదే కాలవ్యవధిలో 51 శాతం నుంచి 57 శాతం వరకు తన వాటాను పెంచుకున్న సేవారంగంతో దాదాపు భర్తీ అయింది. 2004-05 నుంచి 2014-15 వరకు పారిశ్రామిక రంగం వాటా 25 శాతం, 30 శాతం మధ్య ఊగిసలాడుతూ వచ్చింది. స్థిరమైన 2004-05 ధరల వద్ద, వర్తమాన ధరల వద్ద జి.ఎస్.డి.పిలో రంగాలవారీ వాటాలకు దిగువ గణాంక పటాలు అద్దం పడతాయి.

**జి.ఎస్.డి.పిలో రంగాలవారీ శాతాలలో మార్పుచేర్పులు - ప్రామాణికమైన 2004-05 ధరలు ప్రాతిపదికగా**




**జి.ఎస్.డి.పిలో రంగాలవారీ శాతాలలో మార్పుచేర్పులు - వర్తమాన ధరలు ప్రాతిపదికగా**




టి.ఆర్.ఇ. : మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ.: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటిసారి సవరించిన అంచనాలు, ఏఇ : ముందస్తు అంచనాలు.

ఆధారం : సంచాలకులు అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## తలసరి ఆదాయం

ఏ రాష్ట్ర అభివృద్ధి స్థాయి గురించి అయినా మెరుగైన అవగాహన కల్పించేది తలసరి ఆదాయమే. ప్రజల జీవన ప్రమాణానికి ఇది ఒక పరోక్ష సూచిక. 2014-15కి వేసిన ముందస్తు అంచనాల ప్రకారం, వర్తమాన ధరల వద్ద రాష్ట్ర తలసరి ఆదాయం 2013-14 నాటి రూ. 95,361 నుంచి రూ. 1,03,889కి పెరిగింది. ఇది 8.9 శాతం వృద్ధి కావడమే గాక, జాతీయ తలసరి ఆదాయం రూ. 88,533 కన్నా

ఎక్కువ కూడా. స్థిరమైన 2004-05 ధరల వద్ద తలసరి ఆదాయం 2013-14 నాటి రూ. 48,881 నుంచి 2014-15నాటికి రూ. 51,017కి పెరిగింది. దీనిలో వృద్ధి రేటు 4.4 శాతం. 2004-05 నుంచి 2014-15 వరకూ కూడా రాష్ట్ర తలసరి ఆదాయం, జాతీయ తలసరి ఆదాయం కన్నా నికరంగా ఎక్కువగానే ఉంటూ వస్తోంది. వర్తమాన ధరల వద్ద చూస్తే, 2004-05 నాటి రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 24,409, 2014-15 నాటికి రూ. 1,03,889కి పెరిగింది.

రాష్ట్ర తలసరి ఆదాయం అధికంగా ఉండడానికి కారణం స్థూల రాష్ట్ర ఉత్పత్తి ఇతోధికంగా పెరగడం మాత్రమే కాదు. జనాభా వృద్ధి వేగంగా తగ్గడాన్ని కూడా దానికి ఒక కారణంగా పరిగణించాలి. తెలంగాణలోని పది జిల్లాలకూ ఆరింటి తలసరి ఆదాయం రాష్ట్ర తలసరి ఆదాయం కన్నా తక్కువగా ఉంది. రాష్ట్ర తలసరి ఆదాయం కన్నా ఎక్కువ తలసరి ఆదాయాన్ని కలిగిన జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, ఖమ్మం. దీనిని బట్టి ఆర్థికాభివృద్ధి రాష్ట్రంలో సమానంగా పంపిణీ కాలేదనీ, అది పట్టణ ప్రాంతాలలో ఎక్కువగా కేంద్రీకృతమయిందనీ స్పష్టంగా తెలుస్తుంది. వర్తమాన, స్థిర ధరల ప్రాతిపదికగా కాలక్రమంలో తలసరి ఆదాయం ఏ విధంగా ఉన్నదీ ఇక్కడ ఇచ్చిన గణాంక పటాలు వివరిస్తాయి.

**రాష్ట్ర, దేశ తలసరి ఆదాయాలు - వర్తమాన ధరల ప్రాతిపదికగా**




టి.ఆర్.ఇ. : మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ.: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటిసారి సవరించిన అంచనాలు, ఏఇ : ముందస్తు అంచనాలు.

ఆధారం : సంచాలకులు అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## జిల్లా స్థాయి స్థూల ఉత్పత్తి

భారతదేశంలోని ఇతర భాగాలలో మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా జిల్లాల వ్యాప్తంగా అభివృద్ధి స్థాయిలలో హెచ్చుతగ్గులు గణనీయంగా ఉన్నాయి.

జిల్లా స్థాయి స్థూల ఉత్పత్తి (జి.డి.డి.పి) అంచనాలు ఆయా జిల్లాల ఆర్థిక పరిమాణాన్ని వెల్లడిస్తాయి. అలాగే కాలక్రమంలో ఆ జిల్లా ఆర్థిక పురోగతి పరిణామాన్ని మదింపు చేయడానికి కూడా ఉపకరిస్తాయి. వర్తమాన ధరల వద్ద 2013-14 సంవత్సరానికి జరిగిన జి.డి.డి.పి అంచనాల ప్రకారం హైదరాబాద్ అత్యున్నత స్థానంలో ఉంది. రంగారెడ్డి, మెదక్ దాని తరువాత స్థానాలలో నిలుస్తున్నాయి. ఈ మూడు జిల్లాలూ కలిపి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జి.డి.పి)లో సుమారు 45 శాతం సమకూర్చాయి. తక్కిన ఏడు జిల్లాలూ కలిపి రాష్ట్ర జి.డి.పిలో 55 శాతం సమకూర్చాయి. 2004-05 నుంచి 2013-14 వరకు మూడు అగ్రగామి జిల్లాల జి.డి.డి.పిలూ సగటున 10 శాతం

కన్నా మిన్నగా పెరిగాయి. అదే ఆదిలాబాద్ జిల్లా సంగతికి వస్తే జి.డి.డి.పి సగటు వృద్ధి 5.9 శాతం మాత్రమే. ఇది సదరు కాలవ్యవధిలో అన్ని జిల్లాలలోకీ అత్యంత తక్కువ.

జిల్లాల వారీ జి.డి.డి.పి, వాటా శాతం, వృద్ధి రేట్లు, తలసరి ఆదాయాలను ఇక్కడి పట్టిక, గణాంక పటము సూచిస్తాయి.

**పట్టిక 6 : రాష్ట్ర జి.డి.పిలో జిల్లాల వారీగా జి.డి.డి.పి వాటా, ప్రామాణికమైన 2004-05 ధరల వద్ద క్రితం సంవత్సరంపై మార్పు శాతం**

| వరుస సంఖ్య | జిల్లా | 2013-14లో రాష్ట్ర జి.డి.పి.లో జిల్లా వాటా (%) | 2005-06 నుండి 2013-14 వరకు తలసరి వృద్ధి రేటు |
|---|---|---|---|
| 1. | హైదరాబాద్ | 17.4 | 10.0 |
| 2. | రంగారెడ్డి | 16.8 | 12.3 |
| 3. | మెదక్ | 10.8 | 12.0 |
| 4. | కరీంనగర్ | 10.3 | 9.3 |
| 5. | నల్గొండ | 9.0 | 10.4 |
| 6. | మహబూబ్‌నగర్ | 8.8 | 10.1 |
| 7. | ఖమ్మం | 8.4 | 8.0 |
| 8. | వరంగల్ | 7.6 | 8.0 |
| 9. | ఆదిలాబాద్ | 5.6 | 5.9 |
| 10. | నిజామాబాద్ | 5.4 | 9.4 |

ఆధారం : సంచాలకులు అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

**2013-14లో జిల్లావారీ తలసరి ఆదాయం - వర్తమాన ధరలు ప్రాతిపదికగా (రూపాయలలో)**




*2014-15 సంవత్సరానికి రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 1,03,889. 2014-15 సంవత్సరానికి జిల్లాల తలసరి ఆదాయాలను ఇంకా లెక్కకడుతున్నారు.*

తెలంగాణ రాష్ట్ర వృద్ధి చిత్రణ రాష్ట్రం ముందున్న ఎన్నో అవకాశాలను, అదే విధంగా సవాళ్లను వెల్లడిస్తుంది. విధానాలను, కార్యక్రమాలను రూపకల్పన చేసే క్రమంలో వీటిని దృష్టిలో పెట్టుకోవలసిన అవసరముంది. తెలంగాణ పునరావిష్కరణ లక్ష్య సాధనలో ఎదురయ్యే అన్ని అంశాలనూ పరిష్కరించడానికి ప్రభుత్వం తీసుకున్న మొదటి చర్య అవసరమైన అన్ని అంశాలనూ క్రోడీకరించడం. అందుకు అనుగుణంగా తదుపరి రంగాలలో సమగ్ర పట్టికలను అందించే ప్రయత్నం జరిగింది.

> *"వృద్ధి దానంతటది ఎన్నటికీ జరగదు. వివిధబలాలు కలసికట్టుగా పనిచేసిన ఫలితంగా అది సిద్ధిస్తుంది." - జేమ్స్ కాష్ పెన్నీ*

# అధ్యాయం 2

# వ్యవసాయం, సంబంధిత రంగాల పునరుద్ధరణ

# 2.1 వ్యవసాయం - సవాళ్లు అవకాశాలు

*"వ్యవసాయం అంటే కొందరు అనుకున్నట్లుగా కేవలం పంటలు వేయడం కాదు.*
*అది ప్రపంచంలోని భూమి నుంచి, నీటి నుంచి ఆహారాన్ని, గ్రాసాన్ని ఉత్పత్తి చేయడం.*
*వ్యవసాయం లేకుండా ఓ నగరం, ఓ స్టాక్ మార్కెట్, బ్యాంకులు, విశ్వవిద్యాలయం, చర్చి,*
*సైన్యం ఏవీ మనలేవు. నాగరికతకూ, సమస్తమైన సుస్థిర ఆర్థిక వ్యవస్థలకూ వ్యవసాయమే పునాది."*
*- అలన్ శావరీ*

ఆర్థికంగా, అన్ని విధాలా నిలదొక్కుకోగలిగిన రీతిలో వ్యవసాయరంగంలో వృద్ధిని సాధించడం అటు కేంద్రం, ఇటు రాష్ట్రం రెండు ప్రభుత్వాలకూ కీలకమైన అజండా. వ్యవసాయరంగం ప్రధానంగా వర్షాధారమైనది. నానాటికీ తరిగిపోతున్న భూగర్భ జలాల మీద అది గణనీయంగా ఆధారపడింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 55.49 శాతం మంది తమ జీవనోపాధి కోసం ఏదో విధంగా వ్యవసాయ కార్యకలాపాల మీదనే ఆధారపడి ఉన్నారు. అందువలన పేదరికాన్ని తగ్గించడానికి, తెలంగాణలో సంపద వృద్ధిని నికరంగా సాగించడానికీ వ్యవసాయ ఆదాయాలను పెంచడం చాలా కీలకమైన అవసరం. ఈ రంగంలో అధికంగా ఉన్న శ్రామిక బలగాన్ని నైపుణ్యాల అభివృద్ధి ద్వారా గ్రామీణ పరిశ్రమల వంటి వ్యవసాయేతర గ్రామీణ రంగాలకు మళ్లించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యాన్ని ఇవ్వడం జరుగుతోంది. ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్, గ్రామీణ జీవనోపాధి కల్పన వంటి ఉపాధి హామీ పథకాలకు, సామాజిక-ఆర్థిక అభివృద్ధి పథకాలకు అత్యవసర ప్రాతిపదిక నిరంతరంగా ఆహార భద్రతను సాధించడం, చక్కని ఆదాయాన్నిచ్చే రీతిలో ఉపాధికల్పనను ఏర్పాటు చేయడం.

రాష్ట్ర జి.ఎస్.డి.పికి వ్యవసాయం అందిస్తున్న వాటా 2014-15లో వర్తమాన ధరల వద్ద 9.3 శాతం.

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో కలిపి పంట సేద్యం (వ్యవసాయం, ఉద్యాన వన పోషణ కలిపి), జీవోత్పత్తులు, అటవీ సంపద, మత్స్య పరిశ్రమ రంగాలను చేర్చడం జరిగింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల జి.ఎస్.డి.పిలో పంట సేద్యం భాగం కాలక్రమంలో క్షీణించిపోతోంది.

2014-15లో వ్యవసాయం, దాని అనుబంధ రంగాల జి.ఎస్.డి.పిలో జీవోత్పత్తులు సుమారు మూడో వంతు వరకు ఉంటున్నాయి. గడచిన దశాబ్దంలో ఈ రంగం వృద్ధి, పంట సేద్యంతో పోల్చి చూస్తే కుదురుగా ఉంది. ఏమైనప్పటికీ, దీని వృద్ధి మాత్రం గడచిన రెండేళ్లలో మందగించింది. జి.ఎస్.డి.పిలో వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాల భాగం క్షీణిస్తున్న నేపథ్యంలో జీవోత్పత్తుల రంగం వృద్ధికి ప్రాముఖ్యం పెరుగుతోంది. ఈ వివరాలను ఇక్కడ చూడవచ్చు.

**పట్టిక 7 : వ్యవసాయ జి.ఎస్.డి.పిలో అనుబంధ రంగాల భాగం - వర్తమాన ధరలలో**

| రంగం | 2011-12* | 2014-15 |
|---|---|---|
| వ్యవసాయం ఉద్యానవనపోషణ | 57.7 | 51.8 |
| జీవోత్పత్తులు | 34.4 | 39.7 |
| అటవీ ఉత్పత్తులు, కలప | 5.5 | 5.0 |
| మత్స్య సేకరణ | 2.4 | 3.5 |
| మొత్తం వ్యవసాయ రంగం | 100.0 | 100.0 |
| జి.ఎస్.డి.పిలో వ్యవసాయరంగం - అనుబంధ రంగాల భాగం | 18.6 | 17.9 |
| జి.ఎస్.డి.పిలో పశుసంపద భాగం | 6.4 | 7.1 |

*గమనిక : జీవోత్పత్తుల గణాంకాల కారణంగా 2011-12 ఏడాది లెక్కలను ప్రస్తావించడమైనది.

## భూమి వినియోగం

రాష్ట్రంలో మొత్తం భూ విస్తీర్ణం 114.84 లక్షల హెక్టార్లు. దానిలో అడవుల రూపంలో ఉన్నది 27.43 లక్షల హెక్టార్లు. ఇది భౌగోళిక విస్తీర్ణంలో 23.89 శాతం. దాదాపు 43.20 శాతం విస్తీర్ణం సాగులో ఉంది. ఇది 49.61 లక్షల హెక్టార్లు. 8.36 శాతం భూములు (9.60 లక్షల హెక్టార్లు) ప్రస్తుత పడావ భూములు. 7.79 శాతం భూములు (8.95 లక్షల హెక్టార్లు) వ్యవసాయేతర ప్రయోజనాలకు వినియోగమవుతున్నాయి. 5.36 శాతం భూములు (6.15 లక్షల హెక్టార్లు) బంజరు మరియు సాగుకు పనికిరాని భూములు. 6.24 శాతం (7.17 లక్షల హెక్టార్లు) ఇతర పడావ భూములు. మిగిలిన 5.16 శాతం భూములు కల్చర్ చేయడానికి వీలైన వ్యర్థం కింద, 5.93 శాతం శాశ్వత పచ్చిక బయళ్ళు, మేత బయళ్ళు, నికరముగా విత్తిన విస్తీర్ణములో చేర్చని, ఇతర వృక్షాలు తోపులు కింద భూమి. నికరంగా విత్తిన భూముల కింద లెక్కించని ఈ భూములు 5.93 లక్షల హెక్టార్ల వరకు ఉన్నాయి. వివిధ వర్గాల కింద భూమి వినియోగం తీరుతెన్నులను దిగువ వర్ణ పటం సూచిస్తుంది.



## భూకమతాలు

వ్యవసాయ కమతాలగణన, 2010-11 ప్రకారం రాష్ట్రంలో భూకమతాల సంఖ్య 55.54 లక్షలు. ఈ కమతాల కింద ఉన్న మొత్తం భూమి పరిమాణం 61.97 లక్షల హెక్టార్లు. రాష్ట్రంలో సగటు భూకమతం పరిమాణం 1.11 హెక్టార్లు. ఆర్థికంగా ఈ పరిమాణం బొత్తిగా గిట్టుబాటు కాని వ్యవహారం. రాష్ట్రంలో 62.0 శాతం కమతాలు హెక్టారు కన్నా చిన్నవైన నామమాత్రపు కమతాలు. ఇక 1 - 2 హెక్టార్ల మధ్య విస్తీర్ణం కలిగిన చిన్న కమతాల శాతం 23.9. ఆ విధంగా రాష్ట్రంలోని మొత్తం కమతాలలో నామమాత్రపువి, చిన్నవి కలిపి 85.9 శాతం ఉన్నాయి. ఆ విధంగా అత్యధిక జనాభా జీవనోపాధికి వ్యవసాయం ఒక ఆధారం..

నిజామాబాద్, కరీం నగర్, మెదక్, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో 60 శాతానికి పైగా భూములు నామమాత్రపు కమతాలే. ఏమైనప్పటికీ చిన్న, ఒక మోస్తరు కమతాలన్నీ కలిపితే, నామమాత్రపు కమతాలన్నీ కలిపిన దాని కన్నా ఎక్కువ శాతమే. సగటు కమతం విస్తీర్ణం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక స్థాయిలో 1.40 హెక్టార్లుండగా, 0.92 హెక్టార్ల సగటు విస్తీర్ణంతో నిజామాబాద్ అతి తక్కువ స్థాయిలో ఉంది. భూమి కమతాల పంపిణీ, పరిమాణం వారీగా వివిధ తరగతుల కింద ఉన్న విస్తీర్ణం పట్టిక 8లో చూడవచ్చు.

**పట్టిక 8 : తరగతుల వారీగా కమతాలు మరియు విస్తీర్ణాల శాతం 2010-11**

| జిల్లా | కమతాలు | | | | | విస్తీర్ణం (హెక్టార్లలో) | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | నామమాత్రం | చిన్న స్థాయి | ఒక మోస్తరు | మధ్య స్థాయి | పెద్ద స్థాయి | నామమాత్రం | చిన్న స్థాయి | ఒక మోస్తరు | మధ్య స్థాయి | పెద్ద స్థాయి | కమతాల సగటు పరిమాణం (హెక్టార్లలో) |
| అదిలాబాద్ | 49.8 | 27.7 | 17.5 | 4.6 | 0.4 | 16.9 | 28.3 | 31.9 | 18.1 | 4.8 | 1.4 |
| నిజామాబాద్ | 67.5 | 23.8 | 7.3 | 1.3 | 0.1 | 33.9 | 36.1 | 20.6 | 7.9 | 1.5 | 0.92 |
| కరీంనగర్ | 67.5 | 21.9 | 8.4 | 2 | 0.2 | 30.9 | 31.8 | 22.9 | 11.8 | 2.6 | 0.96 |
| మెదక్ | 67.9 | 21.7 | 7.8 | 2.3 | 0.3 | 29.9 | 31.3 | 21.2 | 13.2 | 4.4 | 0.97 |
| రంగారెడ్డి | 58.3 | 25.7 | 12.1 | 3.5 | 0.4 | 23.5 | 29.4 | 26.1 | 15.8 | 5.2 | 1.22 |
| మహబూబ్‌నగర్ | 57.9 | 25.4 | 12.6 | 3.7 | 0.4 | 22 | 29.5 | 27.2 | 16.8 | 4.5 | 1.23 |
| నల్గొండ | 58.8 | 25.3 | 12.1 | 3.5 | 0.3 | 23.1 | 29.9 | 26.9 | 16.5 | 3.6 | 1.19 |
| వరంగల్ | 67.1 | 21.4 | 8.7 | 2.5 | 0.3 | 28.6 | 29.7 | 22.8 | 14.2 | 4.7 | 1.01 |
| ఖమ్మం | 62.2 | 22.6 | 11.6 | 3.3 | 0.3 | 25.6 | 27.6 | 26.7 | 15.8 | 4.3 | 1.14 |
| రాష్ట్రం | 62 | 23.9 | 10.8 | 3 | 0.3 | 25.3 | 30.2 | 25.5 | 15 | 4 | 1.11 |

ఆధారం : సంచాలకులు అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## వర్షపాతం

అంతంతమాత్రపు వర్షాల మీద ఆధారపడిన రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలో సగటు వార్షిక వర్షపాతం సుమారు 906 మి.మీ. దీనిలో 80 శాతం (జూన్-సెప్టెంబర్ నెలల మధ్య వచ్చే) నైరుతి రుతు పవనాల నుంచి లభిస్తుంది. రాష్ట్రంలో వాన కురిసే విధానం ఒక తీరుగా ఉండదు. కురుస్తుందో, కురవదో, ఎప్పుడు కురుస్తుందో, ఎంత కురుస్తుందో అంచనాలకు అందదు. ఇక వర్షపు నీటి పంపిణీ కూడా వేర్వేరు మండలాలలో వేర్వేరు తీరులలో ఉంది. దీనితో వ్యవసాయమనేది వరుణ దేవుడి కరుణాకటాక్షాల మీద ఆధారపడిన జూదం అన్న సామెతగా మారిపోయింది.

2004-05 నుంచి 2013-14 వరకు కురిసిన వర్షాలలో, 2004-05లో అతి తక్కువ స్థాయిలో 614 మి.మీ నమోదైనది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 906 మి.మీ కాగా, అత్యధిక స్థాయిలో 1212 మి.మీ 2013-14లో కురిసినది.

**2004-05 నుంచి 2013-14 వరకు కురిసిన సాధారణ వర్షపాతాన్ని, ఏడాది వారీగా వాస్తవ వర్షపాతాన్ని దిగువ రేఖాచిత్రపటం చూపిస్తుంది.**




ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

2013-14లో జూన్-సెప్టెంబర్‌ల మధ్య నైరుతి రుతుపవనాలలో లభించిన వాస్తవ వర్షపాతం 852 మి.మీ, సాధారణ వర్షపాతం 715 మి.మీపై 19 శాతం అధికం. 2013-14లో ఈశాన్య రుతుపవనాల నుంచి (అక్టోబర్-డిసెంబర్) లభించిన వర్షపాతం 243 మి.మీ కాగా, ఇది సాధారణ వర్షపాతం 129 మి.మీ కన్నా 88 శాతం అధికం. గడచిన 10 ఏళ్ల వర్షపాతం ధోరణిని దిగువ రేఖాచిత్రపటాలు విశదీకరిస్తాయి.

**2004-05 నుంచి 2013-14 వరకు నైరుతి రుతుపవనాల సమయంలో వర్షపాతం**




ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

**2004-05 నుంచి 2013-14 వరకు ఈశాన్య రుతుపవనాల సమయంలో కురిసిన వర్షపాతం**




ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

2014-15 వ్యావసాయిక సంవత్సరంలో నైరుతి, ఈశాన్య రుతు పవనాల నుంచి లభించిన సాధారణ, వాస్తవ వర్షపాతాలను దిగువ రేఖాచిత్రపటం చూపిస్తుంది.

**2014-15లో నైరుతి రుతుపవనాలతో కురిసిన వర్షపాతం (మి.మీ.)**



**2014-15లో ఈశాన్య రుతుపవనాల కాలంలో కురిసిన వర్షపాతం (మి.మీ.)**




## వ్యవసాయరంగ సామర్థ్యం

పంటలు వేసిన స్థూల విస్తీర్ణాన్ని పంటలు వేసిన నికర విస్తీర్ణంతోటి భాగించగా వచ్చినది పంటల సాంద్రత. భూవినియోగం యొక్క సామర్థ్యాన్ని తెలియచేసే ముఖ్యమైన సూచిక. ఇది 2012-13 నాటి 1.22 నుంచి 2013-14లో 1.27కి పెరిగింది. వ్యవసాయరంగ సామర్థ్యం అత్యధిక స్థాయిలో నిజామాబాద్ జిల్లాలో 1.67 నమోదు కాగా, ఆదిలాబాద్ జిల్లాలో అత్యల్ప స్థాయిలో 1.09 నమోదయింది.

**పట్టిక 9 : 2013-14లో జిల్లాల వారీ పంటల సాంద్రత**

| క్ర.సం. | జిల్లాలు | | పంటల సాంద్రత |
|---|---|---|---|
| 1 | మహబూబ్‌నగర్ | | 1.11 |
| 2 | రంగారెడ్డి | | 1.14 |
| 3 | మెదక్ | | 1.23 |
| 4 | నిజామాబాద్ | | 1.67 |
| 5 | ఆదిలాబాద్ | | 1.09 |
| 6 | కరీంనగర్ | | 1.53 |
| 7 | వరంగల్ | | 1.36 |
| 8 | ఖమ్మం | | 1.16 |
| 9 | నల్గొండ | | 1.27 |
| | **రాష్ట్రం** | | **1.27** |

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## సాగునీటిద్వార సాగైన స్థూల మరియు నికర విస్తీర్ణము

రాష్ట్రంలో సేద్యపు నీటి సదుపాయం కలిగిన భూమి 2012-13లో 25.57 లక్షల హెక్టార్లుండగా, 2013-14లో అది 31.64 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఇది 23.74 శాతం పెరుగుదల. దానికనుగుణంగా నికరంగా సేద్యపు నీరు అందిన భూమి విస్తీర్ణం 2012-13 నాటి 17.74 లక్షల హెక్టార్ల నుంచి 2013-14లో 29.03 శాతం పెరిగి, 22.89 లక్షల హెక్టార్లకు చేరింది.

**2007-08 నుంచి 2014-15 వరకు ఖరీఫ్‌లో స్థూలంగా, నికరంగా సేద్యపు నీరు అందిన విస్తీర్ణాలు**




**2007-08 - 2014-15ల మధ్య వేర్వేరు జలవనరుల కింద సేద్యం జరిగిన విస్తీర్ణం**




ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

**పట్టిక 10 : 2008-09 నుంచి 2013-14 వరకు, సాగుచేసిన నికర విస్తీర్ణం, సాగునీరు అందించిన నికర విస్తీర్ణం సాగు వ్యవసాయం నిష్పత్తి**

(లక్షల హెక్టార్లలో)

| సంవత్సరం | సాగుచేసిన నికర విస్తీర్ణం | సేద్యపు నీరు అందిన నికర విస్తీర్ణం | సాగు వ్యవసాయం నిష్పత్తి (%) |
|---|---|---|---|
| 2008-09 | 42.26 | 18.82 | 44.53 |
| 2009-10 | 39.58 | 14.93 | 37.72 |
| 2010-11 | 44.89 | 20.04 | 44.64 |
| 2011-12 | 45.73 | 19.85 | 43.41 |
| 2012-13 | 46.54 | 17.74 | 38.12 |
| 2013-14 | 49.61 | 22.89 | 46.14 |
| 2014-15 (ఖరీఫ్) | 41.46 | 14.87 | 35.86 |

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

2013-14 సంవత్సరంలో విత్తిన విస్తీర్ణంలో సేద్యపు నీరు నికరంగా అందిన విస్తీర్ణం భాగం 46.14 శాతం. అది 2014-15 ఖరీఫ్‌కు 35.86 శాతం. 2008-09 నుంచి 2014-15 ఖరీఫ్ వరకు ఈ నిష్పత్తుల వివరాలను దిగువ చూపడమైనది.

2009-10లో బావి నీటితో సేద్యం జరిగిన భూములు 84.33 శాతంతో అత్యధిక స్థాయిలో నిలిచాయి. ఇవి 2013-14లో 74.83 శాతానికి పడిపోయాయి. కాలువ నీటితో నికరంగా సాగు అయిన భూములు 2012-13లో కేవలం 5.07 శాతం కాగా, అవి 2013-14లో 12.67 శాతానికి పెరిగాయి. ఈ కాలవ్యవధిలో నికరంగా సాగు నీరు అందుకున్న భూములలో సగటున 76 శాతం బావుల నుంచి నీటిని పొందినవే. దీనిని బట్టి బావి నీటి మీద ఆధారపడిన సేద్యం బాగా ఎక్కువగా ఉందని తెలుస్తుంది.

**పట్టిక 11 : 2008 నుంచి 2013-14 వరకు సేద్యపు నీటి వనరుల ఆధారంగా సాగయిన నికర విస్తీర్ణం శాతం**

| సంవత్సరం | నికరంగా సేద్యపు నీరు అందిన విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో) | జలవనరుల వారీగా సాగునీరు అందిన నికర విస్తీర్ణం (%) | | |
|---|---|---|---|---|
| | | కాలువలు | చెరువులు | బావులు |
| 2008-09 | 18.28 | 11.55 | 13.03 | 72.09 |
| 2009-10 | 14.93 | 9.18 | 3.82 | 84.33 |
| 2010-11 | 20.04 | 15.76 | 11.87 | 69.63 |
| 2011-12 | 19.85 | 16.37 | 9.22 | 71.69 |
| 2012-13 | 17.74 | 5.07 | 8.91 | 83.77 |
| 2013-14 | 22.89 | 12.67 | 10.05 | 74.83 |
| 2014-15 K | 14.87 | 10.52 | 6.05 | 81.055 |

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## నీటి వసతి సామర్థ్యం

బావులు, జలాశయాల వంటి అన్ని వనరుల నుంచి స్థూలంగా సాగు నీరు అందే విస్తీర్ణంలో నికరంగా సాగు నీరు అందుకున్న విస్తీర్ణం నీటి వసతి సామర్థ్యంగా లెక్కకు వస్తుంది. దీనిని పట్టిక 12 చూపిస్తుంది. 2013-14లో బావులకు సంబంధించిన నీటి వసతి సామర్థ్యం 1.36. బావి నీటి సేద్యం కారణంగా స్థూలంగా, నికరంగా సేద్యపు నీటిని అందుకున్న భూవిస్తీర్ణం విస్తరించింది.

**పట్టిక 12 : 2007-08 నుంచి 2014-15 ఖరీఫ్ వరకు స్థూలంగా, నికరంగా సేద్యపు నీరు అందిన విస్తీర్ణాలు, సేద్యపు నీరు సాంద్రత**

| సంవత్సరం | అన్ని వనరుల కింద స్థూల జలవసతి (లక్షల హెక్టార్లలో) | అన్ని వనరుల కింద నికర జలవసతి (లక్షల హెక్టార్లలో) | సేద్యపునీటి సాగు సాంద్రత (అన్నివనరులు) | బావుల కింద స్థూల జలవసతి (లక్షల హెక్టార్లలో) | బావుల కింద నికర జలవసతి (లక్షల హెక్టార్లలో) | సేద్యపు నీటి సాగు సాంద్రత (బావులు) |
|---|---|---|---|---|---|---|
| 2007-08 | 24.46 | 17.49 | 1.40 | 18.23 | 13.14 | 1.39 |
| 2008-09 | 27.21 | 18.82 | 1.45 | 19.814 | 13.17 | 1.50 |
| 2009-10 | 21.31 | 14.93 | 1.43 | 18.42 | 12.59 | 1.46 |
| 2010-11 | 29.99 | 20.04 | 1.50 | 21.11 | 13.96 | 1.51 |
| 2011-12 | 28.64 | 19.85 | 1.44 | 21.57 | 14.23 | 1.52 |
| 2012-13 | 25.57 | 17.74 | 1.44 | 22.07 | 14.86 | 1.49 |
| 2013-14 | 31.64 | 22.89 | 1.38 | 23.36 | 17.13 | 1.36 |
| 2014-15 K | 14.98 | 14.87 | 1.01 | 4.41 | 4.41 | 1.00 |

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## విస్తీర్ణం మరియు ఉత్పత్తి

2004-05 నుంచి 2013-14 వరకు, అటుపై 2014-15 ఖరీఫ్ వరకు రాష్ట్రంలో ఆహార ధాన్యాలను పండించిన విస్తీర్ణం, పండిన పంటల సంఖ్యలను రేఖా చిత్రపటం చూపిస్తుంది. క్షామం, వరదలు, భారీ వర్షాల వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా గడచిన దశాబ్దంలో ఆహార ధాన్యాలను పండించిన విస్తీర్ణం, ఉత్పత్తి అయిన పంట ఒడిదుడుకులకు లోనయ్యాయి. సరిగ్గా వర్షపాతం తగ్గిన సంవత్సరాలలోనే నికరంగా పంట వేసిన భూమి, స్థూలంగా సేద్యపు నీరు అందిన విస్తీర్ణం, ఆహార పంటలను వేసిన విస్తీర్ణం, ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా చాలా తక్కువగా ఉన్న సంగతిని గమనించవచ్చు.

**2004-05 నుంచి 2014-15 ఖరీఫ్ వరకు ఆహార ధాన్యాల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి**




ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

## పంటల ఉత్పాదకత

హెక్టారు పొలంలో ఎన్ని కిలోల ధాన్యం పండిందనేది ఉత్పాదకతగా లెక్కిస్తారు. 2009-10 నుంచి 2014-15 (ఖరీఫ్) వరకు వరి ఉత్పాదకత దాదాపు నిలకడగా ఉంది. కానీ, 2013-14లో ఖరీఫ్ పంట దిగుబడి హెక్టారుకు 3,227 కిలోలు రాగా, 2014-15 ఖరీఫ్ సమయంలో 3,054 కిలోల వద్ద ఆగింది. మొక్కజొన్న పంట మాత్రం నిరుడు ఖరీఫ్‌లో హెక్టారుకు 4,408 కిలోల దిగుబడినివ్వగా, 2014-15 అదే సమయంలో హెక్టారుకు 2,720 కిలోల దిగుబడినిచ్చింది. జొన్నపంట ఉత్పత్తిరేటు 2013-14 ఖరీఫ్‌లో హెక్టారుకు 1,085 కిలోలు కాగా, 2014-15 ఖరీఫ్‌లో అది హెక్టారుకు 1,119 కిలోలకు పెరిగింది. పెసలు నిరుడు ఖరీఫ్ సమయంలో హెక్టారుకు 662 కిలోల దిగుబడినివ్వగా, 2014-15 ఖరీఫ్‌లో 489 కిలోలు మాత్రమే ఇచ్చింది. కందులు నిరుడు ఖరీఫ్‌లో హెక్టారుకు 529 కిలోలు పండగా, 2014-15 ఖరీఫ్‌లో 441 కిలోలు మాత్రమే పండాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా చాలా పంటలు నిరుటి ఖరీఫ్ కన్నా 2014-15 ఖరీఫ్‌లో తక్కువ దిగుబడినిచ్చాయి.

**2009-10 నుంచి 2014-15 ఖరీఫ్ వరకు ప్రధాన ఆహార పంటల ఉత్పాదకత (కిలోలు/హెక్టారుకు)**




ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

**పట్టిక 13 : 2013-14 ఏడాది ముగింపులో జిల్లాల వారీగా ముఖ్యపంటల దిగుబడి (కిలోలు/హెక్టారుకు)**

| జిల్లా | వరి | మొక్కజొన్న | సెనగలు | పత్తి (లింట్)* | మిరప | పసుపుకొమ్ములు |
|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 2745 | 3771 | 1371 | 369 | 2386 | 6721 |
| ఖమ్మం | 2994 | 5500 | 1716 | 533 | 4179 | 5078 |
| కరీంనగర్ | 3591 | 5463 | 1352 | 492 | 2710 | 6303 |
| మహబూబ్‌నగర్ | 2839 | 4749 | 1842 | 352 | 3232 | 5078 |
| మెదక్ | 3653 | 3720 | 1587 | 416 | 800 | 2869 |
| నల్గొండ | 3061 | 1675 | 1716 | 393 | 3196 | 5078 |
| నిజామాబాద్ | 4004 | 5352 | 2046 | 338 | 3941 | 4178 |
| రంగారెడ్డి | 2284 | 3554 | 1253 | 399 | 3490 | 3216 |
| వరంగల్ | 3141 | 4984 | 837 | 472 | 3249 | 4521 |
| **రాష్ట్రం** | **3297** | **4685** | **1716** | **423** | **3544** | **5078** |

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాదు

వేరుసెనగ పంట ఉత్పాదకత 2009-10 నుంచి 2014-15 వరకు దాదాపు నిలకడగా ఉంది. సోయాబీన్ 2009-10లో మినహా నిలకడగానే పండింది. పామాయిల్ విషయంలో 2009-10, 2014-15 (ఖరీఫ్) వరకు దిగుబడిలో హెచ్చుతగ్గులు గణనీయంగా ఉన్నాయి. వేరుసెనగ, సోయాబీన్, పామాయిల్‌ల ఉత్పాదకతలను దిగువ పటంలో చూపడమైనది.

**వేరుసెనగ, సోయాబీన్, పామాయిల్ పంటల ఉత్పాదకత**




మిరప పంట ఉత్పాదకత ఖమ్మంలో అత్యధిక స్థాయిలో నిలచింది. కాగా, పసుపు పంట ఉత్పాదకతలో ఆదిలాబాద్ అగ్రస్థానంలో ఉంది. పత్తి ఉత్పాదకత జిల్లాలన్నింటిలో కాస్త అటూయిటూగా దాదాపు ఒకే స్థాయిలో ఉంది. పత్తి (లింట్), మిరప, పసుపు పంటల జిల్లాలవారీ ఉత్పాదకతలను దిగువ పట్టికలో చూపడమైనది.

**జిల్లాల వారీగా ప్రధాన వాణిజ్య పంటల ఉత్పాదకత**




## వ్యవసాయం పట్ల భవిష్యత్ వైఖరి

వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో మూలాధారమైన పాత్రను పోషిస్తుంది. అన్ని వర్గాలనూ వృద్ధి బాటలోకి తీసుకురావడానికి ఈ రంగంలో మెరుగైన పనితనాన్ని చూపించడమే కీలకం. 1970లలో వరి సాగులో తెలంగాణ హరిత విప్లవాన్ని చేపట్టింది. వ్యవసాయాధారిత ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంలో ఇటీవలి ఏళ్లలో అటు నిర్మాణాత్మకంగా, ఇటు పనితనం పరంగా గణనీయమైన మార్పులు వచ్చాయి.

సారవంతమైన భూములు, వైవిధ్యం కలిగిన పంటలు, కృష్ణ, గోదావరి నదుల నీటిని అందుకునే భారీ సేద్యపు నీటి వ్యవస్థలు మొదలైన పుష్కలమైన వనరులు తెలంగాణకు వరం. తెలంగాణ ప్రజల సంస్కృతిని, ఆర్థిక జీవితాన్ని రూపుదిద్దిన వ్యవసాయం ఒక సంప్రదాయం, ఒక జీవనవిధానం. కాబట్టి, రాష్ట్ర ప్రణాళికాబద్ధమైన సాంఘిక-ఆర్థిక అభివృద్ధికి వేసే సమస్త వ్యూహాలకూ కేంద్ర బిందువు వ్యవసాయమే. 6 శాతం వృద్ధిని సాధించాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వం నొక్కిచెప్పింది. మెరుగుపరచిన సాంకేతిక సదుపాయాల ద్వారా, సదుపాయాలను ఎక్కువమందికి అందించడం ద్వారా, యాంత్రికీకరణ ద్వారా, అవసరమైన వాటిని సకాలంలో సమర్థంగా అందించడం ద్వారా, విక్రయ అనుబంధాల ద్వారా, తగినంత రుణ సదుపాయం కల్పించడం ద్వారా, పంటల బీమా ద్వారా రైతులకు పెట్టుబడి మీద మెరుగైన ప్రతిఫలాన్ని సాధించడం అత్యంత కీలకం.

రాష్ట్రం మొత్తం భౌగోళిక విస్తీర్ణం 114.84 లక్షల హెక్టార్లు కాగా, 2013-14లో స్థూలంగా పంటలు వేసిన విస్తీర్ణం 62.88 లక్షల హెక్టార్లు.

**పట్టిక 14 : సాగవుతున్న స్థూల విస్తీర్ణం, సాగువుతున్న నికర విస్తీర్ణం వివరాలు**

| వరుస సంఖ్య | విభాగం | పరిమాణ ప్రమాణం | విలువ |
|---|---|---|---|
| 1 | మొత్తం భూవిస్తీర్ణం | లక్షల హెక్టార్లలో | 114.84 |
| 2 | సాగవుతున్న స్థూల విస్తీర్ణం | లక్షల హెక్టార్లలో | 62.88 |
| 3 | సాగవుతున్న నికర విస్తీర్ణం | లక్షల హెక్టార్లలో | 49.61 |
| 4 | స్థూలంగా సేద్యపు నీరు అందుతున్న విస్తీర్ణం | లక్షల హెక్టార్లలో | 31.64 |
| 5 | నికరంగా సేద్యపు నీరు అందుతున్న విస్తీర్ణం | లక్షల హెక్టార్లలో | 22.89 |
| 6 | భూకమతాల సంఖ్య | లక్షలలో | 55.54 |
| 7 | సగటు కమతం పరిమాణం | హెక్టార్లలో | 1.12 |
| 8 | సగటు వార్షిక వర్షపాతం | మి.మీ.లలో | 906.00 |
| 9 | పంటల సాంద్రత | % | 1.27 |
| 10 | సేద్యపు నీటి సాగు సాంద్రత | % | 1.38 |

## సాగు కమతాలు

61.97 లక్షల హెక్టార్ల విస్తీర్ణంతో రాష్ట్రంలో 55.54 లక్షల కమతాలు సేద్యంలో ఉన్నాయి. వర్గాల వారీగా వివిధ స్థాయిలకు చెందిన కమతాలు (2010-11), వాటి విస్తీర్ణాలు, వాటి శాతాలను పట్టిక 15 తెలియజేస్తుంది.

**పట్టిక 15 : భూకమతాలు, నిర్వహణలోని విస్తీర్ణం**

| వరుస సంఖ్య | విభాగం | భూకమతాల సంఖ్య (లక్షలలో) | నిర్వహిస్తున్న విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో) | శాతం | |
|---|---|---|---|---|---|
| | | | | కమతాల సంఖ్య | నిర్వహిస్తున్న విస్తీర్ణం |
| 1 | నామమాత్రం | 34.41 | 15.67 | 61.96 | 25.28 |
| 2 | చిన్న స్థాయి | 13.27 | 18.69 | 23.90 | 30.17 |
| 3 | ఒక మోస్తరు స్థాయి | 6.03 | 15.85 | 10.86 | 25.58 |
| 4 | మధ్యస్థాయి | 1.67 | 9.27 | 3.00 | 14.96 |
| 5 | పెద్దస్థాయి | 0.16 | 2.49 | 0.28 | 4.01 |
| | **మొత్తం** | **55.54** | **61.97** | **100.00** | **100.00** |

## నేలలు

హిందూ మహాసముద్రానికి తూర్పున ఉన్న భారతదేశానికి నడిమి ప్రాంతంలో దక్కన్ పీఠభూమి మీద నెలకొని ఉన్న రాష్ట్రం తెలంగాణ. సారవంతమైన మాగాణి నుంచి, మొక్క మొలవని ఇసుక పర్రల వరకు తెలంగాణ రాష్ట్రంలో రకరకాల నేలలున్నాయి. మామిడితోటలకు, బత్తాయి, నారింజలకు, పూల తోటలకు అనుకూలమైన ఎర్రరేగడి, నల్లరేగడి, తదితర రకరకాల నేలలు తెలంగాణలో ఉన్నాయి.

వీటిలో ఎర్రరేగడి నేలలు ప్రధానమైనవి. ఇవి మొత్తం విస్తీర్ణంలో 48 శాతం ఉంటాయి. రాష్ట్రంలోని ఇతర రకాల నేలలలో, నల్ల నేలలు, రేగడి నేలలు, రాళ్లు- గుట్టలు విస్తీర్ణం పరంగా వరుసగా 25 శాతం, 20 శాతం, 7 శాతం ఉంటాయి. నిజామాబాద్, వరంగల్, నల్గొండల భూములలో నత్రజని లోపం (44శాతం కన్నా తక్కువ) ఎక్కువ. ఆదిలాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో భాస్వరం (ఫాస్ఫరస్) లోపం (55శాతం కన్నా తక్కువ) ఎక్కువ.

## వ్యవసాయ-వాతావరణ మండలాలు

వర్షపాతము, నేలల స్వభావము మరియు పంట విస్తీర్ణం మొదలగు అంశాల ఆధారంగా రాష్ట్రాన్ని నాలుగు వ్యవసాయ వాతావరణ మండలాలుగా విభజించనైనది.

**పట్టిక 16 : వ్యవసాయిక వాతావరణ మండలాలు**

| వరుస సంఖ్య | మండలం పేరు | జిల్లాలు | ప్రధాన కార్యాలయం | భౌగోళిక విస్తీర్ణం (చ.కి.మీ.లలో) | మండలాల సంఖ్య | ప్రాంతీయ కార్యాలయాల |
|---|---|---|---|---|---|---|
| 1 | ఉత్తర తెలంగాణ మండలం | కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ | జగిత్యాల | 35.5 | 145 | 6 |
| 2 | కేంద్ర తెలంగాణ మండలం | వరంగల్, ఖమ్మం, మెదక్ | వరంగల్ | 30.6 | 138 | 7 |
| 3 | దక్షిణ తెలంగాణ మండలం | మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి | పాలెం | 39.3 | 160 | 6 |
| 4 | ఎక్కువ ఎత్తులో ఉన్న మరియు గిరిజన ప్రాంతాల మండలం | ఖమ్మం మరియు ఆదిలాబాద్ జిల్లాలు | చింతపల్లి | 4.66 | 13 | 3 |

ఆధారం : వ్యవసాయశాఖ

మండలానికి ఒక్కొక్కటి చొప్పున ప్రొఫెసర్. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పి.జె.టి.ఎస్.ఎ.యు)కి చెందిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రాలను నెలకొల్పడం జరిగింది. వాటి పరిశోధన, సిఫార్సులతో ఒక్కొక్క మండలానికీ వ్యవసాయ ప్రణాళికల రూపకల్పన జరుగుతుంది.

## తెలంగాణలో వ్యవసాయ సామర్థ్యం

- తెలంగాణలోని నేలలకు మురుగునీరు పారి వెళ్లిపోయే మార్గాలు పుష్కలమైన స్థాయి నుంచి ఒక మోస్తరు స్థాయి వరకు వివిధ రకాలున్నాయి. అన్నీ కలసి భూసార పరిరక్షణ నిర్వహణకు చక్కగా అనుకూలమైన పరిస్థితులను కల్పిస్తున్నాయి.
- వివిధ రకాల పంటలకు అనువైన నేలలు తెలంగాణలో ఉన్నాయి. ఆహారధాన్యాలు, నూనె గింజలు, పప్పులు, పండ్ల తోటలు, పచ్చిక పొలాలు, అడవులు మొదలైన అనేక రకాల పచ్చదనానికి ఈ నేలలు అనుకూలమైనవి. వ్యవసాయ సంబంధమైన ప్రాముఖ్యం కలిగిన ఎన్నో సంస్థలు తెలంగాణలో ఉన్నాయి. వాటిలో ఐ.సి.ఎ.ఆర్‌కు చెందినవి కూడా ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు డి.ఆర్.ఆర్, డి.ఒ.ఆర్, మేనేజ్, ఎన్.ఐ.పి.హెచ్.ఎం, ఇంకా ఎన్.ఏ.ఏ.ఆర్.ఎం, ఎన్.ఐ.ఆర్.డి, ఎన్.ఎఫ్.డి.బి, సి.ఆర్.ఐ.డి.ఏ, ఎన్.ఆర్.సి.ఎస్ మొదలైనవి.
- ఆహార ధాన్యాల ఉత్పత్తి వృద్ధి రేటు అఖిల భారత స్థాయిలో 2.43 % కాగా, తెలంగాణలో అది 3.97% (సి.ఎ.జి.ఆర్).
- హెచ్.వై.వి వరి, సంకర వరి, మొక్కజొన్న, పత్తి, సెనగలు మొదలైన పంటలకు చెందిన 37.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 3.22 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పండించారు.

## తెలంగాణ వ్యవసాయానికి గల అవరోధాలు

వ్యవసాయంలో వృద్ధికి ఎంతో అవకాశం ఉండగా, వృద్ధిని ఆటంకపరుస్తున్న అవరోధాలు కూడా ఎన్నో ఉన్నాయి. ప్రధానమైన అవరోధాలు దిగువ తెలిపిన విధంగా ఉన్నాయి.

- అత్యల్ప వర్షపాతం, నిలకడలేని వర్షపాతం, కారణంగా చాలా పొలాలు దుర్భిక్షంలో మునిగిపోతాయి. కొన్ని పొలాలు వరదలలో మునిగితేలతాయి.

- సహజమైన పచ్చదనం పెరగకుండా అరకొర వర్షపాతం దెబ్బతీస్తుంది.దీనివల్ల నేలలలో సేంద్రియ పదార్థం అభివృద్ధి పరిమితమైపోతుంది. ఫలితంగా మొక్కల పెరుగుదలకు ప్రధాన పోషకమైన నత్రజని చాలా నేలలలో తక్కువైపోతుంది. వ్యవసాయంలో 63% వర్షాధారమే. దీనితో ఈ రంగం వాతావరణం ఆగ్రహానుగ్రహాలకు గురవుతోంది.
- అన్నదాతలలో సుమారు 85% మంది సన్నకారు, చిన్నకారు రైతులే. లేదా నిరుపేద సామాజిక-ఆర్థిక వర్గానికి చెందిన వారే. అత్యధికమైన కూలీల వ్యయభారం, అతి తక్కువ యాంత్రికీకరణ కలగలసి సేద్యం ఖర్చును పెంచి వేశాయి. ప్రతి ఒక్క రైతుకి అవసరమైన వాటిని సకాలంలో అందించి, అండదండగా నిలిచేటంత పుష్టి, అందుబాటులోకి చేరే శక్తి వ్యవసాయ సేవలకు లోపించింది.

## రాష్ట్ర వ్యవసాయ దార్శనికత

ఆటంకాలున్నప్పటికీ, రాష్ట్రంలో వ్యవసాయ పరిస్థితిని మెరుగుపరచడం చాలా ముఖ్యం. అందుబాటులో ఉన్న వ్యవసాయ సామర్థ్యాన్ని శక్తివంచన లేకుండా పుణికిపుచ్చుకుని, సాంకేతిక విజ్ఞానంతో, వనరులతో సంపూర్ణంగా వినియోగించుకోవలసి ఉంది. వ్యవసాయోత్పత్తికి చెందిన భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ దార్శనికతను రూపకల్పన చేసుకోవడం జరిగింది. దానిని సూక్ష్మంగా ఇలా చెప్పుకోవచ్చు: విత్తనాల నిర్వహణలో రైతుల సాధికారతను సాధించడం, వారు సకాలంలో మంచి నాణ్యమైన విత్తనాలను, సరసమైన ధరలో సమకూర్చుకోగలిగేలా చేయడం

- వ్యవసాయాన్ని వాణిజ్యపరంగా గిట్టుబాటయ్యే వ్యవహారంగా చేయడం
- విత్తనాలు, ఎరువులు మొదలైన అవసరాలు, రుణాలు, సాంకేతిక విజ్ఞానం, సమాచార సాంకేతిక సదుపాయాలను రైతులకు సులభంగా అందుబాటులోకి తేవడం
- ఉపరితల, భూగర్భ జల అవకాశాలను ఉపయోగించుకోగలిగేలా సేద్యపు భూ విస్తీర్ణాన్ని పెంచడం
- సమర్థమైన భూసార, జల నిర్వహణకు వీలుగా భూమి అభివృద్ధికి మార్గాలను సమకూర్చడం
- సాంకేతిక విజ్ఞాన వినియోగం కోసం సుశిక్షితులైన సిబ్బందిని రైతుల ముంగిళ్ల వద్దకే పంపడం
- పంటల దిగుబడిలో కొన్ని ప్రాంతాలు ఎందుకు వెనుకబడ్డాయో కనిపెట్టి, తగిన సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా ఆ వెలతులను భర్తీ చేయడం
- అవసరమైన ప్రదర్శనలతో, శిక్షణ సహాయంతో, సమగ్ర పోషక నిర్వహణ (ఐ.ఎన్.ఎం)ను చేపట్టేటట్లుగానూ, సమతూకంగా ఎరువులను వినియోగించేలాగానూ రైతులకు ప్రోద్బలం గావించడం
- తక్షణ చర్యల కోసం స్వల్పకాలిక వాతావరణ జోస్యాలను సమకూర్చడం
- సరసమైన ధరలలో వ్యవసాయ సామగ్రిని, పరికరాలను అందుబాటులోకి తేవడం ద్వారా వ్యవసాయ యాంత్రికీకరణను అభివృద్ధి చేయడం
- వాతావరణం, అవసరాల అందుబాటు, విపణి పరిస్థితులపై రైతులు సమాచారాన్ని పొందడం కోసం సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని పటిష్ఠం చేయడం
- బిందు సేద్యం, తుంపర సేద్యం మొదలైన వాటి ద్వారా నీటిని సమర్థంగా ఉపయోగించే విధానాలను మెరుగుపరచడం
- ఐ.ఎన్.ఎం, ఐ.పి.ఎంల ద్వారా వ్యవసాయాన్ని పర్యావరణ హితంగా మార్చేలా రైతుల సాధికారతను పెంచడం
- అటుపోట్లను అధిగమించగల వ్యవసాయాభివృద్ధి కోసం కొత్త ప్రయత్నాలు

## సంతులిత వ్యవసాయాభివృద్ధికి కొత్తపుంతలు

## వ్యూహం - దార్శనికత సాకారానికై

ఈ దార్శనికతను నిజం చేయడానికి 2014-15లో వ్యవసాయ రంగంలో ఈ దిగువ చూపిన ముఖ్య పథకాలను అమలు చేయడం జరిగింది.

### విత్తన భాండాగారము :

వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంలో కీలక పాత్రధారి విత్తనమే. ఉత్పత్తి చేసి, సరఫరా చేసిన విత్తనం నాణ్యత మీద ఆధారపడే ఎరువులు తదితర సరఫరాల పనితనం, సామర్థ్యం వ్యక్తమవుతాయి.

దేశానికే "విత్తన భాండాగారము"గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే వ్యూహాన్ని తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. వరి, మొక్కజొన్న, సోయాబీన్, ఆముదం, పత్తి మొదలుగా వివిధ రకాల పంటలకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయడానికి తగిన నేలలు, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఈ రాష్ట్రానికి వరంగా ఉన్నాయి. వీటన్నింటి దృష్ట్యా ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పి.జె.టి.ఎస్.ఎ.యు) వారి సాంకేతిక నైపుణ్యాన్ని రంగరించి, బ్రీడర్, సర్టిఫైడ్ విత్తనాలను ఉత్పత్తి చేయడానికి పంచ వర్ష ప్రణాళికను సిద్ధం చేయడం జరిగింది. సీడ్ విలేజ్ ప్రోగ్రామ్, సీడ్ ప్రొడక్షన్ ఇన్ స్టేట్ సీడ్ ఫార్మ్స్ ద్వారా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టి.ఎస్.ఎస్.డి.సి), ఆయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్, హాకా వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా విత్తనోత్పత్తి కార్యక్రమానికి ప్రణాళికలు వేయడం జరుగుతోంది.

వివిధ రకాల పంటలకు సంబంధించి, 37.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రాష్ట్రం 3.22 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉత్పత్తి చేస్తోంది. ఇవి ప్రధానంగా సంకర వరి, మొక్కజొన్న, పత్తి, పెసలు మొదలైనవి. వీటిని మన రైతులకు, అనేక ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేయడం జరుగుతోంది. ఆ విధంగా దేశానికి విత్తన రాజధానిగా తెలంగాణ నిలుస్తోంది.

అందువలన నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసి, రైతుకు సరఫరా చేయడం ప్రణాళికా బడ్జెట్‌లో ప్రతిపాదించిన అత్యంత ముఖ్యమైన నూతన ప్రయత్నంగా పేర్కొనక తప్పదు. దీనికి రూ. 50.00 కోట్లను కేటాయించడం జరిగింది. దీనితో విత్తన సంబంధిత అంగాలను పటిష్ఠం చేయడం జరుగుతుంది. ఆ అంగాలలో అన్ని పంటలలోనూ పాత విత్తనాల స్థానే కొత్త విత్తన రకాలను ప్రవేశపెట్టే ప్రక్రియను మెరుగుపరచడం, అదనపు గిడ్డంగుల నిర్మాణం, విత్తన శుద్ధి పరికరాల సేకరణ, విత్తన పరీక్షా ప్రయోగశాలలను పటిష్ఠం చేయడం మొదలైనవి ఉంటాయి.

సేద్యయోగ్యమైన 536 హెక్టార్ల విస్తీర్ణంతో రాష్ట్రంలో 10 విత్తన క్షేత్రాలున్నాయి. పునాది విత్తనాన్ని ఉత్పత్తి చేసి, దానిని సీడ్ విలేజ్ స్కీమ్ ద్వారా సరఫరా చేయడం వీటి ప్రధాన ఉద్దేశ్యం. ఈ క్షేత్రాలను పటిష్ఠం చేయాలని సంకల్పించడం జరిగింది. అందుకు గానూ బహుళోత్పత్తి కోసం బ్రీడర్ విత్తనాన్ని సరఫరా చేస్తారు. అలాగే ఈ క్షేత్రాలకు నికరంగా సాగునీటిని అందించడానికి విత్తన శుద్ధి సదుపాయాలు, నిల్వచేసే సదుపాయాల వంటి మౌలిక సదుపాయాలను కూడా సమకూరుస్తారు.

## పంట అభివృద్ధి క్షేత్రాలు

తగిన నేలలలో, సానుకూలమైన వాతావరణ పరిస్థితులతో తెలంగాణ రాష్ట్రంలోని సువిశాలమైన విస్తీర్ణాలలో వరి, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, ఇంకా సోయాబీన్, ఆముదం, వేరుసెనగ వంటి నూనె గింజలు పండుతున్నాయి. విస్తీర్ణాన్ని విస్తరించడానికి, ఉత్పత్తిని పెంచడానికి, ఉత్పాదకతను ఇనుమడింపజేయడానికి, స్వయం-సమృద్ధిని సాధించడానికి ఈ పంటల కింద పంట క్షేత్రాలను నెలకొల్పాలని ప్రతిపాదించారు.

వ్యవసాయంలో దీర్ఘకాలికంగా, అటుపోట్లను తట్టుకునే వృద్ధికి విత్తనాలు చాలా కీలకమైన అవసరం. మంచి దిగుబడి సత్తా కలిగిన, ధృవీకృత విత్తనాలు రైతులకు సకాలంలో అందడం రాష్ట్రంలో ఇప్పటికీ ప్రధాన సమస్యగానే ఉంది.

భారతదేశంలో 20% రైతులు మాత్రమే ధృవీకృత విత్తనాలను ఉపయోగిస్తున్నారు. తక్కిన 80% రైతులు పంట నుంచి మిగిల్చిన విత్తనాలనే ఉపయోగిస్తున్నారు. అదే తెలంగాణ సంగతికి వస్తే దాదాపు 70% - 80 % రైతులు ధృవీకృత విత్తనాలనే ఉపయోగిస్తున్నారు. వర్షాధార ప్రాంతాలు అత్యధిక ప్రతికూలతా ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న సంగతిని ఇక్కడ ప్రస్తావించవలసిన అవసరముంది. కాబట్టి, సరఫరాలలో కొరత ఏర్పడినప్పుడు కొరతను అధిగమించే విధంగా విత్తన వ్యవస్థలను పునర్వ్యవస్థీకరించవలసి ఉంటుంది.

వర్షాధార ప్రాంతాలలో విత్తిన దరిమిలా దీర్ఘకాలం పాటు ఎండలు మండి, వానలు కరవైనప్పుడు విత్తనాలు నిరుపయోగమవుతున్నాయి. ఇది తరచుగా ఎదురవుతున్న సమస్య.

మొదటి సారి పెట్టిన విత్తనాలు విఫలమైన పక్షంలో రెండో విడత పంపిణీ కోసం విత్తనాలను నికరంగా సిద్ధంగా ఉంచడం అవసరం. దీర్ఘకాలం పాటు వర్షరాహిత్యం ఎదురైనప్పుడు, తిరిగి విత్తనాలను సరఫరా చేయడానికి ఆపద్ధర్మ ప్రణాళికతో స్టేట్ సీడ్ సిస్టమ్ సిద్ధంగా ఉండాలి.

తెలంగాణలో విత్తన ఉత్పత్తికి ఎంతో అవకాశముంది. మహబూబ్‌నగర్‌లో సంకర పత్తి విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఇంకా కరీం నగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాలలో సంకర మొక్కజొన్న విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. సంకర వరి విత్తనాన్ని కరీంనగర్, వరంగల్ జిల్లాలలో ఉత్పత్తి చేస్తున్నారు.

అదే విధంగా వరి, ఆముదం, పప్పులు, వేరుసెనగ, సోయాబీన్, కూరగాయల విత్తనాల కోసం కరీంనగర్, వరంగల్, నల్గొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాలలో వివిధ పంటల విత్తనోత్పత్తి కోసం సువిశాలమైన విస్తీర్ణాలను ఉపయోగిస్తున్నారు.

కాబట్టి, విత్తనాల కోసం పంట క్షేత్రాన్ని విస్తరించడానికి, విత్తనోత్పత్తిని, ఉత్పాదకతను పెంచడానికి, విత్తన రంగంలో స్వయం సమృద్ధిని సాధించడానికి ఈ పంటల కింద పంటకాలనీలను నెలకొల్పే ప్రతిపాదన వచ్చింది.

## ఎరువుల వినియోగం:

2014-15లో ఎరువుల వినియోగం తెలంగాణలో నేటి వరకు అందుబాటులో ఉన్న ప్రకారం 19.40 లక్షల మెట్రిక్ టన్నులు. పోషకాలతో ప్రయోగించిన ఎరువులను అత్యధికంగా 14.81 లక్షల మెట్రిక్ టన్నులు వాడిన సంవత్సరం 2010-11. అయితే వీటి వినియోగం ఆ తరువాత నుంచి పడిపోసాగింది. 2013-14లో 13.39 లక్షల మెట్రిక్ టన్నులకు, 2014-15లో 12.48 లక్షల మెట్రిక్ టన్నులకు ఆ వినియోగం పడిపోయింది. హెక్టారుకు ఎరువులు ఎన్ని కిలోలు వినియోగమయ్యాయని లెక్కలు తీస్తే, అత్యధికంగా ఉపయోగించినది కరీంనగర్‌లోనని, అతి తక్కువగా ఉపయోగించినది మెదక్ జిల్లాలోనని తేలింది.

## వ్యవసాయ యాంత్రికీకరణ

వ్యవసాయంలో అత్యధిక భాగం జరుగుతున్నది చిన్న కమతాలలోనే. కాగా, పొలం పరిమాణం, రైతు కూలీలకయ్యే ఖర్చు, విద్యుచ్ఛక్తి అందుబాటు, అనువైన యంత్రాల లభ్యత అన్నీ కలసి యాంత్రికీకరణకు గల సాధ్యాసాధ్యాలు బలంగా ప్రభావితం చేస్తాయి. వ్యవసాయ వ్యవస్థ ఇప్పటికీ మానవ శక్తిని, పశుశక్తిని, ట్రాక్టర్లను వినియోగించుకుంటూనే ఉంది. మరింత భూమిని వ్యవసాయం కిందకు తేవడానికీ, ఒక్కొక్క ఎకరంలోనూ పంట ఉత్పాదకతను మెరుగుపరచడానికీ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రికీకరణను సిఫార్సు చేస్తోంది. ఇందుకు గానూ విత్తడం నుంచి, పంట కోయడం వరకు యంత్రాలను వాడవలసిందిగా ప్రోత్సహిస్తోంది. దీనిలో భాగంగానే పవర్ ట్రాక్టర్లను, పవర్ టిల్లర్‌లను, అలాగే పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించవలసిందిగా ప్రోద్బలం చేస్తోంది.

## పథకం లక్ష్యాలు

- పొలం పనులలోని వివిధ దశలలో అవసరమవుతున్న మానవశక్తిని తగ్గించడం
- ప్రతి గ్రామంలోనూ యంత్ర పరిచయాన్ని అందుబాటులో ఉంచడం
- ఉత్పాదకతా స్థాయిని / హెక్టారుకు లభించే నికరాదాయాన్ని పెంచడం
- వ్యవసాయ ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులు పరిమాణాత్మకంగా గానీ, నాణ్యత పరంగా గానీ దెబ్బతినిపోకుండా రక్షణ కల్పించడంలో సహాయపడడం
- పంటల అనంతర దశలలో ఉపయోగపడే యంత్రాలను ఉపయోగించడం ద్వారా / మెరుగైన ఆహారోత్పత్తుల తయారీ విధానాల ద్వారా ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడం
- రాష్ట్రంలో పండించే ప్రధాన ఉత్పత్తుల వ్యవసాయ ఖర్చులను తగ్గించడం

యాంత్రికీకరణ ఆధారంగా పెంచే ఉత్పాదకత గ్రామీణ ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసే ఒక ముఖ్యమైన భాగం కాగలదనే కోణంలో ఈ లక్ష్యాల సాధనకు కృషిని కొనసాగించవలసి ఉంది.

వివిధ వ్యవసాయ పనిముట్లను సరఫరా చేయడానికి 100 కోట్ల రూపాయల మొత్తాన్ని ప్రతిపాదించడం జరిగింది. ఈ వ్యవసాయ పనిముట్లలో పశువులు లాగే పనిముట్లు, ట్రాక్టర్‌లకు బిగించే పనిముట్లు, లక్ష రూపాయల వరకు, అలాగే లక్ష నుంచి 5 లక్షల రూపాయల వరకు ఉండే ఎక్కువ ఖరీదు యంత్రాలు, రోటోవేటర్లు, హార్వెస్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, మినీ ట్రాక్టర్లు, పంటల అనంతర సాధనాలు, మొక్కల సంరక్షణ సాధనాలు, అంతర పంటల సాధనాలు, ఇంకా వరి పంటకు నేలను సిద్ధం చేసే ప్యాకేజీల కోసం నిర్దిష్ట కిరాయి కేంద్రా(కస్టమ్ హైరింగ్ సెంటర్)లను నెలకొల్పడం వంటివన్నీ ఈ ఖర్చులో ప్రతిపాదించారు. దీనికి సాధారణ రాష్ట్ర ప్రణాళిక (ఎన్.ఎస్.పి)లో ప్రతిపాదించిన సబ్సిడీ 50%.

## వ్యవసాయ యాంత్రికీకరణ - రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై)

ఈ ప్రయత్నానికి రూ. 67.40 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదించారు. వరి, పత్తి, మొక్కజొన్న, వేరుసెనగ, చెరకు, మినీ ఎస్.ఎం.ఎస్.ఆర్.ఐ, వరి నర్సరీ ప్యాకేజ్, వరి హార్వెస్టింగ్ ప్యాకేజ్, పంటల అనంతర అంశాలు, సేకరణ కేంద్రాలు, పనిముట్ల కిరాయి కేంద్రాలు, టార్పాలిన్‌లు, సౌర కంచెలు, ప్యాడీ రీపర్లు, పవర్ టిల్లర్లు, విత్తనాలను, ఎరువులను చల్లే యంత్రాలు, మొక్కజొన్న షెల్లర్లు, వివిధ పంటలకు కంకులు కొట్టే యంత్రాలు, రోటోవేటర్లు, పవర్ వీడర్లు, మెరుగు పరచిన వ్యవసాయ యంత్రాలు (4 వరుసల వాకర్

రకం ప్యాడీ ట్రాన్స్‌ప్లాంటర్లు, వరి కంకులు కొట్టే సాధనాలు, పసుపు బాయిలర్‌లు, లేజర్ ఆధారిత నేల చదును సాధనాలు, తడి నేలను చదును చేసే సాధనాలు, వేరు సెనగ వెట్ పాడ్ త్రెషర్, కంబైన్ హార్వెస్టర్‌లు మొదలైనవి), శిక్షణ, ప్రదర్శనల నిర్వహణ, ఇంకా సౌర పంపు సెట్లు మొదలైన వాటి ఏర్పాటు ఈ ఖర్చు కిందకు వస్తాయి.

ప్రతిపాదించిన మొత్తంలో ఆర్.కె.వి.వై 2013-14 కింద ఖర్చు కాకుండా మిగిలి ఉన్న రూ. 10.42 కోట్లను 2014-15లో సౌర పంపుసెట్లను నెలకొల్పడానికి వినియోగిస్తారు. దీనికి వ్యవసాయ శాఖ నుంచి సబ్సిడీగా లక్ష రూపాయల వంతున, నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (ఎన్.ఆర్.ఇ.డి) నుంచి 30 శాతం వంతున స్వీకరిస్తారు. తక్కిన రూ. 56.98 కోట్లను కేటాయించడం జరిగింది. రూ. 22.00 కోట్లను అన్ని జిల్లాలకూ విడుదల చేయడం జరిగింది. ఆర్.కె.వి.వై పథకంలో ఎఫ్.ఎం అంశం కింద సరఫరా చేసిన ప్రతి అంశానికీ రాష్ట్ర స్థాయి మంజూరు కమిటీ (ఎస్.ఎల్.ఎస్.సి) ఆమోదించిన సబ్సిడీ 50 శాతం.

## వ్యవసాయ యాంత్రికీకరణపై ఉప కార్యక్రమం (ఎస్.ఎం.ఏ.ఎం)

కొన్ని సరఫరాల నిమిత్తం రూ. 23.54 కోట్ల మొత్తాన్ని ప్రతిపాదించారు. మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, సెల్ఫ్ ప్రొపెల్డ్ యంత్రాలు, పశువులు లాగే పనిముట్లు, ట్రాక్టర్లు లాగే పనిముట్లు, మొక్కల సంరక్షణ పరికరాలు ఆ సరఫరాలలో ఉంటాయి. ఇంకా నిర్ణీత కిరాయి కేంద్రాల కోసం రూ. 10 లక్షల వరకు, అటుపై రూ. 25 లక్షల వరకు వ్యవసాయ యంత్రాల బ్యాంకులను నెలకొల్పడానికి, రైతులకు శిక్షణ, ప్రదర్శనలను నిర్వహించడానికి దీనిలో అవకాశం ఉంటుంది.

ప్రతిపాదించిన మొత్తంలో పై అంశాల కోసం జిల్లాలకు ఇప్పటికే రూ. 7.54 కోట్లను కేటాయించడం జరిగింది. అంశాన్ని బట్టి, తీసుకునే రైతు ఏ వర్గానికి (ఎస్.సి / ఎస్.టి / మహిళలు / ఎస్.ఎఫ్ / ఎం.ఎఫ్, ఇతర రైతులు) చెందిన వారనే దానిని బట్టి, భారత ప్రభుత్వం తెలియబరచిన మేరకు ఎస్.ఎం.ఎ.ఎం మార్గదర్శక సూత్రాలను బట్టి సబ్సిడీ విధానం మారుతుంది.

## వ్యవసాయ యాంత్రికీకరణ - జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్.ఎఫ్.ఎస్.ఎం)

కోనో వీడర్, స్ప్రేయర్, పవర్ వీడర్, డ్రమ్ సీడర్, సీడ్ డ్రిల్, ప్యాడీ త్రెషర్, మల్టీక్రాప్ త్రెషర్, సెల్ఫ్ ప్రొపెల్డ్ ప్యాడీ ట్రాన్స్‌ప్లాంటర్, పంప్ సెట్లు, మానవశక్తితో నడిపే విన్నోవర్‌ల సరఫరా నిమిత్తం జిల్లాలకు రూ. 9.11 కోట్లను కేటాయించడం జరిగింది. ఇంకా కస్టమ్ హైరింగ్ సెంటర్‌లకు సహాయంగా, అంటే రోటావేటర్‌లతో జరిపే పడ్లింగ్, 50 శాతం సబ్సిడీతో రిడ్జ్ ఫర్రో ప్లాంటర్‌లు, తైవాన్ స్ప్రేయర్‌లను ఉపయోగించే కూలీల చార్జీలు, ఎన్.ఎఫ్.ఎస్.ఎం రైస్ కింద కంబైన్ హార్వెస్టర్‌లకు కూడా ఈ కేటాయింపు నుంచే ఖర్చును భరించడం జరుగుతుంది.

## విస్తరణ

సిబ్బంది కొరత వల్ల, సిబ్బంది రవాణా సమస్యల వల్ల క్షేత్ర స్థాయిలో విస్తరణ పని దెబ్బతింటోంది. ఇలాంటి అవరోధాలున్నప్పటికీ, వాటిని తట్టుకుని వ్యవసాయ వృద్ధిని సాధించడానికి అనేక రకాల విస్తరణ మద్దతు యంత్రాంగాలతో అండదండలనివ్వడం జరుగుతోంది. వీటిలో రైతు చైతన్య యాత్రల కింద రైతు సమావేశాల నిర్వహణ, రైతు సదస్సుల నిర్వహణ, అత్యుత్తమ పనితనం సాధించిన రైతులకు అవార్డుల బహూకరణ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం (ఏ.టి.ఎం.ఏ), వ్యూహాత్మక పరిశోధనల విస్తరణ ప్రణాళిక, వ్యూహాత్మక విస్తరణ పని ప్రణాళిక, రైతుల పాఠశాలలు, నిర్ణీత కాలవ్యవధులలో భూసార పరీక్షా నివేదికలు, రైతులకు భూసార ఆరోగ్య కార్డుల పంపిణీ, సమాచార, కమ్యూనికేషన్ సాంకేతిక పరిజ్ఞాన సాధనాల విస్తృత వినియోగం, అగ్రిస్‌నెట్ (http://agrisnet.tg.nic.in-Telugu) వంటి వెబ్ ఆధారిత నూతన ప్రయత్నాలు, బి.ఎస్.ఎన్.ఎల్ నడిపే వ్యవసాయ విశ్వవిద్యాలయం - కిసాన్ సెల్ కేంద్రాల నుంచి లభించే పరస్పర భేటీ సేవలు, గళాన్ని రికార్డు చేసిన వ్యవస్థతో నడిచే మాటామంతీ సదుపాయం, ఎరువులను, క్రిమిసంహారక ప్రయోగాలను పరీక్షించే ఇ-అగ్రిల్యాబ్‌లు, రైతుల కోసం మీ-సేవ అనువర్తనలు, గ్రామపంచాయతీల స్థాయిలో వ్యవసాయ యాంత్రికీకరణ మద్దతు సేవలు, యంత్రాల సమర్థమైన వినియోగం కోసం రైతులకు తర్ఫీదు మొదలైనవి ఉన్నాయి. 100 శాతం కేంద్ర ప్రభుత్వ మద్దతుతో నడిచే అగ్రగామి కార్యక్రమం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఈ దిశగా ఒక ప్రధానమైన విస్తరణ ప్రయత్నం.

## వ్యవసాయ పరపతి

వ్యవసాయ పరపతి కింద తెలంగాణకి 2014-15కి వార్షిక పరపతి ప్రణాళిక మొత్తం రూ. 27,233.59 కోట్లు. దీనిలో దాదాపు రూ. 17,636.44 కోట్లు (65% ) వ్యవసాయ రుణాల కింద పంపిణీ చేశారు. పంట రుణాల కేటాయింపు లక్ష్యం 18,717.95 కోట్ల

రూపాయలలో, రూ. 13,561 కోట్లను (72%) పంపిణీ చేయడం జరిగింది. వ్యవసాయ టర్మ్ లోన్‌ల లక్ష్యం రూ. 6,238.48 కోట్లు కాగా దానిలో రూ. 2,794.15 కోట్లు (45%) పంపిణీ జరిగింది. ఇక అనుబంధ కార్యకలాపాల కింద రూ. 2,277.16 కోట్ల పంపిణీ లక్ష్యం కాగా రూ. 3,132.29 కోట్లను పంపిణీ చేయడం జరిగింది. ఇది ఉద్దేశించిన లక్ష్యంలో 137 శాతం.

### పంట రుణాల మాఫీ పథకం 2014-15

తరచుగా పంట వైఫల్యాలు, పంటకు తగినంత మద్దతు ధర లభించకపోవడం, వ్యవసాయ పెట్టుబడి ధరలు అమాంతం పెరిగిపోవడం మొదలైన వాటి కారణంగా తెలంగాణ రాష్ట్రంలోని రైతులు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. రైతుల కష్టాన్ని బాపడానికి తెలంగాణ ప్రభుత్వం రైతుకు లక్ష రూపాయల వంతున పంటరుణాలను మాఫీ చేయాలని నిర్ణయించింది. బంగారాన్ని తాకట్టు పెట్టి రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలు కూడా వడ్డీతో సహా కలిపి, ఈ మాఫీ పథకం కిందకు వస్తాయి. రుణ మాఫీ పథకం కింద మొదటి విడతగా తెలంగాణ ప్రభుత్వం రూ. 4,250.00 కోట్లను విడుదల చేసింది. ఈ మొత్తాన్ని 34 లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా బ్యాంకు ఖాతాలకు జమచేయడం జరిగింది.

### పంటల బీమా

తెలంగాణ రాష్ట్రంలో 2014-15 ఖరీఫ్, రబీ పంటల సమయంలో మూడు పంటల బీమా పథకాలను అమలు చేయడం జరిగింది.

అవి:

ఎ) జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్.ఏ.ఐ.ఎస్)

బి) వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్)

సి) మెరుగు పరచిన జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎం.ఎన్.ఏ.ఐ.ఎస్)

2000 ఖరీఫ్ పంట మొదలుకుని జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్.ఏ.ఐ.ఎస్) ను ప్రవేశపెట్టారు. దీనిలో వ్యవసాయ శాఖకు, బీమాను అమలు చేసే సంస్థగా వ్యవసాయ బీమా కార్పొరేషన్‌కు, సంచాలకులు, అర్థ గణాంక శాఖకు ప్రమేయం కల్పించారు.

ఈ పథకం కింద ఖరీఫ్‌లో 19 పంటలకు, రబీలో 10 పంటలకు రక్షణ కవచాన్ని కల్పించారు. సన్నకారు, చిన్నకారు రైతులకు జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్.ఏ.ఐ.ఎస్) కింద మాత్రం ప్రీమియంలో 10 శాతం సబ్సిడీని కల్పించారు.

### లక్ష్యాలు

పంట కోత ప్రయోగాలను నిర్వహించడం ద్వారా దిగుబడి నష్టాలు ఏమైనా నమోదయ్యాయా అనే సంగతిని నిర్ధారించుకుని, రైతులకు ఆర్థికపరంగా కొంత మేర అండదండలనివ్వడం.

- పంటను కోల్పోయిన రైతుకు, తదుపరి సీజన్‌లో తిరిగి రుణ అర్హతను పునరుద్ధరించడం.
- ప్రగతి శీల వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా రైతులను ప్రోత్సహించడం, అధిక విలువ కలిగిన వ్యవసాయ సహాయకాలనూ, వ్యవసాయ పెట్టుబడులను ఉపయోగించేలా ఉత్సాహపరచడం, వ్యవసాయంలో ఉన్నతమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగింపజేయడం.
- పొలం రాబడులు నిలకడగా ఉండేలా చూడడం, ప్రత్యేకించి విపత్తులు వాటిల్లిన సంవత్సరాలలో నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవడం.

ఖరీఫ్‌లో 19 పంటలకు, రబీలో 10 పంటలకు బీమా కవచాన్ని కల్పించడం జరిగింది. కేవలం వ్యవసాయ బీమా పథకం (ఎన్.ఏ.ఐ.ఎస్) కింద మాత్రం ప్రీమియంలో 10% సబ్సిడీకి అవకాశం కల్పించారు.

### వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్)

'జాతీయ వ్యవసాయ బీమా పథకం' (ఎన్.ఏ.ఐ.ఎస్) అమలు ఓ పక్కన యథావిధిగా ఉండగా, తోడుగా రాష్ట్రంలో రైతు సమాజం ప్రయోజనం కోసం ప్రభుత్వం 'వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం'ను 2009 ఖరీఫ్ సీజన్ నుంచి ప్రారంభించింది. వర్షపాతం, ఉష్ణోగ్రత, సాపేక్ష తేమదనం మొదలైన వాటి ప్రతికూల పరిణామాల వల్ల పంటలు నష్టమై దెబ్బతిన్న రైతుల కష్టాన్ని తగ్గించడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు.

## ఆటోమేటిక్ వాతావరణ పరిశీలన కేంద్రాలు (ఏ.డబ్ల్యు.ఎస్)

వాతావరణ పరామితులను కొలుస్తూ ఉండడానికి రాష్ట్రంలో మండలానికి ఒకటి చొప్పున అన్ని మండలాలలో నెలకొల్పారు. రాష్ట్రంలో రమారమి 900 ఏ.డబ్ల్యు.ఎస్‌లు పనిచేస్తున్నాయి.

## జాతీయ పంటల బీమా కార్యక్రమం (ఎన్.సి.ఐ.పి)

ఎం.ఎన్.ఏ.ఐ.ఎస్, డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్‌లు రెండింటినీ విలీనం చేసి, రైతు సమాజ ప్రయోజనం కోసం మరిన్ని రైతు హితకరమైన కోణాలతో 2014 ఖరీఫ్ నుంచి జాతీయ పంటల బీమా పథకం (ఎన్.సి.ఐ.పి)ని అమలు చేయవలసిందని భారత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## మెరుగుపరచిన జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎం.ఎన్.ఏ.ఐ.ఎస్)

మెరుగుపరచిన జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎం.ఎన్.ఏ.ఐ.ఎస్)ను 2010-11 రబీ సమయంలో వరంగల్ జిల్లాలో ప్రయోగ ప్రాతిపదికన భారత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిలో రైతులకు మరింత హితవైన రీతిలో పెక్కు అంశాలను కలిపారు. వడగళ్ల వాన లాంటి స్థానికమైన విపత్తుల వల్ల పంటలకు జరిగిన నష్టానికి కూడా పరిహారం కల్పించడం, విత్తుకు వచ్చిన ఆటంకాలు, జిల్లాలోని ప్రధాన పంటలు అన్నింటికీ బీమా కవచం, ప్రీమియంలో 40 నుంచి 75 శాతాన్ని సబ్సిడీగా ఇచ్చేలా రైతుకు వ్యక్తిగతంగా అందించే అండదండ మొదలైనవి, ఈ అదనపు హితకారులు. వరి ప్రధానమైన పంట కావడంతో ఈ పథకం కింద అమలు చేయడానికి దానిని ఎంపిక చేశారు. పథకం అమలుకు ప్రామాణిక ప్రదేశంగా గ్రామాన్ని నిర్ణయించారు. ఈ పథకం విజయవంతంగా అమలులో ఉంది. దీనిని 2014-15 రబీ సీజన్ నుంచి అన్ని జిల్లాలకూ విస్తరించారు.

## జాతీయ ఇ - పాలనా ప్రణాళిక - వ్యవసాయం (ఎన్.ఇ.జి.పి-ఏ)

ఎన్.ఎం.ఏ.ఇ.టి కింద సబ్-మిషన్ ఆన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్‌లో భారత ప్రభుత్వం ఆమోదించిన ఎన్.ఇ.జి.పి-ఏ ఒక భాగం. ఎన్.ఇ.జి.పి-ఏను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి పౌరునికి / ప్రభుత్వం నుంచి రైతుకు (జి2సి లేదా జి2ఎఫ్), ప్రభుత్వం నుంచి వ్యాపారానికి (జి2బి), ప్రభుత్వం నుంచి ప్రభుత్వానికి (జి2జి) కేంద్ర వ్యవసాయ పోర్టల్ (సి.ఏ.పి) ద్వారా, రాష్ట్ర వ్యవసాయ పోర్టల్స్ (ఎస్.ఏ.పిలు) ద్వారా సమీకృత విధానంలో వ్యవసాయ సేవలు అందించడం లక్ష్యంగా దీనిని తలపెట్టారు. సమితి స్థాయి దాకా కేంద్రీకృతంగా హార్డ్‌వేర్‌ని భారత ప్రభుత్వం సేకరిస్తోంది. ఈ హార్డ్‌వేర్‌ని సరఫరా చేయడానికి ముందు క్షేత్రాన్ని సిద్ధం చేయడానికి డబ్బుని విడుదల చేయడం జరుగుతోంది. క్షేత్రాన్ని సిద్ధం చేయడంలో సమితులు, శిక్షణ కేంద్రాలలో విద్యుత్ పనులను, ఫర్నిచర్‌ను సమకూర్చుకోవడం వంటివి ఉంటాయి. అనుసంధానం పనులకు, రెండు నెలల పాటు ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పి.ఎం.యు)ను నెలకొల్పడానికి అవసరమైన మొత్తాలను విడుదల చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతప్రభుత్వం విడుదల చేసిన మొత్తం రూ. 66.55 లక్షలు.

## రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై)

భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకమైన అగ్రగామి కార్యక్రమాలలో ఒకటి ఆర్.కె.వి.వై. ఇది 100% కేంద్ర సహాయంతో అమలు జరుగుతుంది. వ్యవసాయ రంగంలో 4%మించి వృద్ధి రేటును సాధించడం దీని ఆశయం.

అదనపు కేంద్ర సహాయ పథకం (100% భారత ప్రభుత్వ గ్రాంటు) రాష్ట్రీయ కృషి వికాస యోజన (ఆర్.కె.వి.వై) పథకం, లక్ష్యంగా పెట్టుకున్న వార్షిక వృద్ధిని సాధించడానికి వీలుగా వ్యవసాయ, అనుబంధ రంగాలను సమగ్ర విధానంలో అభివృద్ధి చేయడానికి ఉద్దేశించినది.

ఆర్.కె.వి.వై పథకంలో పాత్ర కల్పించిన శాఖలు వ్యవసాయం, అనుబంధ రంగాలు ఉదాహరణకు వ్యవసాయం, ఉద్యాన వనాలు, పశు గణాభివృద్ధి, మత్స్య సంపద, పాడి అభివృద్ధి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ, హార్టికల్చర్ యూనివర్సిటీ, వెటెరినరీ యూనివర్సిటీ, యాగ్రోస్, సెరికల్చర్, టి.ఎస్. మార్క్‌ఫెడ్, ఆహారోత్పత్తులు (పరిశ్రమలు) మొదలైనవి.

వ్యవసాయ శ్రామికుల కొరత, పెరిగిపోయిన వ్యవసాయ కూలీ ఖర్చులు నేటి వ్యవసాయరంగానికి అత్యంత ఆందోళన కలిగించే అంశాలు కావడంతో వ్యవసాయ యాంత్రికీకరణకు ఇతోధికమైన ప్రాధాన్యాన్ని ఇవ్వడం జరుగుతోంది. గతంలో కన్నా మరింతగా యాంత్రికీకరణ జరిగిన సేద్య సాధనాలను రైతులకు సమకూర్చడం ద్వారా వారు సకాలంలో వ్యవసాయ కార్యకలాపాలను చేపట్టడానికి

అవకాశం కలుగుతుంది. రైతుల అవసరాలను అనుసరించి, ట్రాక్టర్లు, టిల్లర్లు, మల్టీ క్రాప్ త్రెషర్ల వంటి ఎక్కువ ఖరీదైన యంత్రాలను అద్దెకు తెచ్చుకునే అవకాశం కల్పించే కస్టమ్ హైరింగ్ సెంటర్‌లు, మొక్కజొన్న షెల్లర్, రోటోవేటర్లు, సమష్టి హార్వెస్టర్‌లు మొదలైన వాటిని, రూ. 50,000 మించని రీతిలో 50 శాతం వరకు సబ్సిడీతో అందుబాటులోకి తెస్తారు. ఆర్.కె.వి.వై కింద 2014-15లో తెలంగాణకు జరిగిన కేటాయింపులు రూ. 195.27 కోట్లు.

## జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్.ఎఫ్.ఎస్.ఎం)

భారత ప్రభుత్వం 11వ పంచవర్ష ప్రణాళికా కాలంలో ప్రారంభించి, 12వ పంచవర్ష ప్రణాళిక మీదుగా కొనసాగిస్తున్న అగ్రగామి పథకం ఎన్.ఎఫ్.ఎస్.ఎం. జాతీయ ఆహార భద్రతా మిషన్ ద్వారా 12వ పంచవర్ష ప్రణాళికా సమయంలో భారతప్రభుత్వం కొన్ని లక్ష్యాలను ఆశించింది.

ఈ పథకం అమలుకు 100% ఆర్థిక సహాయాన్ని భారత ప్రభుత్వమే సమకూరుస్తుంది. 2014-15 సంవత్సరంలో ఎన్.ఎఫ్.ఎస్.ఎం కింద రూ. 85.43 కోట్లను కేటాయించింది.

## సహకార రంగం

## తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ హైదరాబాద్ (టి.ఎస్. మార్క్‌ఫెడ్)

రాష్ట్ర విభజన జరిగిన తర్వాత 2-6-2014వ తేదీన తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ సొసైటీస్ ఫెడరేషన్ లిమిటెడ్ హైదరాబాద్ (టి.ఎస్. మార్క్‌ఫెడ్)ని పునర్వ్యవస్థీకరించారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించే విధంగా వ్యవసాయోత్పత్తుల సేకరణ, మూల విక్రయాలను చేపడుతున్న తొమ్మిది జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలు దీని కింద మిగిలాయి. ఈ సొసైటీల వ్యాపార పరిమాణం 2013-14లో రూ. 201.48 కోట్లకు పెరిగింది. వ్యాపార పరిమాణం అంత క్రితం సంవత్సరంలో రూ. 59.17 కోట్లు మాత్రమే. ఈ సంస్థకు కరీంనగర్‌లో ఒకే ఒక దాణా మిశ్రమ విభాగం, ఆదిలాబాద్‌లో ఒకే ఒక పత్తి వడికే కర్మాగారం ఉన్నాయి.

## వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం

సమగ్రమైన ఆంధ్ర ప్రదేశ్ (వ్యవసాయోత్పత్తుల, జీవోత్పత్తుల) విపణుల చట్టం 18.11.1996 నుంచి అమలులోకి వచ్చింది. దీనిని తెలంగాణ రాష్ట్రానికి ఆమోదించుకోవలసి ఉంది. వ్యవసాయ మార్కెట్ చట్టం లక్ష్యం వ్యవసాయోత్పత్తుల విక్రయంలో రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చూడడం, దోపిడీదారులైన వ్యాపారుల కబంధహస్తాల నుంచి రైతులకు రక్షణ కల్పించడం.

రాష్ట్రంలో 150 వ్యవసాయ మార్కెట్ కమిటీలుండగా, వాటి కింద 306 మార్కెట్ యార్డులు నోటిఫై అయ్యాయి. వాటిలో 140 ప్రధాన యార్డులు కాగా, 101 ఉప యార్డులు. వీటిలో 150 వ్యవసాయ మార్కెట్ కమిటీలు కాగా, 64 ఫంక్షనల్ విపణులు, 16 సీజనల్ విపణులు, 19 పాడి పశువుల విపణులు, 264 చెక్ పోస్టులు, 26 రైతు బజార్‌లు.

## రైతు బంధు పథకం

రైతు బంధు పథకాన్ని 1990 నుంచి అమలు చేస్తున్నారు. దీనిలో గరిష్ఠ స్థాయి రుణ పరిమాణం లక్ష రూపాయలే కావడంతో ఇది రైతులలో పెద్దగా ఆదరణ పొందలేదు. రైతులతో సంప్రదింపులు జరిపిన తెలంగాణ ప్రభుత్వం, ఈ గరిష్ఠ రుణ పరిమితిని రూ. 2.00 లక్షలకు పెంచినది. దీనిని తీర్చడానికి మొదటి 180 రోజులకు వడ్డీ ఏమీ వసూలు చేయరు. దీని వల్ల రైతులు విధిలేక పంటను అమ్ముకునే అగత్యం తప్పిపోగలదు.

గతంలో రైతుబంధు కార్డుకి కాలపరిమితి మూడేళ్లు మాత్రమే ఉండేది. కొత్తగా ఈ కార్డు పునరుద్ధరణ వ్యవధిని ప్రభుత్వం అయిదేళ్లకు పెంచడం జరిగింది. రైతులు గత్యంతరం లేని స్థితిలో పడి, తక్కువ ధరకు పంటను అమ్ముకోవలసిన అగత్యం లేకుండా చేస్తూ, 2014-15లో ప్రభుత్వ శాఖ రూ. 1.74 కోట్లు ఖర్చు పెట్టింది. రైతు బంధు పథకం కింద 2012-13లో 953 మంది రైతులు లబ్ధి పొందగా 2013-14లో 1,111 మంది రైతులు లబ్ధి పొందారు.

## రైతు బజార్‌లు

రాష్ట్రంలో ఉన్న 30 రైతు బజార్‌ల మధ్య అనుసంధాన యంత్రాంగం ఉంది. సగటున 3,115 మంది రైతులు ప్రతి వారానికి 8,000 లక్షల క్వింటాళ్ల నుంచి 10,000 లక్షల క్వింటాళ్ళ వరకు కూరగాయలను ఈ రైతుబజార్‌ల ద్వారా నేరుగా వినియోగదారులకు విక్రయించుకుంటారు. నాణ్యత వారీగా విభజించిన కూరగాయలను విక్రయించే సంచార రైతు బజార్‌లు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాలలో పనిచేస్తున్నాయి. ఇవి విజయవంతమైనవిగా నిరూపణ అయ్యాయి.

# 2.2 ఉద్యానవన పోషణ - సరికొత్త ప్రయత్నాలు

"వికసించిన పుష్పంలా భూమి నవ్వుతుంది."
- రాల్ఫ్ ఆల్డో ఎమర్సన్

వ్యవసాయ రంగంలో అభివృద్ధి కారకాలలో ఒకటిగా ఉద్యాన వన రంగాన్ని గుర్తించడం జరిగింది. రాష్ట్ర అభివృద్ధిలో "దృష్టిని కేంద్రీకరించవలసిన" రంగాలలో ఒకటిగా దానిని గుర్తించారు. ఉద్యాన వన వనరులలో సంప్రదాయకంగా సుసంపన్నమైనది తెలంగాణ రాష్ట్రం. వివిధ రకాల ఉద్యాన వన పంటలకు ఈ రాష్ట్ర వాతావరణ పరిస్థితులు చక్కగా అనుకూలంగా ఉన్నాయి. తిరిగి ఈ వనరులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, అభ్యాసాలను మేళవించడం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా గల గిరాకీని ఆకట్టుకోడానికీ, మరియు ఈ దిశలో అనుకూల గమ్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని మలచడానికీ కృషి జరుగుతోంది.

తెలంగాణ రాష్ట్ర జి.ఎస్.డి.పికి ఒక గణనీయమైన సహాయకారి, ఉద్యానవన రంగం. ఉద్యాన వన పంటల కింద మొత్తం 10.86 లక్షల హెక్టార్ల విస్తీర్ణం ఉంది. ఇది 112.56 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని అందజేస్తోంది. రాష్ట్రంలోని ప్రధానమైన పండ్లతోటలు మామిడి, నిమ్మ జాతులు, అరటి, జామ, బొప్పాయి. ప్రధానమైన కూరగాయలు టమాటా, వంకాయ, బెండ, బీర, కాకర, సొర మొదలైనవి. మిరప, పసుపు, ధనియాలు ముఖ్యమైన మసాలా దినుసులు. కొబ్బరి, జీడిపప్పు, ఆయిల్ పామ్‌లు రాష్ట్రంలో ప్రధానమైన తోట పంటలు. వచ్చే అయిదేళ్లలో (2018-19 నాటికి) ఉద్యానవన రంగంలో కార్యాచరణ కింద లక్ష్యంగా పెట్టుకున్న విస్తీర్ణం 14.48 లక్షల హెక్టార్లు. ఈ విస్తీర్ణంలో పండించగలమని అంచనా వేస్తున్న ఫలసాయం 152.31 లక్షల మెట్రిక్ టన్నులు. భారతదేశంలో సాగులో ఉన్న భూ విస్తీర్ణం పరంగా తెలంగాణ, పండ్లు ఫలాలలో మూడో వరుసలో ఉంది. పసుపులో మొదటి వరుసలో ఉంది.

రాష్ట్రంలో ఉద్యానవన రంగం అభివృద్ధికి గల అవకాశాలను బాగా వినియోగించుకోడానికి, ఉద్యాన వనరంగానికి పెద్ద ఊపునివ్వడానికి అవసరమైన కీలక కార్యక్రమాలకు విస్తృతమైన ప్రాధాన్యాన్నిస్తూ, ఉద్యానవన శాఖ వివిధ పథకాలను అమలు చేస్తోంది. వాటిలో ప్రధాన కార్యక్రమాలు సూక్ష్మ సేద్య పథకం (ఎం.ఐ.పి), సమగ్ర ఉద్యానవనాభివృద్ధి ఉద్యమం (ఎం.ఐ.డి.హెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై), నూనె గింజల జాతీయోద్యమం మరియు పామ్ ఆయిల్ ఉద్యమం (ఎన్.ఎం.ఒ.ఒ.పి), ఇంకా రాష్ట్ర ప్రణాళికా పథకాలు.

2014-15లో ఉద్యానవన కార్యకలాపాల అభివృద్ధికి, పబ్లిక్ గార్డెన్‌లను అందంగా తీర్చిదిద్దడానికి, ఎకరానికి రూ. 29.52 లక్షల వంతున 75% సబ్సిడీపై 1000 ఎకరాలలో పాలీ హౌస్‌లను నిర్మించడానికి 452.75 కోట్ల రూపాయలను కేటాయించారు. వీటిలో 2014-15 సంవత్సరంలో ఒక్కొక్క లబ్ధిదారుకు గరిష్ఠం మూడు ఎకరాల వరకు మాత్రమే సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించారు.

### రాష్ట్ర ఉద్యాన వన మిషన్ (ఎస్.హెచ్.ఎం)

కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకంగా రాష్ట్ర ఉద్యాన వన మిషన్ (ఎస్.హెచ్.ఎం)ని 2005 నవంబర్‌లో ప్రారంభించారు. దీనిలో కొత్త తోటలను నెలకొల్పడం, పూర్వపు తోటలను పునరుజ్జీవింపజేయడం, సమీకృత తెగుళ్ల అదుపు (ఐ.పి.ఎం) / సమీకృత పోషక నిర్వహణ (ఐ.ఎన్.ఎం), పంట కోత అనంతర నిర్వహణ (పి.హెచ్.ఎం) మొదలైనవి, ఇంకా ఆదాయాలను గణనీయంగా పెంచే విధంగా రైతులకు అవసరమైన శిక్షణనివ్వడం భాగాలు.

ఉద్యానవన పంటలలో ఉత్పత్తిని అనేక రెట్లు పెంచినప్పటికీ, పంటను భద్రపరచడం, నిల్వచేయడాలలోని లోటుపాట్ల కారణంగా పంట కోత అనంతర నష్టాలు దాదాపు 30% - 35% వరకు ఉంటున్నాయి.

అందుబాటులో ఉన్న మిగులు ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఈ అవసరాన్ని పెంచవలసి ఉంది. పంటలకు అవకాశం

ఉన్న ప్రాంతాలలో వ్యవసాయ ఎగుమతి మండలాల ద్వారా, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లను ప్రోత్సహించవలసి ఉంది.

కొత్త తోటలను నెలకొల్పడం, పాతబడి, శిథిలమవుతున్న తోటలను పునరుజ్జీవింపజేయడం, ఐ.పి.ఎం / ఐ.ఎన్.ఎం, హెచ్.ఆర్.డి, సేంద్రియ సాగు, వ్యవసాయ యాంత్రికీకరణ, పంటల అనంతర నిర్వహణ మొదలైన వివిధ కార్యకలాపాల కింద 2014-15లో రూ. 28.30 కోట్లను వినియోగించడం జరిగింది.

## పంట కోతల అనంతర నిర్వహణ

ఉద్యాన వన పంటలు అతి తక్కువ కాలం మాత్రమే నిల్వ ఉంటాయి. పంటలను పండించడం, కోయడం, బుట్టలలో సర్దడం, నిల్వచేయడం, అమ్మకానికి సిద్ధం చేయడం, రైతుల సామర్థ్యాన్ని పెంపొందించడం లాంటి కార్యక్రమాలన్నింటికీ ప్రత్యేకమైన శ్రద్ధ అవసరం. పంట కోతకు ముందు అవసరమైన సాధనాలను సమకూర్చడం మీద, అలాగే పంట కోత అనంతరం అవసరమైన ప్యాక్ హౌస్‌లు, శీతల గిడ్డంగులు, తడి ఆరబెట్టే వేదికలు, ప్రత్యేక రవాణా వాహనాలు, మగ్గబెట్టే గదులు మొదలైన మౌలిక సదుపాయాల అభివృద్ధి మీద దృష్టిని కేంద్రీకరించడం జరుగుతోంది. మొత్తం 19 శీతల గిడ్డంగి విభాగాలు, 12 మగ్గబెట్టే గదులు, 31 ప్యాక్ హౌస్‌లు, 40 పసుపు బాయిలింగ్ విభాగాలను నెలకొల్పడం జరిగింది. ఎస్.హెచ్.ఎం కార్యక్రమాలను అమలు చేయడంలో పారదర్శకత కోసం, జవాబుదారీతనం కోసం 2013-14 నుంచి, ఆర్థిక సహాయాలను ఆన్‌లైన్ పద్ధతిలో హార్టినెట్ ద్వారా రైతుల ఖాతాలకే నేరుగా జమచేయాలని తలపెట్టారు.

## ఉద్యానవన పంటల ఉత్పత్తి మెరుగుదల, ఉత్పాదకత అభివృద్ధి

కొత్తగా 3,155 హెక్టార్ల విస్తీర్ణంలో తోటలను వేయడం జరిగింది. 8,255 హెక్టార్లలో పాతబడిన, శిథిలమైన పూదోటల పునరుద్ధరణ, తోటల రూపురేఖా విలాసాలను సుందరంగా తీర్చిదిద్దడం జరిగాయి.

## రక్షిత వ్యవసాయం

మెరుగైన నాణ్యత కలిగిన ఉత్పత్తులను సాధించడానికి, రైతులకు ఇతోధికమైన ఆదాయాన్ని సాధించడానికి అధిక విలువ కలిగిన కూరగాయలు, పూదోటల సాగును అభివృద్ధి చేయడం కోసం 7.9 హెక్టార్లలో గ్రీన్ హౌస్‌ల నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం తలపెట్టింది. మట్టిలోని తేమని కాపాడడానికి, భూసారాన్ని పరిరక్షించడానికి, కలుపు మొక్కల నివారణకు, ఇంకా అనేక ప్రయోజనాల కోసం నేలని ఆకులు అలమలతో కప్పి ఉంచడం లాంటి విధానాల అమలుకోసం 812 హెక్టార్ల విస్తీర్ణానికి ఆర్థిక సాయాన్ని సమకూర్చడం జరిగింది.

## రాష్ట్ర ప్రణాళిక (100%) ద్వారా తోట నీటి నిర్వహణ కార్యక్రమం (ఓఎఫ్‌డబ్ల్యుఎం-ఎన్ఎంఎస్ఏ), సూక్ష్మ సేద్య పథకాల అమలు

పంటల ఉత్పాదకతను, ఉత్పత్తిని మెరుగుపరచడానికి, రాష్ట్రానికి చెందిన సన్నకారు, చిన్నకారు రైతుల జీవన ప్రమాణాలలో నికరమైన మెరుగుదలను సాధించడానికి సూక్ష్మ సేద్యం ద్వారా ప్రతి నీటి బొట్టుని సమర్థంగా వినియోగించడమే కీలకం. సూక్ష్మ సేద్యంతో నీటి సమర్థ వినియోగాన్ని మెరుగు పరచడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని నికరంగా పొందగలుగుతారు. సూక్ష్మ సేద్యాన్ని సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా నీరు ఆదా అవుతుంది. మొక్కలు, దిగుబడి మరింతగా పెరగడానికి దోహదమవుతుంది. శ్రమ ఖర్చు, విద్యుత్ ఖర్చు తగ్గుతాయి. ముఖ్యంగా సారం తక్కువగా ఉన్న నేలలకు ఇది ఎక్కువ ఉపయోగకరం. అలాగే కలుపుని అదుపు చేయడానికి, కల్చర్ విధానాలలో ఖర్చుని ఆదా చేయడానికి, కార్యకలాపాలను సులభంగా నిర్వహించడానికి, ఉప్పు నీళ్లను ఉపయోగించే అవకాశాలకు, ఎరువుల సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, కార్యకలాపాలలో అనువైన మార్పుచేర్పులకు, భూమి కోతను నివారించడానికి కూడా సూక్ష్మ సేద్య విధానాలు దోహదం చేస్తాయి.

## లక్ష్యాలు

- ఉత్పాదకత మెరుగుదల, నాణ్యతా అభివృద్ధి
- నీరు, ఎరువుల సమర్థ వినియోగం
- విద్యుచ్ఛక్తి, శ్రమశక్తి సమర్థ వినియోగం
- తక్కువ నీటితో ఎక్కువ ఉత్పత్తి

## సూక్ష్మ సేద్యంలోని విభాగాలు

- తగినంత ఎడంతో వేసిన పంటలకు బిందు సేద్యం (ఉపరితలం పైనుంచి)
- దట్టంగా వేసిన పంటలకు బిందు సేద్యం (భూమి లోపలి నుంచి)
- చిట్టి, సూక్ష్మ తుంపర సాధనాలు
- వెంట తీసుకువెళ్లడానికి వీలైన, కొంత కాలం పాటు మన్నే, వాన నీటి తుంపర సాధనాలు

## తెలంగాణలో సూక్ష్మ సేద్య ఆవశ్యకత

తెలంగాణలో భూగర్భ జలాలతో సేద్యం జరుగుతూ, నికరంగా సేద్యపు నీరు అందుతున్న భూమి 14.85 లక్షల హెక్టార్లు. దీనిలో ఇప్పటికి 4.7 లక్షల హెక్టార్లకు మాత్రమే సూక్ష్మ నీటి సరఫరా విధానం అమలు జరుగుతోంది. అంటే ఇంకా 10.00 లక్షల హెక్టార్లలో సూక్ష్మ నీటి సాగును అమలు చేయడానికి అవకాశముంది. అమలు చేయాల్సిన అవసరముంది.

**పట్టిక 17 : జిల్లాల వారీగా సూక్ష్మ నీటి సదుపాయం కింద సాగవుతున్న విస్తీర్ణం**

| వరుస సంఖ్య | జిల్లా పేరు | భూగర్భ జలాలతో నికరంగా సాగయ్యే విస్తీర్ణం (హెక్టార్లలో) | 2003-04 నుంచి 2013-14 వరకు సూక్ష్మ నీటి సేద్యం జరిగిన భూమి (హెక్టార్లలో) | | | ఇంకా సాగుకు అవకాశమున్న విస్తీర్ణం (హెక్టార్లలో) |
|---|---|---|---|---|---|---|
| | | | బిందు | తుంపర | మొత్తం | |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7(3-6) |
| 1 | ఆదిలాబాద్ | 60960 | 16703 | 17301 | 34004 | 26956 |
| 2 | కరీంనగర్ | 311116 | 28260 | 9611 | 37871 | 273245 |
| 3 | నిజామాబాద్ | 169570 | 25099 | 6321 | 31420 | 138150 |
| 4 | ఖమ్మం | 94049 | 24039 | 9481 | 33520 | 60529 |
| 5 | వరంగల్ | 256866 | 33512 | 9086 | 42598 | 214268 |
| 6 | నల్గొండ | 185611 | 76949 | 9383 | 86332 | 99279 |
| 7 | మెదక్ | 130517 | 47538 | 19335 | 66873 | 63644 |
| 8 | మహబూబ్‌నగర్ | 205217 | 80059 | 31642 | 111701 | 93516 |
| 9 | రంగారెడ్డి | 71942 | 23516 | 11928 | 35444 | 36498 |
| | **రాష్ట్రం** | **1485848** | **355675** | **124088** | **479763** | **1006085** |

- కాబట్టి, ఏటా కొత్తగా అత్యవసరంగా సూక్ష్మ సేద్యం కిందకు తీసుకురావలసిన భూమిని రాష్ట్రంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా తలపెట్టిన 44,000 హెక్టార్ల నుంచి, ప్రత్యేక రాష్ట్రంలో 1,00,000 హెక్టార్ల వరకు పెంచాల్సిన అవసరం ఉంది.
- సూక్ష్మ సేద్యానికి తెలంగాణ రాష్ట్రంలో అపారమైన అవకాశం ఉన్న కారణాన, వర్షాధారమైన తెలంగాణ రాష్ట్రంలో పేద రైతుల నికరాదాయాన్ని, పంటల ఉత్పాదకతను పెంచడానికి, వనరులను సమర్థంగా వినియోగించడానికి మరింత విస్తీర్ణాన్ని సూక్ష్మ సేద్యం కిందకు తీసుకురావలసిన అవసరముంది. ఆ విధంగా ఏడాదికి 11 లక్షల హెక్టార్లను కొత్తగా సూక్ష్మ సేద్యం కిందకు తేవడానికి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం జరిగింది. అవకాశమున్న విస్తీర్ణంలో కనీసం 50%భాగాన్ని 2014 నుంచి 2019 వరకు గల అయిదేళ్ల వ్యవధిలో సూక్ష్మ సేద్యం కిందకు తేవడమే దీని లక్ష్యం. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఎన్.ఎం.ఎస్.ఏ కింద ఉద్యాన వన కమిషనర్ ఇదే కాలానికి ప్రతిపాదించిన లక్ష్యం 2014-15 సంవత్సరానికి 44,000 హెక్టార్లు మాత్రమే.
- ప్రత్యేకంగా దృష్టి సారించిన జిల్లాలు: మహబూబ్ నగర్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ.
- ఉద్యాన వన పంటలు - కూరగాయలు, మిరప, మసాలా దినుసులు, పండ్లు, బొప్పాయి, పామాయిలు.
- వ్యవసాయం - చెరకు, పత్తి, మొక్కజొన్న, కందులు, వేరుసెనగ, సోయాబీన్.
- పట్టు పరిశ్రమ - మల్బరి

## కూరగాయలను పండించడానికి పాలీహౌస్: 2014-15

అధిక విలువ కలిగిన ఉద్యాన వన పంటలను అభివృద్ధి చేయడానికి, పూల పంటలలో, కూరగాయ తోటలలో నిరంతర ఉత్పత్తికి, సరఫరాకు తెలంగాణ రాష్ట్రంలో 2014-15 సంవత్సరంలో 1,000 ఎకరాల విస్తీర్ణంలో పాలీహౌస్‌లను ప్రోత్సహించాలని తలపెట్టారు. అధిక విలువ కలిగిన ఉద్యాన వన పంటల సేద్యంలో కీటకాల నుంచి రక్షించడానికి / తగినంత నీడనివ్వడానికి వలలు కడతారు. యు.వితో స్థిరీకరణ జరిగే పాలీఎథిలీన్‌ని కప్పిన జి.ఐ పైపులతో నిర్మాణాలు చేస్తారు. వీటిని కాపాడడానికి పాలీ హౌస్‌లను నిర్మిస్తారు.

ప్రతికూల వాతావరణ పరిస్థితుల నుంచి పంటలను కాపాడడానికి, సహజంగా పెరిగే ఋతువులతో నిమిత్తం లేకుండా ఆయా పంటలను పండించడానికి ఈ నిర్మాణాలు అవసరమవుతాయి.

### లక్ష్యాలు

- ప్రామాణిక విస్తీర్ణం ఉత్పాదకతను పెంచడం
- అధిక విలువ కలిగిన ఉద్యానవన పంటలను పాలీహౌస్‌ల కింద అభివృద్ధి చేయడం. పూల తోటలలో ఏడాది పొడవునా పూలను ఉత్పత్తి చేయడం, అదే విధంగా కూరగాయలను ఇతర ఋతువులలో కూడా ఉత్పత్తి చేయడం
- తెగుళ్ల బారిన పడని, జన్యురీత్యా అత్యున్నతమైన అంట్లను నిరంతరంగా ఉత్పత్తి చేయవచ్చు. తద్వారా గ్రామీణ ప్రాంతాలలో జీవనోపాధిని కల్పించవచ్చు

### ఎస్.హెచ్.ఎం పథకం ప్రారంభించినప్పటి నుంచి పురోగతి (2007-2013)

- రాష్ట్ర ఉద్యానవన మిషన్ పథకం కింద 130 ఎకరాలలో పాలీ హౌస్‌లను నిర్మించడానికి తెలంగాణలోని 9 జిల్లాలలో కలిపి 346 మంది రైతులకు రూ. 24.42 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.
- పాలీ హౌస్‌ల కింద పూలకు సంబంధించిన వృక్ష సామగ్రి నిమిత్తం రూ. 9.91 కోట్ల రూపాయల మొత్తాన్ని ఆర్థిక సహాయంగా ఇవ్వడం జరిగింది. అలాగే పాలీ హౌస్‌ల కింద కూరగాయలకు సంబంధించిన వృక్ష సామగ్రి నిమిత్తం రూ. 22.86 లక్షల మొత్తాన్ని ఆర్థిక సహాయంగా ఇవ్వడం జరిగింది.
- రక్షిత వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి లబ్ధిదారులకు మొత్తం రూ. 34.33 కోట్ల ఆర్థిక సహాయాన్ని సమకూర్చడం జరిగింది.

రాష్ట్ర ఉద్యాన వన మిషన్ కింద 2007 నుంచి 2013 వరకు, పాలీ హౌస్‌లు, పూలకూ, కూరగాయలకూ సంబంధించి వృక్ష సామగ్రి సరఫరాలలో సాధించిన విజయాలు జిల్లాల వారీగా ఈ విధంగా ఉన్నాయి:

**పట్టిక 18 : రాష్ట్ర ఉద్యానవన మిషన్ (ఎస్.హెచ్.ఎం)ను ప్రారంభించినది మొదలు (2007-2013) తెలంగాణాలో ఏర్పాటు చేసిన రక్షిత బహుళ పంటల నిలయాలు (పాలీహౌస్‌లు)**

| వరుస సంఖ్య | జిల్లా పేరు | లబ్ధిపొందిన రైతుల సంఖ్య | విస్తీర్ణం ఎకరాలలో | అందించిన సబ్సిడీ (లక్షలలో) |
|---|---|---|---|---|
| 1 | రంగారెడ్డి | 181 | 61.644 | 1139.49 |
| 2 | మహబూబ్‌నగర్ | 55 | 21.879 | 397.50 |
| 3 | మెదక్ | 87 | 32.575 | 608.82 |
| 4 | నల్గొండ | 17 | 9.875 | 226.51 |
| 5 | ఆదిలాబాద్ | 2 | 1.004 | 18.75 |
| 6 | వరంగల్ | 3 | 2.5 | 46.75 |
| 7 | కరీంనగర్ | 1 | 0.25 | 4.67 |
| | **రాష్ట్రం** | **346** | **129.727** | **2442.50** |

### పాలిహౌజ్ వ్యవసాయం - అత్యుత్తమ విధానాలు

- నిర్వహణతో కలిపి వ్యయం: నెలకు రూ. 80,000/-
- నెలకు నికర ఆదాయం రూ. 1,00,000/- (సగటున)



*రక్షిత బహుళ పంటల నిలయం*

## "మన ఊరు - మన కూరగాయలు" కార్యక్రమం

హైదరాబాద్ విపణికి కూరగాయలను సరఫరా చేసే ప్రధానమైన ఇరుగుపొరుగు జిల్లాలు మహబూబ్ నగర్, మెదక్, రంగారెడ్డిలు. వీటిలో కూరగాయల విపణి అనుసంధానాన్ని సృష్టించడానికి, కూరగాయల విలువ శ్రేణిని పటిష్ఠం చేయడానికి వెజిటబుల్ ఇనిషియేటివ్స్ ఫర్ అర్బన్ క్లస్టర్స్ (వి.ఐ.యు.సి) అనే పథకం ఉంది. దీనిలోని ప్రధానమైన కార్యక్రమాలు సంకర కూరగాయ విత్తనాల సరఫరా, శాశ్వతమైన శాలల నిర్మాణం, ట్రెల్లీలు, ఛాయా ఆవాసాలు, వసూళ్ల కేంద్రాల ఏర్పాటు మొదలైనవి. వీటికి వి.ఐ.యు.సి కింద రూ. 625.00 లక్షల వ్యయాన్ని ప్రతిపాదించారు.



*మెదక్‌లో "మన ఊరు - మన కూరగాయలు" పథకం ప్రారంభోత్సవం*

## పూల సాగు

ఉద్యానవన విభాగంలో ప్రాధాన్యతనిస్తున్న ఓ ముఖ్యమైన రంగం పూల సాగు. ఎగుమతులకు గణనీయమైన అవకాశం ఉన్న రంగమిది. రైతులు పూలసాగు చేపట్టడాన్ని ప్రోత్సహించడానికి ఈ శాఖ ప్రోత్సాహకాలను ఇస్తోంది. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించడానికి ప్రధాన కారణం, ఇది తెలంగాణ ప్రజలు నమ్మే దేవతను పూలతో అలంకరించే పండుగ కావడమే. రాగల సంవత్సరాలలో పూల రైతులకు ఈ పండుగ కొత్త ఊతాన్నిస్తుందని ఆశించవచ్చు.

# 2.3 పశుగణాభివృద్ధి మరియు మత్స్య సంపద

పశుగణాభివృద్ధి రంగం కిందకు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు వస్తాయి. వీటిలో ఆవులు, గేదెలను పాడి పశువులుగా, గొర్రెలు, మేకలను గొర్రె జాతి జంతువులుగా స్థూలంగా వ్యవహరిస్తుంటారు. జీవసంపద వనరులలో తెలంగాణ సుసంపన్నమైనది. ముఖ్యంగా దేశంలోని పాడి పశువులు, గొర్రెలలో 5.52 శాతం తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నాయి. మొత్తం జీవసంపద పరంగా రాష్ట్రం దేశంలో పదో స్థానంలో ఉండగా, 2007 జీవసంపద లెక్కలను అనుసరించి, గొర్రెల పెంపకంలో మొదటి స్థానంలో, మేకల పెంపకంలో 12వ స్థానంలో, కోళ్ల పెంపకంలో 5వ స్థానంలో, పాడి పశువుల పెంపకంలో 13వ స్థానంలో, పందుల పెంపకంలో 17వ స్థానంలో ఉంది.

జీవనోపాధి కోసం తెలంగాణలో దాదాపు 29 లక్షల కుటుంబాలు జీవోత్పత్తుల మీద ఆధారపడి ఉన్నాయి. జీవోత్పత్తుల విలువ వర్తమాన ధరలలో రూ. 30,584 కోట్లు ఉంటుందని అంచనా. స్థూల రాష్ట్రోత్పత్తి (జి.ఎస్.డి.పి)లో జీవోత్పత్తుల భాగం 7.1 శాతం. ఇది 2014-15 ముందస్తు అంచనాల ప్రకారం వ్యవసాయ రంగంలో 39.69 శాతం.

ఏడాదికి 1006 కోట్ల గుడ్ల ఉత్పత్తితో తెలంగాణ రాష్ట్రం గుడ్ల ఉత్పత్తిలో దేశంలోనే 3వ స్థానంలో ఉంది. దేశంలో ప్రతి ఎనిమిది గుడ్లలో ఒకటి తెలంగాణ నుంచి వచ్చేదే. ఏడాదికి 4.46 లక్షల మెట్రిక్ టన్నుల మాంసం ఉత్పత్తితో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఆరో స్థానంలో ఉంది. ఏడాదికి 39.24 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తితో తెలంగాణ దేశంలో పాల ఉత్పత్తిలో 13వ స్థానంలో ఉంది.

పాలు, మాంసం, గుడ్లు మొదలైనవి జంతువుల నుంచి లభించే ఆహారపు అంశాలు. వీటి లభ్యతను మానవ వినియోగం కోసం విరివిగా లభింప చేయడం పశుగణాభివృద్ధి శాఖ పని. సశాస్త్రీయమైన పెంపకం, పోషణ, రోగ నివారణల ద్వారా ఈ లక్ష్యసాధన దిశగా పురోగమించడం జరుగుతుంది.

ఈ రంగంలో జాతీయ విధానాలు రూపకల్పన చేసి అందించిన మార్గాలలో పశుగణాభివృద్ధి పథకాల రూపకల్పన జరుగుతోంది. జీవసంపద ఉత్పత్తి, మాంసకృత్తుల పోషణ అవసరాన్ని భర్తీ చేయడం, మానవ జనాభా పోషణ ప్రమాణాల మెరుగుదల, జీవసంపద నిర్వహణకు, మెరుగుదలకు సాంకేతికమైన అండదండలను సమకూర్చడం ఈ పథకాలలోని ముఖ్యాంశాలు.

## పాల ఉత్పత్తి మరియు ఉత్పాదకత

2014-15లో (2014 అక్టోబర్ 31 వరకు) రాష్ట్రం 2354.32 లక్షల మెట్రిక్ టన్నుల పాలను ఉత్పత్తి చేసింది. రాష్ట్ర జనాభాకు పాల తలసరి లభ్యత రోజుకు 234 గ్రాములు. ఇది కనీసం 2009-10 సంవత్సరం నాటి జాతీయ సగటు రోజుకు 263 గ్రాములకు చేరుకోవలసి ఉంది. రాష్ట్ర పాడి సమాఖ్యకు పాలు పోసే రైతులకు లీటరు పాలకు రూ. 4.00 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. పాడి రంగంలో రైతుల లాభాన్ని పెంచడానికి, గ్రామాలలోని జీవనోపాధిలో వారు నిలదొక్కుకోవడానికి మద్దతు నివ్వడానికి ఉద్దేశించిన ఈ ప్రోత్సాహకాన్ని అందించడానికి 2014 నవంబర్ 1వ తేదీ నుంచి ఒక కొత్త పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రోత్సాహక మొత్తంగా తెలంగాణ పాడి రైతులకు ఇప్పటికి 537.49 లక్షల రూపాయలను పంపిణీ చేసింది.

**పట్టిక 19 : పాల సేకరణ - పరిస్థితి**

| వరుస సంఖ్య | జిల్లా | సాధన | | | |
|---|---|---|---|---|---|
| | | పాలుపోసిన వారు సంఖ్య | | పాల సేకరణ (లీటర్లలో) | |
| | | 01-11-2014 | 26-01-2015 | 01-11-2014 | 26-01-2015 |
| 1 | మెదక్ | 4250 | 12421 | 27053 | 37777 |
| 2 | నిజామాబాద్ | 8336 | 10572 | 31188 | 29037 |
| 3 | ఖమ్మం | 2478 | 6250 | 5518 | 12690 |
| 4 | వరంగల్ | 9420 | 15550 | 34254 | 47001 |
| 5 | మహబూబ్‌నగర్ | 7915 | 10700 | 29449 | 69869 |
| 6 | ఆదిలాబాద్ | 0 | 398 | 0 | 2204 |
| 7 | నల్గొండ | 0 | 195 | 0 | 1358 |
| 8 | కరీంనగర్ | 0 | 190 | 0 | 1392 |
| | **మొత్తం** | **32399** | **56276** | **127462** | **201328** |

## మన ఊరు - మన పాడి ప్రణాళిక

నిధులను, మానవ శక్తిని, వివిధ ప్రభుత్వ పథకాల కూర్పును ఉపయోగించుకుని ప్రభుత్వం "మన ఊరు - మన పాడి ప్రణాళిక" పేరుతో మరొక సృజనాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రాథమికంగా 425 పాడి ఉత్పత్తిదారుల సహకార సంఘాలను గుర్తించింది. ఎలాంటి అవాంతరం లేకుండా తెలంగాణ రాష్ట్ర పాడి సమాఖ్యకు చెందిన గ్రామ పాల సేకరణ కేంద్రాని (వి.ఎం.సి.సి)కే పాలను సరఫరా చేయాలనే షరతుతో తెలంగాణ రాష్ట్రంలోని రైతులు పాడి పశువులను కొనుగోలు చేయడానికి రుణాలు ఇవ్వడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో పాడి కార్యకలాపాలను పెంచడానికి స్త్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ముందుకు వచ్చింది.

పథకాన్ని ప్రకటించడానికి ముందు, అంటే అక్టోబర్ చివరలో తెలంగాణ రాష్ట్రంలో రోజుకు 1.27 లక్షల లీటర్ల పాల సేకరణ జరిగింది. కొత్తగా చేపట్టిన ప్రయత్నాల ఫలితంగా ఈ సేకరణ 2015 జనవరి 26వ తేదీ నాటికి రోజుకు 2.01 లక్షల లీటర్లకు పెరగడం ఈ ప్రయత్నాల సత్ఫలితాన్ని సూచిస్తుంది.

## మాంసం మరియు గుడ్ల ఉత్పత్తి

2014-15లో 2014 అక్టోబర్ 31వ తేదీ వరకు రాష్ట్రం 294.00 లక్షల మెట్రిక్ టన్నుల మాంసాన్ని, 624.80 కోట్ల గుడ్లను ఉత్పత్తి చేసింది. గత దశాబ్దంలో మాంసం ఉత్పత్తి, గుడ్ల ఉత్పత్తి రెండూ ఆటుపోట్లకు గురయ్యాయి.

పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి వివరాలను పట్టిక 20లో ఇచ్చాము.

**పట్టిక 20 : తెలంగాణాలో పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తి**

| అంశం | పరిమాణ ప్రమాణం | 2012-13 | 2013-14 | 2014-15 (31.10.2014 వరకు) |
|---|---|---|---|---|
| పాలు | 000 మెట్రిక్ టన్నులలో | 3950 | 3924 | 2354.32 |
| గుడ్లు | కోట్ల సంఖ్యలలో | 942 | 1006 | 624.80 |
| మాంసం | 000 మెట్రిక్ టన్నులలో | 428 | 446 | 294.00 |

ఆధారం : పశుగణాభివృద్ధి శాఖ

### జీవసంపదలో ఆవులు, గేదెలు, తదితరాల పరిమాణం, కూర్పు

2012 జీవసంపద లెక్కల ప్రకారం రాష్ట్రంలో 92.28 లక్షల పాడి పశువులుండగా, వాటిలో ఆవులు 50.34 లక్షలు, గేదెలు 41.94 లక్షలు. రాష్ట్రంలోని గొర్రెలు, మేకల సంఖ్య 175.49 లక్షలు కాగా, వాటిలో గొర్రెలు 128.74 లక్షలు, మేకలు 46.75 లక్షలు.

**పట్టిక 21 : వివిధ రకాల పశువుల నిష్పత్తి సంఖ్య (లక్షలలో)**

| విభాగం | 2007లో సేకరించిన లెక్కల ప్రకారం | 2012లో సేకరించిన లెక్కల ప్రకారం |
|---|---|---|
| ఆవులు | 57.50 | 50.34 |
| గేదెలు | 50.42 | 41.94 |
| గొర్రెలు | 133.57 | 128.74 |
| మేకలు | 48.01 | 46.75 |
| పందులు | 2.32 | 2.51 |
| కోళ్ళు | 494.47 | 691.58 |

ఆధారం : పశుగణాభివృద్ధి డైరెక్టరేట్

### పశు ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు

జీవోత్పత్తుల పరిశ్రమ వృద్ధిలో పశువుల ఆరోగ్యం చాలా ముఖ్యపాత్రను పోషిస్తుంది. పశువులకు వ్యాధులు సోకే ప్రమాదాల నుంచి అవసరమైన రక్షణ చర్యలు సమకూర్చకుండా జీవోత్పత్తుల కార్యక్రమాలేవీ విజయవంతం కావన్నది సుస్పష్టం. శస్త్రచికిత్సలు, వ్యాధి పరిశోధన, చికిత్స సదుపాయాలను సమకూర్చడం ద్వారా పశు ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరచడానికి ఇప్పుడున్న సంస్థలను పటిష్ఠం చేసే చర్యలను పశుగణాభివృద్ధి శాఖ చేపట్టింది. దీని కోసం ప్రతి జిల్లా ప్రధాన కార్యాలయంలోనూ పాలీక్లినిక్‌లను నెలకొల్పింది. పశు ఆరోగ్య సేవలను పటిష్ఠంగా అందించడానికి, ఉత్పత్తి కార్యక్రమానికి, జీవరాశి వ్యాధుల నివారణ, అదుపునకు అండగా నిలవడానికి ప్రతి మండలానికీ ఒక పశువైద్య పట్టభద్రుడిని సమకూర్చింది.

### క్రమబద్ధమైన సంస్థల రకాలు

తెలంగాణ వ్యాప్తంగా పశువుల ఆరోగ్య అవసరాలను తీర్చడానికి వెటర్నరి పాలీక్లినిక్‌లు (8), సూపర్ స్పెషాలిటీ వెటర్నరి హాస్పిటల్ (1), వెటెరినరీ హాస్పిటళ్లు (101), వెటెరినరీ డిస్పెన్సరీలు (917), సంచార వెటెరినరీ క్లినిక్‌లు (11), (1105) గ్రామీణ జీవోత్పత్తి విభాగాలు పనిచేస్తున్నాయి. ఈ సంస్థలు 2014-15లో (31.12.2014 వరకు) 401.66 లక్షల కేసులకు చికిత్స చేశాయి. 2.24 లక్షల జంతువులకు సంతాన నిరోధక చికిత్సలు జరిగాయి. 325.94 లక్షల టీకాలను వేయడం జరిగింది. సరైన రోగనిర్ధారణ చేయడమంటే వ్యాధిని సగం నయం చేసినట్టే. ఈ కారణంగా 9 జంతు రోగ నిర్ధారణ ప్రయోగశాల (ఎ.డి.డి.ఎల్)ల సేవలను అందించడం జరుగుతోంది.

### వెటర్నరి బయొలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్

రాష్ట్రంలో వైరల్, బయొలాజికల్ టీకాల ఉత్పత్తికి ప్రధాన వనరు హైదరాబాద్‌లోని వెటెరినరీ బయొలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్. ఈ సంస్థ తొమ్మిది రకాల టీకాలను ఉత్పత్తి చేస్తోంది. వి.బి.ఆర్.ఐలో బాక్టీరియల్, పి.పి.ఆర్, షీప్ పాక్స్ టీకాల ఉత్పత్తి ప్రయోగశాలలను డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్ 1945ని అనుసరించి జి.ఎం.పి ప్రమాణాలను నిర్వర్తించడానికి వీలుగా ఆధునికీకరించడం పూర్తయింది. దానిలో ప్రస్తుతం పరీక్షాత్మక మచ్చుల ఉత్పత్తి పురోగతిలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో జీవ రాశుల మేలు కోసం ఈ సంస్థ 2014-15 సంవత్సరంలో 2014 డిసెంబర్ వరకు వివిధ రకాల టీకాలు 202.60 లక్షల మోతాదులు ఉత్పత్తి చేసింది.

### ప్రభుత్వ జీవోత్పత్తి శాలలు

తెలంగాణలో జాతి ఎద్దులను ఉత్పత్తి చేయడానికి వీలుగా పాడి పశు అభివృద్ధి కార్యకలాపాలకు అండదండనివ్వడానికి తగిన ప్రాంతాలను ప్రభుత్వ శాఖ ఎంపిక చేసి, అక్కడ పాడి పశుగణాభివృద్ధి కేంద్రాలను నెలకొల్పింది. ప్రస్తుతం 2014-15లో (31.12.2014 వరకు) మెదక్ జిల్లాలోని గుడ్డర్‌పల్లిలో దేవని పశుగణాభివృద్ధి కేంద్రంలో 22 దేవని జాతి పశువులను పెంచుతున్నారు.

## మేత, దాణా అభివృద్ధి

జీవోత్పత్తులను, ముఖ్యంగా సంకర జాతి వాటిని సశాస్త్రీయంగా, గిట్టుబాటయ్యే విధంగా పెంచాలంటే ఇతోధికమైన దిగుబడినిచ్చే పుష్టికరమైన మేత అత్యవసరం. పాలను, మాంసాన్ని ఇతోధికంగా పెంచాలంటే జీవరాశులకు సశాస్త్రీయంగా ఆహారాన్నివ్వడం తప్పనిసరి. దీనికోసం అందుబాటులో ఉన్న పంటభూముల్లోనూ, బీడు భూముల్లోనే రైతులు అధికోత్పత్తినిచ్చే గ్రాస పంటలను వేయాల్సి ఉంటుంది. వీటిని బాగా ప్రచారం చేయడానికి, వీటికి ప్రజాదరణ తేవడానికి ప్రభుత్వ శాఖ పూనిక వహించింది. ఈ కార్యకలాపాలను ముమ్మరం చేయడానికి దాణా స్లిప్పులనూ, దాణా, పచ్చికల మెరుగు పరచిన విత్తనం రకాలను ఇస్తోంది. ఈ ప్రయత్నాలు అత్యంత ప్రోత్సాహకరమైన ఫలితాలను ఇస్తున్నాయి. పశువుల మేతను పెంచడానికి 2013-14లో 4.64 లక్షల హెక్టార్ల పొలాన్ని, 2014-15లో 31.12.2014 వరకు2.69 లక్షల ఎకరాల పొలాన్ని పశువుల మేత సాగు కోసం వినియోగించడం జరిగింది. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచాలనే ధ్యేయంతో క్రమపద్ధతిలో వచ్చిన ప్రణాళికా పథకాల కిందనే మేత అభివృద్ధి కార్యక్రమాలను కూడా చేపట్టడం జరుగుతోంది.

## గొర్రెల పెంపకం

తెలంగాణ జిల్లాలలో సుమారు 129 లక్షల గొర్రెలు, 47 లక్షల మేకలు ఉన్నాయి. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన సుమారు 4.5 లక్షల గ్రామీణ కుటుంబాలు గొర్రెలు, మేకల పెంపకంలో ఉన్నాయి.

## కోళ్ల పరిశ్రమ అభివృద్ధి

తెలంగాణ రాష్ట్రంలో కోళ్ల పరిశ్రమ చాలా చైతన్యవంతమైన, దానితో పాటే అత్యంత శీఘ్రంగా పెరుగుతున్న విభాగం. కోళ్ల పరిశ్రమ రైతులకు ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇవ్వడంతో పాటు ప్రభుత్వ శాఖ, వివిధ రకాల వ్యాధులకు నిరోధకంగా టీకాలను తయారు చేయడానికీ, సరఫరా చేయడానికీ ప్రభుత్వ శాఖ కృషి చేస్తోంది. కోళ్ల పరిశ్రమ అభివృద్ధి పథకాలలో దిగువ తెలిపిన విభాగాలుంటాయి.

## రాష్ట్రంలోని కోళ్ల ఫారాలకు సాయం

"రాష్ట్ర కోళ్ల ఫారాలకు సాయం" అనే పథకం అమలులో ఉంది. 2008-09లో ప్రభుత్వ లైవ్‌స్టాక్ ఫారమ్, మామ్నూర్ మరియు వరంగల్ జిల్లాలో ఈ పథకం అమలు జరిగింది. వనరాజ / గ్రామప్రియ మల్టిప్లికేషన్ ఫారమ్ అండ్ హాచరీ లను నెలకొల్పి, కోడి పిల్లలను సరఫరా చేయడం జరిగింది. వనరాజ / గ్రామప్రియ కోళ్ల నిర్వహణ సభ్యుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి, పథకం ప్రయోజనాల పంపిణీకి కూడా అవసరమైన ఏర్పాట్లు జరిగాయి. క్షేత్రంలో ఈ ఫారమ్ 2,39,985 కోడిపిల్లలను ఉత్పత్తి చేసి, సరఫరా చేసింది. పెరటిలో కోళ్ల పెంపకం సాగించడంలో 22,292 మంది రైతులకు శిక్షణ ఇచ్చింది.

## రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై)

కేంద్ర సహాయంతో రాష్ట్రంలో అమలవుతున్న పథకం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై). 2014-15 సంవత్సరంలో జీవోత్పత్తుల రంగం నుంచి మొత్తం మీద 8 శాతం వార్షిక వృద్ధి రేటును సాధించడం ఈ పథకం లక్ష్యం. నిరంతరమైన రెండేళ్ల ఆడ దూడల దాణా సబ్సిడీ కార్యక్రమం ("సునందిని") ఈ ప్రాజెక్టులో భాగం. జాతి ఆడదూడల వివరాలను ఈ ప్రాజెక్టులో నమోదు చేసుకుని, దూడ మేత, దూడ ఆరోగ్య సంరక్షణ, బీమాలను 2013-14లో ఏడాది పాటు కల్పించడం జరిగింది. తిరిగి 2014-15లో, అప్పటికే నమోదై ఉన్న ఆడ దూడలకు రెండో ఏడాదిలో దూడ మేతను సమకూర్చడం జరిగింది. ఈ ప్రాజెక్టు అమలుతో దూడల మరణాల స్థాయి బాగా తగ్గుముఖం పట్టింది. త్వరగా ఎదకు రావడం, పాల ఉత్పత్తి పెరుగుదల, పునరుత్పాదక సాధనంగా వినియోగం, ఆదాయం ఉత్పత్తిలో పెంపు మొదలైన లక్ష్యాల మీద మంచి ప్రభావం చూపింది.

ఈ ఫలితాల గురించి రైతుల హృదయాలకు హత్తుకునేలా చెప్పడానికి, నమోదైన దూడలతో క్రమపద్ధతిలో ఊరేగింపులను నిర్వహించడం జరిగింది.

## దూడల ఊరేగింపు



## ప్రాజెక్టు ప్రభావం

**దూడల మరణాల తగ్గుదల:** సమతుల్యమైన రీతిలో దూడల మేతని, ఆరోగ్య సంరక్షణను అందించడం వల్ల ఆవుదూడల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడ్డాయి. దూడల మరణాల స్థాయి తగ్గింది.

**త్వరగా ఎదకు రావడం :** ఆడ దూడల చేత పోషకాలు గల అనుబంధపు మేతను తినిపించిన కారణంగా అవి త్వరగా ఎదకట్టడానికి దోహదం చేసింది. తద్వారా మొదటి దూడ పుట్టే వయసు తగ్గింది. తద్వారా అదనంగా మరొక దూడను ఈనడానికి దోహదం జరిగింది.

**బలహీనమైన వాటి స్థానంలో భర్తీ :** మంచి పాడి పశువుల మందను, జాతి ఆవులనూ ఉత్పత్తి చేయడానికి ఉద్దేశించిన ప్రయత్నంలో, పాత వాటి స్థానే పోషించిన ఆవులను ఉపయోగిస్తారు.

**పాల ఉత్పత్తి పెంపు:** ఆడదూడలను సారవంతమైన ఆహారంతో మేపడం, వాటి ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్త వహించడం కారణంగా అవి చూడికట్టే వయసు వచ్చే నాటికి వాటి పాల ఉత్పత్తి ఇతోధికమవుతోంది.

**ఆదాయంలో అభివృద్ధి :** త్వరగా ఎదకు రావడం వంటి కారణాల వల్ల దారిద్ర్య రేఖ కింద ఉన్న రైతులకు అదనపు పాల ఉత్పత్తి ఆదాయాన్ని పెంచుతోంది.

## మత్స్య సంపద

వేగంగా వృద్ధి చెందుతున్న రంగాలలో మత్స్య విభాగం ఒకటి. స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జి.ఎస్.డి.పి)కి దోహదం చేస్తున్న, అదే సమయంలో ఆదాయాన్నివ్వడం ద్వారా ఉపాధి కల్పిస్తున్న రంగమిది. 2014-15లో వర్తమాన ధరల వద్ద, రాష్ట్ర జి.ఎస్.డి.పిలో 0.6 శాతమూ, వ్యవసాయ రంగం నుంచి సమకూరే స్థూల రాష్ట్రోత్పత్తిలో 3.47 శాతమూ మత్స్య రంగం నుంచే అందుతాయి.. అభివృద్ధి నిలదొక్కుకోగలిగేలా మత్స్య ఉత్పత్తిని పెంచాలనీ, ఉత్పాదకతను పెంచాలనీ, వాటికి అవసరమైన పునాదిని నిర్మించాలనీ, అందుబాటులో ఉన్న అన్ని వనరులనూ బాగా ఉపయోగించుకోవాలనీ మత్స్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఆహార భద్రతకు, పోషణకు, ఆరోగ్యానికి, గ్రామీణ ప్రజల జీవనోపాధి భద్రతకూ, చేపలు పట్టే వారి సంక్షేమానికీ ఈ రంగం గణనీయంగా తోడ్పడుతోంది.

రాష్ట్రంలో మొత్తం 78 జలాశయాలున్నాయి. వీటిలో 53 జలాశయాలలో జలం వ్యాపించిన విస్తీర్ణం 1,000 హెక్టార్ల లోపు కాగా, 1000, 5000 హెక్టార్ల మధ్య జల ఉపరితల విస్తీర్ణం కలిగిన జలాశయాలు 17. ఎనిమిది శాతం జలాశయాలలో జల వ్యాప్తి విస్తీర్ణం 5000 హెక్టార్లు పైబడింది. రాష్ట్రంలోని మొత్తం 35,031 చెరువులలో 600కి పైగా ఉన్న జిల్లాలు వరంగల్, మెదక్, కరీం నగర్, మహబూబ్ నగర్‌లు. ఆ ప్రకారం చూస్తే చెరువులు, జలాశయాల ద్వారా మత్స్యాభివృద్ధి అవకాశాలు అత్యున్నతంగా ఉన్నవి వరంగల్, మహబూబ్ నగర్, కరీం నగర్, మెదక్ జిల్లాలు.

2014-15లో తెలంగాణలో 2.92 లక్షల టన్నుల చేపలను, రొయ్యలను ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం కాగా, 2014 డిసెంబర్ నాటికి 1.69 లక్షల టన్నులను ఉత్పత్తి చేయడం జరిగింది. 2015-16 సంవత్సరంలో చేపలు, రొయ్యల ఉత్పత్తిని 3.21 లక్షల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది.

హెక్టారు ఉపరితలం కలిగిన చెరువులో సగటు ఉత్పాదకత 300 నుంచి 400 కిలోలు. జలాశయాలలో హెక్టారు జల విస్తీర్ణంలో వాస్తవ ఉత్పాదకతా అవకాశం 150 కిలోల వరకు ఉన్నప్పటికీ, వాస్తవంలో అందుబాటులో ఉన్న సదుపాయాలతో 30 కిలోల చేపలను మాత్రమే పట్టగలుగుతున్నారు. కాబట్టి చెరువులు, జలాశయాలలో మత్స్య ఉత్పాదకతను పెంచడానికి మరింత శ్రద్ధ చూపించాల్సిన అవసరముంది.

చెరువులు, జలాశయాలలో చేపలు పట్టడంతో పోలిస్తే సాగు ద్వారా మత్స్య సంపదను పెంచే విధానం తెలంగాణలో అంతగా అభివృద్ధి కాలేదు. యాక్వా కల్చర్ కిందకు వచ్చే చేపల చెరువులలో ఎక్కువ భాగం ఖమ్మం జిల్లాలో కేంద్రీకృతమై ఉన్నాయి. మహబూబ్‌నగర్, నల్గొండ, కరీం నగర్, ఆదిలాబాద్ జిల్లాలు రొయ్యల సాగుని చేపట్టాయి.

చేపలు పట్టే వృత్తిలో ఉన్న వారు రాష్ట్రంలో 19.04 లక్షల మంది ఉన్నారు. ఈ వృత్తిలో ఉన్న వారిలో ఎక్కువ భాగం వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ, కరీం నగర్ జిల్లాలలో ఉన్నారు. కేంద్రం సహాయంతో ఏర్పాటైన అనేక కార్యక్రమాలను వీరికోసం రాష్ట్రం అమలుచేస్తోంది. వీటిలో సమాచార పునాదిని, అనుసంధానాన్ని పటిష్ఠం చేసుకోవడం, మంచి నీటి చేపల పెంపకాన్ని నమోదు చేసుకోవడం, మత్స్యకారులకు సామూహిక ప్రమాద బీమా, చిరు చేపలు, మంచు పెట్టెల సరఫరా రాష్ట్ర ప్రణాళిక కింద జరుగుతున్నాయి. ఇంకా ఎస్.టిలకు చెందిన మత్స్యకారులకు ముడి వనరుల సరఫరా, పడవల, వలల సరఫరా, ఎస్.టిల చేత చేపల / రొయ్యల చెరువులు నెలకొల్పడం, ఎస్.టిల చేత చేప విత్తుల ఉత్పత్తి కేంద్రాలు పెట్టించడం, మోపెడ్‌లు, సామాను ఆటోలతో విక్రయ విభాగాలను పెట్టించడం వంటివి ఈ కార్యక్రమంలో భాగాలు.

## మత్స్య సంపద అభివృద్ధి

మత్స్యాభివృద్ధి కోసం రూ. 3,856.72 లక్షల వ్యయంతో ప్రభుత్వం ఒక సమగ్ర ప్రాజెక్టు / పథకాన్ని ప్రతిపాదించింది. ఉత్పాదకతను పెంచడం, పంట అనంతర నష్టాలను తగ్గించడం, జీవనోపాధి బలాన్ని పెంచడం, సహజ వనరులు, నిర్మిత వనరులు రెండింటికి చెందిన మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయడం ఈ ప్రాజెక్టు ఉద్దేశ్యం. మౌలిక సదుపాయాలు కేంద్రబిందువుగా రూపొందించిన పథకాలు, లబ్ధిదారులు కేంద్రంగా రూపుదిద్దిన పథకాలు / కార్యక్రమాలు, ఎస్.సి / ఎస్.టి మత్స్యకారులతో సహా అందరు మత్స్య కారులకూ సమష్టి ఆస్తులను నిర్మించడం ఈ ప్రాజెక్టులోని ప్రతిపాదనలు.

## మత్స్యకారిణుల స్వయం సహాయ బృందాలు - మత్స్య మిత్ర బృందాలు (ఎం.ఎం.జి.ఎస్)

మత్స్య మిత్ర బృందాలు (ఎం.ఎం.జిలు)గా వ్యవహరించే మత్స్యకారిణుల స్వయం సహాయ బృందాలను రాష్ట్రంలో నెలకొల్పడం జరిగింది. 1,068 మంది సభ్యులతో 383 మత్స్యకారిణుల సహకార సంఘాలను నెలకొల్పడం జరిగింది. మత్స్యకారిణుల సహకార సంఘాల పరిధిలోనే ఎం.ఎం.జిలను నిర్వహించడం జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికి 8,700 మంది మత్స్యకారిణులతో 868 ఎం.ఎం.జిలను నిర్వహించడం జరిగింది. ఈ ఎం.ఎం.జిలు తమ సూక్ష్మ వ్యాపార ప్రణాళికను సిద్ధం చేసుకుని, తమ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచే ఆదాయోత్పత్తి పథకాలను చేపడతాయి. ముఖ్యమంత్రి ప్యాకేజీ కింద, ఆర్.కె.వి.వై కింద వీరి బృందాలకు రివాల్వింగ్ ఫండ్‌ని అందజేస్తారు. 10 నుంచి 15 మంది మహిళలతో ఏర్పడే బృందం ఒక్కంటికి రూ. 25,000 చొప్పున అందజేస్తారు.

తెలంగాణలో ఇప్పటికి 550 ఎం.ఎం.జిలకు రూ. 138.65 లక్షల ఆర్థిక సహాయాన్ని ఇవ్వడం జరిగింది.

## పట్టు పరిశ్రమ

పట్టు వస్త్రాల నేతకు ప్రసిద్ధి చెందిన పోచంపల్లి, కొత్తకోట, నారాయణ పేట్, గద్వాల్ మొదలైన ప్రాంతాలు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. పట్టు వస్త్రాలను నేసే ఎంతో మంది నిపుణులు ఈ ప్రాంతాలలో ఉన్నారు. వీరి పుణ్యమా అని పట్టు దారానికి ఈ ప్రాంతంలో వినియోగం బాగా ఉంది. ఇక్కడ మల్బరీ పట్టు ఉత్పత్తినే కాక, టస్సార్ సిల్కు ఉత్పత్తిని కూడా మరింత పెంచే అవకాశముంది.

తెలంగాణ రాష్ట్రంలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం వివిధ పథకాల కింద ప్రభుత్వ శాఖ వేర్వేరు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అంతర్జాతీయ గ్రేడ్‌కి చెందిన బివోల్టిన్ పట్టు ఉత్పత్తిని మెరుగుపరచడం, పట్టు వస్త్రాల గిరాకీ - సరఫరాల మధ్య అంతరాన్ని భర్తీ చేయడం, సాంకేతిక సహాయ కేంద్రాల ద్వారా సాంకేతిక నైపుణ్యాన్ని రైతులకు అందించడం, మల్బరీలో అధికోత్పత్తి రకాలను సిద్ధం చేయడం, నీటిని పొదుపుగా ఉపయోగించడం, పట్టు పురుగుల సరఫరా కోసం పెంపకం కేంద్రాలను ప్రైవేట్ రంగంలో ప్రోత్సహించడం, పట్టు పురుగుల పెంపకం కోసం విడిగా షెడ్లు నిర్మించుకోడానికి ప్రోత్సహించి, పట్టు గూళ్ల విపణుల ద్వారా రైతులకు విక్రయావకాశాలను

కల్పించడం ఈ కేంద్రాల ధ్యేయం.

## ఉత్ప్రేరకాభివృద్ధి కార్యక్రమం

అంతర్జాతీయ స్థాయి 2 ఏ, అంతకు మించిన గ్రేడ్‌ల బివోల్టిన్ పట్టును తెలంగాణలో ఉత్పత్తి చేయడానికి భారత ప్రభుత్వ నిర్వహణలో బెంగుళూరులో నడిచే కేంద్ర సిల్కు బోర్డుతో సమన్వయంగా ఉత్ప్రేరకాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది తెలంగాణ ప్రభుత్వం. ఈ పథకంలో పాల్గొనే వారికి క్షేత్ర, క్షేత్రేతర కార్యకలాపాల అవసరాల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు. 2014-15 సంవత్సరంలో సి.డి.పి పథకాలను అమలు చేసే నిమిత్తం కేంద్ర వాటా సబ్సిడీ రూ. 543.63 కోట్లు, రాష్ట్రం జత చేసే వాటా రూ. 383.15 లక్షలను విడుదల చేయడం జరిగింది.

## పట్టు పురుగులు, పట్టు దారం ఉత్పత్తిదారులకు ఉత్పత్తికి అనుగుణమైన ప్రోత్సాహకం:

ఈ పథకం కింద సి.బి పట్టుగూళ్ల ఉత్పత్తి కిలో ఒక్కంటికి రూ. 20/-లను, బి.వి పట్టుగూళ్లకు కిలోకు రూ. 50/- ఉత్పత్తిదారునికి ప్రోత్సాహకంగా ఇస్తారు. కుటీర పరిశ్రమలో చరఖా మీద ఉత్పత్తి చేసిన పట్టుకి కిలోకి రూ. 35, మల్టీ ఎండ్ మీద ఉత్పత్తి చేసిన సి.బి పట్టుకి కిలోకి రూ. 80/-, మల్టీ ఎండ్ మీద లేదా ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాల మీద ఉత్పత్తి చేసిన అంతర్జాతీయ శ్రేణి 2ఏ గ్రేడు, అంతకు మించిన నాణ్యతల బి.వి పట్టుకి కిలోకి రూ. 150 ప్రోత్సాహకంగా ఇస్తారు. 2014-15లో పట్టుగూళ్ల దారాల ఉత్పత్తికి రూ. 108.60 లక్షలు, పట్టు ఉత్పత్తికి రూ. 35.16 లక్షలు ప్రోత్సాహకంగా విడుదల చేయడం జరిగింది.

## పట్టు నేతపని వారికి నూలు మద్దతు ధర

ప్రస్తుతము అమలులో ఉన్న ప్రణాళికా పథకమిది. సాంప్రదాయకమైన పట్టు చీరలు, ధోవతులు, దక్షిణ భారతదేశానికి చెందిన అనేక రకాల వస్త్రాలు తెలంగాణలో ఉత్పత్తి అవుతున్నాయి. సాంప్రదాయకమైన పట్టు నేత తెలంగాణలో వారసత్వంగా వస్తోంది. ముడి పట్టు, మెలి నూలు ధరలలో విపరీతమైన ఆటుపోట్ల కారణంగా పేద నేత పనివారు తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఉంటారు. వీటి మధ్య సాంప్రదాయకమైన చేనేత పట్టు కార్మికులు నిలదొక్కుకునేలా చూడవలసిన కీలకమైన అగత్యముంది. చేనేతలో పట్టు వస్త్రం ఉత్పత్తి ఖర్చు పెరగడం వల్ల సంప్రదాయకమైన పట్టు చేనేత కార్మికులు తమ వృత్తిని కొనసాగించలేకపోతున్నారు. చేనేత రంగాన్ని పరిరక్షించడానికి గానూ నేత పనివారికి పట్టు నూలు మద్దతు కింద 4 కిలోల పట్టు నూలును కొనుగోలు చేసే నిమిత్తం కుటుంబానికి నెలకు రూ. 600ల వంతున ప్రోత్సాహకాన్ని సమకూర్చడం జరిగింది. నూలు మద్దతు పథకం కింద 2014-15 సంవత్సరంలో రూ. 246.252 లక్షలను విడుదల చేయడం జరిగింది.

## టస్సార్ కల్చర్

టస్సార్ పట్టు గూళ్ల ఉత్పత్తిలో తెలంగాణ, దేశంలో నాలుగో వరుసలో ఉంది. ఆదిలాబాద్, కరీం నగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో గిరిజనులు టస్సార్ పట్టుని ఉత్పత్తి చేసే టి. టొమెంటోసా, టి. అర్జున పూలచెట్ల అరణ్యం 8,200 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది.

లోతట్టు అటవీ ప్రాంతాల గిరిజనులకు టస్సార్ పట్టు పరిశ్రమ ఒక ప్రధానమైన జీవనోపాధి. ఈ అటవీ ప్రాంతాలలో ఆహార పంటల తోటలు పుష్కలం. పట్టు పురుగు (యాంథిరియా మైలిట్టా డ్రూరీ)ని పెంచడానికి సంబంధించిన అన్ని కార్యకలాపాలూ, టస్సార్ పట్టు గూళ్లను పండించడం, పట్టు గూళ్ల నుంచి టస్సార్ పట్టు నూలు ఉత్పత్తి, టస్సార్ నూలుతో వస్త్రాన్ని నేయడం అన్నీ టస్సార్ కల్చర్‌లో భాగాలు. పట్టు పురుగులను పెంచే వారు, నూలు ఉత్పత్తిదారులు, నేతపనివారు ఈ రంగంలో ప్రధాన ఉత్పత్తిదారులు.

ఈ ప్రాథమిక రంగంలో కనబడుతున్న నికరమైన వృద్ధి అనేక విజయాల మిశ్రమంగా కళ్ళకు కడుతుంది. నిజానికి రెండో అంచెలో నిలిచే పారిశ్రామిక రంగంలో భాగమైన వస్తూత్పత్తి రంగంలో ఎంతగానో ఎదురుచూస్తున్న ఊపును ఇచ్చేది ఈ రంగమే.

# 2.4 అటవీ ప్రాంతం విస్తరణ

*"అడవులు మన భూమికి ఊపిరితిత్తులు. అవి గాలిని శుభ్రపరుస్తూ, మన ప్రజానీకానికి సరికొత్త జవజీవాలను ఇస్తాయి." - ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్*

మానవుడి జీవనాధారాలు పీల్చే గాలి, తాగే నీరుల నాణ్యతను కాపాడే పర్యావరణాన్ని పరిరక్షించడంలో అడవులు ఎంతో కీలకమైనవి. గ్రామీణ పేదల జీవనోపాధి కార్యకలాపాలకు మద్దతుగా నిలవడంలో అడవులు ముఖ్యపాత్రను పోషిస్తాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతాన్ని అందిస్తాయి. భూతాపం ప్రమాదాన్ని తగ్గించడానికి అడవులు పెన్నిధి. ఇంకా భూసార పరిరక్షణకు, ప్రమాదంలో ఉన్న వన్యప్రాణి జాతులను కాపాడడానికి అడవులే శరణ్యం. అటవీ సంపద, కలప కలసి 2014-15లో రాష్ట్ర స్థూలోత్పత్తి (జి.ఎస్.డి.పి)లో వర్తమాన ధరలలో 0.9 శాతం, మొత్తం వ్యవసాయ రంగ జి.ఎస్.డి.పిలో 5.02 శాతం ఉంటాయి. అటవీ రంగం యొక్క కీలకమైన ఆశయం జీవనోపాధితో సమన్వయం చేసే రీతిలో పచ్చదనాన్ని పెంచడం.

1,14,865 చదరపు కి.మీ.ల భౌగోళిక విస్తీర్ణం కలిగిన తెలంగాణ రాష్ట్రం, సామాజిక వనాలతో కలిపి, 21,024 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం గల అడవితో, అంటే 25.46 శాతం హరిత విస్తీర్ణంతో - భారతదేశంలో 12వ స్థానంలో ఉంది. ఈ 29,242 చదరపు కిలోమీటర్ల హరిత విస్తీర్ణంలో రిజర్వ్‌డ్ అటవీ ప్రాంతం 21,024 చదరపు కిలోమీటర్లు. రక్షిత అడవులు 7,468 చదరపు కిలోమీటర్లు. తక్కిన 750 చదరపు కిలోమీటర్లు అవర్గీకృత భూభాగం. 2014 డిసెంబర్ వరకు అటవీ ఉత్పత్తుల నుంచి రాష్ట్రానికి లభించిన మొత్తం రాబడి రూ. 54.16 కోట్లు.

తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల వారీగా భౌగోళిక విస్తీర్ణం, ఆయా జిల్లాలలోని అటవీ విస్తీర్ణాలను దిగువ ఇచ్చిన గణాంక చిత్రపటం తెలియజేస్తుంది.




● ఖమ్మం జిల్లా పూర్తి భాగాన్ని కలిపి

2,939 రకాల వృక్ష జాతులతో, 365 రకాల పక్షి జాతులతో, 103 రకాల క్షీరదాల జాతులతో, 28 రకాల సరీసృపాలు, 21 రకాల ఉభయచర జాతులతో, పెద్ద సంఖ్యలో ఉన్న అకశేరుక (వెన్నెముక లేని) జంతుజాలంతో వైవిధ్యభరితమైన రీతిలో చెట్టూచేమా, గొడ్డూగోదా ప్రకృతి ఇచ్చిన వరంగా కలిగిన రాష్ట్రం తెలంగాణ. అంతరించిపోతున్న ముఖ్యమైన జంతుజాతులలో రాష్ట్రంలో ఉన్నవి పెద్ద పులులు, చిరుత పులులు, అడవి దున్నలు, నాలుగు కొమ్ముల జింకలు, కృష్ణ జింకలు, మంచి నీటి మొసళ్లు మొదలైనవి. నిజామాబాద్ నుంచి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్‌ల మీదుగా ఖమ్మం జిల్లా వరకు గోదావరి నదీ తీరం వెంబడి ఉన్న దట్టమైన టేకు తోటలు రాష్ట్ర అడవులకు మరొక వరం.

టేకుకి తోడు, ఏటా ఆకులు రాల్చే జాతులకు చెందిన నల్లమద్ది, ఏగిస, రోజ్‌వుడ్, నరేపా, వెదురు మొదలైన అనేక రకాల వృక్షాలకు నిలయం తెలంగాణ అడవులు.

సవరించిన 2002 రాష్ట్ర అటవీ విధానం, విజన్ 2020ని అనుసరించి, ఇప్పుడున్న అడవులను పరిరక్షించడానికి, మరింత అడవిని అభివృద్ధి చేయడానికి, ఉత్పాదకతను మెరుగుపరచడానికి, ఆర్థికపరమైన విలువను పెంచడానికి రాష్ట్ర అటవీ శాఖ వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తోంది. ఈ కార్యక్రమాల ప్రధాన ఆశయాలు: ప్రజలతో కలసి అటవీ నిర్వహణ, కేంద్రం ఆర్థిక సహాయంతో జాతీయ వనపోషణ కార్యక్రమం (ఎన్.ఏ.పి), ఆర్.ఐ.డి.ఎఫ్ ప్రాజెక్టులు, భూసారం-తేమ పరిరక్షణ, సామాజిక వనపోషణ, వన్యప్రాణి నిర్వహణ, మానవ వనరుల అభివృద్ధి, పలుచగా ఉన్న అడవులను దట్టంగా అభివృద్ధి చేయడం, గ్రామీణ పేదరికాన్ని తగ్గించడం, అటవీ ప్రాంతాలలో కొండవాలు కందకాలు, రాతి ఆనకట్టలు, ఇంకుడు చెరువులు మొదలైన వాటి ఏర్పాటు. వీటిలో తెలిపిన నిర్మాణాలు భూగర్భ జలాలను భర్తీ చేయడానికి, తద్వారా అడవులలో చెట్టూ చేమా పెంచడానికి, ఇరుగుపొరుగు ప్రాంతాలలో వ్యవసాయ బాగోగులను నిలకడగా ఉండేలా చేయడం.

ఇటీవలి ధోరణులను దృష్టిలో పెట్టుకుని ప్రయోగాలు చేయడానికి, తోటలను వేసే సులభోపాయాలను, నర్సరీలను మెరుగుపరచడానికి, హరిత వ్యాప్తి ప్రబోధానికి, విత్తనాల ఉత్పత్తికి, ఇంకా వనాభివృద్ధి సంస్కృతికి చెందిన అనేక కార్యకలాపాలకు అటవీ శాఖ 'వన పరిశోధన'కు ప్రాధాన్యమిస్తోంది.

అడవులలో చెట్టూచేమా, వృక్ష కవచ సాంద్రతల పర్యవేక్షణ, అడవులలో అగ్ని ప్రమాదం కలిగిన మండలాల గుర్తింపు, నమోదు, స్థల యోగ్యతల వారీగా వివిధ అటవీ ప్రాంతాల నమోదు, అటవీ సరిహద్దుల గుర్తింపు, మార్పుచేర్పులు, అటవీ వనరుల నమోదు మొదలైనవి జి.ఐ.ఎస్‌తో సహా ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అటవీ శాఖ చేపడుతున్న కొన్ని ముఖ్యమైన, పెద్ద కార్యకలాపాలు.

దాదాపు అన్ని కార్యక్రమాలు / అటవీ శాఖ పథకాలలో స్థానిక ప్రజలను అటవీ శాఖ నిమగ్నం చేస్తోంది. వన సంరక్షణ సమితి (వి.ఎస్.ఎస్)లు, పర్యావరణ అభివృద్ధి కమిటీ (ఇ.డి.సి)ల సేవలను రక్షిత ప్రాంతాల అభివృద్ధిలోనూ, జల కూడలి (వాటర్ షెడ్) అభివృద్ధి కమిటీలు మొదలైన వాటి సేవలను రివర్ వ్యాలీ ప్రాజెక్టులోనూ స్వీకరిస్తోంది. ఒక ప్రాంతం / వన్యప్రాణి అటవీ డివిజన్‌ల పరిధిలో అన్ని వి.ఎస్.ఎస్‌లనూ కలిపిన సమాఖ్యలే సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద అటవీ అభివృద్ధి ఏజన్సీలవుతాయి. ఇవి రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఎస్.ఎఫ్.డి.ఏ), డివిజన్ స్థాయిలో అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్.డి.ఏ), గ్రామ స్థాయిలో వన సంరక్షణ సమితి (వి.ఎస్.ఎస్) అనే మూడంచెల వ్యవస్థలో ఈ సమాఖ్యలు పనిచేస్తాయి.

## సామాజిక వనాలు

పర్యావరణను కాపాడడానికి, మెరుగుపరచడానికి, లాభదాయకమైన ఉపాధిని కల్పించడానికి రిజర్వ్ అడవుల వెలుపల వృక్ష సంపదను పెంచడానికి ప్రజలతో, రైతులతో పెద్దయెత్తున ప్రజాఉద్యమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. సామాజిక వనపోషణలోని ప్రధానమైన భాగాలు మొలకల పంపిణీ, ఊరుమ్మడి భూములలో, సంస్థలలో, రోడ్డు పక్క ఉన్న ఖాళీ స్థలాలలో తోటలు వేయడం.

ఉచిత పంపిణీ, బహిరంగ స్థలాలలో పెంచే నిమిత్తం సిద్ధం చేసిన మొక్క జాతులు వేప, పొంగామియా, మేడి, మర్రి, రావి, గంగరావి, ఉసిరి, సీతాఫలం, బాదం, మామిడి, టేకు, సరుగుడు, నీలగిరి మొదలైనవి. రిజర్వ్‌డ్ అటవీ ప్రాంతాలలోనూ, అడవి వెలుపల కూడా అటవీ కార్యకలాపాలన్నీ ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కింద ఏకీకృతమవుతాయి.

2014-15 సంవత్సరంలో మిక్స్‌డ్ ప్లాంటేషన్స్ పథకం కింద పెంచిన, పంపిణీ చేసిన నారు రోడ్ల పక్కన వేయడానికి ఉద్దేశించి 2014 డిసెంబర్ వరకు పెంచిన మొక్కలను, అలాగే దట్టంగా వేయడానికి ఉద్దేశించి పెంచిన మొక్కలకు దిగువ తెలిపిన విధంగా ఉన్నాయి :

## తెలంగాణకు హరిత హారం

రాష్ట్ర మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో ఇప్పుడున్న 25.16 శాతం నుంచి హరిత కవచాన్ని 33 శాతానికి పెంచాలని ఆకాంక్షిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అగ్రగామి కార్యక్రమం "తెలంగాణకు హరిత హారం" అక్రమ రవాణా, దురాక్రమణలు, అగ్ని ప్రమాదాలు. మేత వంటి వాటి నుంచి అడవులను మరింత సమర్థంగా రక్షించడం ద్వారా, అడవుల లోపల, బయట వాటర్ షెడ్‌ల విధానాలతో భూసారం, తేమల పరిరక్షణ చర్యలు మొదలైన వాటితో దెబ్బతిన్న అడవులను పునరుజ్జీవనం గావించడానికి బహుముఖ కృషి సాగించడం ఈ పథకం లక్ష్యం.

పైన తెలిపిన చర్యలే కాక, అటవీ ప్రాంతాల వెలుపల కూడా భారీ స్థాయిలో చెట్లను పెంచడం ద్వారా సామాజిక వనపోషణకు కొత్త ఊపునివ్వాలని తలపెట్టారు. పెద్ద రోడ్ల పక్కన, నది ఒడ్డున, కాలువల ఒడ్డున, బీడుపడిన కొండల మీద, చెరువు కట్టల మీద, నదీ తీరాలలో, సంస్థల ఆవరణలలో, ధార్మిక ప్రదేశాలలో, గృహ వాడలలో ఖాళీగా వదలివేసిన ఊరుమ్మడి స్థలాలలో ఈ విధమైన వనపోషణను చేపట్టాలని తలపెట్టారు. సంబంధితులు అందరినీ కలుపుకొనిపోవాలనే వైఖరితోనే హరిత వృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. ప్రభుత్వ విధానాలు, చట్టం, పరిపాలనలకు సంబంధించిన వ్యవహారాలలో అవసరంగా ఉన్న సంస్కరణలు ఈ దృక్పథానికి సాయపడగలవు.

దీనిలో భాగంగా, వచ్చే మూడేళ్లలో 230 కోట్ల మొక్కలను రాష్ట్రవ్యాప్తంగా నాటాలని తలపెట్టారు. వీటిలో 130 కోట్ల మొక్కలను నోటిఫై అయిన అటవీ ప్రాంతాలకు వెలుపలే నాటించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హెచ్.ఎం.డి.ఏ పరిధిలో 10 కోట్ల మొక్కలను, తక్కిన 120 కోట్ల మొక్కలను రాష్ట్రంలో తక్కిన ప్రాంతాలలోను నాటాలని సంకల్పించారు. నోటిఫై చేసిన అడవులలో ముమ్మర అటవీ రక్షణ కార్యకలాపాల ద్వారా అడవుల లోపల 100 కోట్ల వృక్షాలను పునరుజ్జీవింపజేసే కార్యక్రమాన్ని కూడా తలపెట్టారు.

ప్రభుత్వం చేపట్టిన కొత్త ప్రయత్నం "మన ఊరు - మన ప్రణాళిక" నుంచి లభించిన పరిశీలనల ఆధారంగా నర్సరీలు, తోట చెట్ల మొక్కలకు అనువైన తావులను గుర్తించడానికి 'తెలంగాణకు హరిత హారం' కార్యక్రమం కింద ముమ్మరమైన కసరత్తు జరిగింది.

అటవీ శాఖ, డి.డబ్ల్యు.ఎం.ఏ, వ్యవసాయం, ఉద్యానవనాలు, గిరిజన సంక్షేమం (మొదలైన) సంస్థలను కూడా నిమగ్నం చేసి గ్రామాల వారీగా మొత్తం 3,888 నర్సరీలను గుర్తించడం జరిగింది. 2015 సంవత్సరంలో మొక్కలను నాటే సీజన్ వచ్చే సరికి 40 కోట్ల మొక్కలను సిద్ధం చేయాలని తలపెట్టారు. ఇంకా, బాగా ఎత్తుగా ఎదిగే వృక్షాలకు చెందిన మరో 40 కోట్ల మొక్కలను 2016 వనపోషణ కోసం లక్ష్యంగా పెట్టుకున్నారు.



*హరిత హారం - నర్సరీ*

## పరిహార వనపోషణ నిధి నిర్వహణ మరియు ప్రణాళికా ప్రాధికార సంస్థ

కాంపెన్సేటరీ అఫోర్‌స్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (కాంపా)ని భారత ప్రభుత్వ పర్యావరణ, అడవుల మంత్రిత్వ శాఖ నెలకొల్పింది. అటవీ భూములను అటవీయేతర ప్రయోజనాలకు మళ్లించినపుడు, ఆ నష్టాన్ని భర్తీ చేయడానికి వనపోషణ, వన పునరుజ్జీవన కార్యకలాపాలను అభివృద్ధి చేయడానికి ఈ సంస్థను ఉద్దేశించారు.

రాష్ట్రంలో 2009 నుంచి కాంపా కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. తెలంగాణలో 2009-10 నుంచి 2013-2014 వరకు వీటి కింద 233.125 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. 2014-2015 సంవత్సరానికి జరిగిన కేటాయింపు రూ. 101.95 కోట్లు కాగా, దీనిలో 2014 డిసెంబర్ వరకు జరిగిన ఖర్చు రూ. 45.11 కోట్లు.

## 2014-15లో తెలంగాణాలో కాంపా సాధించిన విజయాలు

- నికర వర్తమాన విలువ (ఎన్.పి.వి) భాగం కింద మొక్కలు నాటిన మొత్తం విస్తీర్ణం 2,695 హెక్టార్లు.
- 144 బేస్ క్యాంప్‌లు, 60 స్ట్రైక్ ఫోర్స్ దళాలు, 57 చెక్ పోస్టులు నెలకొల్పి, నిర్వహించడం జరుగుతోంది.
- 763 కిలోమీటర్ల మేర అగ్ని ప్రమాద నిఘా మార్గాలను నిర్ణయించి, ప్రతి ప్రమాదభరితమైన ఋతువులో 458 మంది చేత నిఘా వేయిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగే ఆస్కారమున్న మండలాలలో 19 (ఫైర్) వాచ్ టవర్లను నిర్మించబోతున్నారు.
- అటవీ బ్లాకుల చుట్టూ 5070 సరిహద్దు స్థంభాలను కట్టాలని ప్రతిపాదించారు.
- పట్టణ అటవీ బ్లాకుల చుట్టూ 6 కిలోమీటర్ల పొడవున రక్షణ గోడను నిర్మించాలని తలపెట్టారు.
- రంగంలో ముందు వరుసలో పనిచేసే సిబ్బందికి 44 అధికార నివాసాలను నిర్మించాలని తలపెట్టగా, వాటిలో 20 క్వార్టర్స్‌ల నిర్మాణం పూర్తయింది. కొందరు సిబ్బంది వాటిలో ఉంటున్నారు.

కాంపా కింద 2015లో మొక్కలు నాటడానికి సంబంధించి ఎన్.పి.వి కింద 5030 హెక్టార్లలో ముందస్తు కార్యకలాపాలను మొదలు పెట్టారు.

## తెలంగాణలో వన్యప్రాణి జీవవైవిధ్య పరిరక్షణ

సుసంపన్నమైన చెట్టూచేమా, పర్యావరణ వ్యవస్థలు తెలంగాణా రాష్ట్రానికి ప్రకృతి ఇచ్చిన వరం. రాష్ట్రంలో 2939 వృక్ష జాతులు, 365 పక్షి జాతులు, 103 క్షీరదాల జాతులు, 28 సర్ప జాతులు, పెద్ద సంఖ్యలో అకశేరుక జాతులు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నాయి. ప్రభుత్వ జీవవైవిధ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో ప్రభుత్వం 12 ప్రాంతాలను ఆరక్షిత ప్రాంతాలుగా ప్రకటించింది. వీటిలో 9 వన్యప్రాణి ఆశ్రయాలు, 3 జాతీయ వన్యప్రాణి నిలయాలు 5,692.48 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇది తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం అడవిలో 19.73 శాతం. ఆరక్షిత ప్రాంతాల అనుసంధాన గుచ్ఛంలో అంతరించిపోతున్న మంచి నీటి మొసళ్లకు (మార్ష్) నిలయమైన మంజీరా వన్యప్రాణి ఆశ్రయం, శివారామ్ వన్యప్రాణి ఆశ్రయాలకు చెందిన జలప్రదేశాలున్నాయి.

## టైగర్ ప్రాజెక్ట్

రాష్ట్రానికి రెండు టైగర్ రిజర్వ్‌లున్నాయి. వాటిలో ఒకటి నల్లమల కొండలలో మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలలో వ్యాపించి ఉన్న అమరాబాద్ టైగర్ రిజర్వ్. మరొకటి కవాల్ టైగర్ రిజర్వ్. ఇది మహారాష్ట్రలోని తడోబా అంథేరీ టైగర్ రిజర్వ్ వరకు చత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి టైగర్ రిజర్వ్ వరకు వ్యాపించిన అడవులతో కలసి ఉంది. పులులు కవాల్‌కు, తక్కిన రెండు టైగర్ రిజర్వ్‌లకూ మధ్య అటూయిటూ వలస వెళుతుంటాయి. కనుక, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ డివిజన్‌ల మీదుగా మూడు టైగర్ రిజర్వ్‌లనూ అనుసంధానం చేస్తూ కారిడార్‌లను అభివృద్ధి చేయడం అంతరించి పోతున్న పులి జాతులను కాపాడడానికి అత్యంత కీలకం.

## తెలంగాణ జీవ వైవిధ్య బోర్డు (టి.ఎస్.బి.డి.బి)

జీవ వైవిధ్యాన్ని కాపాడడానికి, మనగలిగేలా జీవవైవిధ్యాన్ని ఉపయోగించడానికి, జీవ వనరులను సంబంధితులందరి మధ్య న్యాయంగా, సమానంగా పంపిణీ చేసే లక్ష్యంతో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు (టి.ఎస్.బి.డి.బి) ఏర్పడింది. ఏటా మే 22వ తేదీన బయోడైవెర్సిటీ బోర్డు అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్నినిర్వహిస్తుంది. 170 జీవ వైవిధ్య నిర్వహణ కమిటీలను తెలంగాణలో ఏర్పాటు చేయడం జరిగింది. 10 జిల్లాలలో, 66 మండలాలలో, హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఈ కమిటీలు విస్తరించి ఉన్నాయి. జీవవైవిధ్యం గురించి ప్రజలలో అవగాహన కల్గించడానికి, జీవవైవిధ్య పర్యవసానాలపై అప్రమత్తం చేయడానికి ప్రతి జిల్లాలో జీవవైవిధ్య పార్కులను నెలకొల్పాలని జీవవైవిధ్య బోర్డు ప్రతిపాదించింది.

# అధ్యాయం 3

# సంక్షేమం మరియు సామాజిక అభివృద్ధి

# 3.1 సంక్షేమంపై ప్రత్యేకశ్రద్ధ

*"అధికారానికి ఒకే బాధ్యత ఉంది. అది ప్రజల సామాజిక సంక్షేమాన్ని సాధించడమే."*
*- బెంజామిన్ డిస్రాయలీ*

ప్రజా సంక్షేమాన్ని పెంచి పోషించడమే ప్రభుత్వ ముఖ్య అజెండా. దానికి అనుగుణంగానే తెలంగాణ ప్రభుత్వం ఏర్పడినది మొదలు, ప్రభుత్వం ఎన్నో చర్యలను తీసుకోవడం మొదలుపెట్టింది. ఈ విషయంలో రంగాలవారీ విహంగ వీక్షణను ఈ అధ్యాయం సమర్పిస్తోంది.

## ఆసరా పింఛన్లు

పేదలందరూ గౌరవప్రదంగా, భద్రతతో జీవించడానికి ప్రభుత్వం తన వంతు సంక్షేమ చర్యలు, సామాజిక భద్రతా వలయ వ్యూహంలో భాగంగా 'ఆసరా' పింఛన్‌లను ప్రవేశపెట్టింది.

సమాజంలో కష్టాలకు అత్యధికంగా ఆలవాలమైన వర్గాలను ఆదుకోడానికి, ముఖ్యంగా వృద్ధులు, బలహీనులు, హెచ్.ఐ.వి-ఎయిడ్స్‌లతో జీవిస్తున్న వారు, వితంతువులు, వృద్ధాప్యం మీద పడడంతో పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోయి, జీవనోపాధిని కోల్పోయిన నేతపని వారు, కల్లుగీత పనివారు సామాజిక భద్రతతో, హుందాగా జీవితం సాగడానికి తమకు రోజువారీగా అవసరమైన కనీస అవసరాలను తీర్చుకోవడంలో అండగా నిలవడానికి 'ఆసరా' పథకాన్ని ఉద్దేశించారు.

పాత పింఛన్ పథకంలో సామాజిక భద్రతా పింఛన్‌ల కింద ఇచ్చిన పింఛన్ మొత్తం చాలా తక్కువగా ఉండేది. అది అర్హుల కనీసావసరాలను తీర్చడానికి కూడా చాలేది కాదు. పాత పింఛన్ పథకంలో వృద్ధులకు, వితంతువులకు, కల్లుగీత పనివారికి, నేత పనివారికి, హెచ్.ఐ.వి ఎయిడ్స్ రోగులకు నెలకు రూ. 200/- వంతున, వికలాంగులకు నెలకు రూ. 500/- వంతున ఇచ్చేవారు.

నిరంతరంగా పెరుగుతున్న జీవన వ్యయం, ద్రవ్యోల్బణాలను తట్టుకునేలా చేయాలనే ఆలోచనతో తెలంగాణ ప్రభుత్వం 'ఆసరా' పేరుతో కొత్త పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీనిలో వృద్ధులకు, వితంతువులకు, నేత పనివారికి, కల్లు గీత పనివారికి నెలవారీ పింఛన్‌ని రూ. 200/- నుంచి రూ. 1,000/-కి పెంచారు. వికలాంగులకు రూ. 500/- నుంచి రూ. 1500/-కి పెంచారు.

గతాన్ని పరిశీలిస్తే, మునుపటి ప్రభుత్వం ఏడాదికి రూ. 835.63 కోట్లు ఖర్చు పెట్టగా, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం కొత్త ఆసరా పింఛన్ పథకం కింద పింఛన్‌ల చెల్లింపు కోసం సుమారుగా రూ. 4,000.00 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇది గతం మీద 478 శాతం పెంపు.

జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్.ఎస్.ఏ.పి) కింద భారత ప్రభుత్వం పింఛన్‌ల నిమిత్తం ఏడాదికి రూ. 264.84 కోట్లు సమకూరుస్తోంది. 80 ఏళ్ల లోపు వారికి భారత ప్రభుత్వ పింఛన్ స్కేలు నెలకు రూ. 200/-. 80 ఏళ్లు అంతకు పైబడిన వారికి రూ. 500/-. వితంతువులకు, వికలాంగులకు నెలకు రూ. 300/-. పైన పడిన ఖర్చు అంతటినీ రాష్ట్ర ప్రభుత్వం భరిస్తూ, భారత ప్రభుత్వ

నిధులతో జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్.ఎస్.ఏ.పి) కింద 8.15 లక్షల మంది పింఛనర్‌లకు ఆసరా కల్పించడం జరుగుతోంది. పాత పింఛన్ పథకం కింద, తిరిగి కొత్తగా ఆసరా పింఛన్ పథకం కింద పింఛనర్‌లకు చెల్లించిన మొత్తాలను, పింఛనర్ల సంఖ్యలను పట్టిక 22 తెలియజేస్తుంది.

**పట్టిక 22 : విభాగాల వారీగా ఆసరా పింఛన్లు**

| క్ర. సం. | విభాగం | పాత పింఛన్ పథకము | | | ఆసరా పింఛన్ పథకము | | |
|---|---|---|---|---|---|---|---|
| | | నెలవారీ ఫించన్ స్కేల్ (రూ.లలో) | లబ్ధిదారుల సంఖ్య | పంపిణీ చేసిన మొత్తం (రూ. లక్షలలో) | నెలవారీ ఫించన్ స్కేల్ (రూ.లలో) | లబ్ధిదారుల సంఖ్య | పంపిణీ చేసిన మొత్తం (రూ. లక్షలలో) |
| 1 | ఓ.ఏ.పి. | 200 | 15,28,233 | 36677.59 | 1000 | 13,38,370 | 160604.40 |
| 2 | వితంతువులు | 200 | 9,26,879 | 22245.10 | 1000 | 12,61,190 | 151342.80 |
| 3 | కల్లుగీత పనివారు | 200 | 27,345 | 656.28 | 1000 | 50,201 | 6024.12 |
| 4 | నేతపనివారు | 200 | 55,442 | 1330.61 | 1000 | 30,249 | 3629.88 |
| 5 | హెచ్.ఐ.వి. ఎయిడ్స్ రోగులు | 200 | 10,613 | 254.71 | 1000 | 10,788 | 1294.56 |
| 6 | వికలాంగులు | 500 | 3,73,316 | 22398.96 | 1500 | 3,84,202 | 69156.36 |
| | మొత్తము | | **2921828** | **83563.25** | | **3075000** | **392052.12** |

**పట్టిక 23 : జిల్లాల వారీగా, విభాగాల వారీగా లబ్ధిదారుల వ్యయమొత్తాల సమాచారం (ఫిబ్రవరి, 2015)**

| క్ర. సం. | జిల్లా | వృద్ధులు | | వికలాంగులు | | వితంతువులు | | నేతపనివారు | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | సంఖ్య | నెలకు పంపిణీ చేస్తున్న మొత్తం (రూ. లక్షలలో) | సంఖ్య | నెలకు పంపిణీ చేస్తున్న మొత్తం (రూ. లక్షలలో) | సంఖ్య | నెలకు పంపిణీ చేస్తున్న మొత్తం (రూ. లక్షలలో) | సంఖ్య | నెలకు పంపిణీ చేస్తున్న మొత్తం (రూ. లక్షలలో) |
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 1 | ఆదిలాబాద్ | 1,10,080 | 1,100.80 | 28,632 | 429.48 | 1,13,646 | 1,136.46 | 574 | 5.74 |
| 2 | హైదరాబాద్ | 42,665 | 426.65 | 20,425 | 306.38 | 67,614 | 676.14 | - | - |
| 3 | కరీంనగర్ | 1,89,020 | 1,890.20 | 63,748 | 956.22 | 1,27,362 | 1,273.62 | 8,239 | 82.39 |
| 4 | ఖమ్మం | 1,17,313 | 1,173.13 | 32,275 | 484.13 | 1,07,533 | 1,075.33 | 448 | 4.48 |
| 5 | మహబూబ్‌నగర్ | 1,81,906 | 1,819.06 | 47,181 | 707.72 | 1,87,636 | 1,876.36 | 5,603 | 56.03 |
| 6 | మెదక్ | 1,43,458 | 1,434.58 | 29,578 | 443.67 | 1,27,842 | 1,278.42 | 2,921 | 29.21 |
| 7 | నల్గొండ | 1,65,338 | 1,653.38 | 49,454 | 741.81 | 1,47,776 | 1,477.76 | 5,709 | 57.09 |
| 8 | నిజామాబాద్ | 1,08,583 | 1,085.83 | 28,934 | 434.01 | 1,01,996 | 1,019.96 | 827 | 8.27 |
| 9 | రంగారెడ్డి | 1,08,224 | 1,082.24 | 35,038 | 525.57 | 1,30,158 | 1,301.58 | 573 | 5.73 |
| 10 | వరంగల్ | 1,71,783 | 1,717.83 | 48,937 | 734.06 | 1,49,627 | 1,496.27 | 5,355 | 53.55 |
| | మొత్తము | **13,38,370** | **13,383.70** | **3,84,202** | **5,763.03** | **12,61,190** | **12,611.90** | **30,249** | **302.49** |

పట్టిక 23 : (కుడిభాగము)

| క్ర. సం. | జిల్లా | కల్లుగీత పనివారు | | ఎయిడ్స్ బాధితులకు ఫించన్‌లు | | పూర్తి మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|
| | | సంఖ్య | నెలకు పంపిణీ చేస్తున్న మొత్తం (రూ. లక్షలలో) | సంఖ్య | నెలకు పంపిణీ చేస్తున్న మొత్తం (రూ. లక్షలలో) | సంఖ్య | నెలకు పంపిణీ చేస్తున్న మొత్తం (రూ. లక్షలలో) |
| **1** | **2** | **11** | **12** | **13** | **14** | **15** | **16** |
| 1 | ఆదిలాబాద్ | 1003 | 10.03 | 707 | 7.07 | 254642 | 2689.58 |
| 2 | హైదరాబాద్ | 1 | 0.01 | 2274 | 22.74 | 132979 | 1431.915 |
| 3 | కరీంనగర్ | 10365 | 103.65 | 2282 | 22.82 | 401016 | 4328.9 |
| 4 | ఖమ్మం | 2413 | 24.13 | 1010 | 10.1 | 260992 | 2771.295 |
| 5 | మహబూబ్‌నగర్ | 2762 | 27.62 | 1468 | 14.68 | 426556 | 4501.465 |
| 6 | మెదక్ | 2394 | 23.94 | 203 | 2.03 | 306396 | 3211.85 |
| 7 | నల్గొండ | 17905 | 179.05 | 1101 | 11.01 | 387283 | 4120.1 |
| 8 | నిజామాబాద్ | 1233 | 12.33 | 866 | 8.66 | 242439 | 2569.06 |
| 9 | రంగారెడ్డి | 1631 | 16.31 | 296 | 2.96 | 275920 | 2934.39 |
| 10 | వరంగల్ | 10494 | 104.94 | 581 | 5.81 | 386777 | 4112.455 |
| | **మొత్తము** | **50201** | **502.01** | **10788** | **107.88** | **3075000** | **32671.01** |




ఆసరా పింఛన్ పంపిణీ

2015 నుంచి బీడీ కార్మికులలోని మహిళలకు కూడా ఆర్థిక సహాయాన్ని వర్తింపజేయాలని తెలంగాణ ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. ఈ సహాయం కింద 'సమగ్ర కుటుంబ సర్వే'లో సేకరించిన సమాచార నిధి మీద ఆధారపడి బీడీ కార్మిక మహిళకు రూ. 1000 చెల్లిస్తారు.

## ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన

అన్ని ప్రాధాన్య వర్గాలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉండడం ద్వారా అర్హులైన అన్ని కుటుంబాలకు ఆహార భద్రతా కార్డులను అందజేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. అర్హమైన కుటుంబాలకు సబ్సిడీ మీద లభించే ఆహార ధాన్యాలను, ఇతర నిత్యావసర సరకులను అందించడం దీని లక్ష్యం.

ఇప్పటికి కోటీ ఒక లక్ష దరఖాస్తులు అందగా, 99 లక్షల ఒక వెయ్యి దరఖాస్తుల మీద దర్యాప్తు పూర్తయింది. లబ్ధిదారులను గుర్తించడం కోసం తక్కిన దరఖాస్తుల తనిఖీ, దర్యాప్తు కూడా ముందుకు సాగుతోంది. ఇప్పటి వరకు ఆహార భద్రతా కార్డులకు అర్హులుగా 87.57 లక్షల మంది లబ్ధిదారులను గుర్తించారు. అంత్యోదయ అన్న యోజన (ఏ.ఏ.వై) కార్డులకు 49 వేల మంది అర్హులుగా తేలారు. తనిఖీ పూర్తి కావడంతోటే ఆహార భద్రతా కార్డులను జారీ చేస్తారు.

ప్రాధాన్య కుటుంబాలుగా గుర్తింపు పొందడానికి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను నిర్ణయిస్తారు. దీనికి అర్హతగా గ్రామీణ ప్రాంతాలలో అయితే ఏడాది ఆదాయాన్ని మునుపటి కన్నా పెంచి, లక్షా యాభై వేల రూపాయల వరకూ, నగర ప్రాంతాలలో అయితే ఏడాదికి రెండు లక్షల రూపాయల వరకూ సడలించారు. భూ పరిమితిని కూడా సడలించి మాగాణిని 3.5 ఎకరాల వరకు, మెట్టను 7.5 ఎకరాల వరకు పెంచారు.

ఆహార భద్రతా కార్డులకు అర్హమైన అన్ని 87.57 లక్షల అర్హమైన కుటుంబాలకు (2.80 కోట్ల మంది లబ్ధిదారులకు ఉపకరించేలా) 2015 జనవరి 1వ తేదీ నుంచి మనిషికి ఆరు కిలోల వంతున బియ్యాన్ని సరఫరా చేశారు. కుటుంబంలో ఎందరు సభ్యుల వరకు అనే హద్దు ఏదీ దీనిలో పాటించలేదు. అలాగే ఏ.ఏ.వై కుటుంబాలకు కార్డుకి 35 కిలోల వంతున సరఫరా చేయడం జరిగింది.

## మనిషికి ఆరు కిలోల వంతున ప్రాధాన్య కుటుంబాలకు బియ్యం పంపిణీ

అర్హమైన కుటుంబాలకు 2015 జనవరి 1వ తేదీ నుంచి కిలో రూపాయి ధరకు మనిషికి ఆరు కిలోల వంతున బియ్యాన్ని సరఫరా చేశారు. కుటుంబంలో ఎందరు సభ్యుల వరకు అనే హద్దు దేనినీ దీనిలో పాటించలేదు.

లోగడ మనిషికి 4 కిలోల లెక్కన బియ్యాన్ని ఇచ్చే వారు. కుటుంబానికి 20 కిలోలకు మించి బియ్యం ఇవ్వరాదనే హద్దు అమలులో ఉండేది. ఇప్పుడు కుటుంబంలో సభ్యులు ఎంత మంది ఉన్నప్పటికీ, మనిషికి ఆరు కిలోల వంతున బియ్యం సరఫరా జరుగుతోంది. అంత్యోదయ అన్న యోజన (ఏ.ఏ.వై) కుటుంబాలు కిలో రూపాయి ధరకు 35 కిలోల బియ్యాన్ని పొందుతాయి.

## కుటుంబానికి ఇది ఒక మంచి మొత్తాన్ని ఆదా చేస్తుంది.

ఒక కార్డుకు ఒక సభ్యుడు మాత్రమే ఉన్నట్లయితే, గతంలో అతడికి కిలో రూపాయి ధరకు నాలుగు కిలోల బియ్యం లభించేది. మరో ఆరు కిలోల బియ్యాన్ని అతడు కిలో రూ. 25 ధర వెచ్చించి కొనుగోలు చేసుకోవలసి వచ్చేది. అంటే 10 కిలోల బియ్యం మీద అతడు రూ. 154 ఖర్చు చేసే వాడు. ఇప్పుడతను పి.డి.ఎస్ ద్వారా ఆరు కిలోల బియ్యాన్ని ఆరు రూపాయలకు పొందుతున్నాడు. తక్కిన 4 కిలోల మీద రూ. 100 ఖర్చు చేస్తున్నాడు. అంటే మొత్తం మీద 10 కిలోలకు కలిపి రూ. 106 ఖర్చు చేస్తున్నాడు. మరో మాటలో చెప్పాలంటే నెలకు రూ. 48 ఆదా చేస్తున్నాడు.

మరో ఉదాహరణలో కార్డు కలిగిన కుటుంబంలో ఏడుగురు సభ్యులు ఉంటే, ఆ కుటుంబం 20 కిలోలకు రూ. 20 ఖర్చు చేసే వారు. మరో 50 కిలోలకు రూ. 1250 ఖర్చయ్యేది. మొత్తం 70 కిలోలకు రూ. 1270 ఖర్చయ్యేది. ఇప్పుడు ఆ కుటుంబానికయ్యే ఖర్చు (ఏడుగురు సభ్యులకు కిలో 6 రూపాయల వంతున) 42 కిలోలకు రూ. 42, తక్కిన 28 కిలోలకు కిలో 25 వంతున రూ. 700, మొత్తం రూ. 742 అవుతుంది. అంటే ఏడుగురు సభ్యుల కుటుంబానికి నెలకి రూ. 798 ఆదా అవుతోంది.

ప్రత్యేకించి అయిదుగురికి మించి సభ్యులున్న కుటుంబాలకు కిలో ఆరు రూపాయల బియ్యం సరఫరా పథకం తగినంత పుష్కలంగా బియ్యాన్ని తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతోంది.

ఆహార భద్రతా కార్డులను ఇంకా జారీ చేయనప్పటికీ, ప్రభుత్వం ఆ కుటుంబాలకు ఎటువంటి కష్టమూ కలగని రీతిలో, అర్హత ఆధారంగా బియ్యాన్ని సరఫరా చేస్తోంది.

ఈ పథకం కింద 2.80 కోట్ల యూనిట్‌లకు సరఫరా చేయడానికి నెలకు సుమారు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతుందని అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వం నుంచి అంచనా వేస్తున్న కేటాయింపు నెలకు 1.12 లక్షల మెట్రిక్ టన్నులు. దీని వలన నెల నెలా తక్కిన 68 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రైస్ మిల్లర్ల నుంచి రాష్ట్ర సేకరణ విభాగం నుంచి కొనుగోలు చేయవలసి ఉంటుంది. క్వింటాలుకు రూ. 1 వంతున (కిలోకు పైన ధరకు) చెల్లించి, రాష్ట్ర సేకరణ విభాగం కింద రైస్ మిల్లర్ల నుంచి 7.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగింది.

రాష్ట్ర సేకరణ విభాగం కింద 3.22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.

హాస్టళ్లలోని విద్యార్థుల కొరకు, పాఠశాలలలో మధ్యాహ్న భోజన కార్యక్రమానికి సూపర్ ఫైన్ రకం (సన్న బియ్యం) సరఫరా

హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు, మధ్యాహ్న భోజన కార్యక్రమం కింద లబ్ధి పొందుతున్న విద్యార్థులకు పుష్టికరమైన, మంచి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలంగాణ ప్రభుత్వం తలపెట్టింది. అందుకు అనుగుణంగా ఎక్కువ మంది అభిమానించే 'సన్న బియ్యం' అనే సూపర్‌ఫైన్ రకాలను వారికి సరఫరా చేయాలనే ఆచరణాత్మకమైన నిర్ణయాన్ని ప్రభుత్వం కూలంకషంగా ఆలోచించి తీసుకుంది.

హాస్టళ్ల బియ్యం అవసరాలు 6663 మెట్రిక్ టన్నులు కాగా, మధ్యాహ్న భోజన కార్యక్రమానికి 5837 మెట్రిక్ టన్నులు. ఇవి రెండూ కలిపి నెలకు 12,500 మెట్రిక్ టన్నులు అవుతున్నాయి.

హాస్టళ్ల విద్యార్థులకు మంచి నాణ్యమైన బియ్యాన్ని ఇవ్వడం కోసం తెలంగాణ ప్రభుత్వం కిలో 36 రూపాయల ధరకు పాత బియ్యాన్ని సేకరిస్తోంది. హాస్టళ్లకు, స్కూళ్లకు సెలవలు మొదలయ్యే 2015 ఏప్రిల్ 23వ తేదీ వరకు వీటిని సేకరించింది. ఇక ఈ ఏడాది (2014-15) పంటను కిలో రూ. 32.50 ధరకు ఈ ప్రతిష్ఠాత్మక పథకం కోసం సేకరిస్తోంది.

సంక్షేమ హాస్టళ్లకు, స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి 1.25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సేకరించడం జరిగింది.

అదే సమయంలో ఈ సూపర్ ఫైన్ రకం బియ్యం చీకటి విపణిలోకి దారిమళ్లకుండా, వచ్చిందే తిరిగి తిరిగి లెక్కల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడిన వారి మీద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.

## భూమి కొనుగోలు పథకం

పేద ఎస్.సి. మహిళా కుటుంబాలలోకెల్లా నిరుపేదలైన వారి ప్రయోజనం నిమిత్తం భూమి కొనుగోలు పథకం అనే అగ్రగామి కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది.

ఈ కార్యక్రమం కింద, మొదటి దశలో బొత్తిగా భూమిలేని నిరుపేద దళిత వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు మూడు ఎకరాల వరకు భూమిని సమకూర్చుతారు. తరువాత దశలలో అర ఎకరం, ఎకరం, రెండెకరాల భూమి మొదలుగా కలిగిన ఇతర ఎస్.సి లబ్ధిదారులకు కూడా మిగిలిన పరిమాణం భూమిని ఇచ్చి, మూడెకరాల ఆసాములుగా చేస్తారు.

భూమి అభివృద్ధికి, నాట్లను సిద్ధం చేయడానికి, వ్యవసాయ అవసరాలను సమకూర్చుకోడానికి నిధులను సమకూర్చడంతో పాటు, ఏడాదిలో ఒక పంటకు సేద్యపు నీటి సదుపాయాలు, బిందు సేద్య సదుపాయాలు, విత్తనాలు, సేద్యం ఖర్చు, ఎరువులు, పురుగు మందులు, దున్నే ఖర్చు, సూక్ష్మ సేద్య విధానాలు, పంపు సెట్లకు విద్యుత్ సరఫరా మొదలుగా అన్ని అవసరాలనూ తీర్చేలా సమగ్రమైన ప్యాకేజీని వీరికి అందిస్తారు. సేద్యపు ఖర్చులను భరించడానికి అవసరమైన మొత్తాలను నేరుగా లబ్ధిదారు ఖాతాలో వేస్తారు.

భూమి కొనుగోలు పథకం 100 శాతం సబ్సిడీతో అమలు జరుగుతుంది. దీనిలో లబ్ధిదారులు సమకూర్చవలసిన మొత్తం గానీ, బ్యాంకులతో ముడిపెట్టడాలు కానీ ఉండవు. ఈ కార్యక్రమం నిమిత్తం హైదరాబాద్ మినహా తెలంగాణ రాష్ట్రంలోని తక్కిన 9 జిల్లాలలో, ఎకరం 2 లక్షల రూపాయల నుంచి 7 లక్షల రూపాయల వరకు ధరలో వ్యవసాయ భూములను కొనుగోలు చేయడానికి జిల్లా కలెక్టర్లకు అధికారం ఇవ్వడం జరిగింది. 29-1-2015 నాటికి, 525 మంది లబ్ధిదారులకు 1132 ఎకరాల ప్రైవేట్ భూమిని, 270 ఎకరాల ప్రభుత్వ భూమిని మంజూరు చేయడం జరిగింది.



భూమి కొనుగోలు పథకం ప్రారంభం

## కళ్యాణ లక్ష్మి పథకం

ఎస్.సి / ఎస్.టి కుటుంబాల ఆర్థికపరమైన కుంగుబాటును మాన్పడానికి, తెలంగాణ రాష్ట్ర నివాసి అయిన ప్రతి ఎస్.సి / ఎస్.టి యువతి వివాహ సమయంలో, జీవితంలో ఒక సారి మాత్రం రూ. 51,000/- ఆర్థిక సాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తదనుగుణంగా 2014 అక్టోబర్ 2వ తేదీ నుంచి 18 ఏళ్ల వయసు పూర్తయిన అవివాహిత యువతులకు, తల్లితండ్రుల ఆదాయం ఏడాదికి రూ. 2.00 లక్షలు మించని వారికి కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

## షాది ముబారక్

అందరు అవివాహిత మైనారిటీ కమ్యూనిటీ యువతులకూ వివాహ సందర్భంగా వారి కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గించడానికి, 2014 అక్టోబర్ 2వ తేదీ నుంచి "షాదీ ముబారక్ పథకాన్ని" తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా, వివాహానికి కనీసం నెల ముందు దరఖాస్తు చేసుకునే ప్రతి మైనారిటీ బాలికకు ఒకే ఒకసారి రూ. 51,000 ఆర్థిక సహాయాన్ని ఇస్తారు. ఈ మొత్తాన్ని పెళ్లికూతురు పేరిట అకౌంట్ పేయీ చెక్కు ద్వారా బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు.



షాదీ ముబారక్

## తెలంగాణ త్రాగు నీటి సరఫరా ప్రాజెక్టు

తెలంగాణ తాగు నీటి సరఫరా ప్రాజెక్టు (టి.డి.డబ్ల్యు.ఎస్.పి) తెలంగాణ రాష్ట్రంలో ఒక విశిష్ట కార్యక్రమం. హైదరాబాద్‌ను మినహాయించి, రాష్ట్రంలో తొమ్మిది జిల్లాలలోని 25,139 ఆవాసాలలోను, 67 మునిసిపల్ పరిధులలోనూ నివసిస్తున్న 319 లక్షల జనాభాకు, తలకు రోజుకు అందుబాటులోకి 100 లీటర్ల తాగు నీటి (100 ఎల్.పి.సి.డి)ని టి.డి.డబ్ల్యు.పి సమకూరుస్తుంది. మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ. 42,000 కోట్లు కాగలదని అంచనా. దీనిలో తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పొరేషన్ (టి.డి.డబ్ల్యు.ఎస్.సి) నిర్వహణలోని గుత్త నీటి సరఫరా (శుద్ధి, పంపిణీ) వ్యవస్థకు అయ్యే ఖర్చు కూడా ఇమిడి ఉంది. అదే విధంగా పారిశుద్ధ్యం, ఆరోగ్య జీవన విధానాలపై చదువు, సంస్థల అభివృద్ధి, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ వ్యవహారాలను చూసే గ్రామ నీరు - పారిశుధ్య కమిటీ నిర్వహించే గ్రామ నీటి సరఫరా వ్యవస్థకయ్యే ఖర్చు కూడా దీనిలో కలసి ఉంది. ఇప్పుడు అమలులో ఉన్న తాగు నీటి ప్రాజెక్టులన్నీ ప్రతిపాదిత టి.డి.డబ్ల్యు ప్రాజెక్టులో సమీకృతమవుతాయి.

రాష్ట్రం గుండా ప్రవహించే జీవనదులైన కృష్ణా, గోదావరులతో రాష్ట్రం సుసంపన్నమై ఉంది. నాగార్జున సాగర్, పాలేరు, వైరా, దుమ్ముగూడెం, శ్రీశైలం, ఎస్.ఆర్.ఎస్.పి, సింగూర్, నిజాంసాగర్, కడెం మరియు కొమరం భీమ్ ప్రాజెక్టులకు పుష్కలమైన నీటి నిల్వ సామర్థ్యం ఉంది. అది రాష్ట్ర ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చగలిగే స్థాయిలో ఉంది. ఈ వనరుల మీద ఆధారపడి, నిలదొక్కుకోగలిగిన వనరుల నుంచి టి.డి.డబ్ల్యు.పి సుమారు 63 టి.ఎం.సిల నీటిని ఉపయోగించుకుంటుంది.

టి.డి.డబ్ల్యు.పిని నాలుగేళ్లలో అమలు చేయాలని తలపెట్టారు. దీనిలో 1.25 లక్షల కిలోమీటర్ల పొడవున ఎన్నెన్నో నీటి గొట్టాలను అమర్చవలసి ఉంటుంది. 18 స్వీకరణ బావులను నిర్మించవలసి ఉంటుంది. (7.5 లక్షల కె.ఎల్ నీటి కోసం) 17,407 నీటి నిల్వ ట్యాంకులను  నిర్మించవలసి ఉంటుంది. మధ్య మధ్యలో 62 పంపింగ్ స్టేషన్‌లను నెలకొల్పవలసి ఉంటుంది. దీనికి మొత్తం విద్యుచ్ఛక్తి అవసరం 186 మెగావాట్లు మాత్రమే. కారణం, ఈ ప్రాజెక్టులో నీటి పంపిణీ చట్రం సాధ్యమైనంత వరకు భూమివాలుపై ఆధారపడి నీటిని ప్రవహింపజేసే విధానాన్నే అనుసరిస్తుంది. నైపుణ్యవంతమైన నవ్య సాంకేతిక పరిజ్ఞానాన్ని (స్మార్ట్ టెక్నాలజీని) ఉపయోగించి, నీటి వినియోగాన్ని పర్యవేక్షిస్తారు. నీటి వృధాని బాగా అరికడతారు.

26 విభాగాలుగా చేసిన ఈ భారీ ప్రాజెక్టుకు నిధులను సమకూర్చుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం సొంత వనరులను, కేంద్ర ప్రభుత్వ వనరులను ఉపయోగించుకోవడంతో పాటు ద్వైపాక్షిక సంస్థలు, బహుళ పక్ష సంస్థలు, ఆర్థిక సంస్థల నుంచి కూడా రాష్ట్ర ప్రభుత్వం నిధులను కోరుతోంది.

రాష్ట్ర స్వీయ నీటి సరఫరాకు తోడు, పరిశ్రమలకు అవసరమైన నీటిని కూడా ఈ ప్రాజెక్టు లెక్కలోకి తీసుకుంటుంది. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించడానికి గానూ పరిశ్రమల వల్ల పెరిగే నీటి గిరాకీని ఈ ప్రాజెక్టు మదింపు చేసుకుంటుంది. నీటిని గుత్తగా సరఫరా చేసే పనిని తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పొరేషన్ గావిస్తుంది. తదుపరి గ్రామాలలో / మునిసిపల్ ప్రాంతాలలో ఆ నీటిని పంపిణీ చేసే పనిని సంబంధిత పి.ఆర్.ఐలు / యు.ఎల్.బిలు చేపడతాయి. గుత్త సరఫరా నీటి గొట్టాల మార్గాలను, వాటికి సంబంధించిన నిర్మాణాలను గావించే బాధ్యతలను ఆ రంగంలో విస్తృతమైన అనుభవం కలిగిన సుప్రసిద్ధమైన సంస్థలకు అప్పగించాలని ప్రతిపాదించారు. గ్రామాలలోని, లేదా యు.ఎల్.బి పంపిణీ వ్యవస్థలను నీటి  పొదుపులో గణిత, మీమెన యాజమాన్యపు నైపుణ్యము కలిగిన మహిళలతో ఏర్పాటు చేసే స్థానిక జల సంఘాలకు అప్పగించదలచారు.

1. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమైన నల్గొండ జిల్లాలో టి.డి.డబ్ల్యు ప్రాజెక్టుని నడుంబిగించి ఆచరణలోకి తెస్తారు. రాష్ట్రంలో మొత్తం నాలుగు ప్రాంతాలకూ ప్రయోజనం కలిగించే విధంగా ఈ పనులను ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నిజామాబాద్ జిల్లాలలో ఏకకాలంలో అమలు చేస్తారు. ఇప్పుడున్న అన్ని సేద్యపు నీటి ప్రాజెక్టుల నుంచి, కొత్తగా రాబోతున్న సేద్యపు నీటి ప్రాజెక్టుల నుంచి 10 శాతం నీటిని టి.డి.డబ్ల్యు.పికి కేటాయిస్తామనీ, దానిలో తిరిగి 10 శాతాన్ని పరిశ్రమలకు వినియోగిస్తామనీ ముఖ్యమంత్రి గారు ప్రకటించారు. ఈ ప్రాజెక్టును కొత్తగా నెలకొల్పిన తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పొరేషన్ లిమిటెడ్ అమలుచేస్తుంది.

2. ప్రతి ఇంటికీ నీటి కుళాయిని సమకూర్చడం ద్వారా తెలంగాణలో నివసిస్తున్న అందరికీ ఆమోదయోగ్యమైన, వాస్తవంగా తీసుకోడానికి అనువైన, ఆర్థికంగా భరించగలిగిన రీతిలో సురక్షితమైన, నీటిని సమృద్ధిగా పొందే మౌలికమైన మానవీయ హక్కును రాష్ట్రం నెరవేర్చగలుగుతుంది.

3. వచ్చే 30 ఏళ్ల పాటు ప్రజల తాగు నీటి అవసరాలను తీర్చగలిగే రీతిలో ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతమైన నమూనా కూడా కాగలదు. ఇంటింటికీ అంతర్జాతీయ ప్రమాణాలతో నీటిగొట్టాలు వేసేలా శ్రద్ధ వహించవలసిందని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించడం జరిగింది. కొత్తగా కేంద్రం ప్రవేశపెట్టనున్న చట్టాన్ని అనుసరించి, అటవీ భూమిని అభివృద్ధి పనులకు ఉపయోగించాలని ప్రభుత్వం ఆశిస్తోంది. ప్రాజెక్టును అమలు చేయడానికి అవసరమైన అటవీ భూమిని బదులివ్వదలచింది.

4. తెలంగాణ తాగునీటి ప్రాజెక్టు (టి.డి.డబ్ల్యు.పి)ను ఒక ప్రాముఖ్యమైన రాష్ట్ర కార్యక్రమంగా ప్రకటించారు. ప్రాజెక్టు పురోగతిని సమీక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర స్థాయి సమన్వయ సంఘాన్ని నెలకొల్పారు. జిల్లాలలో ప్రాజెక్టు పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి సమన్వయ కమిటీ పర్యవేక్షిస్తుంది.

5. స్వచ్ఛ భారత్ అభియాన్, స్వచ్ఛ భారత్-స్వచ్ఛ విద్యాలయ మొదలుగా భారత ప్రభుత్వ కార్యక్రమాలలో నీటి సరఫరా, ఆరోగ్య విధానాల చైతన్యం, పర్యావరణ పరిశుద్ధి, హరిత హారం మొదలైన వాటిని టి.డి.డబ్ల్యు.పి మమేకం చేసుకుని వ్యవహరిస్తుంది. ఆటోమేషన్, నీటి బడ్జెటింగ్, నీటి పునర్వినియోగం, నీటి భర్తీ, గ్రామీణ, నగర ప్రాంతాలలో ప్రజలు స్నానాదులకు వాడిన నీటితో మొక్కల పెంపకం మొదలైన నవనాగరిక విధానాలను టి.డి.డబ్ల్యు.పి అనుసరిస్తుంది.

## తెలంగాణ తాగునీటి ప్రాజెక్టు ఆవశ్యకత :

తెలంగాణ గడ్డ మీద వర్షం ఎంత కురుస్తుంది, ఎక్కడ కురుస్తుంది, సాలుసరి వర్షపాతం ఎంత నమోదవుతుందన్నది అనిశ్చితం. అటు దీర్ఘ వర్షపాత విరామాలు, ఇటు వరదలు కూడా రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తుంటాయి. గడచిన దశాబ్దంలో అయిదేళ్ల పాటు తెలంగాణ లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంది. వర్షపు నీరు, ఉపరితల నీరు, భూగర్భ జలాలు, నేల తడులలో వాడుకకు అవసరమైన మన్నిక లోపించడం నీటి సంక్షోభానికి దారి తీసింది. రాష్ట్రానికి రెండు పెద్ద నదీపరివాహక ప్రాంతాలు - కృష్ణా, గోదావరులు. అయినప్పటికీ, గ్రామీణ తాగునీటికి మాత్రం భూగర్భ జలాల మీదే భారీగా ఆధారపడవలసి వస్తోంది. కావున భూగర్భ జలాలు ఆధారపడడానికి వీలులేని అనిశ్చిత నీటి వనరుగా మారిపోయాయి.

విడిగా ఉన్న నీటి నెట్‌వర్క్‌లను ఉపయోగించే ప్రతిపాదిత తెలంగాణ తాగునీటి ప్రాజెక్టు జి.హెచ్.ఎం.సిని మినహాయించి, అలాగే హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఒ.ఆర్.ఆర్) లోపల శివారు జనావాసాలను మినహాయించి, గ్రామీణ, నగర, సంస్థాగత, వాణిజ్య, పారిశ్రామిక నీటి అవసరాలను తీర్చడానికి ఉద్దేశించారు. రాష్ట్రంలో ప్రతి ఒక్క జనావాసంలో ఇంటింటికీ నీటిని నికరంగా సమకూర్చడంలో ఎదురవుతున్న సవాళ్లు ఎన్నెన్నో ఉన్నాయి. పరిష్కరించవలసిన సవాళ్లలో పెద్దవి:

**భూగర్భ జలాలు తగ్గిపోవడం:** భూమిలోని నీటిని అతిగా తోడేయడం, వాటిని భర్తీ చేయవలసిన వర్షాలు తక్కువగా కురియడం సమస్యలలోకెల్లా పెద్ద సమస్య.

**భూగర్భ జల నాణ్యత:** తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో భూగర్భ జలాలలో ఫ్లోరైడ్, ఇనుము ఎక్కువగా ఉంటోంది. భూమి ఉపరితలానికి కొద్ది దిగువన ఇనుప రజను, ఉప్పు ఎక్కువగా ఉన్న చోట్ల, భూగర్భ జలాలు తగ్గిన కొద్దీ నీటిలో ఇనుప మడ్డి, లవణం, ఫ్లోరైడ్ కాలుష్యాలు చిక్కగా పెరిగిపోతున్నాయి. వాటి వల్ల మానవులు తాగడానికి ఆమోదయోగ్యమైన ప్రామాణిక హద్దులను దాటి, ఆ నీటిని ఉపరితలం మీద శుద్ధి చేస్తే తప్ప తాగడానికి వీలులేని పరిస్థితులు నెలకొంటున్నాయి. నీటిలో హద్దుమీరిన ఫ్లోరైడ్ శాతాన్ని గుర్తించిన జనావాసాలు 9 జిల్లాలలో 4,506 ఉన్నాయి. లవణీయత నీటిని 1590 జనావాసాలలోనూ, టి.డి.ఎస్ కాలుష్యం కలిగిన నీటిని 19 జనావాసాలలోను, నైట్రేట్ కాలుష్యం కలిగిన నీటిని 1881 జనావాసాలలోనూ, ఇనుప మడ్డితో కలుషితమైన నీటిని 576 జనావాసాలలోను గుర్తించారు. ఏమైనప్పటికీ నాణ్యత దెబ్బతిన్న ఈ జనావాసాలలో కొన్నింటిని నాణ్యమైన నీటి పరిమిత సరఫరాతో ప్రస్తుత పథకాలలోనూ / నిర్మాణంలో ఉన్న పథకాలలోనూ పొందుపరచారు.

**భూగర్భ జలకాలుష్యం:** ఇటు సహజ కాలుష్యాలు, అటు కృత్రిమకాలుష్యాలైన పారిశ్రామిక కాలుష్యం, వ్యవసాయ సంబంధమైన పురుగుమందులు, నైట్రేట్‌లు, ఇష్టం వచ్చినట్లుగా వదలివేసిన ఘన, ద్రవ వ్యర్థపదార్థాలు - రెండూ కీలక సమస్యలే.

**నిలకడ ఎలా :** ఒక పక్క సేద్యపు నీటి అవసరాలు, మరో పక్క ప్రతికూల ఋతుపవనాలు. వీటి మధ్య నీటి సరఫరా రంగంలో తాగునీటి వనరులు, వ్యవస్థలు నిలకడగా నీటిని అందించడం పెద్ద సవాలు.

**పెరుగుతున్న గిరాకీ:** మారుతున్న జీవనశైలి, నగరీకరణలతో చాలా గ్రామాలలో సైతం గృహస్తులు తమ ఇళ్లకు నీటి సదుపాయం కల్పించమని అడుగుతున్నారు. తమ ఇళ్ల ముంగిళ్లలోకి మరింత నీటి సరఫరాను కోరుతున్నారు. మెరుగైన జీవన ప్రమాణాల పరంగా ప్రజల భావనలో వస్తున్న మార్పు కూడా గిరాకీ పెరుగుదలకు దారితీస్తోంది.

**గ్రామీణ ప్రాంతాలు, నగర ప్రాంతాలు:** ప్రస్తుతంలో గ్రామీణ ప్రాంతాలకూ, పట్టణ ప్రాంతాలకూ నీటి సరఫరాకి ప్రణాళికలు వేర్వేరుగా వేసి ఉన్నాయి. ఒకే జలవనరు నుంచి నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఈ విధంగా వేర్వేరుగా ప్రణాళికలు వేయడం వల్ల పట్టణ ప్రాంతాలకు ప్రాజెక్టు వ్యయం చాలా పెరిగిపోతోంది. కారణం మొత్తం 67 పట్టణ ప్రాంతాలు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ జనావాసాల మధ్య చెల్లాచెదరుగా వ్యాపించి ఉండడమే.

భూగర్భ జలాల మీద అతిగా ఆధారపడడాన్ని క్రమంగా తగ్గించి, ఉపరి తల వనరుల మీద ఆధారపడడానికి మారాలని జాతీయ గ్రామీణ తాగు నీటి కార్యక్రమం మార్గదర్శక సూత్రాలు స్పష్టం చేస్తున్నాయి. భూగర్భ జలాలను, ఉపరితల జలాలను, వాన నీటిని సమన్వయంగా ఉపయోగించాలని కూడా మార్గదర్శక సూత్రాలు సూచిస్తున్నాయి. ఆ విధంగా భారత ప్రభుత్వ లక్ష్యాలు, ఉద్దేశ్యాలను టి.డి.డబ్ల్యు.ఎస్.పి నెరవేరుస్తోంది.

## అమలు, పర్యవేక్షణల కోసం వ్యవస్థ ఏర్పాటు

తెలంగాణ నీటి సరఫరా ప్రాజెక్టును అమలు చేయడానికి, పర్యవేక్షణకు, భవిష్యత్ నిర్వహణ, మరమ్మత్తులకు తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పొరేషన్‌ని నెలకొల్పడం జరిగింది. ప్రాజెక్టుని సమర్థంగా అమలు చేయడానికి, భవిష్యత్ నిర్వహణ, మరమ్మత్తులకు అవసరమైన సిబ్బందిని ఆర్.డబ్ల్యు.ఎస్ అండ్ ఎస్ శాఖ సమీకరిస్తుంది. అట్టి పథకాల రూపకల్పన, నిర్మాణం, పర్యవేక్షణలలో అదే మాదిరి అనుభవం కలిగిన సలహాదారులతో అంకితభావం కలిగిన బృందాన్ని తీసుకోవడం జరిగింది.

## ఖర్చుని రాబట్టడం మరియు రుసుములు

వ్యవస్థ దీర్ఘకాలంలో మనడానికి ఖర్చులను తిరిగి రాబట్టడం, ఆర్థిక స్వావలంబన చాలా అవసరం. కాబట్టి ఆర్థికంగా గానీ, సాంకేతికంగా గానీ సమాజం దీర్ఘకాలంలో కేంద్ర ప్రభుత్వం మీద గానీ, ప్రాంతీయ ప్రభుత్వం మీద గానీ ఆధారపడకూడదు. తాగడానికి, వంటకు, పరిశుభ్రతకు ఒక పరిమాణాన్ని మించి ఇచ్చిన నీటికి విధించే ధర, వాస్తవంగా ఆ అదనపు నీటిని సరఫరా చేయడానికి అయ్యే ఖర్చుకి సరితూగాలి. ఫలానా పరిమాణం నుంచి ఫలానా పరిమాణం వరకు వినియోగించుకున్న నీటికి ఫలానా మాదిరి ధర అనే నమూనాని అమలు చేయాలి. ఉదాహరణకు 0 నుంచి 100 ఎల్.పి.సి.డిల వరకు, 100 నుంచి 125 ఎల్.పి.సి.డిల వరకు, 125 నుంచి 150 ఎల్.పి.సి.డిల వరకు, 150 ఎల్.పి.సి.డిలను మించి అనే విభాగాలకు వేర్వేరు ధరలను నిర్ణయించవలసి ఉంటుంది. 100 ఎల్.పి.సి.డిల లోపున నీటిని వినియోగించుకున్న అల్పాదాయ వర్గా (ఎల్.ఐ.జి)లకు, ఆర్థికపరమైన బలహీన వర్గా (ఇ.డబ్ల్యు.ఎస్)లకు ధరలను నామమాత్రంగా నిర్ణయించవలసి ఉంటుంది. తక్కిన వారికి వేరే మాదిరి ధరలను తగిన విధంగా యోచించి, నిర్ణయించవలసి ఉంటుంది. అధిక వినియోగానికి అధికమైన ధరలు అనేది విధానం. ఇక వాణిజ్య, పారిశ్రామిక ఖాతాదారులకు వేరే ధరలు ఉంటాయి.

## రూపకల్పనకు మార్గదర్శకాలు

నీటి సరఫరాకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (సి.పి.హెచ్.ఇ.ఇ.ఓ) వేసిన నిబంధనావళిని, ఇటు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన మార్గదర్శకాలు, విధానాల ప్రకారంగా ప్రతిపాదిత తెలంగాణ తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు రూపకల్పన చేయడం జరుగుతుంది.

## వ్యవస్థల నిర్వహణ, మరమ్మత్తుల విభాగం

గుత్త నీటి సరఫరా వ్యవస్థని నిర్వహించడం, మరమ్మత్తుల బాధ్యతలను నిర్వర్తించడం రెండూ కార్పొరేషన్ చేతులలోనే ఉంటాయి. జనావాసాల పరిధిలో నీటి సరఫరా నిర్వహణ, మరమ్మత్తుల బాధ్యత పి.ఆర్.ఐల చేతిలో ఉంటాయి. పి.ఆర్.ఐలు నిర్దేశించే రుసుముల ద్వారా నిర్వహణ వ్యయాన్ని వాస్తవిక వినియోగదారులు సమకూరుస్తారు.

## సమన్వయం

ఈ రంగానికి సంబంధించిన అన్ని కార్యక్రమాల సమన్వయం కోసం రాష్ట్ర నీరు, పారిశుధ్య మిషన్ (ఎస్.డబ్ల్యు.ఎస్.ఎం) కింద, రాష్ట్ర స్థాయిలో నీటి సరఫరా, పారిశుధ్య సంస్థ (డబ్ల్యు.ఎస్.ఎస్.ఓ) నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ప్రాజెక్టు యాజమాన్యానికి సంబంధించిన

వేర్వేరు కర్తవ్యాలను సాధించడానికి తెలంగాణ తాగు నీటి సరఫరా కార్పొరేషన్ లోనే మంచి అర్హతలు కలిగిన, బహు శాఖా నైపుణ్యం కలిగిన ప్రాజెక్టు యాజమాన్య విభాగాన్ని నెలకొల్పుతారు. కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ నైపుణ్యం ఎలాగూ అందుబాటులో ఉంటుంది. దీనికి తోడు పి.ఎం.యు జట్టుకి అవసరమైన ఇతర నైపుణ్యాలలో ఉండే మరికొన్ని: ప్రాజెక్టు నిర్వహణ, సేకరణ, ఎం.ఐ.ఎస్, జి.ఎం.ఐ.ఎస్, నిశిత వీక్షణ, అధ్యయనం, మదింపు, పర్యావరణ పరమైన, సామాజికమైన భద్రతా చర్యలు, నీటి నాణ్యతా అధ్యయనాలు, పరిశోధన, గ్రంథస్థీకరణ, సమాచార పంపిణీ, శిక్షణ, సామర్థ్య నిర్మాణం, ఆరోగ్య శాస్త్ర, పరిశుద్ధతా విధానాలపై విద్యాబోధన. ఆదర్శవంతమైన నీటి నిర్వహణ యాజమాన్య సంస్థగా నిలవడానికి దీర్ఘకాలంలో మానవ వనరుల సమర్థమైన నిర్వహణ చాలా ముఖ్యం.

## ఆటోమేషన్, స్కాడా (సిస్టమ్ కంట్రోల్ మరియు డేటా ఆక్సెసింగ్)

ప్రతిపాదిత తెలంగాణ తాగునీటి ప్రాజెక్టును కూడా నవ సాంకేతిక గ్రిడ్‌గా ప్రతిపాదించారు. దీనిలోని నీటి శుద్ధి విభాగాలలో, పంపింగ్ స్టేషన్‌లలో పూర్తి ఆటోమేషన్ ఏర్పాటవుతుంది. నీటి ప్రవాహం మీద నిరంతర నిఘాకు, ట్యాంకులలోని నీటి నిల్వల గమనికకు, బేరింగ్‌ల / మోటార్‌ల ఉష్ణోగ్రత పరిశీలనకు ఈ ఆటోమేషన్ ఉపయోగపడుతుంది. నిర్వహణలో ఏదైనా అసంబద్ధమైనది జరిగిన పక్షంలో వెంటనే వ్యవస్థ దానికదే ఆగిపోయేలా రూపకల్పన జరుగుతుంది. దీనివల్ల యంత్ర సంబంధమైన, విద్యుత్ సంబంధమైన నష్టాలు జరగకుండా రక్షణ కలుగుతుంది. దీనికి తోడు, ఐటి-సామర్థ్యంతో పనిచేసే మరో కేంద్రీకృత పర్యవేక్షణ వ్యవస్థను ప్రధాన కార్యాలయం వద్ద నెలకొల్పుతారు. ఇది ఒక్కొక్క గుత్త ఖాతాదారుకీ, ట్యాంకుకీ పంపిణీ అయిన నీటి పరిమాణాలను పరిశీలిస్తూ ఉంటుంది. నీటి గుత్త సరఫరా జరిగే పాయింట్లలో తగిన వాటి వద్ద అవశేష క్లోరిన్‌ను తెలుసుకోడానికి క్లోరిన్ విశ్లేషణులను నెలకొల్పుతారు. దీని ద్వారా ప్రతి ఒక్క టోకు ఖాతాదారుకు ఆశించిన నీటి సరఫరా స్థాయిలను, నీటి సరఫరా వ్యవస్థ సమర్థమైన యాజమాన్యాన్ని సాధించడం జరుగుతుంది.

ఇది సంక్లిష్టమైన రూపకల్పన, జలశక్తి నమూనాలను కలిగి ఉండే ఒక భారీ తాగునీటి ప్రాజెక్టు. దీనిలో పైన సూచించిన స్వతంత్ర వనరులతో, తమ పని తాము సంపూర్ణంగా చేసే విభాగాలు 28 వరకు ఉంటాయి.

## షెడ్యూల్డు కులాల అభివృద్ధి

తెలంగాణలో షెడ్యూల్డు కులాల జనాభా 54,32,680 మంది. 2011 జనాభా లెక్కల ప్రకారం వీరు జనాభాలో 15.44 శాతం. వీరిలో 75.40 శాతం గ్రామీణ ప్రాంతాలలో, 24.60 శాతం పట్టణాలలో ఉన్నారు. రాష్ట్రంలో ఎస్.సిలలో అక్షరాస్యత 52.52 శాతం.

రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి షెడ్యూల్డు కులస్తుల సామాజికాఆర్థిక, విద్యా అభివృద్ధికి, సంక్షేమానికి ఎన్నో చర్యలు తీసుకోవడం జరిగింది. వాటిని ఇక్కడ సంక్షిప్తంగా వివరించడం జరిగింది.

## విద్యా కార్యక్రమాలు

### వసతి సదుపాయాలు

ఎస్.సి / ఎస్.టి / బి.సిలకు చెందిన వారు బస చేయడానికి ఒక్కొక్క సముదాయానికి రూ. 1.68 కోట్ల ఖర్చుతో సమీకృత సంక్షేమ హాస్టల్ సముదాయా (ఐ.డబ్ల్యు.హెచ్.సి)ల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. వీటిలో ఒక్కో సముదాయంలో 400 మంది బసచేయడానికి అవకాశముంటుంది. వీటిలో బస చేస్తున్న వారికి చక్కని సౌకర్యాలు, నాణ్యమైన సదుపాయాలు ఉంటాయి. మొదటి దశలో చేపట్టిన 34 ఐ.డబ్ల్యు.హెచ్.సిలకు 32 ఐ.డబ్ల్యు.హెచ్.సిలు వినియోగంలోకి వచ్చాయి. తక్కిన 2 ఐ.డబ్ల్యు.హెచ్.సిలు ఇంకా వినియోగంలోకి రాలేదు. రెండో దశలో 31 కొత్త ఐ.డబ్ల్యు.హెచ్.సిల నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా పరమైన మంజూరులను 2013-14 ఎస్.సి.ఎస్.పిలో గావించగా, వాటిలో 29 వినియోగంలోకి వచ్చాయి.

### ఆనంద నిలయాలు

దాదాపు 33 ఆనంద నిలయాల వాసులు అనాథ కుటుంబాల నుంచి వచ్చిన వారు. వృత్తుల వారికి సామాజిక సంక్షేమ హాస్టళ్ళలోని విద్యార్థులతో సమానంగా అన్ని సదుపాయాలనూ కల్పించడం జరిగింది.

### కళాశాల హాస్టళ్లు

ప్రస్తుతం రాష్ట్రంలో 11,391 మంది విద్యార్థులతో 183 కళాశాల హాస్టళ్లు పనిచేస్తున్నాయి.

## మెట్రిక్-అనంతర ఉపకార వేతనాలు

షెడ్యూల్డు కులాలలో మెట్రిక్-అనంతర విద్యార్థులకు నివాస, నివాసేతర ఉపకార వేతనాలను మంజూరు చేయడం జరిగింది. 2014-15లో రూ. 199.00 కోట్ల విడుదల జరిగింది. అంబేద్కర్ ప్రవాస విద్యానిధి ఎస్.సి విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాలలో ఉన్నత స్థాయి విద్యను అభ్యసించడానికి వీలుగా, ప్రతిభావంతులైన వారికి ఒక్కొక్కరికి రూ. 10.00 లక్షల సహాయాన్ని మంజూరు చేయడం జరుగుతోంది.

## తెలంగాణ సామాజిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఇ.ఐ.ఎస్)

ఈ సొసైటీ కింద 134 పాఠశాలలు పనిచేస్తున్నాయి. వీటిలో అయిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు దాదాపు 71,493 మంది విద్యార్థులు, ఆంగ్ల భాషా మాధ్యమంలో చదువుతున్నారు. వీటిలో ఎస్.సిలకు కేటాయించిన సీట్లు 75 శాతం. క్రైస్తవ మతంలోకి మారిన వారికి కేటాయించిన సీట్లు 12 శాతం. ఎస్.టిలకు 6 శాతం. బి.సిలకు 5 శాతం. ఒ.సిలకు 2 శాతం. దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘన బాధితులకు, ప్రకృతి విపత్తుల బాధితుల పిల్లలకు కూడా రిజర్వేషన్‌లను కల్పించడం జరిగింది. దాదాపు 88 సంస్థలు (66.16 శాతం) బాలికలకు కేటాయించి ఉన్నాయి. తద్వారా టి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఇ.ఐ.ఎస్ ప్రత్యేకించి బాలికలకు విశేష సేవలందించే సొసైటీగా రూపుదిద్దుకుంది.

సొంత భవనాలలో పనిచేస్తున్న 121 స్కూలు సముదాయాలతో టి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఐ.ఇ.ఎస్ ఒక బలమైన మౌలిక సదుపాయంగా అవతరించింది. మరో 13 సొంత భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. పరిపాలనలోనూ, విద్యాబోధనలోను సాంకేతిక పరిజ్ఞానాన్ని పుణికిపుచ్చుకోవడంలో అగ్రగామిగా ఉన్న టి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఐ.ఇ.ఎస్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో శీఘ్రగతిన అభివృద్ధి సాధించింది. ఇప్పుడు మొత్తం 134 సంస్థలూ నికరమైన అనుసంధానంతో సొంత ఇ-మెయిల్, వెబ్‌సైట్ సదుపాయాలతో, తమ మధ్య అంతర్జాలాన్ని కలిగి ఉన్నాయి. స్టూడెంట్ అకడమిక్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల, అధ్యాపకుల విద్యా సంబంధమైన పురోగతిని కంప్యూటర్ వ్యవస్థ ద్వారానే పర్యవేక్షించడం జరుగుతోంది.

## ఎస్.సి సబ్ ప్లాన్

- ఎస్.సి.ఎస్.పి కింద మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రతిపాదించినది.
- ఎస్.సి నియోజక వర్గాలు (ఆలంపూరు, బెల్లంపల్లి, మానకొండూర్)లలో మూడు కొత్త సముదాయాల నిర్మాణం
- ఇతర నియోజక వర్గాలలో 8 కొత్త సముదాయాల నిర్మాణం
- ఇప్పుడున్న పాఠశాల (పాల్వంచ, యల్లారెడ్డి, అసిఫాబాద్, రుక్మాపూర్, నారాయణ ఖేడ్)కు అయిదు కొత్త సముదాయాల నిర్మాణం
- రాయదుర్గం, హైదరాబాద్‌లో టీచర్ కెపాసిటీ బిల్డింగ్ సెంటర్, మరియు ఒక కొత్త పాఠశాల నిర్మాణం
- 104 పాఠశాలలలో మౌలిక సదుపాయాల పెంపు.

## షెడ్యూల్డు కులాల సహకార ఆర్థిక సంస్థ

సామాజిక, ఆర్థిక అభివృద్ధి నిమిత్తం పేద షెడ్యూల్డు కులాల కుటుంబాలకు ఆదాయాన్ని ఉత్పత్తి చేసే ఆస్తులను సృష్టించడానికి ఆర్థిక సహాయాన్ని సమకూర్చడం షెడ్యూల్డ్ క్యాస్ట్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రధాన ఆశయం. వివిధ ఆర్థికాభివృద్ధి పథకాల కింద పేద ఎస్.సి లబ్ధిదారులు వీలైనంత మందికి సహాయాన్ని సమకూర్చడానికి ఎస్.సి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగింది. 29,030 మంది ఎస్.సి లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని అందించడానికి 2014-15లో రూ. 1096.00 కోట్లను సమకూర్చడం జరిగింది.

## గిరిజన సంక్షేమం

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో గిరిజన జనాభా 32.87 లక్షలు. వీరు రాష్ట్ర మొత్తం జనాభాలో 9.34 శాతం. రాష్ట్రంలో అక్షరాస్యతా శాతం 66.46 కాగా, ఎస్.టిలలో అక్షరాస్యతా శాతం 49.51. రాష్ట్రంలో 32 గిరిజన వర్గాలు నివసిస్తున్నాయి. వీరిలో 4 పివి.టి.జిఎస్‌లు. గతంలో యానాది గిరిజన తెగలుగా పిలిచిన వారిని, ఇప్పుడు ప్రత్యేకించి విపత్తునకు ఆలవాలమైన గిరిజన తెగలు (పివి.టి.జిఎస్‌లు)గా గుర్తిస్తున్నారు. వారు కొండరెడ్లు, చెంచులు, కొలమలు, తోటీలు. వీరు ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాలలో ఉన్నారు. రాష్ట్రంలో ప్రబలంగా కనిపించే గిరిజన తెగవారు లంబాడాలు. వీరి జనాభా

20,46,117. ఇంకా కోయలు 4,86,391 మంది, గోండులు 2,97,846 మంది, ఎరుకలు 1,44,128 మంది ఉన్నారు. సామాజిక-ఆర్థిక అభివృద్ధి పథకాల ద్వారా గిరిజనులను అత్యంత శీఘ్రంగా అభివృద్ధిపథంలోకి తేవడానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యాన్నిచ్చింది. విద్య, ఆర్థికపరమైన అండదండ, భూ ఆధారిత పథకాలు వీటిలో ముఖ్యమైనవి.

## కొత్త చర్యలు

### కొమరం భీమ్ స్మారక, గిరిజన మ్యూజియం

ఆదిలాబాద్ జిల్లాలోని జోడేఘాట్ గ్రామంలో కొమరం భీమ్ స్మారక, గిరిజన మ్యూజియాన్ని ప్రభుత్వం నిర్మిస్తోంది. దానిని గిరిజన సాంస్కృతిక నిలయంగా, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి రూ. 25.00 కోట్ల అంచనా వ్యయంతో పథకాలు వేస్తోంది.

### గిరిజన సంక్షేమ విద్యా సంస్థలకు అదనపు సదుపాయాలు

అన్ని గిరిజన సంక్షేమ విద్యా సంస్థలలోనూ నిర్ణీతమైన అదనపు సదుపాయాలను కల్పించాలని 2014-15లో ప్రతిపాదించడం జరిగింది. దీని కింద ప్రయోగశాలలు, అవసరమైన మౌలిక సదుపాయాలతో గ్రంథాలయాలు, పరికరాలు, పుస్తకాలు, పత్రికలు, డి.టి.హెచ్ కనెక్షన్‌తో ఎల్.సి.డి టీవీలు, డిజిటల్ ప్రొజెక్టర్‌లు, సూర్యరశ్మితో నీటిని కాచే సాధనాలు, ఆర్.ఓ జలశుద్ధి సాధనాలు, జోడు బల్లలు, కంప్యూటర్‌లు, ఉపకరణ సామగ్రి, దోమ తెరలు, ఆటవస్తువులు, బి.ఎ.ఎస్ కింద అదనపు సీట్లు మొదలైన వాటిని ఏర్పాటు చేయడానికి రూ. 200.00 కోట్ల వ్యయంతో ప్రణాళికను చేపట్టారు.

### షెడ్యూల్డు ప్రాంతాలకు పంచాయతీల విస్తరణ (PESA)

కీలక ఆదర్శాలైన స్వయం పాలన, అధికార వికేంద్రీకరణ మొదలైన సిద్ధాంతాలను అమలు చేస్తూ, షెడ్యూల్డు ప్రాంతాల నివాసులైన గిరిజనుల ప్రయోజనాలను కాపాడడానికి పీసా చట్టాన్ని చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో 78 షెడ్యూల్డు ప్రాంత మండళ్లు, 690 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 4127 గిరిజన ఆవాసాలు / శివార్లకు సంబంధించి గ్రామసభలను నిర్వహించడానికి దాదాపు 1594 గ్రామాలను గ్రామసభా గ్రామాలుగా ప్రకటించారు.

### ఆశ్రమ్ స్కూళ్లు, వసతి గృహాలు

గిరిజన సంక్షేమ శాఖ 283 ఆశ్రమ్ స్కూళ్ళను నడుపుతోంది. వీటిలో 85,843 మంది ఎస్.టి విద్యార్థులు చదువుకుంటున్నారు. 212 హాస్టళ్లను నడుపుతోంది. వీటిలో 40,763 మంది బసచేస్తున్నారు. 101 మెట్రిక్ అనంతర హాస్టళ్లలో 20,100 మంది విద్యార్థులు బస చేస్తున్నారు. 2014 మార్చిలో జరిగిన ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షలో ఎస్.టి విద్యార్థులలో ఉత్తీర్ణత శాతం 84.21.

### గురుకులం

గురుకులం 150 విద్యాసంస్థలను నిర్వహిస్తోంది. వీటిలో 38,511 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. టి.డబ్ల్యు గురుకుల పాఠశాలలలో చదువుకున్న విద్యార్థులలో 2014 మార్చిలో ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షలు రాసి, ఉత్తీర్ణులైన వారు దాదాపు 88.67 శాతం. టి.డబ్ల్యు గురుకుల జూనియర్ కళాశాలలలో ఇంటర్మీడియట్ చదివి, పబ్లిక్ పరీక్ష రాసి ఉత్తీర్ణులైన వారి శాతం 85.80. ఇది రాష్ట్ర సగటు 55.85తో పోలిస్తే మెరుగైన స్థితిలో ఉంది.

### మెట్రిక్-అనంతర ఉపకార వేతనాలు

షెడ్యూల్డు తెగలకు చెందిన అర్హులైన అందరు మెట్రిక్ - అనంతర విద్యార్థులకూ ఆవాస, ఆవాసేతర ఉపకార వేతనాలు లభిస్తున్నాయి. 1.50 లక్షల మంది విద్యార్థులకూ రూ. 256.42 కోట్లు మంజూరై, ఆన్‌లైన్ విధానంలో పంపిణీ అయింది.

### ఆర్థిక మద్దతు పథకాలు

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్.టిలకు లబ్ధి చేకూర్చడానికి తెలంగాణ ఎస్.టి సహకార ఆర్థిక సంస్థ (TRICOR) అనేక పథకాలను అమలుచేస్తోంది. 2014-15సంవత్సరంలో 25,765 మంది లబ్ధిదారులకు సాయపడాలని లక్ష్యంగా పెట్టుకుంది.

### అటవీ హక్కుల చట్టం (ఆర్.ఓ.ఎఫ్.ఆర్) 2006 గుర్తింపు అమలు

న్యాయమైన జీవనాధారం కోసం తరతరాలుగా అడవులలో నివసిస్తున్న, అడవుల మీద ఆధారపడిన అటవీ నివాసుల హక్కులను నమోదు చేయాలనీ, వాటిని గుర్తించాలనీ షెడ్యూల్డు తెగలు, ఇతర సంప్రదాయ అటవీ వాసుల (అటవీ హక్కుల చట్టం గుర్తింపు) చట్టం, 2006 నిర్దేశిస్తుంది. నిర్ణీతమైన జాతి హక్కులను కూడా ఈ చట్టం వారికి హక్కుభుక్తం (రిజర్వ్) చేస్తుంది. తద్వారా చిన్న చిన్న

అటవీ ఉత్పత్తులను సేకరించుకునే హక్కును వారికి పదిలం చేస్తుంది. ఈ చట్టం కింద 95,022 మంది వ్యక్తులకు అటవీ భూమిలో 8,09,059 ఎకరాలను పంపిణీ చేస్తూ దస్తావేజులను అందజేయడం జరిగింది.

### 1/70 చట్టం అమలు

ఈ చట్టం కింద, 1,05,500 ఎకరాలతో ముడిపడిన భూమి బదిలీకి సంబంధించిన (ఎల్.టి.ఆర్) 31,188 కేసులను గిరిజనులకు అనుకూలంగా పరిష్కరించడం జరిగింది.

### ఇంజనీరింగ్ పథకాలు

గిరిజన ప్రాంతాలు / గ్రామాలలో కాలక్రమంలో గుర్తించిన అవసరాల ప్రకారం, రోడ్లు పనులు, భవనాలు, తాగు నీటి పథకాలు వంటి వివిధ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగాన్ని సృష్టించడం జరిగింది.

- 13వ ఆర్థిక సంఘం కింద రూ. 45.23 కోట్ల కేటాయింపుతో బహుళ గ్రామాల పథకం, ఏక గ్రామ పథకం కిందకు వచ్చే 727 పనులను చేపట్టడం జరిగింది. ఆర్.డబ్ల్యు.ఎస్ అండ్ ఎస్ శాఖ కూడా 54.60 కోట్ల రూపాయలు వ్యయమయ్యే 311 పనులను చేపట్టడం జరిగింది.
- గిరిజన సంక్షేమ విద్యా సంస్థల(279 ఆశ్రమ పాఠశాలలు, 379 గురుకుల పాఠశాలలు)లో 279.20 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో మౌలిక సదుపాయాల పనుల మంజూరు జరిగింది. వీటిలో 96 పనులు పూర్తి కాగా, మరో 283 పనులు పురోగతిలో ఉన్నాయి.
- నబార్డ్ కింద రూ. 43.92 కోట్ల అంచనా వ్యయంతో (27) రోడ్లు పనులు మంజూరయ్యాయి. వాటిలో 32.12 కోట్ల రూపాయల ఖర్చుతో 23 పనులు పూర్తయ్యాయి.
- ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ (ఆర్.సి.పి 2) కింద రూ. 212.65 కోట్ల వ్యయంతో 1287 పనులను చేపట్టగా, వాటిలో రూ. 23.52 కోట్ల ఖర్చుతో 300 పనులు పూర్తయ్యాయి.
- ఖమ్మం జిల్లాలో వామపక్ష తీవ్రవాద కార్యక్రమం కింద రూ. 210.80 కోట్ల ఖర్చుతో 42 పనులను చేపట్టడం జరిగింది. రూ. 200.12 కోట్ల వ్యయంతో అన్ని పనులనూ పూర్తి చేయడం జరిగింది.
- మేడారం జాతర కోసం బండ్లు నడిచే దారుల అభివృద్ధి, ప్రస్తుతమున్న మట్టి రోడ్లు బి.టి రోడ్లుగా అభివృద్ధి, తాగు నీటి సదుపాయాలు, ఇతర సదుపాయాల వంటి అనేక పనులను రూ. 7.99 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టి, పూర్తి చేయడం జరిగింది.

### గిరిజన సహకార కార్పొరేషన్ లిమిటెడ్

ఏజన్సీ గిరిజనుల సామాజిక-ఆర్థిక అభివృద్ధి కోసం గిరిజన సహకార కార్పొరేషన్‌ను నెలకొల్పారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లకు, గిరిజనులకు నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేయాలనే సంకల్పంతో కామారెడ్డి (నిజామాబాద్ జిల్లా)లో తేనె శుద్ధి విభాగాన్ని, నిర్మల్ (ఆదిలాబాద్ జిల్లా)లో సబ్బుల తయారీ విభాగాన్ని, ఏటూరు నాగారం (వరంగల్ జిల్లా)లో పసుపు పొడి కర్మాగారాన్ని, కొండనాగుల (మహబూబ్‌నగర్ జిల్లా)లో షాంపూ తయారీ విభాగాన్ని నెలకొల్పడం జరిగింది. అనేకానేక సరకులను భద్రపరచడానికి పనికివచ్చే శీతల గిడ్డంగులను, సొసైటీ కార్యాలయాలకు అవసరమైన భవనాలను, బహుళార్థ సాధక డి.ఆర్ డిపోలు - వెన్ - ఎన్.టి.ఎఫ్.పి స్టోరేజ్ గోడౌన్‌లు మొదలైన వాటి నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది.

### వెనుకబడిన తరగతుల సంక్షేమం

పాడి ఆవుల పెంపకం, గొర్రెల పెంపకం, కల్లు గీత, మట్టి పనులు, చేపలు పట్టడం, నేత, బంగారం పనులు, కమ్మరం, ఇత్తడి పనులు, వడ్రంగం, రాళ్ల చెక్కడం, దుస్తులను ఉతికి ఇస్త్రీ చేయడం, కుండలు చేయటం, నూనె తీయడం, మేదరి పని, క్షౌరం, దర్జీ పని, వస్త్రాలకు అద్దకాలు వేయడం మొదలైన అనేక సంప్రదాయకమైన వృత్తిపనులను వెనుకబడిన తరగతులు / జాతులకు చెందిన వారు కొనసాగిస్తారు. ఈ విధమైన 112 జాతులను ఎ, బి, సి, డి, ఇ అనే అయిదు రకాలుగా వర్గీకరించడం జరిగింది. ఈ జాతులను పైకి తేవడానికి ప్రభుత్వం అనేకానేక సంక్షేమ, విద్యా, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. బి.సి సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థు (ఇ.బి.సి)లకు మెట్రిక్-అనంతర రుసుములు, బోధన రుసుముల భర్తీ, వీటిలో ప్రముఖమైనవి. 2013-14లో బి.సి సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 88.09.

## వసతి గృహాలు

వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు మెట్రిక్‌కు ముందరి వరకు గల చదువులు చదువుకోడానికి వీలుగా, వారికి బస, భోజనం ఉచితంగా కల్పించడానికి ఈ వసతిగృహాలను ఏర్పాటు చేశారు. బాలురకు 374 వసతి గృహాలు, బాలికలకు 116 వసతి గృహాలు కలిపి మొత్తం 490 ప్రభుత్వ బి.సి హాస్టళ్లు ఇప్పుడున్నాయి. 2014-15లో బి.సి హాస్టళ్ళలో మొత్తం 49,370 మందికి ప్రవేశం కల్పించడం జరిగింది. వీరిలో 37,740 మంది బాలురు, 11,630 మంది బాలికలు. సమగ్ర సామాజికాభివృద్ధి సాధన ఆశయంతో వసతి గృహాలు అన్నింటిలోనూ వెనుకబడిన తరగతుల వారికి 76 శాతం, షెడ్యూల్డు కులాల వారికి 10 శాతం, షెడ్యూల్డు తెగల వారికి 5 శాతం, అల్పసంఖ్యాక వర్గాలకు 3 శాతం, ఇతర జాతుల వారికి 6 శాతం ప్రవేశం కల్పిస్తున్నారు.

మొత్తం 490 హాస్టళ్లలో 362 హాస్టళ్లు ప్రభుత్వ భవనాలలో ఉన్నాయి. తక్కిన హాస్టళ్లకు గానూ, కేంద్ర పోషిత పథకం కింద లభించే సమాన గ్రాంటుతో 31 భవనాలు నిర్మాణంలో ఉన్నాయి.

## కళాశాల యువతులకు, బాలురకు వసతి గృహాలు

వెనుకబడిన తరగతులకు చెందిన వారిలో బాలికలకు, బాలురకు ఉన్నత విద్యా సాధనను పెంచడానికి గానూ ప్రతి శాసనసభా నియోజక వర్గానికి బాలురకు ఒక హాస్టల్‌ను, బాలికలకు ఒక హాస్టల్‌ను నెలకొల్పాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2014-15 సంవత్సరంలో 247 కళాశాల వసతి గృహాలు పనిచేస్తుండగా, వాటిలో బాలురకు ఉద్దేశించినవి 123, బాలికలకు ఉద్దేశించినవి 124. వాటిలో బస చేస్తున్న మొత్తం 17,334 మంది విద్యార్థులలో 8,917 మంది బాలురు, 8,417 మంది బాలికలు. సమగ్ర సామాజికాభివృద్ధి సాధనను ప్రోత్సహించడం లక్ష్యంగా, బాలురకు, బాలికలకు ఉద్దేశించిన ఈ కళాశాల హాస్టళ్లు అన్నింటిలోనూ వెనుకబడిన తరగతుల విద్యార్థులకు 69 శాతం, షెడ్యూల్డు కులాల విద్యార్థులకు 15 శాతం, షెడ్యూల్డు తెగల విద్యార్థులకు 6 శాతం, అల్ప సంఖ్యాక వర్గాలకు 10 శాతం ప్రవేశం కల్పిస్తున్నారు.

## ఆవాస విద్యాలయాలు

2014-15 సంవత్సరంలో 19 బి.సి గురుకుల పాఠశాలలు పనిచేస్తున్నాయి. వాటిలో 12 బాలురవి కాగా, 7 బాలికలవి. ఈ పాఠశాలలలో మొత్తం 7,584 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో 5,218 మంది బాలురు కాగా, 2,366 మంది బాలికలు. ఈ గురుకుల పాఠశాలలు అన్నింటిలోనూ వెనుకబడిన తరగతుల విద్యార్థులకు 74 శాతం, షెడ్యూల్డు కులాల విద్యార్థులకు 15 శాతం, షెడ్యూల్డు తెగల విద్యార్థులకు 6 శాతం, ఆర్థికంగా వెనుక బడిన వర్గాలకు 2 శాతం, అనాథలకు 3 శాతం ప్రవేశాలు కల్పించడం జరుగుతోంది. మెదక్ జిల్లాలో కొడిపల్లి పాఠశాలను పూర్తిగా మత్స్యకారుల పిల్లలకే ఉద్దేశించారు.

## బి.సి విద్యార్థులకు మెట్రిక్ అనంతర ఉపకార వేతనాలు, బోధన రుసుముల భర్తీ

ఉన్నత విద్యాభ్యాసం గావించే సామర్థ్యాన్ని బి.సి విద్యార్థులకు కలిగించే నిమిత్తం ప్రభుత్వం బి.సి విద్యార్థులకు మెట్రిక్ అనంతర ఉపకార వేతనాలు, బోధన రుసుముల భర్తీ పథకాన్ని అమలు చేస్తోంది. ఏడాది ఆదాయం లక్ష రూపాయల లోపు ఉన్న అర్హులైన అందరు బి.సి విద్యార్థులకు సంతృప్త ప్రాతిపదిక మీద మెట్రిక్ అనంతర ఉపకార వేతనాలను, బోధన రుసుముల భర్తీని మంజూరు చేస్తోంది. 2014-15 సంవత్సరానికి ఉపకార వేతనాలు, బోధన రుసుముల భర్తీకి పేర్ల నమోదు కార్యక్రమం అమలు జరుగుతోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు బోధన రుసుము భర్తీ చేయడానికి కూడా బి.సిలకు వర్తించే షరతులే వర్తిస్తాయి.

## వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ లిమిటెడ్.

మార్జిన్ మనీ, రాజీవ్ అభ్యుదయ యోజన పథకాలను ఈ కార్పొరేషన్ అమలు చేస్తోంది.

## మార్జిన్ మనీ

వ్యవసాయ, తదనుబంధ రంగాలలోనూ, చిన్న వ్యాపారాలు, పరిశ్రమలలోనూ, సేవా, రవాణా రంగ కార్యకలాపాలలోనూ బి.సి లబ్ధిదారులకు ఆర్థికపరమైన సహాయాన్ని అందజేయడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. ఒక్కో యూనిట్‌కు, లబ్ధిదారునికి లక్ష రూపాయలు మించని రీతిలో 50 శాతం సబ్సిడీని, యూనిట్ ఖర్చులో 50 శాతాన్ని బ్యాంకు రుణంగా ఇవ్వడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. యూనిట్ ఖర్చు రూ. 2.00 లక్షలు మించిన ప్రతి సందర్భంలోనూ లక్ష రూపాయలు సబ్సిడీ ఇచ్చి, తక్కిన భాగాన్ని బ్యాంకుల నుంచి రుణంగా ఇస్తున్నారు.

2014-15లో 31,501 కుటుంబాలకు లబ్ధి చేకూర్చడానికి రూ. 173.04 కోట్ల విలువైన కార్యాచరణ ప్రణాళిక అమలులో ఉంది. దీనిలో రూ. 86.52 కోట్లు కార్పొరేషన్ ఇస్తున్న సబ్సిడీకి సంబంధించినది. మరో రూ. 86.52 కోట్లు బ్యాంకుల నుంచి రుణంగా లభిస్తున్నది

## బి.సి హస్తకళాకారుల, ఇతర వృత్తి వర్గాల సహాయపథకం

పట్టణ ప్రాంతాలలో బి.సి హస్తకళాకారులకు / బి.సి వృత్తి వర్గాలకు ఆర్థిక సహాయం సమకూర్చే నిమిత్తం, లబ్ధిదారునికి లక్ష రూపాయలు మించని స్థాయిలో యూనిట్ వ్యయంలో 50 శాతాన్ని సబ్సిడీగా ఇస్తారు. యూనిట్ ఖర్చు రూ. 2,00,00/- మించిన సందర్భాలలో లక్ష రూపాయలను సబ్సిడీగా ఇచ్చి, తక్కిన మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణంగా సమకూరుస్తారు.

2014-15లో 10,497 కుటుంబాలకు లబ్ధి చేకూర్చే రూ. 57.66 కోట్ల కార్యాచరణ ప్రణాళిక అమలులో ఉంది.

## అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం

రాష్ట్ర జనాభా కుల, మత, వర్గ, లింగాది సమ్మేళన చిత్రంలో అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఈ వర్గాలలో చాలా భాగం ఆర్థికంగా, సామాజికంగా రెండు రకాలుగానూ వెనుకబడి ఉన్నారు. ఈ కారణంగా వీరి ప్రయోజనం నిమిత్తం వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలుచేస్తోంది.

## ఉర్దూ అకాడమీ

ఉర్దూ భాషను, సాహిత్యాన్ని సంరక్షించడానికి, అభివృద్ధి చేయడానికి ఉర్దూ అకాడమీ ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ. అకాడమీ ఈ దిగువ పథకాలను అమలు చేస్తోంది.

- ఉర్దూ భాషా పరిరక్షణ, అభివృద్ధి
- ఉర్దూ కంప్యూటర్ విద్యలో వృత్తి విద్యా శిక్షణ
- అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం నిమిత్తం ప్రణాళికా పథకాల గురించి జాగృత పరచడం
- ఉర్దూ ఘర్ - కమ్ - షాదీ ఖానాల నిర్మాణం
- కొత్త హాజ్ హౌస్ నిర్మాణం.

రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్‌లో రూ. 5.00 కోట్ల అంచనా వ్యయంతో, దర్గా హజరత్ ఖాజా మొయినుద్దీన్ చిస్తీ ఘరీబ్ నవాజ్ (ఆర్.ఎ) వద్ద ఫెసిలిటేషన్ సెంటర్-కమ్-రుబాత్‌ను నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.

## రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యువతీయువకులు ఉద్యోగాలకు పోటీ పడగలిగే విధంగానూ, ఆర్థికాభివృద్ధి సాధనకు సమర్థులు కాగలిగే విధంగానూ శిక్షణ ద్వారా వారి నైపుణ్యాలను మెరుగుపరచాలని ప్రభుత్వం తలపెట్టింది. 2014-15 సంవత్సరంలో వీరికి రూ. 20.00 కోట్లు కేటాయింపు జరిగింది. 2014-15 సంవత్సరంలో 1.76 లక్షల ప్రీ-మెట్రిక్ ఉపకార వేతనాల నిమిత్తం రూ. 48.03 కోట్లను భారత ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే 1259 మెట్రిక్ అనంతర ఉపకార వేతనాల నిమిత్తం రూ. 3.38 కోట్లను, 12,258 మెరిట్-కమ్-మీన్స్ ఉపకార వేతనాల నిమిత్తం రూ. 7.25 కోట్లను మంజూరు చేసింది.

## తెలంగాణ రాష్ట్ర క్రైస్తవ (అల్పసంఖ్యాక వర్గాల) ఫైనాన్స్ కార్పొరేషన్

రాష్ట్రంలో పేద క్రైస్తవుల సమస్యల మీద ప్రభుత్వం దృష్టి పెట్టి, నిర్ణీత కాల వ్యవధిలో అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం ద్వారా వారి సంక్షేమాన్ని పెంచి, పైకి తీసుకురావడం కార్పొరేషన్ ఆశయం. కార్పొరేషన్‌ను నెలకొల్పినప్పటి నుంచి వివిధ కార్యకలాపాల ద్వారా, ప్రత్యేకించి విద్య, ఉపాధి కల్పన రంగాలలో వివిధ కార్యకలాపాలను అమలు చేస్తోంది.

హైదరాబాద్‌లో క్రైస్తవ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 10.00 కోట్లు మంజూరు చేసింది. క్రైస్తవ యువ సంక్షేమ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడానికి, వివాహాలు, ఇతర సామాజిక, సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించడానికి ఈ భవనాన్ని ఉపయోగిస్తారు.

## మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం

స్త్రీ, పురుష సమానత్వాన్ని ప్రబోధించే సూత్రం భారత రాజ్యాంగంలో పొదిగి ఉంది. సమాన అవకాశాలు, సమానమైన పనికి సమానమైన వేతనం నిర్దేశించి ఉన్నాయి. ఏ మహిళ పట్ల వివక్షతో వ్యవహరించరాదని స్పష్టం చేయడం జరిగింది. అంతే గాక, మహిళల ఆత్మగౌరవానికి

భంగం కలిగించే విధానాలను వదలించడానికి, న్యాయమైన, మానవీయమైన పని పరిస్థితులను కల్పించడానికి వీలుగా మహిళలకు, బాలలకు రాజ్యం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించింది.

### ఈ శాఖ బహుముఖమైన కార్యకలాపాలను స్థూలంగా మూడు విభాగాలుగా వర్గీకరించవచ్చు

- సమీకృత శిశు అభివృద్ధి సేవల (ఐ.సి.డి.ఎస్) కార్యక్రమం అమలు. రాష్ట్రం మొత్తం మీద 149 ప్రాజెక్టులతో ఈ కార్యక్రమాన్ని సార్వత్రికరణ చేయడం జరిగింది.
- సంరక్షణ, ఆలనాపాలనలు అవసరమైన సందర్భాలలో మహిళా, శిశు సంక్షేమం నిమిత్తం సంస్థల నిర్వహణ.
- మహిళలకు, శిశువులకు సంబంధించి సంరక్షణ / సంక్షేమం, సాధికారతా చర్యల అమలు, పర్యవేక్షణ.

## కొత్త ప్రయత్నాలు

### ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం

గర్భిణులకు, బిడ్డకు పాలిస్తున్న తల్లులకు ఒక పూర్తి భోజనాన్ని సమకూర్చడానికి ఉద్దేశించిన కార్యక్రమమిది. దీనిని 2015 జనవరి 1వ తేదీ నుంచి అన్ని అంగన్‌వాడి కేంద్రాల (ఎ.డబ్ల్యు.సిల)లోనూ విస్తరించారు. ఎ.డబ్ల్యు.సిలలో గర్భిణులకు, బిడ్డలకు పాలిస్తున్న తల్లులకు ఒక పూర్తి భోజనాన్ని ప్రతి రోజూ సమకూర్చడం జరుగుతోంది. రూ. 105.86 కోట్ల ఖర్చుతో 5,66,917 మంది మహిళలకు ఈ ప్రయోజనాన్ని కల్పించడం జరిగింది.

### మహిళల రక్షణ, సాధికారతల కోసం తెలంగాణ స్టేట్ సొసైటీ

రాష్ట్రంలోని మహిళలు, బాలికల భద్రత, రక్షణ, సంరక్షణ, సాధికారతల కోసం 'తెలంగాణ స్టేట్ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్' పేరుతో సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం, 2001 కింద 2014 నవంబర్ 25వ తేదీన సంస్థ రిజిస్టరైంది.

### 24/7 మహిళల హెల్ప్‌లైన్ (181)

వివిధ అత్యాచారాలకు వ్యతిరేకంగా శీఘ్రమే స్పందించడానికి సమీకృత మహిళా హెల్ప్‌లైన్ ప్రారంభించడానికి చర్యలు మొదలయ్యాయి. మహిళలు ఏ రకమైన హింసకు గురైనా తక్షణమే స్పందించడానికి నిర్భయ సెంటర్ / పోలీస్ / హాస్పిటల్ / యాంబులెన్స్‌లకు అత్యవసరంగా తెలియజేయడం ద్వారా రోజు పొడవునా 24 గంటల పాటు అత్యవసర స్పందన సహాయాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నారు.

### షి-ట్యాక్సీ పథకం

ఈ పథకాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించవలసిందంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ట్యాక్సీకి 35 శాతం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తోంది.

### సమీకృత శిశు అభివృద్ధి సేవలు

0-6 ఏళ్ల మధ్య వయసు గల బాలల పోషణ, ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరచడానికి, వారి మానసిక, భౌతిక, సామాజిక అభివృద్ధికి కేంద్ర పోషణలో నడుస్తున్న ఏకైక అతి పెద్ద సమీకృత కార్యక్రమం ఐ.సి.డి.ఎస్ పథకం. ఐ.సి.డి.ఎస్ ద్వారా దిగువ సేవలు సమకూరుతున్నాయి.

ఎ) అప్పుడే పుట్టిన శిశువు నుంచి 6 ఏళ్ల వయసు బాలల వరకు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు అనుబంధ పోషణ కార్యక్రమం

బి) పిల్లలకు ప్రీ-స్కూల్ విద్య

సి) టీకాలు వేయడం

డి) ఆరోగ్య తనిఖీలు

ఇ) సిఫార్సు సేవలు

ఎఫ్) బాలలకు, మహిళలకు, వయోజనులైన యువతులకు ఆరోగ్యం, పోషణలపై విద్యాచైతన్యం.

31,711 ప్రధాన ఎ.డబ్ల్యు.సిలకు 25,326 ఎ.డబ్ల్యు.సిలు గ్రామీణ ప్రాంతాలలో, 3,716 ఎ.డబ్ల్యు.సిలు పట్టణ ప్రాంతాలలో, 2,669 ఎ.డబ్ల్యు.సిలు గిరిజన ప్రాంతాలలో ఉన్నాయి. వీటికి అదనంగా 3,989 మినీ ఎ.డబ్ల్యు.సిలు ఉండగా, వాటిలో 3,160 గ్రామీణ ప్రాంతాలలోను, 42 ఎ.డబ్ల్యు.సిలు పట్టణ ప్రాంతాలలోను, 787 ఎ.డబ్ల్యు.సిలు గిరిజన ప్రాంతాలలోను పనిచేస్తున్నాయి. ఇవి

5,66,917 మంది మహిళలకు, 19,05,385 మంది బాలలకు ప్రయోజనం కలిగిస్తున్నాయి.

అంగన్ వాడి కార్యకర్తలకు ఇచ్చే నెలసరి వేతనాన్ని 2015 మార్చి 1వ తేదీ నుంచి రూ. 4,200 నుంచి రూ. 7,000కి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే అంగన్‌వాడి సహాయకులకు నెల వేతనాన్ని రూ. 2,500 నుంచి రూ. 4,500కి పెంచింది. వంట పాత్రల కొనుగోలు నిమిత్తం ఒకసారి ఇచ్చే గ్రాంటుగా 35,000 అంగన్ వాడీ కేంద్రాలకు తలొక రూ. 1,000 మంజూరు చేస్తారు.

## అనుబంధ పోషకాహార కార్యక్రమం

అనుబంధ పోషకాహార కార్యక్రమం (ఎస్.ఎన్.పి) కింద 'భుజించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని' (వండనవసరం లేని ఆహారాన్ని) 7 నెలలు మొదలు 3 ఏళ్ల వయసు కలిగిన బాలలకు సమకూర్చుతున్నారు. వండి, వేడివేడిగా వడ్డించవలసిన ఆహారాన్ని మొత్తం 149 ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టులలోనూ 3-6 ఏళ్ల వయసు బాలలకు పెడుతున్నారు. ప్రస్తుతంలో ఎస్.ఎన్.పి విభాగం కింద లబ్ధిపొందుతున్న వారు 800 జనాభాకు 85 మంది (సంతృప్తీకరణ ద్వారా కట్టిన సగటు) అయ్యారు. దీనిలో నమోదైన ప్రయోజితులు 24.72 లక్షల మంది.

## కిశోరి శక్తి యోజన

ఈ పథకం 11-18 ఏళ్ల మధ్య వయసు బాలికలకు సాధికారత కలిగించడానికి ఉద్దేశించినది. పోషణరీత్యా, లైంగిక అసౌకర్యాల రీత్యా కలిగే ఇబ్బందుల వలయాన్ని ఛేదించడం ద్వారా, బాలికల స్వీయ అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా బాలికలకు సాయపడతారు. దీనిలో దృష్టిని ప్రధానంగా పోషణ, ఆరోగ్యం, విద్యా నైపుణ్యాల అభివృద్ధి మీద, గృహ ఆధారిత నైపుణ్యాలను, జీవిత నైపుణ్యాలను, వృత్తి నైపుణ్యాలను పెంచడం మీద కేంద్రీకరిస్తారు.

గృహ హింస నుంచి, కార్యాలయ వేధింపుల నుంచి మహిళలను కాపాడడానికి గృహ హింస చట్టం - 2005ని ఉపయోగిస్తున్నారు.

## సమీకృత శిశు సంరక్షణ పథకం

ప్రతికూలతలకు ఆలవాలమైన బాలలకు నివారణ, చట్ట పరమైన సేవలు, సంరక్షణ, పునరావాసం మొదలైన సేవలను ఐ.సి.పి.ఎస్ సమకూరుస్తుంది. నిరాదరణకు ఎక్కువగా ఆలవాలమైన కుటుంబాలకు చెందిన బాలలకు, ప్రమాదాలకు ఆలవాలమైన కుటుంబాలకు చెందిన బాలలకు, వివక్ష వంటి వాటి ద్వారా సామాజికంగా దూరంగా ఉంచబడిన కుటుంబాలకు చెందిన బాలలు, అల్పసంఖ్యాక వర్గాలు, అనాథ బాలలు, హెచ్.ఐ.వి / ఎయిడ్స్ వ్యాధి సోకిన బాలలు, బాల్యంలో మాదక ద్రవ్య, పదార్థ ద్రవ్య వ్యసనాలలో పడిన బాలలు, బాల యాచకులు, అమ్మివేయబడిన బాలలు, లైంగిక దోపిడికి గురైన బాలలు, ఖైదీల బాలలు, వీధి బాలలు, శ్రామిక బాలలు మొదలైన వారందరినీ ఆదుకోడానికి ఐ.సి.పి.ఎస్ కృషి చేస్తుంది.

## బాల నేరస్తుల సంక్షేమం

బాల్యంలో పెడదారులు తొక్కి, నేరస్తులుగా మారిన బాలలను సరిదిద్ది, వారి ఆలనాపాలనా, సంక్షేమాలను చూడడానికి చదువు సంధ్యలు, వ్యవస్థాపక సేవలు, వ్యవస్థేతర సేవల సాయం తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్య అత్యంత ముఖ్యమైన భాగం.

తెలంగాణలో రెండు చిల్డ్రన్ హోమ్‌లు, మూడు అబ్జర్వేషన్ హోమ్‌లు, ఒక స్పెషల్ హోమ్, ప్రత్యేకించి బాలికల కోసం ఒక హోమ్, ఒక 'అనంతర సంరక్షణ గృహం' పనిచేస్తున్నాయి.

'యువ కౌమార కౌన్సెలింగ్ అండ్ గైడెన్స్ క్లినిక్'ల ద్వారా వ్యవస్థేతర సేవలను అందిస్తున్నారు. వీటిలో మానసిక, ఆరోగ్య సంబంధమైన జాగృతి, కౌన్సెలింగ్, గైడెన్స్ సేవలను బాలలకు, కౌమారులకు అందిస్తున్నారు.

## వికలాంగులను ఆదుకునే పథకాలు

వికలాంగులకు వివక్షల నివారణ, స్వేచ్ఛా వాతావరణంలో విద్యాభివృద్ధి, ఉపాధి ప్రోత్సాహం, వృత్తి విద్యా శిక్షణ, పునరావాస సేవలను కల్పించే విషయాలకు వికలాంగ చట్టం, 1996 దోహదం చేస్తుంది.

వైకల్యం కలిగిన వ్యక్తుల సాధికారతకు, పునరావాసానికి అనేక పథకాలు అమలు జరుగుతున్నాయి. వారి జీవిత నాణ్యతను పెంచడానికి, వారు హుందాగా తమ జీవితాలను నడుపుకోడానికి దోహదం చేసేలా భౌతికంగా, మానసికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థిక పునరావాస పరంగా, అభివృద్ధి పరంగా వారిని మంచి స్థితిలో నిలపడానికి ఈ పథకాలను ఉద్దేశించారు.

## అవసరాల సర్వే, మదింపు, వైద్య ధృవీకరణ పత్రాలు, గుర్తింపు కార్డుల జారీ

'సాఫ్ట్‌వేర్ ఫర్ అసెస్‌మెంట్ ఆఫ్ డిజేబుల్డ్ ఫర్ యాక్సెస్, రిహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్' (సదరెమ్) అనేది కంప్యూటర్ ఆధారితమైన ఒక సాధనం. వైద్య-ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి మొదలైన శాఖలతో కలిసి ఈ మదింపు విధానాన్ని సంక్షేమ శాఖ సిద్ధం చేసింది. భారత ప్రభుత్వ మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా వైకల్యాన్ని మదింపు చేయడానికి ఈ సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగిస్తారు. ఇది విశిష్టమైన ఐ.డితో వికలాంగ ధృవీకరణ పత్రాలను, గుర్తింపు కార్డులను జారీ చేస్తుంది. అంతే గాక, వారికి వర్తింపజేసే సేవలను కూడా ఎప్పటికప్పుడు గుర్తిస్తుంది. ఆ విధంగా సిద్ధం చేసిన సమాచార నిధిని ప్రజా క్షేత్రంలో అందుబాటులోకి తెచ్చి, సేవలను అందించే వారికి ఈ వికలాంగులను అందుబాటులోకి తెస్తారు. సదరెమ్ ద్వారా 5,27,159 కంప్యూటరీకృత ధృవీకరణ పత్రాలను వికలాంగులకు జారీ చేశారు.

## సాధనాలు, సహాయ ఉపకరణాలు

భారత కృత్రిమ అవయవాల ఉత్పత్తి కార్పొరేషన్ (అలిమ్‌కో) సహకారంతో 2014-15 సంవత్సరంలో అన్ని జిల్లాలలోనూ రెండు దశలలో శిబిరాలను నిర్వహించాలని ప్రభుత్వం తలపెట్టింది. 8-12-2014 మొదలు 7-1-2015 వరకు వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, మెదక్ జిల్లాలలో శిబిరాలను నిర్వహించి, జిల్లాకు 2,948 మంది చొప్పున వివిధ సాధనాలకు, సహాయ ఉపకరణాలకు అర్హులైన వారిని గుర్తించారు. వారిని లబ్ధిదారులను గావించారు. 2015 ఫిబ్రవరి, మార్చి నెలలలో మిగిలిన జిల్లాలలో కూడా శిబిరాలను నిర్వహించాలని ప్రతిపాదించారు.

## వికలాంగుల, వృద్ధుల సంక్షేమం

తల్లితండ్రుల, వృద్ధుల భరణం, సంక్షేమాల చట్టం, 2007ని (2007 సంవత్సరం చట్టం 56) భారత ప్రభుత్వం చేసింది. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో మొత్తం 10 జిల్లాలలోనూ అప్పిలేట్ ట్రిబ్యునళ్ళను నెలకొల్పడం జరిగింది. రాష్ట్రం మొత్తం మీద 42 ట్రిబ్యునళ్లు పనిచేస్తున్నాయి.

## భారత ప్రభుత్వ పథకాలు

వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు (ఎన్.జి.ఓ)లకు భారత ప్రభుత్వం గ్రాంట్-ఇన్-ఎయిడ్‌ను మంజూరు చేసింది. నాలుగు జిల్లా వికలాంగ పునరావాస కేంద్రాలు (డి.డి.ఆర్.సి)లను తెలంగాణకు భారత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇవి నల్గొండ, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలకు కేటాయింపు జరిగాయి.

## 2014-15లో సాధించిన విజయాలు

వికలాంగులకు ప్రత్యేకించిన ఉద్యోగాల మిగులును భర్తీ చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక రిక్రూట్‌మెంట్ కార్యక్రమం చేపట్టింది. వికలాంగుల కోసం చేపట్టిన ఈ ప్రత్యేక రిక్రూట్‌మెంట్ కార్యక్రమంలో 2014-15లో 215 ఉద్యోగాలను గుర్తించారు. వికలాంగుల, ఓల్డ్ ఏజ్ హోమ్ నివాసుల నెలవారీ పింఛన్లను రూ. 500/- నుంచి రూ. 1500/-కు పెంచుతూ 2014 నవంబర్ 5వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వృద్ధాప్య పింఛన్ల కింద సుమారు 11,99,215 మంది, వికలాంగుల పింఛన్ల కింద 3,46,409 మంది లబ్ధిదారులయ్యారు.

## తెలంగాణ వికలాంగుల సహకార కార్పొరేషన్

వికలాంగుల పునరావాసానికి సాయపడడానికి, కార్పొరేషన్ ఈ కింది కార్యక్రమాలను చేపట్టింది.

1. కృత్రిమ అవయవాలు, చక్రాల కుర్చీలాంటి సంచార సదుపాయ ఉపకరణాల సరఫరా
2. వ్యక్తులకు, సంస్థలకు విద్యా సంబంధమైన సాధనాల సరఫరా
3. వివిధ సాంకేతిక, సాంకేతికేతర వ్యాపకాలలో శిక్షణ గరిపే సదుపాయాలు
4. చేసిన ఉత్పత్తులకు ఖచ్చితమైన విపణిలో ఉపాధి కల్పన ద్వారా ఉత్పత్తులను గావించే వ్యాపకాల నిర్వహణ
5. వివిధ వైకల్యాలను చిన్న వయసులోనే గుర్తించి, అప్రమత్తమై, వైద్యం చేయించేలాగా తల్లితండ్రులలో అవగాహనను పెంచడం.

# 3.2 సామాజిక అభివృద్ధి

*"కష్టాల కడలి నుంచి ఆశల పల్లకికి తీసుకెళ్ళేదే విద్య."*

*- కోఫీ అన్నన్*

ఏ సంక్షేమ రాజ్యానికైనా ప్రధాన లక్ష్యం ప్రజల నికరమైన, మనగలిగిన, మెరుగైన జీవన ప్రమాణం కోసం సామాజిక మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే. సామాజిక మౌలిక సదుపాయాలలో విద్య, ఆరోగ్యం, పోషణ, పారిశుద్ధ్యం, నీటి సరఫరా మొదలైనవి వస్తాయి. సామాజికాభివృద్ధిని వ్యవస్థీకృతం చేయడంతోనే అది ఆర్థికాభివృద్ధికి సంబంధించిన మొత్తం ప్రక్రియను నిలదొక్కుకునేలా చేస్తుంది.

## అక్షరాస్యత

రాష్ట్రంలో అక్షరాస్యత స్థాయి 2001 నాటి 58 శాతం నుంచి 2011 నాటికి 66.46 శాతానికి పెరిగింది. రాష్ట్ర అక్షరాస్యతా స్థాయి అఖిల భారత స్థాయి 72.99 శాతం కన్నా తక్కువ. గడచిన దశాబ్దంలో అక్షరాస్యతా వృద్ధి అటు జాతీయ స్థాయిలోనూ, ఇటు రాష్ట్ర స్థాయిలోనూ కూడా మందగించింది.

ఏడేళ్లు, అంతకు పైబడిన వయసు బాలలలో రాష్ట్రంలో సాధారణ అక్షరాస్యతా స్థాయి మరీ ఎక్కువగా లేవు. మూడో వంతు నిరక్షరాస్యులతో రాష్ట్రం 2011లో, రాష్ట్రాలలో 25వ ర్యాంకులో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో వయోజన అక్షరాస్యతా స్థాయి 73.7 శాతం. 2011-12లో ఈ విషయంలో జాతీయస్థాయిలు తెలంగాణ 21వ స్థానంలో ఉంది. ఒక్క వయోజన అక్షరాస్యుడూ లేని కుటుంబాలు గ్రామీణ తెలంగాణలో 29 శాతం. అదే అఖిల భారత స్థాయిలో ఉన్నది 2011-12లో 18.7 శాతం. ఏమైనప్పటికీ, పట్టణ విభాగంలో ఒక్క వయోజన అక్షరాస్యుడూ లేని కుటుంబాలు ఇప్పటికీ 6 శాతం ఉన్నాయి.

**పట్టిక 24 : చదువుసంధ్యల ప్రగతి సూచికలు**

| జిల్లా | అక్షరాస్యతా స్థాయిలు 2011 | | వయోజనఅక్షరాస్యత 2011-2012 | | యువజన అక్షరాస్యత 2011-2012 | | సెకండరీ అంతకు పైబడిన స్థాయి విద్యావంతులు, 2011-12 | |
|---|---|---|---|---|---|---|---|---|
| | గ్రామీణ | పట్టణ | గ్రామీణ | పట్టణ | గ్రామీణ | పట్టణ | గ్రామీణ | పట్టణ |
| ఆదిలాబాద్ | 55.30 | 75.60 | 52.08 | 76.07 | 89.83 | 99.07 | 25.16 | 48.96 |
| నిజామాబాద్ | 56.50 | 77.20 | 47.79 | 72.19 | 89.93 | 91.64 | 24.19 | 48.81 |
| కరీంనగర్ | 59.60 | 77.80 | 52.23 | 80.12 | 96.75 | 98.05 | 31.30 | 55.56 |
| మెదక్ | 56.00 | 78.60 | 45.62 | 70.76 | 82.70 | 90.78 | 26.13 | 47.75 |
| హైదరాబాద్ | - | 83.20 | - | 85.59 | - | 95.90 | - | 61.59 |
| రంగారెడ్డి | 60.60 | 82.30 | 60.84 | 78.32 | 93.32 | 94.65 | 37.74 | 54.39 |
| మహబూబ్‌నగర్ | 50.90 | 78.00 | 40.88 | 78.07 | 80.53 | 92.87 | 23.78 | 50.25 |
| నల్గొండ | 60.10 | 81.70 | 59.84 | 81.47 | 90.33 | 90.87 | 33.17 | 57.55 |
| వరంగల్ | 58.80 | 81.00 | 52.25 | 77.15 | 91.63 | 97.19 | 25.85 | 54.56 |
| ఖమ్మం | 59.80 | 81.30 | 59.15 | 84.97 | 89.43 | 99.34 | 31.20 | 57.39 |
| తెలంగాణ | 57.25 | 81.08 | 52.04 | 83.03 | 89.19 | 95.82 | 28.77 | 58.69 |

ఆధారం : ఉపాధికల్పన, నిరుద్యోగాలపై 68వ ఎన్.ఎస్.ఎస్. సర్వే అంచనాలు & జనాభా లెక్కలు, 2011

66.46 శాతం అక్షరాస్యతా స్థాయితో తెలంగాణ రాష్ట్రంలో అక్షరాస్యుల సంఖ్య 207.84 లక్షలు. వీరిలో 117.49 లక్షల మంది పురుషులు, 90.35 లక్షల మంది స్త్రీలు. నిష్పత్తుల పరంగా అక్షరాస్యతా స్థాయి పురుషులలో 74.95 శాతం కాగా, స్త్రీలలో అది 57.92 శాతం.

## పాఠశాల విద్య

'యు.ఎన్.డి.పి సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలు' (ఎం.డి.జి) గుర్తించిన ప్రకారం 'అందరికీ విద్య' అనేది మానవాభివృద్ధి ప్రాథమిక లక్ష్యాలలో ఒకటి. దీనినే భారత రాజ్యాంగం 21 ఏ అధికరణంలో పొందుపరచారు. 2009లో 93వ రాజ్యాంగ సవరణ జరిపిన మీదట విద్య అన్నది ప్రాథమిక హక్కుగా మారింది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి విద్య అందుబాటు, విద్యాలయ ప్రవేశంలో లైంగిక సమానత, మొత్తం మీద బడులలో చేరే విద్యార్థుల సంఖ్య మెరుగుదల, విద్యార్థులు సగంలో బడి మానేయకుండా చదువును పూర్తి కాలం కొనసాగించడం, నాణ్యమైన విద్యను అందించడం మొదలైనవన్నీ అవసరాలు.

ఈ రాజ్యాంగ శాసనాన్ని సమర్థంగా అమలు చేయడానికి, భారత దేశంలో ప్రాథమికోన్నత (ఎలిమెంటరీ) స్థాయి విద్యను 'సర్వ శిక్షా అభియాన్' (ఎస్.ఎస్.ఏ) కిందకు తెచ్చారు. ఇది ప్రాథమికోన్నత విద్యను సార్వత్రికం చేయడానికి ఉద్దేశించినది. అదే విధంగా సెకండరీ స్థాయి విద్యను 'రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్' (ఆర్.ఎం.ఎస్.ఏ) అనే అగ్రగామి కార్యక్రమం కిందకు తెచ్చారు. ఈ రెండు పథకాలనూ, అటు విద్యా హక్కు చట్టం అమలుతో కలిపి, విస్పష్టమైన రాష్ట్ర నిబంధనల ద్వారా రాష్ట్రంలో విద్యా రంగాన్ని పటిష్ఠం చేయడం ప్రభుత్వ విధానం.

## అందరికీ విద్య

పాఠశాల సదుపాయాలను నెలకొల్పడంలో దిగువ సూత్రాలను పాటించాలని విద్యా హక్కు చట్టం నిర్దేశిస్తోంది.

- విద్యార్థులు నడచి వెళ్లి రావడానికి వీలుగా, జనావాసాల నుంచి కిలోమీటరు దూరం మించకుండా, అందుబాటులో ప్రాథమిక స్థాయి (ప్రైమరీ) విద్యాలయాలు.
- విద్యార్థులు నడచి వెళ్లి రావడానికి వీలుగా, అన్ని జనావాసాల నుంచి 3 కిలోమీటర్ల లోపు దూరంలో ఎలిమెంటరీ (ప్రాథమికోన్నత) స్థాయి విద్యాలయాలు.
- విద్యార్థులు నడచి వెళ్లి రావడానికి వీలుగా అన్ని జనావాసాల నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో సెకండరీ (మాధ్యమిక) స్థాయి విద్యాలయాలు.

ఎలిమెంటరీ విద్యా స్థాయిలో తెలంగాణ రాష్ట్రం 99 శాతం అందుబాటును సాధించింది. పైన తెలిపిన సూత్రాలకు అనుగుణంగా విద్యాలయాలను నెలకొల్పడం ద్వారా సెకండరీ స్థాయిలో 91.5 శాతం అందుబాటును సాధించింది. గతంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యాలయాలు లేని తావులలో కొత్త ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యాలయాలను ప్రారంభించడం జరిగింది. పాఠశాల వయసు జనాభా లెక్కలకు వస్తే రాష్ట్రంలో 61.78 లక్షల మంది బాలలున్నారు. వీరికి పాఠశాల విద్యా సదుపాయాన్ని విద్యా శాఖ కల్పిస్తుంది. 2014-15లో వివిధ యాజమాన్యాలకు చెందిన 43208 పాఠశాలలు రాష్ట్రంలో నడుస్తున్నాయి. 'ప్రాథమిక విద్య సార్వత్రీకరణ' లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్రం చేరువలో ఉంది. ప్రాథమిక స్థాయి విద్యా సంస్థల స్థాయిలో భౌతికమైన మౌలిక సదుపాయాలను పటిష్ఠం చేయడానికి గణనీయమైన ప్రయత్నాలు జరిగాయి. దీనివలన విద్యాబోధనలో నాణ్యత, అధ్యాపకుడు - విద్యార్థుల నిష్పత్తి మెరుగుపడ్డాయి. 2014-15లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విద్యా స్థాయిలలో అధ్యాపకుడు - విద్యార్థుల నిష్పత్తి వరుసగా 27, 23, 24 ఉంది.

ఇక ఎలిమెంటరీ విద్య సార్వత్రీకరణ లక్ష్యంతో అనేకచర్యలు తీసుకోవడం జరిగింది. ఇప్పుడున్న పాఠశాలలను పటిష్ఠం చేయడం, కొత్త ప్రైమరీ పాఠశాలలను తెరవడం, మారుమూల ప్రాంతాలలోనూ, ఇప్పటి వరకూ పాఠశాల సదుపాయం లేని జనావాస ప్రాంతాలలోనూ ప్రత్యామ్నాయ విద్యాలయాలనూ, ఇతర రకాల విద్యా సదుపాయాలనూ నెలకొల్పడం ఈ చర్యలలో భాగాలు. కొత్త చర్యలు, బడిలో చేరని పిల్లలను వెదకి పట్టుకుని, ప్రోత్సహించి, తల్లితండ్రులకు నచ్చజెప్పి, వారిని బడిలో చేర్పించడం వంటి చర్యలు మంచి ఫలితాలనిచ్చాయి. పాఠశాలలలో పిల్లలు చేరడం పెరగడమే దీనికి నిదర్శనం. రాష్ట్రంలో అన్ని రకాల పాఠశాలలలో కలిపి 2014-15లో చేరిన విద్యార్థుల సంఖ్య 60.76 లక్షలు.

## చదువును అర్థంతరంగా మానేస్తున్న బాలలు

శ్రద్ధ వహించి ఎదుర్కోవలసిన మరొక సవాలు బాలలు బడులలో చదువును కొనసాగించేలా చూడడం. ఒక వంక బాలలందరికీ విద్య అందాలనే లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో బాలలు సగంలో బడి చదువులు మానేయకుండా కాపాడుకోవడం

ఒక బృహత్కార్యం. ప్రాథమిక స్థాయిలో బాలలు బడులలో చేరడం ఇతోధికమైన స్థాయిలో ఉంటుండగా, వారు ఒక్కో తరగతి చదువునూ పూర్తి చేసి, ముందుకు వెళుతున్నకొద్దీ, విద్యార్థుల సంఖ్య తీవ్రంగా పడిపోతోంది. 1 - 5 తరగతుల విద్యార్థులుండే ప్రాథమిక స్థాయిలో చదువును అర్థంతరంగా విరమిస్తున్న బాలలు తెలంగాణలో 22.32 శాతం ఉంటున్నారు. తదుపరి 1 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులలో చదువును అర్థంతరంగా నిలిపివేస్తున్న విద్యార్థులు 38.21 శాతం ఉంటోంది. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలలో బాలలను వ్యవసాయంలోనూ, ఇతర అనుబంధ కార్యకలాపాలలోనూ పెట్టడం వల్ల, ప్రత్యేకించి పంటలు పండించే రోజులలో వారిని పనులలోకి తీసుకెళ్లిపోవడం వల్ల వారి చదువు అర్థంతరంగా ఆగిపోతున్నదని 'ప్రథమ్' నిర్వహించిన ఎ.ఎస్.ఇ.ఆర్ 2014లో కనుగొన్నారు. ఇది ఇలా ఉండగా, బడి వయసు బాలలను తిరిగి బడులకు తేవడానికి చేస్తున్న ప్రయత్నాలను, అలాగే బాలికలకు ప్రత్యేక సదుపాయాలను కల్పించడాన్ని పటిష్ఠం చేయాల్సి ఉంది. అలాగే పరీక్షా వ్యవస్థలో సంస్కరణలను కూడా పటిష్ఠంగా తేవలసి ఉంది.

## మధ్యాహ్న భోజన పథకం

1 - 8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సరఫరా పథకాన్ని అమలు చేయడానికి భారత ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తన సొంత నిధులతో 9, 10 తరగతుల విద్యార్థులకు కూడా వర్తింపజేస్తోంది. విద్యార్థుల పోషణ స్థాయిలను పెంచడానికి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం వారానికి రెండు సార్లు గుడ్డు లేదా అరటి పండు కూడా సమకూరుస్తోంది. రాష్ట్రంలో విద్యార్థులందరికీ సన్న బియ్యం (సూపర్ ఫైన్ రకం)తో మధ్యాహ్న భోజనాన్ని పెడుతున్నారు. 2014-15లో మధ్యాహ్న భోజన పథకం ప్రయోజనాన్ని పొందిన విద్యార్థులు 30.44 లక్షల మంది.

## సర్వ శిక్షా అభియాన్

6 నుంచి 14 ఏళ్ల వయసు బాలలందరికీ ఉపయోగకరమైన, కాలానికి తగిన ఎలిమెంటరీ విద్యను అందించాలన్నది సర్వ శిక్షా అభియాన్ (ఎస్.ఎస్.ఏ) ఆశయం. పాఠశాలల యాజమాన్యంలో సమాజాన్ని చురుకుగా నిమగ్నం చేయడం ద్వారా, సామాజిక, ప్రాంతీయ, లింగ పరమైన వెలుతులను భర్తీ చేయాలని ఆకాంక్షిస్తున్న ఎస్.ఎస్.ఏ, 2014-15లో అందు నిమిత్తం 65 : 35 నిష్పత్తిలో నిధులను సమకూర్చింది.

### లక్ష్యాలు

- 6 - 14 ఏళ్ల మధ్య వయసు బాలలందరినీ పాఠశాలలలో చేర్పించడం.
- ఎలిమెంటరీ విద్య ఎనిమిదేళ్లు పూర్తి చేసే వరకు విద్యార్థులు బడులలో కొనసాగేలా చూడడం.
- జీవితానికి పనికొచ్చే విద్య అనే అంశానికి ప్రాధాన్యమిచ్చేలా సంతృప్తికరమైన నాణ్యతతో ఎలిమెంటరీ విద్యను రూపుదిద్దడంపై దృష్టి పెట్టడం.
- ఆడ, మగ, సామాజిక అంశాల వారీగా ఉన్న వ్యత్యాసాలను ఎలిమెంటరీ విద్యా స్థాయిలో భర్తీ చేయడం.

### కొత్త చర్యలు

- కొత్త ప్రైమరీ పాఠశాలలను తెరవడం
- ప్రైమరీ స్కూళ్ళను అప్పర్ ప్రైమరీ స్కూళ్ళ స్థాయికి పెంచడం
- కొత్త స్కూళ్ళకు నిరంతర అధ్యాపకులను మంజూరు చేయడం, ఇప్పుడున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అదనపు అధ్యాపకులను మంజూరు చేయడం
- మండల్ రిసోర్స్ సెంటర్‌లను, స్కూలు సముదాయాలను పటిష్ఠం చేయడం
- సర్వీసులో ఉన్న అధ్యాపకులకు ప్రతి ఏటా అయిదు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం
- బడులకు దూరమైన విద్యార్థులకు చదువు, ప్రత్యేక శిక్షణ
- స్కూల్ యూనిఫారాల సరఫరా
- కొత్త ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు టీచింగ్ లెర్నింగ్ ఎక్విప్‌మెంట్ గ్రాంటు విడుదల
- స్కూళ్ళకు స్కూలు గ్రాంటు, టీచర్ గ్రాంటు, నిర్వహణ గ్రాంటు విడుదల
- కొత్తచర్యల మీద పరిశోధన, మదింపు అధ్యయనాలు, కార్యకలాపాల పర్యవేక్షణ మరియు నిఘా

- యాజమాన్యం, నాణ్యత, సమాజ సమీకరణ
- సృజనాత్మక ఆవిష్కరణలు - బాలికల విద్య నిమిత్తం సృజనాత్మకమైన కార్యకలాపాల నిర్వహణ, మొగ్గ దశలో విద్య, ఎస్.సి, ఎస్.టిలకు, మైనారిటీలకు, పట్టణాలలో నిర్లక్ష్యానికి గురైన బాలలకు చదువు, ప్రాథమికోన్నత పాఠశాలలలో కంప్యూటర్ విద్య
- సమాజ నాయకులకు శిక్షణ, సమాజ సమీకరణ
- రవాణా / భద్రత
- పట్టణాలలో నిర్లక్ష్యానికి గురైన బాలలకు ప్రత్యేక ఆవాస విద్యాలయాలు, వసతి గృహాల నిర్వహణ

## 2014-15లో సాధించిన విజయాలు

- పాఠశాల లేని జనావాస ప్రాంతాల్లో 2014-15లో సుమారు 38 కొత్త ప్రాథమిక పాఠశాలలు ప్రారంభం.
- సుమారు 22,41,785 మంది బాలలకు రెండు సెట్ల యూనిఫారాలు పంపిణీ.
- సుమారు 99.4 శాతం విద్యాలయాలు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉంది. అధ్యాపకుడు - విద్యార్థుల నిష్పత్తి (టి.పి.ఆర్) మెరుగుపడింది. 1-5 తరగతుల స్థాయిలో 1:29, 1 - 8/9 తరగతుల స్థాయిలో 1:24, 1-12 తరగతుల స్థాయిలో 1:39 వంతున అది సూచిత ప్రమాణాల మేర ఉంది.
- రాష్ట్రంలో సుమారు 98.4 శాతం పాఠశాలలకు క్రియాశీలకమైన పాఠశాల యాజమాన్య కమిటీలున్నాయి.
- పాఠశాలలకు దూరంగా ఉన్న బాలలను క్రమపద్ధతిలో నడిచే విద్యాలయాలలో చేర్పించడం కోసం సుమారు 52,947 మందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగింది.

## ఇంటర్మీడియట్ చదువు

ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పాలనా నియంత్రణలో 397 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 4 ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలు ఉన్నాయి. గ్రాంట్-ఇన్-ఎయిడ్, సర్వీస్ పరిస్థితులు, విద్యాబోధనాంశాల పరంగా అన్ని వాస్తవిక ప్రయోజనాల రీత్యా మరో 43 ప్రైవేట్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల కార్యకలాపాలను కూడా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టరే చూస్తున్నారు.

ఇంటర్మీడియట్ విద్య (12వ తరగతి) పూర్తి చేసిన తరువాత, సైన్స్, ఆర్ట్స్, కామర్స్, వృత్తి విద్యా కోర్సులలో విద్యార్థులకు విద్యను బోధించడం జరుగుతోంది. 588 జూనియర్ కళాశాలలలో ఇంజనీరింగ్-టెక్నాలజీ, వ్యవసాయం, హోమ్ సైన్స్, వైద్య సహాయక రంగం, వ్యాపార-వాణిజ్యం, మానవీయ శాస్త్ర రంగాలలో 29 వృత్తి విద్యా కోర్సులను బోధించడం జరుగుతోంది.

## విద్యకు వృత్తివిద్యా రూపం

## ఎన్.వి.ఇ.క్యు.ఎఫ్ పైలట్ ప్రాజెక్టు

ఉన్నత విద్యను వృత్తి విద్యగా మలచడానికి సంబంధించి, రాష్ట్రంలో అమలు చేయడానికి భారత ప్రభుత్వం నేషనల్ వొకేషనల్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్ (ఎన్.వి.ఇ.క్యు.ఎఫ్) కింద ఓ పైలట్ ప్రాజెక్టును ఆమోదించింది. దీనికి ఆమోదించిన ఖర్చు రూ. 1247.73 లక్షలు. దీనిలో కేంద్రం భరించే భాగం రూ. 1,066.73 లక్షలు. రాష్ట్రం భరించే భాగం రూ. 181.00 లక్షలు.

## స్వల్పకాలిక వృత్తి విద్యా కోర్సులు

ఇంజనీరింగ్, ఐ.టి, హోమ్ సైన్సెస్, పశుగణాభివృద్ధి, ఇతర రంగాలకు సంబంధించి, ఎంపిక చేసిన స్వల్పకాలిక వృత్తివిద్యా కోర్సులు 24 ఉన్నాయి. 2014-15లో 2014 జూన్ 2వ తేదీ నుంచి, 2015 జనవరి 31వ తేదీ వరకు స్వల్ప కాలిక వృత్తివిద్యా కోర్సుల ద్వారా 1333 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. చదువు అర్థంతరంగా ఆగిన విద్యార్థులు, ఎస్.ఎస్.సి విఫలమైన / ఉత్తీర్ణులై చదువును ఆపివేసిన, ఇంటర్ విఫలమైన లేదా ఉత్తీర్ణులై ఆగిపోయిన విద్యార్థులు మొదలైన వారికి ప్రయోజనం కలిగించడానికి రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలల కాలం, ఏడాది కాలం బోధించే సర్టిఫికెట్ కోర్సులను స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వొకేషనల్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తోంది.

## కళాశాల విద్య

నాణ్యమైన, సమానతా విధానం కలిగిన, ఉన్నత విద్యను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చేలా కళాశాల విద్యా శాఖ శ్రద్ధవహిస్తుంది. రాష్ట్రంలో ఉన్న 126 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ, 69 ఎయిడెడ్ కళాశాలలలోనూ చదువుకు సంబంధించిన నాణ్యతను ఈ శాఖ

పర్యవేక్షిస్తుంది. అన్ని ప్రభుత్వ కళాశాలల అభివృద్ధి అవసరాల పట్ల కూడా ఈ శాఖ శ్రద్ధ వహిస్తుంది. 126 ప్రభుత్వ కళాశాలలు, 69 ఎయిడెడ్ కళాశాలలు కలిపి రాష్ట్రంలో 195 డిగ్రీ కళాశాలలుండగా, వాటిలో ప్రభుత్వ కళాశాలలలో 87,339 మంది, ఎయిడెడ్ కళాశాలలలో 58,785 మంది కలిపి, మొత్తం 1,46,124 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

## సామర్థ్య నిర్మాణం

నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ (ఎన్.ఎ.ఎ.సి) జరిపే అక్రెడిటేషన్ ద్వారా ఉన్నత విద్యలో నాణ్యతను పరిరక్షించడం జరుగుతుంది. 31.01.2015వ తేదీన ఉన్న ప్రకారం మొదటి ఆవృత్తం (సైకిల్ 1)లో 55 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అక్రెడిటిటేషన్ పొందాయి. రెండో ఆవృత్తంలో 31 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు అక్రెడిటేషన్ పొందాయి. ఇక విద్యా సంస్థలలో అక్రెడిటేషన్ అనంతర కార్యకలాపాలకు ప్రణాళిక వేయడానికి, నిర్వహించడానికి, అలాగే రాష్ట్రంలో విద్యా సంస్థల నాక్ అక్రెడిటేషన్‌ను త్వరితం చేయడానికి సాయపడే కార్యకలాపాలను, కార్యక్రమాలను రూపకల్పన చేయడానికి, నిర్వహించడానికి, నాణ్యతను పెంచే కార్యకలాపాలను చేపట్టడానికి కాలేజీ విద్యా కమిషనరేట్‌లో ఎస్.ఎల్.క్యు.ఎ.సి.సి క్రియాత్మక విభాగంగా రాష్ట్ర నాణ్యతా పూచీ విభాగాన్ని నెలకొల్పడం జరిగింది.

రాష్ట్ర్యవ్యాప్తంగా వివిధ కళాశాలలలోను, సి.సి.ఇ కార్యాలయంలోనూ నాణ్యతా అవగాహనను సృష్టించడానికి ఎస్.క్యు.ఎ.సి ఎన్నో కార్యగోష్ఠులను, సదస్సులను, నిర్వహించింది.

## సాంకేతిక విద్య

సాంకేతిక విద్యను పెంపొందించే బాధ్యత రాష్ట్రంలో సాంకేతిక విద్యా శాఖదే. పరిశ్రమ అవసరాలకు దీటుగా సాంకేతిక నైపుణ్యాలతో, తగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఇంజనీర్లను, సాంకేతిక నిపుణులను సిద్ధం చేయడం ఈ శాఖ ఆశయం. రాష్ట్రంలో 1356 డిప్లొమా, డిగ్రీ స్థాయి వృత్తి విద్యాసంస్థలుండగా, వాటిలో మొత్తం సీట్ల సంఖ్య 3,47,950.

## నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు

పాలిటెక్నిక్ విద్యార్థుల ఉపాధికల్పన నిమిత్తం వారి నైపుణ్యాలకు కొత్త వాటిని జోడించే నిమిత్తం, సాంకేతిక విద్యలో నాణ్యతను పెంచడానికి పాలిటెక్నిక్స్‌లో 27 నాణ్యతా అభివృద్ధి కేంద్రా (ఎస్.డి.సి)లను, ప్రతి ఎస్.డి.సిని 30 లక్షల రూపాయల ఖర్చుతో నెలకొల్పడం జరిగింది. ఎస్.డి.సిలను ప్రారంభించినది మొదలు 10,028 మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది.

## తెలంగాణలో ఉన్నత విద్య

ఉన్నత విద్యలో తెలంగాణ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. వీటిలో ఒకటి కొత్త రాష్ట్రంలో ఉన్నత విద్యను విద్యార్థులకు చేరువ చేయడానికి సంబంధించినది. ఉన్నత విద్యా సంస్థలలో అధిక భాగం హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాలలోని పట్టణ ప్రాంతాలలోనే కేంద్రీకృతమై ఉన్నాయి. అయితే, యువజనాభాలో అధిక భాగం మాత్రం గ్రామాలలోనే ఉన్నారు. ఫలితంగా ఎక్కువ మంది యువతీయువకులకు ఉన్నత విద్యను అందించడం అన్నది ఇప్పటికీ సాకారం కావలసిన కలగానే మిగిలి ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థల పంపిణీ దిగువ సూచించిన విధంగా ఉంది.




## ఆరోగ్య రంగంలో కొత్త ప్రయత్నాలు

ఆరోగ్య సంరక్షణ సేవలు నాణ్యత పరంగానూ, పరిమాణం పరంగానూ కూడా అరకొరగానే ఉన్నట్లుగా కనుగొనడం జరిగింది. ఎన్నో ఆరోగ్య సూచికల రీత్యా తెలంగాణ రాష్ట్రం జాతీయ సగటులకన్నా వెనుకబడి ఉంది. రాష్ట్రంలోని పేద ఆర్థిక స్థితిగతుల పట్ల ఆందోళన చెందిన ప్రభుత్వం అనేకానేక చర్యలను చేపట్టింది. ఆరోగ్య సంరక్షణ మీద చేసే వ్యయం మానవాభివృద్ధి మీద పెట్టుబడి

అనేది ప్రపంచం అంగీకరించిన సత్యం. అది ప్రజల ఉత్పాదకతను పెంచి, వారికి చిరకాల ప్రయోజనాలను అందించే పెట్టుబడి. అందరు పౌరులకూ, మౌలిక ఆరోగ్య సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం అనేక ఆరోగ్య పథకాలను, కార్యక్రమాలను అమలు చేసింది.

## జనాభా ఆరోగ్య సూచికలు

ప్రణాళికాబద్ధమైన వివిధ శాఖా కార్యక్రమాలను ఏళ్ళ కాల వ్యవధిలో ఒక నిర్మిత క్రమంలో అమలు చేయడం వల్ల, దిగువ రీతిలో కొన్ని జనవారీ లక్ష్యాలను సాధించడం సాధ్యమయింది.

**పట్టిక 25 : ఫలితాల సాధన స్థాయిపై జనవర్గాల వారీ సూచికలు**

| క్ర.సం. | జిల్లా | ఎం.ఎం.ఆర్ 2011-13* | ఐ.యం.ఆర్. 2013* | టి.ఎఫ్.ఆర్. 2013* | సి.పి.ఆర్. *** | సి.బి.ఆర్. 2013* | ఎ.ఎస్.ఆర్. 2011** | సి.ఎస్.ఆర్. 2011** |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | మహబూబ్‌నగర్ | 98 | 53 | 2.0 | 58.8 | 17.6 | 977 | 925 |
| 2 | రంగారెడ్డి | 78 | 33 | 2.0 | 65.1 | 17.9 | 961 | 933 |
| 3 | హైదరాబాద్ | 71 | 20 | 2.0 | 64.7 | 19.4 | 954 | 914 |
| 4 | మెదక్ | 90 | 49 | 1.9 | 59.2 | 16.9 | 992 | 952 |
| 5 | నిజామాబాద్ | 79 | 48 | 1.6 | 58.6 | 19.3 | 1040 | 948 |
| 6 | ఆదిలాబాద్ | 152 | 48 | 1.7 | 57.0 | 19.1 | 1001 | 934 |
| 7 | కరీంనగర్ | 74 | 37 | 1.9 | 67.9 | 17.9 | 1008 | 935 |
| 8 | వరంగల్ | 78 | 39 | 1.8 | 70.4 | 16.2 | 997 | 923 |
| 9 | ఖమ్మం | 99 | 45 | 1.8 | 73.8 | 17.4 | 1011 | 958 |
| 10 | నల్గొండ | 90 | 47 | 1.6 | 68.8 | 17.3 | 983 | 923 |
| | తెలంగాణ | 92 | 39 | 1.8 | 66.7 | 17.4 | 988 | 933 |

ఆధారం : 1. *2011 జనాభా లెక్కలపై ఆధారపడిన రాష్ట్ర అంచనాలు, 2. **జనాభాలెక్కలు, 2011, 3. ***జిల్లాస్థాయి ఇంటింటి సర్వే - 3 - 2007-08.

ఐ.ఎం.ఆర్. - శిశుమరణాల స్థాయి (1000 సజీవ జననాలకు), ఎం.ఎం.ఆర్. - తల్లుల మరణాల స్థాయి (లక్ష సజీవ జననాలకు), టి.ఎఫ్.ఆర్. - మొత్తం సంతాన సాఫల్య స్థాయి, సి.పి.ఆర్. - గర్భ నిరోధ సాధన స్థాయి, సి.బి.ఆర్. - క్రూడ్ బర్త్ రేట్, ఎ.ఎస్.ఆర్. - వయోజనుల ఆడ, మగ నిష్పత్తి (ప్రతి 1000 మంది మగవారికి), సి.ఎస్.ఆర్. - బాలలలో ఆడ, మగ నిష్పత్తి (ప్రతి 1000 మంది బాలురకు)

ఆధారం : ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమీషనర్

## ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం

4863 సబ్-సెంటర్లు, 661 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 114 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 42 ప్రాంతీయ ఆస్పత్రులు, 8 జిల్లా ఆస్పత్రులు, 5 మాతా, శిశు సంరక్షణ ఆస్పత్రులు, 5 బోధన ఆస్పత్రులకు తోడు 55 పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రాలు, హైదరాబాద్‌లో 11 పట్టణ ఆరోగ్య పోస్టులు, 87 పట్టణ ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇవన్నీ రాష్ట్రంలో మాతా శిశు ఆరోగ్య సంరక్షణకు, బాలల ఆరోగ్య సంరక్షణకు, ప్రజలకు కుటుంబ సంక్షేమ సేవలను అందించడానికి అంకితమై ఉన్నాయి.

## మాతృ ఆరోగ్య సంరక్షణ సేవలు

మాతృ ఆరోగ్య సంరక్షణ సేవల కింద గర్భిణులకు దిగువ సేవలను సమకూరుస్తున్నారు.

## అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్ (ఆషా)

సామాజిక ఆరోగ్య సాధన క్రమంలో ఆషా కార్యక్రమం కీలకమైనది. మాతా, శిశు ఆరోగ్య కార్యకలాపాలపై ఆషా అనేక చర్యలను సమాజంలోకి తీసుకువెళుతుంది. పోషణ, మౌలిక పారిశుద్ధ్యం, ఆరోగ్య జీవన విధానాలు, ఆరోగ్యవంతమైన జీవన నడవడికలు, పని పరిస్థితులు, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవల సమాచారం, ఆరోగ్య సేవలను సకాలంలో ఉపయోగించుకోవలసిన అవసరాలపై సమాజంలో ఆషా జాగృతిని కలిగిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో మంజూరు చేసిన ఆషాల మొత్తం సంఖ్య 28019. ఉనికిలో ఉన్నది

25818 మంది. పట్టణ ప్రాంతాలకు 2660 ఆషాలను మంజూరు చేయగా, 2502 మంది ఉనికిలో ఉన్నారు.

## సమగ్ర అత్యవసర పురుళ్లు, పురిటి కందుల సంరక్షణ (సెమాంక్) సేవలు

రాష్ట్రంలో 68 సెమాంక్ కేంద్రాలున్నాయి. ఆస్పత్రి పురుళ్ళను పెంపొందించడానికి, గర్భిణుల అత్యవసర సమస్యలను చూడడానికి, కాన్పులు, శిశుజననాలకు సంబంధించిన కేసులను చూడడానికి 35 నుంచి 40 కిలో మీటర్ల దూరం మించకుండా జిల్లాలలో ఎంపిక చేసిన 4 నుంచి 9 వరకు మొదటి సిఫార్సు యూనిట్‌లుగా ఈ కేంద్రాలు నెలకొల్పబడ్డాయి. ప్రసూతి వైద్యురాలు, మత్తు నిపుణుల సేవలు, అత్యవసరంగా రక్తం ఎక్కించే సేవలు ఈ కేంద్రాలలో 24 గంటలపాటూ అందుబాటులో ఉంటాయి.

## 24 - గంటల మాతా, శిశు ఆరోగ్య కేంద్రాలు

24 గంటల మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలుగా ప్రకటించిన ప్రజారోగ్య కేంద్రాలు 340 ఉన్నాయి. కానుపు సమయంలో లేదా పురిటిలో తల్లులు మరణించడం 50 శాతం వరకూ ఉండిన నేపథ్యంలో, అలాగే నవజాత శిశువుల, పసిబిడ్డల మరణాలకు కళ్లెం వేయడానికి ఆస్పత్రి పురుళ్లను పెంపొందించడం ఈ సంరక్షణ కేంద్రాల ధ్యేయం. 2014లో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 14480 పురుళ్ళు పోయడం జరిగింది.

## గ్రామ ఆరోగ్య, పోషణ కేంద్రాలు

32143 గ్రామాలలో గ్రామ ఆరోగ్య, పోషణ రోజులను క్రమం తప్పకుండా జరుపుట ద్వారా పెళ్లి ఏ వయసులో చేయవచ్చు, ఏ వయసులో కూడదు అనే దానిపై అవగాహన కల్పించుచున్నారు. గర్భం దాల్చినది మొదలు 12 వారాలలోపు అందరు గర్భిణుల నమోదు, ఎం.పి.హెచ్.ఏ (ఎఫ్) చేత గర్భిణికి మూడు సార్లు ఆరోగ్య తనిఖీ, వైద్యాధికారి చేత ఒకసారి తనిఖీ, గర్భం ఏడో నెలలో జనన ప్రణాళిక, ఆస్పత్రి పురుళ్ళకు ప్రోత్సాహం, ప్రసవానంతర సంరక్షణ సేవలు, మాతృ స్తన్య విధానం విశిష్టతపై చైతన్యం, టీకాల సేవలు, గర్భానికి, గర్భానికి మధ్య వ్యవధిని పెంచే విధానాల ప్రచారం, సంతాననిరోధం, వేసక్టమీలు, చిన్నపాటి ఆరోగ్య సమస్యలకు వైద్యం మొదలైనవి ఈ కేంద్రాలలో లభిస్తాయి.

## జనని సురక్షా యోజన (జె.ఎస్.వై) పథకం

ప్రభుత్వ ఆరోగ్య సంస్థలలో పురుడు పోసుకున్నందుకు, (గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో హోమ్ డెలివరీలకు కూడా కలిపి) పేదరికం రేఖ దిగువన ఉన్న గర్భిణులకు నగదు ప్రోత్సాహకాన్ని ఇచ్చే పథకమే జె.ఎస్.వై. 2014 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 99,674 మంది ఈ ప్రయోజనాన్ని పొందారు.

## జనని శిశు సురక్షా కార్యక్రమం (జె.ఎస్.ఎస్.కె)

అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంస్థలలోను నగదు రహితంగా, ఉచితంగా పురుడు పోయడానికీ, శిశువు పుట్టినది మొదలు ఏడాది పాటు ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోడానికి ఉద్దేశించిన భారత ప్రభుత్వ పథకమిది. 2014 ఏప్రిల్ మొదలు డిసెంబర్ వరకు 75402 మంది గర్భిణులు ఈ సేవలను పొందారు.

## రాష్ట్రీయ కిశోర్ స్వస్థ్య కార్యక్రమం (ఆర్.కె.ఎస్.కె)

10 నుండి 19 ఏళ్ల మధ్య కౌమార ప్రాయం లోని బాలురలకు, బాలికలకు ప్రత్యేక ఆరోగ్య సంరక్షణ, కౌన్సెలింగ్ సేవలను నిర్వహించడానికి రాష్ట్రంలో భారత ప్రభుత్వం ప్రారంభించిన కార్యక్రమం రాష్ట్రీయ కిశోర్ స్వస్థ్య కార్యక్రమం (ఆర్.కె.ఎస్.కె). 2014-15లో మొత్తం 185 కౌమార మిత్ర ఆరోగ్య చికిత్సా కేంద్రాలను / యువ క్లినిక్‌లను రాష్ట్రంలో నెలకొల్పడం జరిగింది.

## శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు

"18" ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగాలు (ఎస్.ఎన్.సి.యులు), 61 నవజాత ఆరోగ్య స్థిరీకరణ విభాగాలు (ఎన్.బి.ఎస్.యులు), 581 నవజాత శిశు సంరక్షణ కార్నర్ (ఎన్.బి.సి.సి)లను రాష్ట్రంలో నెలకొల్పడం జరిగింది. ఇవన్నీ నవజాత శిశు సంరక్షణ సేవలను పటిష్ఠం చేయడం ద్వారా శిశు మరణాలను తగ్గించడానికి ఉద్దేశించినవి.

## బాలలకు టీకాలు

కోరింత దగ్గు, డిఫ్తీరియా (కంఠ సర్పి), టెటానస్ (ధనుర్వాతం), పోలియో, టి.బి (క్షయ), పొంగు (మీజిల్స్), హెపటైటిస్-బి (కామెర్లు) వ్యాధుల వంటివి (వి.పి.డి.ఎస్) రాకుండా ఏడాది లోపు వయసు బాలలందరికీ రోగనిరోధక శక్తిని పెంచడం జరుగుతోంది. దీనికి గానూ నిర్ణీత టీకాల కార్యక్రమం కింద బి.సి.జి, డి.పి.టి, ఒ.పి.వి, మీజిల్స్, హెపటైటిస్ టీకాలను ఇస్తున్నారు. వారు 16 నుంచి 24 నెలల వయసుకి వచ్చే సరికి డి.పి.టి, ఒ.పి.వి, మీజిల్స్ నిరోధానికి తదుపరి మోతాదును (బూస్టర్ డోస్‌ను) ఇవ్వడం జరుగుతోంది.

దరిమిలా వారికి అయిదేళ్ల వయసులో డి.పి.టి, పది మరియు పదహారేళ్ల మధ్య వయసులో బూస్టర్ డోసులు ఇవ్వడం జరుగుతోంది. వ్యాధుల వారీగా 2014 ఏప్రిల్, డిసెంబర్‌ల మధ్య బాలలకు వేసిన టీకాలు ఈ విధంగా ఉన్నాయి. బి.సి.జి 467923, డి.పి.టి 466349, పోలియో 465974, మీజిల్స్ 464543, పూర్తి స్థాయి టీకాలు 466580, హెపటైటిస్ - బి 466571, విటమిన్-ఏ 466691.

## కుటుంబ సంక్షేమ సేవలు

కుటుంబ సంక్షేమ కార్యక్రమం కింద సేవల నాణ్యతను మెరుగుపరచే లక్ష్యంతో రాష్ట్ర జనాభా విధానానికి అనుగుణంగా కుటుంబ సంక్షేమ సేవలను చేపట్టడం జరుగుతోంది.

## సంతాన నిరోధ విధానాలు

స్వచ్ఛంద ప్రాతిపదికన, శాశ్వతంగా లేదా సంతానానికి, సంతానానికి మధ్య వ్యవధిని పెంచడం ద్వారా చిన్నకుటుంబం సూత్రాన్ని పాటించదలచుకున్న అర్హమైన దంపతులకు సంతాన నిరోధక సేవలను అందించడం జరుగుతోంది. సంతాన నిరోధ ప్రక్రియను చేయించుకున్న మహిళలలో పేదరిక రేఖకు దిగువన ఉన్న వారికి, ఎస్.సిలకు చెందిన వారికి, ఎస్.టిలకు చెందిన వారికి వేతన నష్టం భర్తీ కింద రూ. 600 పరిహారాన్ని (సి.ఎస్.ఎస్‌ను), రాష్ట్ర సహాయ భృతిగా రూ. 280/-ను ఇస్తున్నారు. అదే మగవారైతే రూ. 1100/- ఇస్తున్నారు. 2014 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 141616 సంతాన నిరోధక చికిత్సలు చేయడం జరిగింది.

## వైద్య అవసరం పరంగా గర్భం తొలగింపు (ఎం.టి.పి)

అవాంఛిత గర్భాన్ని తొలగించడానికి అర్హమైన దంపతులకు ఎం.టి.పి సేవలను అందించడం ఈ పథకం ఆశయం. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలోనూ ఈ సేవలను అందిస్తున్నారు. 2014 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రాష్ట్రంలో జరిగిన ఎం.టి.పిలు 2919.

## కుటుంబ నియంత్రణ బీమా పథకం

సంతాన నిరోధానికి అంగీకరించిన వారికి అధీకృత బీమా సంస్థ ద్వారా బీమాను కల్పించడం ఈ పథకం ఆశయం. 2014 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఈ పథకం వల్ల ప్రయోజనం పొందిన వారు 21 మంది.

## గిరిజన ఆరోగ్య సేవలు

గిరిజన జనాభా ప్రధానంగా ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలలో 3 ఐ.టి.డి.ఏల ద్వారా సేవలను అందుకుంటున్నారు. ఆరోగ్య సేవలను అందిస్తున్న ఎస్.సిలు 599, పి.హెచ్.సిలు 86, సి.హెచ్.సిలు 10, ఏరియా ఆస్పత్రులు 6, శిశు జనన నిరీక్షణ గృహాలు 10 ఉన్నాయి. అర్హులైన జనాభాకు ఆరోగ్య సేవలను అందించడానికి గిరిజన ప్రాంతాలలో 2987 సి.హెచ్.డబ్ల్యు.ఎస్‌లను అద్దెకు తీసుకున్నారు.

## మాత, శిశు ఆరోగ్య పథకం, ఎపిడెమిక్ టీమ్స్ అవుట్ రీచ్ సర్వీసెస్ (అంటు వ్యాధుల ప్రత్యేక సేవలు, బహుళ నైపుణ్యాల శిబిరాలు)

ప్రత్యేక నైపుణ్యాలతో ఆరోగ్య సంరక్షణ సదుపాయం కల్పించడానికి, మైదాన ప్రాంతాల నుంచి గిరిజన ప్రాంతాలకు వైద్య నిపుణులను రప్పించడం జరుగుతోంది. 2014 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు నిపుణుల శిబిరాల ద్వారా 9840 మంది రోగులను పరీక్షించడం జరిగింది.

## ప్రసవ నిరీక్షణ గృహాల నిర్వహణ

గిరిజనులలో ఆస్పత్రి పురుళ్లను ప్రోత్సహించడానికి ఉద్దేశించినవే శిశు జనన నిరీక్షణ గృహా (బి.డబ్ల్యు.హెచ్)లు. 2014 ఏప్రిల్ - డిసెంబర్ మధ్య కాలంలో 932 మంది మహిళలు ఈ గృహాల ఉపయోగాన్ని పొందారు.

మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న కారణంగా క్రమబద్ధమైన ఆరోగ్య తనిఖీలనిమిత్తం ఆరోగ్య సదుపాయాల వద్దకు రాలేని గర్భిణులను గుర్తించేందుకు గిరిజన ప్రాంతాలకు 25 ఎం.సి.హెచ్ బృందాలను సమకూర్చడం జరిగింది. సాయపడవలసిన వారిని గుర్తించే విషయంలో ఎం.సి.హెచ్ మరియు అంటువ్యాధుల బృందాల పనితీరు సంగతికి వస్తే - 2014 డిసెంబర్ వరకు ఎ.ఎన్.సిలను గుర్తించే విషయంలో 10526, అత్యధిక ప్రమాదానికి ఆలవాలమైన వారి కేసుల సిఫార్సులు 625, సాంక్రామిక వ్యాధుల కేసులు 1585, అంటువ్యాధులు కాని ఇతర రోగాల కేసులు 3868.

## ప్రత్యేక చొరవలు

ఆరోగ్యపరంగా అత్యవసర సమయాలలో రోగులకు సాయం చేయడానికి అత్యవసర రవాణా సదుపాయాన్ని రాష్ట్రం సమకూరుస్తోంది. అలాగే ప్రతి గ్రామీణ జనావాసంలోనూ వివిధ ఆరోగ్య సేవలను సమకూర్చడానికి నిర్ణీతమైన రోజున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

వీటిలో గుర్తింపు, రోగనిర్ధారణ, చికిత్స, వివరాల నమోదు, అధిక ప్రమాదానికి ఆలవాలమైన కేసులను తగిన ఆస్పత్రులకు సిఫార్సు చేయడం, ప్రజలకు ఆరోగ్య సలహా ఇవ్వడానికి, ఆరోగ్య పరమైన మాటామంతీ నెరపడానికి ఆరోగ్య సమాచార హెల్ప్‌లైన్ మొదలైనవన్నీ ఉంటున్నాయి. అత్యవసర వైద్య సహాయం అవసరమైన రోగులను మారుమూల ప్రాంతాల నుంచి సమీపంలో ఉన్న రోడ్డు దాకా తేవడానికి 278 పల్లకీలను ప్రభుత్వం సరఫరా చేసింది.

## అత్యవసర ఆరోగ్య రవాణా పథకం

సుశిక్షితులైన సాంకేతిక సిబ్బందితో 319 యాంబులెన్స్‌లను ఏడాదిలో 365 రోజుల పొడవునా, రోజులో 24 గంటల సేపూ, 108 రుసుము రహిత టెలిఫోన్ నెంబర్ సహాయంతో ఏర్పాటు చేయడం జరిగింది. మొత్తం రాష్ట్రమంతటా ఈ సదుపాయాన్ని అమలులోకి తెచ్చారు. 2014 ఏప్రిల్, డిసెంబర్ నెలల మధ్య 355084 అత్యవసర కేసులలో రవాణా సేవలు అందించడం జరిగింది.

## నిర్ణీత రోజు ఆరోగ్య సేవలు (ఎఫ్.డి.హెచ్.ఎస్)

పి.హెచ్.సికి, లేదా సి.హెచ్.సికి 3 కిలోమీటర్ల దూరం పైబడిన గ్రామీణ జనావాసాలలో, నెలకొకసారి నిర్ణీత రోజున, ఏడాది మొత్తానికి నెల, తేదీ వారీగా ముందే నిర్ణయించిన ప్రకారం వివిధ ఆరోగ్య సేవలను అందించడానికి, హైదరాబాద్ మినహా తక్కిన జిల్లాలలో మొత్తం మీద 200 సంచార ఆరోగ్య వాహనాలను సిద్ధం చేయడం జరిగింది. 2014 ఏప్రిల్, డిసెంబర్ నెలల మధ్య 26,93,120 మంది ప్రజలు ఈ సేవల ప్రయోజనాన్ని పొందారు.

## జాతీయ ఆరోగ్య కార్యక్రమం

వివిధ ప్రభుత్వ సదుపాయాల శ్రేణి ద్వారా అర్హమైన జనాభాకు వివిధ ఆరోగ్య సేవలను అందించడంలో ప్రభుత్వ శాఖ ప్రయత్నాలకు సహాయపడడం నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం) ప్రధాన ఆశయం. ఎన్.హెచ్.ఎం కింద భారత ప్రభుత్వం 75 శాతం సహాయాన్ని సమకూర్చుతుండగా, ఎన్.హెచ్.ఎం కిందనే ప్రణాళికలో పేర్కొన్న నిధులలో 25 శాతం వాటాని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. ఆ విధంగా ఎన్.హెచ్.ఎం కింద 2014-15లో ఆమోదం పొందిన ఆర్థిక వివరాలు రూ. 792.01 కోట్లు కాగా, ఇప్పటికి రూ. 376.57 కోట్లు విడుదలయ్యాయి.

## తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టి.వి.వి.పి)

## తీవ్రగాయాల చికిత్సా కేంద్రాలు

ఆరోగ్య సంరక్షణ సేవలకు జోడిస్తున్న రెండో అంచె ప్రయత్నాలలో భాగంగా ప్రభుత్వం, మహబూబ్‌నగర్ లోని జిల్లా ఆస్పత్రిలోనూ, కామారెడ్డిలోని ఏరియా ఆస్పత్రిలోనూ, తాండూరులోని జిల్లా ఆస్పత్రిలోనూ ట్రామా కేర్ సెంటర్‌లను నెలకొల్పడానికి చొరవతీసుకుంది.

## రక్తాంశ విభజన విభాగాలు

అనేక వ్యాధులలో రోగులకు రక్తం ఎక్కించవలసి వస్తుంది. అయితే, డెంగూ లాంటి కొన్ని వ్యాధులలో మొత్తం రక్తానికి బదులుగా, కేవలం రక్తంలోని కొన్ని అంశాలను ఎక్కిస్తే సరిపోతుంది. అప్పుడు నెత్తురులో మిగిలిపోయిన తక్కిన అంశాలు వేరే కొన్ని రకాల రోగులకు ఉపయోగపడతాయి. అయితే, ఇలా నెత్తురుని వేర్వేరు రోగులకు ఉపయోగపడేలా చేయాలంటే నెత్తురులోని అంశాలను వేరుచేయవలసిన అవసరం కలుగుతుంది. టి.వి.వి.పి కింద 12 ఆస్పత్రుల కోసం రక్తాంశలను వేరు చేసే విభాగాలను కొనుగోలు చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది.

## స్వైన్ ఫ్లూ చికిత్స

రాష్ట్రంలోని అన్ని జిల్లా ఆస్పత్రులలోనూ, ఏరియా ఆస్పత్రులలోనూ స్వైన్ ఫ్లూ చికిత్స, మేనేజ్‌మెంట్ కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పింది. స్వైన్ ఫ్లూ సోకిన రోగులకు ఉచిత ఆరోగ్య పరీక్షలను హైదరాబాద్‌లో నారాయణగూడా లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐ.పి.ఎం)లోనూ, నల్లకుంట లోని ఫీవర్ హాస్పిటల్‌లోనూ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. స్వైన్ ఫ్లూ మందులైన టాబ్లెట్లు, సిరప్‌లు మొదలైన వాటిని అన్ని జిల్లా, ఏరియా ఆస్పత్రులలోనూ అందుబాటులో ఉంచారు. స్వైన్ ఫ్లూ చికిత్సకు కూడా ఆరోగ్య శ్రీ వర్తిస్తుంది.

## ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ

రెట్రో వైరస్ అయిన హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్ (హెచ్.ఐ.వి), కాలక్రమంలో ఎక్వైర్డ్ ఇమ్యూనో డెఫిషియన్సీ సిండ్రోమ్ (ఎయిడ్స్)ని కూడా కలిగిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా మూడు కోట్ల యాభై లక్షల మందికి పైగా బాధితులతో ఈ వ్యాధి ప్రపంచ ఆరోగ్య సమస్యగా నిలచింది. హెచ్.ఐ.వి అంటువ్యాధి భారతదేశంలో కూడా ఆధునిక ప్రజల ఆరోగ్య సమస్యలలో అత్యంత పెద్ద సవాళ్ళలో

ఒకటిగా నిలచింది. ఎయిడ్స్‌తో కాలం గడుపుతున్న రోగులు భారతదేశంలో 25 లక్షల మంది ఉన్నారని అంచనా. వారిలో రెండు లక్షల మంది తెలంగాణలో ఉన్నారు.

హెచ్.ఐ.వి నివారణకు, హెచ్.ఐ.వి సోకిన రోగుల సంరక్షణకు, వారికి అండగా నిలవడానికి, చికిత్స చేయడానికి ఉద్దేశించిన అనేక రకాల చర్యలను సమ్మిళితం చేసి అందించే విధానాన్ని అనుసరించడంతో, గడచిన ఎన్.ఎ.సి.పిలలో హెచ్.ఐ.వి వ్యాప్తి తగ్గుముఖం పట్టిన సంగతిని హెచ్.ఐ.వి సెంటినెల్ సర్వైలెన్స్ (హెచ్.ఎస్.ఎస్) దృష్టికి వచ్చింది.

## ఆరోగ్య శ్రీ పథకం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య పథకాలలోకీ ఒక ముఖ్యమైన పథకం ఇదే. రాష్ట్ర ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ నిర్వచనం ప్రకారం పేదలైన వారికి నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందించాలన్న ప్రభుత్వ దీక్షకు ఇది నిదర్శనం. "అందరికీ ఆరోగ్యం" అనే లక్ష్యాన్ని సాధించడం ఈ పథకం ఆశయం. ఆరోగ్య బీమా రంగంలో ఒక అరుదైన పి.పి.పి నమూనా ఈ పథకం. పేద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపకల్పన చేసిన పథకమిది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో వివిధ రకాల సేవల యంత్రాంగం ద్వారా 938 రకాల వైద్య సేవలలో రోగికి మొదలు నుంచి చివర దాకా నగదుతో ఎలాంటి అవసరమూ కలగకుండా ఏర్పాటు చేసిన సదుపాయమిది.

## ఆశయం, పరిమితి

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలను విపత్కరమైన ఆరోగ్య ఖర్చులనుంచి కాపాడడం ఈ కార్యక్రమం ఆశయం. అందుకు గానూ వారికి నాణ్యమైన ఆస్పత్రి సేవలను ఉచితంగా, ధనవంతులతో సమానంగా అందుబాటులోకి తేవడం ఈ కార్యక్రమ విధానం. స్వయంగా నిధులను సమీకరించుకుని, చికిత్సలకు భర్తీ చేసే విధానంతో (ట్రస్టు సేవలతో) నడిచే ఈ పథకం, విపత్కరమైన అనారోగ్యాలు కలిగినప్పుడు, ఆరోగ్య అవసరాలను తీర్చుకోవడంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు సహాయకరంగా నిలవడానికి ఉద్దేశించినది.

29 విభాగాలలో గుర్తించిన వ్యాధులకు "జాబితాలోకి ఎక్కించిన" 944 చికిత్సలను ఈ పథకం అందిస్తుంది.

కుటుంబానికి, ఏడాదికి లక్షా యాభై వేల రూపాయల వరకు ఖరీదైన సేవలను ఈ పథకం ఫ్లోటర్ ప్రాతిపదికన అందిస్తుంది. మరో రూ. 0.50 లక్షలను బఫర్ ప్రాతిపదికన అందిస్తుంది. ఆ విధంగా మొత్తం రూ. 2.0 లక్షల మేర బీమా కవచాన్ని ఈ పథకం కల్పిస్తుంది. ఈ పథకం కింద జతగా చేయాల్సిన చెల్లింపు ఏమీ ఉండదు.

## 104 కాల్ సెంటర్

రాష్ట్రంలో ఎక్కడి వారికైనా ఈ పథకానికి సంబంధించిన ప్రశ్నలకు తెలుగులో జవాబివ్వడానికి 24 × 7 ప్రాతిపదికన ఫోన్ కాల్ సదుపాయం అందుబాటులో ఉంది.

ఫలానా వ్యాధికి ఈ పథకం వర్తిస్తుందా, వర్తించదా? ఫలానా వారికి వర్తిస్తుందా, వర్తించదా? వర్తించే వారికి అందుబాటులో ఉన్న ప్రయోజనాలేమిటి? విధానాలేమిటి? నెట్ వర్క్ ఆస్పత్రులు ఏమిటి? నగదు రహిత సదుపాయాన్ని గురించిన వివరాలు, అందుబాటులో ఉన్న మిగులు, పరిహారం కోసం తాము చేసిన దరఖాస్తు ఏ దశలో ఉంది మొదలైన వివరాలను ఈ కాల్ సెంటర్ నుంచి తెలుసుకోవచ్చు.

## ఆరోగ్య శ్రీ పథకం కృషి

- 2015 జనవరి 31 వరకు ఉన్న వివరాల ప్రకారం 2014-15లో జరిగిన చికిత్సలు (1,96,671), ధన వ్యయం రూ. 516.58 కోట్లు.
- 2014-15లో అడిగిన పరిహారాలు రూ. 964.89 కోట్లు, 31-01-2015 వరకు చెల్లించిన పరిహారాలు రూ. 406.76 కోట్లు.
- పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి నిర్వహించిన ఆరోగ్య శిబిరాలు 17080
- పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఆరోగ్య శిబిరాలలో పరీక్షించిన రోగులు 3834538
- పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఆరోగ్య శిబిరాల నుంచి ఆస్పత్రులకు సిఫార్సు చేసిన రోగుల సంఖ్య 123785

## గ్రామీణాభివృద్ధి

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో గ్రామీణ జనాభా 215.85 లక్షల మంది. అది మొత్తం జనాభాలో 61.3 శాతం. ఎక్కువ జనాభా రాష్ట్రంలోని గ్రామాలలోనే కేంద్రీకృతమై ఉండడాన్ని బట్టి, రాష్ట్రం స్థూల అభివృద్ధికి గ్రామీణుల అభివృద్ధి, వారి జీవనోపాధి

అభివృద్ధులే కీలకావసరమని తేటతెల్లమవుతుంది. వాటర్‌షెడ్ అభివృద్ధి, స్వయం సహాయ బృందాలు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మొదలైన కార్యక్రమాలను రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి శాఖ అమలుచేస్తోంది.




## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్)

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టా(ఎన్.ఆర్.ఇ.జి.ఎస్)న్ని 2005 సెప్టెంబర్‌లో నోటిఫై చేశారు. గ్రామీణ కుటుంబంలో, వయోజనులైన సభ్యులు నైపుణ్యం లేని కూలీ పనిని చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన పక్షంలో, ఆ వ్యక్తికి ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పాటు వేతనంతో కూడిన పనిని విధిగా కల్పించాలని ఈ చట్టం శాసిస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో వేతనంతో కూడిన ఉపాధితో కొంత మద్దతు కల్పించాలనీ, తద్వారా ఈ క్రమంలో మన్నిక కలిగిన ఆస్తులను పెంచుకోవడానికి సహాయపడాలన్నది ఈ చట్టం ఆశయాలలో ఒకటి. పనిగట్టుకుని చేసే ప్రయత్నం ద్వారా సమాజంలోని నిరుపేద వర్గాన్ని సామాజికంగా ఉన్నత స్థానంలోకి తేవడం, పంచాయతీ రాజ్ వ్యవస్థను పటిష్ఠం చేయడం దీనికి అనుబంధమైన ఆశయాలు.

## తెలంగాణలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ అమలు

- రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలలో 443 మండలాలలోని 8880 గ్రామ పంచాయతీలలో ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ అమలవుతోంది. పథకాన్ని ప్రారంభించినది మొదలు దాదాపు 55 లక్షల జాబ్ కార్డుల జారీ జరిగింది. ఉపాధిని కోరిన 1.3 కోట్ల మందికి ఈ పనులు ప్రయోజనం కలిగించాయి.
- ఉపాధిని కోరుతున్న 64 లక్షల మంది కలిగిన మొత్తం 29.7 లక్షల కుటుంబాలతో సుమారు 3.6 లక్షల శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటయ్యాయి.

**పట్టిక 26 : 2014 జూన్ నుంచి ఎం.జి.ఎన్.ఆర్.జి.ఇ.ఎస్. పనితీరు**

| వివరాలు | 2014-15లో పనితీరు |
|---|---|
| జారీ చేసిన పనికార్డులు | 58,673 |
| పనికి హాజరైన కుటుంబాలు (లక్షలలో) | 23.4 |
| ఉత్పత్తి చేసిన పని రోజులు (కోట్లలో) | 5.08 |
| సగటు వేతన ధర (రూపాయలలో) | 105.70 |
| సగటు వేతన ధరలు (కోట్ల రూ.లలో) | 537.00 |
| సామాను ఖర్చులు (కోట్ల రూ.లలో) | 389.50 |
| పరిపాలనా ఖర్చులు (కోట్ల రూ.లలో) | 108.50 |
| **మొత్తం ఖర్చులు (కోట్ల రూ.లలో)** | **1035.00** |

## కీలకమైన చర్యలు

ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్‌ను సమర్థంగా అమలు చేయడానికి దిగువ తెలిపిన కీలకమైన చర్యలను తీసుకోవడం జరిగింది

- రాష్ట్రీయ గ్రామీణ అభివృద్ధి సమాచారం (రాగాస్): క్షేత్ర సిబ్బందికి సదుపాయం కలిగించే విధంగా మొదలు నుంచి చివరి దాకా లావాదేవీలను నిర్వర్తించే అప్లికేషన్‌ను సమకూర్చడం జరిగింది. అదే సమయంలో ఇది పాలనాధికారుల పనిని కూడా సులభం చేస్తుంది.
- వెబ్ పోర్టల్ (ఎం.ఐ.ఎస్ రిపోర్ట్స్) : ఉపాధి కల్పన, పనుల అమలుతీరు, పెట్టిన ఖర్చు, పనులకు సంబంధించిన నివేదికలు మొదలైన సమాచారమంతా www.nrega.telangana.gov.in అనే వెబ్ పోర్టల్ నివేదికల ద్వారా తెలుసుకోవచ్చు.
- ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ : ఆన్‌లైన్ నగదు బదిలీ విధానం ద్వారా సమర్థమైన రీతిలో నిధుల ప్రవాహాన్ని గావించే లక్ష్యంతో (ఇ-ఎఫ్.ఎం.ఎస్) అనే నగదు బదిలీ వ్యవస్థను అమలులోకి తేవడం జరిగింది. నిధులను ఏదో ఒక చోట నిల్వ చేయాల్సిన అవసరాన్ని ఈ వ్యవస్థ నివారిస్తుంది. పంచాయతీలు, సమితులు నిధులను నిరాటంకంగా అందుకోవడానికి ఈ వ్యవస్థ సాధికారత కల్పిస్తుంది.
- ఎలక్ట్రానిక్ మస్టర్ అండ్ మెజర్‌మెంట్ సిస్టమ్ (ఇ-ఎం.ఎం.ఎస్) : ఇ-ఎం.ఎం.ఎస్ అనేది మొబైల్ ఫోన్ ఆధారంగా ఏర్పాటైన సాంకేతిక పరిజ్ఞానం. దానిని ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ క్షేత్ర సిబ్బంది కోసం ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. గిరాకీని గ్రహించడం, పని కేటాయింపు, ఇ-మస్టర్, ఇ-మెజర్‌మెంట్, ఇ-తనిఖీ మెజర్‌మెంట్, ఇ-మస్టర్ తనిఖీ మొదలైన వాటిని కేవలం మొబైల్‌ని ఉపయోగించి పూర్తి చేయవచ్చు.
- బయోమెట్రిక్ విధానంతో నమ్మకంగా చెల్లింపులు జరిపే విధానం : ముందుగా నిర్దేశించిన ప్రభుత్వ ఆవరణ (సాధారణంగా ఇది గ్రామ పంచాయతీ భవనం)లో బ్యాంకు నియమించిన సి.ఎస్.పి ద్వారా వేతనాల పంపిణీ జరుగుతుంది. బ్యాంకుతోనూ, ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఏ సర్వర్‌తోనూ అనుసంధానం గావించిన బయోమెట్రిక్ రీడర్ సి.ఎస్.పి వద్ద ఉంటుంది. దీనితో ఏ లావాదేవీ అయినా సమాచార నిధికి అప్పటికప్పుడే ఎక్కుతుంది. ఇప్పుడు అమలు చేస్తున్న ఈ బయోమెట్రిక్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను తపాలా శాఖ మరియు బ్యాంకుల ద్వారా, ఆధార్ ఆధారిత చెల్లింపుల పద్ధతికి మార్చబోతున్నారు.
- హెచ్.ఆర్.ఎం.ఎస్ : గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో సువ్యవస్థితంగా నెలకొల్పిన వ్యవస్థాగత ఏర్పాటు (ఇన్‌స్టిట్యూషనల్ అరేంజ్‌మెంట్)కి తోడు ఒక హెచ్.ఆర్ విధానం కూడా అమలులో ఉంది. వ్యవస్థాగతమైన ఏర్పాటుకి తోడు, సి.ఆర్.డి కోసం పనిచేస్తున్న అందరు ఉద్యోగుల ప్రయోజనాలను సంరక్షించడానికి ఈ హెచ్.ఆర్ విధానం పరిపూరకంగా పనిచేస్తుంది.
- శ్రమ శక్తి సంఘాలు (ఎస్.ఎస్.ఎస్ గ్రూప్‌లు) : శ్రద్ధగా ముందుకు వచ్చిన అందరు శ్రామికులను ఎస్.ఎస్.ఎస్ గ్రూపులుగా వర్గీకరించడం జరిగింది. ఒక్కో గ్రూపులో 10 నుంచి 30 మంది వరకు సభ్యులు ఉండవచ్చు. ప్రతి ఒక్క గ్రూపులోని ప్రతి ఒక్క సభ్యునికి వేతనంతో కూడిన 100 రోజుల పనిని కల్పించడంతో పాటు, పూర్తి పారదర్శకతను సాధించడానికి ఈ బృందాల ఏర్పాటు సాయపడుతుంది.
- పని తీర్మానం అధ్యయనాలు, ఆర్.ఎస్.ఎస్.ఆర్ : అన్ని ప్రతిపాదిత పనులకు సంబంధించి పనులను, తీర్మాన అధ్యయనాలను సి.ఆర్.డి చేపడుతుంది. ఏటా ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ కింద చేపట్టిన పనులకు సంబంధించి, ప్రత్యేకమైన గ్రామీణ ప్రామాణిక షెడ్యూలును వెలికితీస్తుంది.
- నాణ్యతా నియంత్రణ విభాగం : చేపట్టిన పనులు నాణ్యంగా ఉండేలా చూడడానికి, ప్రత్యేకంగా నాణ్యతా నియంత్రణ విభాగాన్ని నెలకొల్పడం జరిగింది. పనులను ఈ విభాగం క్రమం తప్పకుండా తనిఖీ చేస్తుంది. నాణ్యతా నియంత్రణ అధికారులు పనుల నాణ్యతను తనిఖీ చేయడమే కాకుండా సాంకేతిక సిబ్బంది సామర్థ్య నిర్మాణాన్ని పెంపొందించడానికి కూడా మద్దతిస్తారు.
- సమస్యల పరిష్కార విభాగం / కాల్ సెంటర్ : ఈ పథకం అమలుకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులనైనా సరే నమోదు చేయడానికి, టోల్‌ఫ్రీ 1800-200-1001 నెంబరు తో కాల్ సెంటర్‌ని నెలకొల్పారు.
- పి.డబ్ల్యు.డిలకు ప్రత్యేక ఏర్పాట్లు : వైకల్యం కలిగిన వ్యక్తులకు వికలాంగుల ఎస్.ఎస్.ఎస్‌లనే ప్రత్యేక గ్రూప్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. 30 శాతం అదనపు వేతనం, ఎంపికలో పి.డబ్ల్యు.డిలకు ప్రాధాన్యం, పి.డబ్ల్యు.డిలకు ప్రత్యేకమైన షెడ్యూలు రేట్లు, గుర్తించిన పి.డబ్ల్యు.డిలకు ప్రత్యేకమైన పనుల గుర్తింపు.

## ఏడాదిలో తీసుకున్న కీలక నిర్ణయాలు

- వేతనం రేటును రూ. 149 నుంచి, రూ. 169కి ఈ ఏడాదిలో పెంచడం జరిగింది.

- ఆధార్‌తో అనుసంధానం : మొత్తం 75 లక్షల మంది లబ్ధిదారులను ఆధార్‌తో నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, 56.9 లక్షల మంది లబ్ధిదారులను యునీక్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (యు.ఐ.డి) లేదా ఎన్‌రోల్‌మెంట్ నెంబర్ (ఇ.ఐ.డి)తో గుర్తించడం జరిగింది. 47.8 లక్షల మంది లబ్ధిదారుల అంటే 76 శాతం డెమో వివరాలను ప్రోగ్రాం ఆఫీసర్లు అధీకృతం చేయడం జరిగింది.
- ప్రక్షాళన చేసిన ఇ.ఎఫ్.ఎం.ఎస్‌లు : అన్ని వేతన చెల్లింపులు నేరుగా ఉపాధి కల్పితుల ఖాతాలలో జమ అవుతాయి. బయోమెట్రిక్ తనిఖీ ఆధారంగా వాటిని చెల్లించడం జరుగుతుంది.
- మొక్కల పెంపకాన్ని చేపట్టడం ద్వారా రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడానికి 'తెలంగాణకు హరిత హారం' కార్యక్రమాన్ని ప్రకటించారు.

ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ అమలులో గ్రామపంచాయతీల పాత్రను మెరుగుపరచడానికి గానూ, పనుల ప్రణాళికలో, అమలులో గ్రామపంచాయతీలను చురుకుగా నిమగ్నం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సెర్ప్, పంచాయతీ రాజ్ శాఖలతో కలిసి, ప్రభుత్వం పంట కోత అనంతర కార్యకలాపాలలో వ్యవసాయ రంగానికి అండగా నిలిచేలా ఒక అగ్రగామి కార్యక్రమాన్ని ప్రకటించింది. ఆరబెట్టే ఆవరణలతో సహా 181 గ్రామీణ గిడ్డంగులను ఈ కార్యక్రమం కింద నిర్మిస్తారు. వీటిలో ఐ.కె.పి కేంద్రాలు చురుకుగా పనిచేస్తున్నాయి.

## సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్)

గ్రామీణ పేదరికాన్ని తొలగించడానికి ఉద్దేశించిన వ్యవస్థ సెర్ప్. ప్రపంచ బ్యాంకు సహాయంతో 2000 సహస్రాబ్ది ప్రారంభంలో ఈ సంస్థ గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయ బృందాలను ఏర్పాటు చేసుకోవలసిందిగా మహిళలను ప్రోత్సహించింది. కమ్యూనిటీ ఆధారిత సంస్థ (సి.బి.ఓ)ల కోవలోకి వచ్చే ఈ యంత్రాంగం ఆర్థిక ప్రగతిలో మారుమూల వర్గాలను చేర్చడానికి ఊతమిచ్చింది. అవకాశాలను పెంచింది. తరువాత భూమి ఆధారిత జీవనోపాధిని పెంచడానికి, నైపుణ్యాలను పెంచడానికి, జీవనోపాధికి అండగా నిలవడానికి, ప్రభుత్వ కార్యక్రమాలను అందిపుచ్చుకోడానికి, ఆరోగ్య, విద్యా ప్రయోజనాలను మెరుగుపరచుకోడానికి కూడా వీటిని విస్తరించారు. రాష్ట్రంలో దాదాపు 90 శాతం పేద కుటుంబాలు ఈ కమ్యూనిటీ సంస్థలలో సభ్యులు. వర్తమానంలో 47,41,891 మంది మహిళలు గ్రామ / జనావాస స్థాయిలో 4,16,811 స్వయం సహాయ బృందా (ఎస్.హెచ్.జి)లను ఏర్పాటు చేసుకుని ఉన్నారు. ఎస్.హెచ్.జిలు గ్రామ స్థాయిలో సమాఖ్యగా ఏర్పడి విలేజ్ ఆర్గనైజేషన్స్ (వి.ఓ)లుగా, వి.ఓలు మండల స్థాయిలో సమాఖ్యగా ఏర్పడి మండల మహిళా సమాఖ్య (ఎం.ఎం.ఎస్)గా ఏర్పడ్డాయి. ప్రస్తుతంలో 17,811 వి.ఓలు, 438 ఎం.ఎం.ఎస్‌లు ఉన్నాయి. ఈ మండల మహిళా సమాఖ్యలు జిల్లా స్థాయిలో సమాఖ్యగా ఏర్పడి 9 జిల్లా సమాఖ్యలుగా ఆవిర్భవించాయి.

కరీంనగర్, మెదక్ జిల్లాలలో పర్యటించి, బీడీ కార్మికుల కష్టాలను అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఒక సీనియర్ ఐ.ఏ.ఎస్ అధికారితో కలిపి ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ నివేదిక ఆధారంగా బీడీ కార్మికులకు పింఛన్ చెల్లింపులు జరపడానికి సముచితమైన మార్గదర్శక సూత్రాలను సిద్ధం చేయదలచింది.

## తెలంగాణ పల్లె ప్రగతి ప్రాజెక్ట్

పేదల 'సమ్మిళిత అభివృద్ధి'ని సాధించడానికి వీలుగా వ్యవస్థాగత వేదికలను పటిష్ఠం చేయడం మీద తెలంగాణ పల్లె ప్రగతి ప్రాజెక్టు (తెలంగాణ రూరల్ ఇన్‌క్లూజివ్ గ్రోత్ ప్రాజెక్ట్ - టి.ఆర్.ఐ.జి.పి) తన దృష్టిని సారిస్తుంది. ఇందుకు గానూ జీవనోపాధి అవకాశాలను పెంచుతుంది. నూతన మార్గాలలోకి విస్తరిస్తుంది. అదే విధంగా మానవాభివృద్ధి చర్యల ద్వారా, తమకు చట్టం ద్వారా, ప్రభుత్వ పథకాల ద్వారా లభిస్తున్న ప్రయోజనాలను అందిపుచ్చుకునేలా, ప్రత్యేకించి పేదలలో కెల్లా పేదలైన గ్రామీణ కుటుంబాలు అవకాశాలను వినియోగించుకునేలా చేయడానికి కృషి చేస్తుంది. ప్రతిపాదిత ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 642.00 కోట్లుగా అంచనా వేశారు. దీనిలో ప్రభుత్వం భరించే వాటా రూ. 192.00 కోట్లు కాగా, ప్రపంచ బ్యాంకు నిధుల నుంచి సమకూర్చేది రూ. 450 కోట్లు. ప్రాజెక్టు అమలుకు నిర్దేశించిన కాలవ్యవధి అనగా 2015 ఫిబ్రవరి నుంచి 2020 ఫిబ్రవరి వరకు మొత్తం అయిదేళ్లు.

లక్ష్యంగా పెట్టుకున్న లబ్ధిదారులు చిన్నకారు, సన్నకారు రైతులు, కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో 150 అత్యంత వెనుకబడిన మండలాలలో సుమారు 6,000 గ్రామాలలో వివిధ సమాజాల నుంచి తీసుకున్న ఎస్.సి / ఎస్.టి కుటుంబాలు. ఈ ప్రాజెక్టులో అయిదు భాగాలుంటాయి. అవి విలువ శ్రేణి అభివృద్ధి, మానవాభివృద్ధి, పల్లె ప్రగతి సేవా కేంద్రం, ఐ.సి.టి మరియు భాగస్వాములు, ప్రాజెక్టు అమలుకు అండదండ.

## ఆర్థిక సదుపాయం - బ్యాంకుతో అనుసంధానం

ఎస్.హెచ్.జి ఉద్యమం ద్వారా మహిళలతో భారీయెత్తున పొదుపు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఎస్.హెచ్.జిలు పొదుపు చేయడమే కాక, బృందం వద్ద ఏర్పడిన మూలనిధి నుంచి చిన్న చిన్న రుణాలు కూడా తీసుకుంటారు. ఎస్.హెచ్.జిల వద్ద పోగుపడిన

సంచిత పొదుపు నిధి రూ. 1845.00 కోట్లు ఉంది. ఏటా దాదాపు రూ. 378 కోట్లు జమ అవుతోంది. కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ మొత్తం రూ. 435.00 కోట్లు. బ్యాంకు అనుసంధానం / నగదు పరపతి సంచిత హద్దు రూ. 22657.00 కోట్లు కాగా, ఏటా పూర్తిగా సాధించగలిగిన అవకాశం రూ. 4000.00 కోట్ల వరకు ఉంది.

### స్త్రీ నిధి

పేదలకు సకాలంలో, సముచితమైన రీతిలో రుణాలను అందించడంలో స్త్రీ నిధి ఓ విశిష్ఠమైన స్థానాన్ని సంపాదించింది. దీని నుంచి ఒక కొలతను తీసుకుని, ఆ భాగాన్ని జీవనోపాధి అభివృద్ధి వ్యవస్థగా పరిగణించి, తద్వారా నిరుపేదపు ఆదాయాన్ని పెంచడానికి ఉపయోగిస్తారు. 2015-16 సంవత్సరంలో రూ. 1100 కోట్లను రుణంగా ఇవ్వాలని తలపెట్టారు. ఎస్.హెచ్.జిలకు చెందిన 436 మండల మహిళా సమాఖ్య (ఎం.ఎం.ఎస్)లు తెలంగాణ ప్రభుత్వంతో చేతులు కలిపి, 'స్త్రీ నిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్'ని నెలకొల్పుకున్నాయి. అరకొర రుణ సదుపాయ సమస్యను పరిష్కరించుకోవడం, సకాలంలో రుణ సహాయాన్ని పొందడం, ప్రత్యేకించి అవసరమైన 48 గంటల వ్యవధిలో రుణాన్ని పొందడానికి, నిరుపేదల అత్యవసర అవసరాలను ఆలస్యం లేకుండా తీర్చుకోవడానికి ఈ సహకార పరపతి సమాఖ్యను నెలకొల్పుకున్నారు. ఆర్థిక సంవత్సరం 2014-15లో 2014 జనవరి వరకు, 423 మండలాలకు, 7,432 వి.ఓలలో, 60,797 ఎస్.హెచ్.జిలకు చెందిన 2,24,902 మంది సభ్యులకు రూ. 481.80 కోట్లను రుణాలుగా పంపిణీ చేయడం జరిగింది.

## మానవాభివృద్ధి

### వికలాంగుల సమ్మిళిత అభివృద్ధి

సమాన అవకాశాలు, హక్కుల సంరక్షణ, సి.బి.ఓల ద్వారా సంపూర్ణ భాగస్వామ్యసాధన దీనిలో భాగాలు. వికలాంగులకు సహాయం చేసే ఐ.కె.పి ప్రయత్నాలు 4.1 లక్షల మందికి పైగా గ్రామీణ వికలాంగులకు మేలు ఒనగూర్చాయి. వారు సంఘటితమై, సొంత సి.బి.ఓలను అభివృద్ధి చేసుకోడానికి సహాయపడ్డాయి.

438 మండలాలలో 436 మండల వికలాంగుల సమాఖ్య (ఎం.వి.ఎస్)లు, 9 జిల్లా వికలాంగుల సమాఖ్య (జడ్.వి.ఎస్)లు, 198207 మంది పి.డబ్ల్యు.డి (వైకల్యంతో ఉన్న వ్యక్తు)లతో పి.డబ్ల్యు.డి కార్యకలాపాలు అమలు జరుగుతున్నాయి. వీరంతా తెలంగాణ రాష్ట్రంలో 20,368 ప్రత్యేకమైన పి.డబ్ల్యు.డి ఎస్.హెచ్.జిలుగా ఏర్పడ్డారు. జీవనోపాధిని పెంచుకోడానికై, సి.ఐ.ఎఫ్ ద్వారా రూ. 18.32 కోట్లు, బ్యాంకులతో ముడిపెట్టిన రుణాల ద్వారా రూ. 214 కోట్లు, స్త్రీ నిది మరియు రివాల్వింగ్ ఫండ్‌ల ద్వారా రూ. 9.9 కోట్లు ఆర్థిక సహాయాన్ని ఇవ్వడం జరిగింది.

### సమాజ నిర్వహణలో ఆరోగ్యం, పోషకాహారం

గర్భిణులకు, పసిబిడ్డలకు పాలిస్తున్న స్త్రీలకు మూడు పోషకాహార భరితమైన భోజనాలను, ఆరోగ్య విద్యను అందించడానికి దాదాపు 1800 పోషకాహార, డే కేర్ సెంటర్ (ఎన్.డి.సి.సి)లను నెలకొల్పడం జరిగింది.

### స్త్రీ - పురుష సమానత్వ ప్రబోధం

స్త్రీ - పురుష సమానత్వానికి సంబంధించి సామాజిక, మానవ అభివృద్ధిలో భాగంగా, 436 మండల స్థాయి సామాజిక కార్యాచరణ సంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. హింసను, అన్యాయాన్ని పరిహరించడం, నివారించడం ధ్యేయంగా, తెలంగాణ రాష్ట్రాన్ని పీడిస్తున్న దిగువ సామాజిక సమస్యలను తగ్గించడం ఆశయంగా సమాజ నిర్వహణలో 340 కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయి :

- మహిళల మీద పాల్పడే నేరాలు (అత్యాచారం, లైంగికపరమైన వేధింపులు, ఏడిపించడం, యాసిడ్ దాడులు)
- గృహ హింస
- వరకట్నం కోసం వేధించడం
- గర్భస్థ శిశువు ఆడపిల్ల అని తెలిసి, గర్భవిచ్ఛేదం చేయించడం / ఆడ శిశువులను హతమార్చడం (దీని వల్ల మగ, ఆడ నిష్పత్తి దెబ్బతినిపోతోంది)
- బాలలను పనిలో పెట్టడం
- బాల్య వివాహాలు
- మద్యపాన వ్యసనం (మగవారిలో మద్య పాన వ్యసనం పెరగడం వల్ల మహిళల మీద నేరాలకు పాల్పడడం పెరిగిపోతోంది)

- ఎస్.సి / ఎస్.టి అత్యాచారాల కేసులు
- జోగిని / బసివిని / మాతంగి వ్యవస్థలు
- ఆడపిల్లల విక్రయం, వ్యభిచారం చేయించడం
- క్షుద్ర ప్రతీకారాలు (క్షుద్ర విద్యలు చేస్తున్నారనే అనుమానంతో మహిళల మీద హింసకు పాల్పడడం)

సమాజ నిర్వహణలో రాష్ట్రంలో 340 కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటికి వచ్చిన 31991 కేసులలో 26052 కేసులు పరిష్కారాన్ని పొందాయి.

## గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం

రాష్ట్రంలోని గ్రామ ప్రాంతాలలో తాగునీటి సరఫరాకు, పారిశుద్ధ్య సదుపాయాలకు మధ్యంతర కేంద్రంగా సేవలందించే వ్యవస్థ గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ. వివిధ రకాల పథకాల ద్వారా తాగునీటి సదుపాయాలను కల్పించడం జరుగుతోంది. వాటిలో చేతి పంపులతో బోర్ బావులు, సురక్షిత నీటి సరఫరా పథకాలు, సమాజ రక్షణలో అమలు జరిగే నీటి సరఫరా పథకాలు మొదలైనవి.

దిగువ ఆశయాల సాధన ద్వారా గ్రామీణ ప్రాంతాలలో తాగు నీటి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది:

- అందరు గ్రామీణ ప్రజలకు తాగడానికి యోగ్యమైన, సురక్షితమైన నీటిని తగినంతగా అందజేయడం.
- ఫ్లోరైడ్ నీరు, ఉప్పునీరు, ఇతర కలుషిత జనావాసాలలో సురక్షితమైన నీటి సరఫరా.
- పూర్తి స్థాయిలో, అందరికీ మంచి నీరు అందే స్థాయికి అన్ని జనావాసాలనూ తీసుకువెళ్లడం.
- వనరులు / పథకాలు నిలదొక్కుకునే విధంగా తగిన చర్యలు.
- అన్ని జనావాసాలకు తగిన పారిశుద్ధ్య సదుపాయాలు.

జనావాసాలకు తాగునీటి సదుపాయాలను కల్పించడానికి, పారిశుద్ధ్య సదుపాయాలను ఏర్పాటు చేయడానికి సంబంధించిన పథకాలను అమలు చేయడానికి / పనులను పూర్తి గావించడానికి వివిధ రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, మరియు కేంద్రప్రభుత్వ పథకాలైన ఎన్.ఆర్.డి.డబ్ల్యు.పి, 13వ ఆర్థిక సంఘం (టి.ఎఫ్.సి), నిర్మల్ భారత్ అభియాన్ (ఎన్.బి.ఏ) ఇంకా ఇతర వెలుపలి సంస్థలు నిధులను సమకూరుస్తున్నాయి. నాబార్డ్, హడ్కో, ప్రపంచ బ్యాంకుల నుంచి రుణాల రూపంలో కూడా నిధులను సమీకరిస్తున్నారు.

## నీటి సరఫరాకు మౌలిక సదుపాయాలు

02.06.2014నాటికి 1,58,496 చేతి పంపులు, 24,003 పి.డబ్ల్యు.ఎస్ పథకాలు, 147 సి.పి.డబ్ల్యు.ఎస్ పథకాలు (ఎస్.ఎస్.పి పథకాలతో కలిపి) ఉనికిలో ఉన్నాయి.

2014-15లో (2.6.2014 నుంచి) 01.02.2015 నాటికి పనులు జరుగుతున్న కార్యక్రమాలు, పూర్తి చేసిన విజయాలు

ఎన్.ఆర్.డి.డబ్ల్యు.పి, నాబార్డ్, ప్రపంచ బ్యాంకు, 13వ ఆర్థిక సంఘం గ్రాంట్లు మొదలైన వివిధ గ్రాంట్లతో 15,208 జనావాసాలకు ప్రయోజనం చేకూర్చే 6284 పనులు రూ. 3354.15 కోట్ల వ్యయంతో అమలులో ఉన్నాయి. వీటిలో 2085 జనావాసాలకు 2014-15లో ప్రయోజనం అందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2015 జనవరి నాటికి రూ. 508.21 కోట్ల ఖర్చు జరగగా, 1854 జనావాసాలకు పూర్తి మేలు ఒనగూరింది. దీనిలో అప్పటి వరకు పాక్షికంగా సదుపాయాన్ని పొందుతున్న 1658 జనావాసాలు, నాణ్యత దెబ్బతినిపోయిన 196 జనావాసాలు ఉన్నాయి.

## గ్రామీణ పారిశుద్ధ్యం

సంపూర్ణ పారిశుద్ధ్య ఉద్యమం ఒక కేంద్ర కార్యక్రమం. దానికి 1.4.2012 నుంచి నిర్మల్ భారత్ అభియాన్ (ఎన్.బి.ఏ)గా పేరు మార్చారు. దానితో పాటే గ్రామీణ ప్రాంతాలకు పారిశుద్ధ్య సాధనను త్వరితం చేయడానికి వీలుగా ఆశయాలను, మార్గదర్శక సూత్రాలను కూడా సవరించారు. సరికొత్త వ్యూహాలతో గ్రామీణ సమాజానికి సమగ్రమైన పారిశుద్ధ్యతను సాధించేలా కొత్త కార్యక్రమాన్ని మలచారు. నిర్మల గ్రామ పంచాయతీ (ఎన్.జి.పి)లను సృష్టించే ఉద్దేశ్యంతో, మొత్తం సమాజం సంతృప్త స్థితిలో పారిశుద్ధ్యాన్ని సాధించేలా నిర్మల్ భారత్ అభియాన్ (ఎన్.బి.ఏ)ను ఉద్దేశించారు.

రాష్ట్రంలో 100 శాతం గ్రామీణ పారిశుద్ధ్యాన్ని సాధించడానికి, ప్రభుత్వం వ్యక్తిగత కుటుంబ యాజమాన్య మరుగుదొడ్ల (ఐ.హెచ్.హెచ్.ఎల్)లను, స్కూళ్లు, అంగన్‌వాడీ మరుగుదొడ్లను ఒక్కొక్క యూనిట్‌గా పరిగణిస్తూ, వాటి నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది.

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబం రూ. 900/- చెల్లించే పక్షంలో ప్రభుత్వం రూ. 10,000/-ను ప్రోత్సాహకంగా ఇచ్చి, రాష్ట్రంలో ఎం.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్‌తో కలసి, ఐ.హెచ్.హెచ్.ఎల్‌ను నిర్మించుకునేలా ఎన్.బి.ఏ ప్రాజెక్టును ప్రభుత్వం 2014 అక్టోబర్ 2వ తేదీ వరకు అమలు చేసింది. ఇటీవలనే భారత ప్రభుత్వం ఎన్.బి.ఏ కార్యక్రమాన్ని ఆపుచేసి, దాని స్థానే దానిని పునర్నిర్మించి, అభివృద్ధి చేసిన స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) ను ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమాన్ని 2014 అక్టోబర్ 2వ తేదీన ఉద్యమ తీరులో ప్రారంభించి, 2019 నాటికి ఆరుబయలు మల విసర్జనను నిర్మూలించిన దేశంగా భారతదేశాన్ని మలచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎన్.బి.ఏ కార్యక్రమాన్ని పునర్నిర్మించి, దాని స్థానే ఎస్.బి.ఎం (జి)ని ప్రవేశ పెట్టే సందర్భంలో భారత ప్రభుత్వం, ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని రూ. 10,000/- నుంచి రూ. 12,000/-కి పెంచింది. మరుగుదొడ్డికి నీటి సదుపాయం కల్పించడానికి, అంటే నీటి నిల్వ కుళాయిని ఏర్పాటు చేసుకోడానికి, చేతులు కడుక్కునే సదుపాయాన్ని కల్పించడానికి ప్రోత్సాహకాన్ని ఈ విధంగా పెంచుతున్నట్లు తెలియజేసింది.

## తెలంగాణ గ్రామీణాభివృద్ధి అకాడమీ

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యకలాపాలపై శిక్షణనివ్వడానికి, సామర్థ్యాన్ని నిర్మించడానికి ఉద్దేశించిన తెలంగాణ ప్రభుత్వ సర్వోన్నత స్థాయి సంస్థ ఎ.ఎం.ఆర్ - తెలంగాణ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్. పంచాయతీ రాజ్ సంస్థలకు ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు, పంచాయతీ రాజ్ అధికారులకు, గ్రామీణాభివృద్ధి అధికారులకు, సంబంధిత ఇతర ప్రభుత్వ అధికారులకు ఈ అకాడమీ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. గ్రామీణ ప్రజలకు సంబంధించిన వివిధ అంశాల మీద ఈ అకాడమీ కార్యగోష్ఠులను, సదస్సులను కూడా నిర్వహిస్తుంది.

## పట్టణాభివృద్ధి, పురపాలన.

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో పట్టణ జనాభా 13.61 మిలియన్‌లు. వీరు మొత్తం జనాభాలో 38.67 శాతం. దేశం మొత్తం జనాభాలో దేశంలోని పట్టణ జనాభా శాతం 31.15 శాతం మాత్రమే. దీనిని బట్టి, రాష్ట్రంలో పట్టణీకరణ స్థాయి ఏడు శాతం పాయింట్లు పెరిగింది. హైదరాబాద్ నూరు శాతం పట్టణ జిల్లా. కానీ, హైదరాబాద్ నగరం జిల్లా సరిహద్దులను దాటి, పొరుగున ఉన్న రంగారెడ్డి జిల్లాలోకి కూడా వ్యాపించింది. ఈ కారణంగా హైదరాబాద్ తర్వాత ఎక్కువగా పట్టణీకరణ చెందిన జిల్లాగా రంగారెడ్డి జిల్లా నిలచింది. రంగారెడ్డి జిల్లాలో పట్టణ జనాభా 70.32 శాతం. పట్టణ జనాభా 68 నగర స్థానిక స్వపరిపాలన సంస్థలతో విస్తరించి ఉండగా, వీటిలో 6 కార్పొరేషన్‌లు, 37 అన్ని గ్రేడ్‌లకు చెందిన మునిసిపాలిటీలు, 25 నగర పంచాయతీలు ఉన్నాయి. హైదరాబాద్ నగర సముదాయంలో భాగమైన పది మునిసిపాలిటీలు హైదరాబాద్ నగర కార్పొరేషన్‌లో విలీనమై, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జి.హెచ్.ఎం.సి) ఆవిర్భవించింది. హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్.ఎం.డి.ఏ) కిందకు మొత్తం 7,228 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం వస్తుంది. దీనిలో హైదరాబాద్ జిల్లాకు చెందిన మొత్తం 16 మండలాలు, రంగారెడ్డి జిల్లాకు చెందిన 22 మండలాలు, మెదక్ జిల్లాకు చెందిన 10 మండలాలు, నల్గొండ జిల్లాకు చెందిన 5 మండలాలు, మహబూబ్ నగర్‌కు చెందిన 2 మండలాలు ఉన్నాయి. ఏమైనప్పటికీ, జి.హెచ్.ఎం.సి చుట్టుపక్కల ఉన్న మెదక్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలలో పట్టణీకరణ చాలా తక్కువే.

**పట్టిక 27: తెలంగాణాలో 2001-11 దశకంలో పట్టణీకరణ వృద్ధి, స్థాయి**

| వరుస సంఖ్య | జిల్లా | పట్టణ జనాభా 2001 | పట్టణ జనాభా 2011 | పెరుగుదల రేటు 2001-11 | మొత్తం జనాభాలో పట్టణ జనాభా శాతం |
|---|---|---|---|---|---|
| 1 | ఆదిలాబాద్ | 6,60,017 | 7,60,259 | 15.19 | 27.73 |
| 2 | నిజామాబాద్ | 4,24,738 | 5,88,372 | 38.53 | 23.06 |
| 3 | కరీంనగర్ | 6,78,812 | 9,51,225 | 40.13 | 25.19 |
| 4 | మెదక్ | 3,83,524 | 7,27,871 | 89.78 | 24.00 |
| 5 | హైదరాబాద్ | 38,29,753 | 39,43,323 | 2.97 | 100.00 |
| 6 | రంగారెడ్డి | 19,37,837 | 37,19,172 | 91.92 | 70.22 |
| 7 | మహబూబ్‌నగర్ | 3,71,335 | 6,07,692 | 63.64 | 14.99 |
| 8 | నల్గొండ | 4,32,678 | 6,62,507 | 53.12 | 18.99 |
| 9 | వరంగల్ | 6,23,212 | 9,92,333 | 59.23 | 28.25 |
| 10 | ఖమ్మం | 5,10,861 | 6,55,911 | 28.39 | 23.45 |
| | **మొత్తం** | **98,52,787** | **1,36,08,665** | **38.12** | **38.67** |
| | **మొత్తం(రంగారెడ్డి మినహా)** | **79,14,950** | **98,89,493** | **24.94** | |

రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పేదలు తరలి వచ్చి, మురికివాడలలో స్థిరపడడం, వారి సంఖ్య నిరంతరంగా పెరగడం, పట్టణ సదుపాయాల మీద వత్తిడి, చెత్త, ఎలక్ట్రానిక్ వ్యర్థపదార్థాలు పెరిగిపోవడం, కాలుష్యం, జీవన పరిస్థితులలో పెరిగిపోతున్న అసమానతలు కారణంగా పట్టణాభివృద్ధికి తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి.

కొత్తగా రూపుదిద్దుకుంటున్న స్మార్ట్ సిటీలు (నవ్య నగరాలు) అనే భావనలో సమాచార నెట్‌వర్క్, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, సురక్షితమైన తాగునీరు, పారిశుధ్యం, అందరికీ గృహ వసతి, హరిత పర్యావరణం, ఆరుబయలు మల విసర్జన పద్ధతి నిర్మూలన, ప్రత్యేకించి ఇప్పటి వరకు నిర్లక్ష్యానికి గురైన జనాభాకు కూడా పాత్ర కల్పించే విధానం దీనిలో ముఖ్యాంశాలు.

## మన వార్డు - మన పట్టణం - మన ప్రణాళిక

శీఘ్రంగా జరుగుతున్న పట్టణీకరణ, మేజర్ గ్రామ పంచాయతీలను పట్టణ స్వపరిపాలన సంస్థ (యు.ఎల్.బి)లుగా పెంచడం ఫలితంగా మొట్టమొదటి సారిగా రాష్ట్రంలో 'మన వార్డు— మన పట్టణం— మన ప్రణాళిక' అనే వినూత్న పథకాన్ని రాష్ట్రంలో ప్రారంభించడం జరిగింది. ప్రజల అవసరాలను గుర్తించడం దీనిలో మొదటి అంశం. అన్ని యు.ఎల్.బిలలో వార్డు సభలను నిర్వహించారు. వీటిలో అందరు ప్రజా ప్రతినిధులను హాజరు పరచారు. వార్డు స్థాయిలో, యు.ఎల్.బి స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించారు. నీటి సరఫరా, రోడ్లు, మురుగు నీటి పారుదల, పారిశుధ్య సదుపాయాలు, వీధి దీపాలు, భవిష్యత్ అవసరాలను ప్రధానమైనవిగా గుర్తించి, వాటిపై దృష్టి సారించారు. 67 యు.ఎల్.బిలలోని 1549 వార్డులలో రూ. 749179.71 లక్షలు ఖర్చయ్యే 5,98,632 ప్రతిపాదనలను గుర్తించారు. తిరిగి పై వాటిలో మొదటి మూడు అగ్రప్రాధాన్యానికి సంబంధించిన 5165 ప్రతిపాదనలను గుర్తించి, వాటికి రూ. 3159.85 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. యు.ఎల్.బి స్థాయిలో మొదటి మూడు అగ్రప్రాధాన్యానికి సంబంధించిన 210 ప్రతిపాదనలను గుర్తించి, వాటికి రూ. 8166.90 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ప్రభుత్వ శాఖ 2015-16 సంవత్సరం బడ్జెట్ నుంచి రూ. 1847.76 కోట్లు భరించాలని ప్రతిపాదించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ పథకం కింద, లోతట్టు రోడ్లు, అభివృద్ధి పనుల కోసం కొత్త మునిసిపాలిటీలకు సహాయం, ఎం.ఇ.పి.ఎం.ఏ, ఎ.పి.ఎం.డి.పి మొదలైనవాటి కింద ఈ ఖర్చును భర్తీ చేస్తారు. తక్కిన మొత్తాన్ని 14వ ఫైనాన్స్ కమిషన్ నిధుల నుంచి / ప్రభుత్వ శాఖ బడ్జెట్ నుంచి / ప్రత్యేక గ్రాంట్ల నుంచి వచ్చే 5 ఏళ్ల కాలంలో దశల వారీగా సమీకరించాలని ప్రతిపాదించారు.

## స్వచ్ఛ భారత్ మిషన్

2014 జూన్ 9వ తేదీన పార్లమెంటు సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గౌరవనీయులైన రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో ఉట్టిపడిన ప్రభుత్వ దార్శనికత నుంచి ఉద్భవించినదే స్వచ్ఛ భారత్ ఉద్యమం. ఇది పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, తాగు నీటి, పారిశుధ్య విభాగాల మంత్రిత్వ శాఖల సంయుక్త దీక్షా కార్యక్రమం. ఈ దీక్షా కార్యక్రమాన్ని మహాత్మాగాంధీ 150వ జన్మదినోత్సవం 2019 అక్టోబర్ రెండో తేదీ సందర్భంగా ఆయనకు నివాళిగా 2014 అక్టోబర్ రెండో తేదీ నుంచి అయిదేళ్ల పాటు నిర్వర్తిస్తారు. పట్టణ భారతదేశాన్ని సమాజం నడిపించే వ్యవస్థగా, సంపూర్ణంగా మురికి రహితం చేసినదిగా, జీవించదగిన నగరాలుగా, పట్టణాలుగా పరివర్తన గావించడమే జాతీయ పట్టణ పారిశుధ్య విధానం స్థూలమైన లక్ష్యం.

## తెలంగాణలో దీక్షా కార్యక్రమం

## పట్టణ స్వపరిపాలన సంస్థలలో పారిశుధ్యం

- 2011 జనాభా లెక్కల నివేదికను అనుసరించి, తెలంగాణలో 91.12 శాతం పట్టణ కుటుంబాలకు మరుగుదొడ్డి సదుపాయం ఉంది. ఇది జాతీయ స్థాయి సగటు 81.4 శాతం కన్నా మెరుగు.
- తెలంగాణ రాష్ట్రంలో పట్టణ కుటుంబాల మధ్య ఆరుబయలు మలవిసర్జన 8.98 శాతం. ఇది జాతీయ స్థాయి సగటు 12.6 శాతం కన్నా మెరుగు. రాష్ట్రంలో పట్టణ వాస కుటుంబాలు 3171376 ఉండగా, వాటిలో ఆరుబయలు మలవిసర్జన గావిస్తున్న కుటుంబాలు 275151గా గుర్తించారు. తెలంగాణ జిల్లాలలో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 25.87 శాతం పట్టణ కుటుంబాలు ఆరుబయలు మల విసర్జన విధానాన్ని అనుసరిస్తున్నాయి. 19.37 శాతం పట్టణ కుటుంబాలతో మహబూబ్‌నగర్ జిల్లా, 18.22 శాతం పట్టణ కుటుంబాలతో నల్గొండ జిల్లా తరువాత స్థానాలలో ఉన్నాయి.
- తెలంగాణ రాష్ట్రంలోని యు.ఎల్.బిలు సగటున రోజుకు 6287 మెట్రిక్ టన్నుల చెత్తను వదులుతున్నాయి. యు.ఎల్.బిలలో ఉత్పత్తి అవుతున్న తలసరి చెత్త రోజుకు 0.3 - 0.4 కిలోలు ఉంటోంది. ఉత్పత్తి అవుతున్న చెత్త పరిమాణం ఏటా 5 శాతం పెరుగుతోంది. కాగా, చెత్తను శుభ్రం చేసే సామర్థ్యం యు.ఎల్.బిలలో 80 శాతం ఉంది. చెత్తను పడేయడానికి, శుద్ధి చేయడానికి అవసరమైన ఆవరణలు లేని యు.ఎల్.బిలు 23 వరకు ఉన్నాయి.

- వరదలు వచ్చినప్పుడు, మురుగును వెనువెంటనే వదలించే సదుపాయాలు తగినన్ని లేకపోవడం వల్ల, ఉన్నవి సరైన స్థితిలో లేకపోవడం వల్ల మురుగు నీటి మార్గాలలో అవరోధాలు ఏర్పడి, అనారోగ్యకరమైన వాతావరణానికి దారితీస్తోంది.

## ప్రభుత్వ చర్యలు

స్వచ్ఛ భారత్ మిషన్‌ను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం అగ్రగామిగా ఉంది. ఈ విషయంలో మొదటి అడుగుగా స్వచ్ఛ తెలంగాణ వారోత్సవం (పరిశుభ్రమైన తెలంగాణ వారోత్సవం)ని 2014 సెప్టెంబర్ 25వ తేదీన లాంఛనంగా ప్రారంభించడం జరిగింది. దీనిని రాష్ట్రంలోని మొత్తం అన్ని 67 యు.ఎల్.బిలలోనూ పాటించడం జరిగింది. పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో చేపట్టడంతో పాటు, నిరంతరంగా పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరస్తామనే ప్రతిజ్ఞతో ఈ వారోత్సవాలను ముగించారు.

## మునిసిపల్ ప్రాంతాలలో పేదరిక నిర్మూలన ఉద్యమం (ఎం.ఇ.పి.ఎం.ఏ)

ఎం.ఇ.పి.ఎం.ఏ ప్రధాన ఆశయం పేద మహిళలను ఎస్.హెచ్.జిలుగా కూర్చి, మురికివాడలలో నివసిస్తున్న అన్ని కుటుంబాలనూ వాటిలో చేర్చి, వారిని స్వావలంబకులుగా తీర్చిదిద్దడం. దాదాపు 12.66 లక్షల మంది మహిళలను 1.26 లక్షల మహిళా స్వయం సహాయ బృందా (ఎస్.హెచ్.జి)లను నిర్మించడం జరిగింది. 2014 డిసెంబర్ నాటికి మొత్తం 4177 మురికివాడ స్థాయి సమాఖ్య (ఎస్.ఎల్.ఎఫ్)లను, 97 బస్తీ స్థాయి సమాఖ్య (టి.ఎల్.ఎఫ్)లను నిర్మించడం జరిగింది. వికలాంగులైన దాదాపు 19,900 మందిని ప్రత్యేకమైన 3,980 ఎస్.హెచ్.జిలుగా కూర్చడం జరిగింది. 57 బస్తీ వికలాంగుల సమాఖ్య (టి.వి.ఎస్)లుగా, 55 మానసిక వికలాంగుల తల్లితండ్రుల సంఘాలను రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరిగింది.

2014-15 సంవత్సరానికి 18,193 స్వయం సహాయ బృందాలకు రూ. 517.00 కోట్ల మేర బ్యాంకు అనుసంధానం గావించడం జరిగింది. ఇంకా 'వడ్డీ లేని రుణాలు' రూ. 75.02 కోట్లను 6,448 స్వయం సహాయ బృందాలకు ఇవ్వడం జరిగింది.

## పింఛన్-కమ్-బీమా పథకం

ఇది పట్టణ ప్రాంతాలలో 18 ఏళ్లు పైబడిన ఎస్.హెచ్.జి మహిళలకు, 60 ఏళ్లు వచ్చే నాటికి సామాజిక భద్రతను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన పథకం. పింఛన్, బీమాలను అందించే ఈ పథకం ప్రయోజనాన్ని పొందడానికి ఆయామహిళలు దీనిలో పాల్గొని కొంత మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది. 2013-14లో ఈ పథకంలో తమ సభ్యత్వాన్ని నవీకరించుకున్న మహిళలు 56,276 మంది కాగా, వారిలో 5,852 మందికి 60 ఏళ్ల వయసు దాటడంతో వారికిప్పుడు నెలనెలా రూ. 500 పింఛన్ జారీ అవుతోంది.

## పట్టణ నీటి సరఫరా ప్రస్తుత పరిస్థితి

రాష్ట్ర ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యం ఇప్పుడున్న అన్ని మౌలిక సదుపాయాలనూ పటిష్ఠం చేయడం ద్వారా, సేవా స్థాయిలనూ మెరుగుపరచడం ద్వారా అన్ని పట్టణ స్వపరిపాలన సంస్థలకు సురక్షితమైన మంచినీటిని సరఫరా చేయడం.

కేంద్ర ప్రజారోగ్య ఇంజనీరింగ్ ఎన్విరాన్‌మెంటల్ ఆర్గనైజేషన్ (సి.పి.హెచ్.ఇ.ఇ.ఓ) నిబంధనావళిలో నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం భూగర్భ డ్రైనేజీ లేని బస్తీలలో రోజుకు తలసరి నీటి సరఫరా కనీసం 70 ఎల్.పి.సి.డి ఉండేలా చూడాలి. అదే భూగర్భ డ్రైనేజీ సదుపాయం ఉన్న పట్టణాలలో అయితే 135 ఎల్.పి.సి.డిలు ఉండేలా చూడాలని ఆ నిబంధనావళి సూచిస్తోంది.

వివిధ పట్టణ స్వపరిపాలన సంస్థలు రోజు వారీగా సరఫరా చేస్తున్న నీరు సాధారణంగా 35 ఎల్.పి.సి.డిల నుంచి 135 ఎల్.పి.సి.డిల వరకు ఉంటోంది. పట్టిక 28లో తెలిపిన విధంగా నీటి సరఫరాను నియంత్రించడం జరుగుతోంది.

**పట్టిక 28 : రోజువారీ నీటి సరఫరా**

| ఎప్పుడెప్పుడు | రోజూ | రోజు విడిచి రోజు | మూడు లేదా అంతకన్నా ఎక్కువ రోజులకు ఒకసారి | మొత్తం |
|---|---|---|---|---|
| ఎన్ని యు.ఎల్.బి.లకు | 28 | 28 | 11 | 67 |

# అధ్యాయం 4

# ఆర్థిక మౌలిక సదుపాయాలు మరియు పారిశ్రామిక విధానం

# 4.1 ఆర్థిక మౌలిక సదుపాయాల మెరుగుదల

మౌలిక సదుపాయాలనేవి ఒక సమాజం లేదా సంస్థ నిర్వహణకు కావలసిన ప్రాథమికమైన భౌతిక, సంస్థాగతమైన నిర్మాణం. ఇవి స్థిరమైన ఆర్థికాభివృద్ధిని సాధ్యం చెయ్యగలిగే వేదికను ఏర్పాటు చేయడంలో ఆర్థిక వృద్ధికి అవసరమైన సేవలు, సౌకర్యాలు కూడా. ఆర్థిక మౌలిక సదుపాయాలు, ప్రధానంగా విద్యుచ్ఛక్తి, నీటిపారుదల, రహదారులు, రవాణా, విమానాశ్రయాలూ తదితరాల మీద దృష్టిని కేంద్రీకరిస్తాయి. వేగంగా వృద్ధి చెందదలచిన ఆర్థిక వ్యవస్థకు మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధి తప్పనిసరిగా కావాలి. ప్రభుత్వ ప్రయత్నాలతో పాటు, ప్రైవేటు రంగం పాత్రను చక్కగా నిర్వచించడం వల్ల ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాల ద్వారా మౌలిక సదుపాయాల కల్పనలో ప్రైవేటు రంగం కీలకమైన పాత్రను పోషించగలుగుతుంది. అలాగే రవాణా, సమాచార వ్యవస్థలు, వినోదం తదితర నిర్ణీతమైన రంగాల్లో ప్రత్యేకమైన పాత్రను పోషించగలుగుతుంది. ఇవన్నీ మౌలిక సదుపాయాల వృద్ధిలో వేగాన్ని పెంచడానికి దోహదపడతాయి.

## విద్యుచ్ఛక్తి

ఐటి ఎగుమతులలో భారతదేశంలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. అలాగే దేశంలోని బల్క్ ఔషధాల్లో మూడో వంతు ఈ రాష్ట్రంలోనే ఉత్పత్తి అవుతున్నాయి. వీటితో పాటుగా, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ రంగం మీద కూడా ఆధారపడి ఉంది. అందువల్ల, దేశంలో అత్యధికంగా విద్యుత్‌ను వినియోగించే రాష్ట్రాల్లో కూడా తెలంగాణ చేరుతోంది. (2012-13 ఆర్థిక సంవత్సరంలో) మొత్తం భారతదేశ తలసరి విద్యుత్ వినియోగం సగటు 917 యూనిట్లు కాగా తెలంగాణలో అది 985 యూనిట్లుగా ఉంది. రాజధాని నగరంలో, ఇతర పట్టణ కేంద్రాల్లో చలనశీలమైన వృద్ధి, గృహావసరాలకూ, వ్యవసాయానికీ అత్యధిక వినియోగం, హైదరాబాద్ మెట్రో రైలు, హైదరాబాద్- నాగపూర్ పారిశ్రామిక కారిడార్ లాంటి రాబోతున్న భారీ ప్రాజెక్టుల్లాంటి వివిధ అంశాల కారణంగా భవిష్యత్తులో విద్యుత్ అవసరాల్లో విశేషమైన వృద్ధి సంభవించవచ్చని అంచనా.

అనేక విధాలుగా అభివృద్ధి చేయబోతున్న సామర్థ్యాల్ని జతచేయడం ద్వారా, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి విద్యుత్ లభ్యతను పెంచడం ద్వారా డిమాండ్‌ను తట్టుకోవడానికి తెలంగాణ ప్రణాళికలు రూపొందిస్తోంది. విద్యుత్ అవసరాలను తీర్చడం కోసం ఇంధనం- ఉత్పత్తి- ట్రాన్స్‌మిషన్- పంపిణీలతో కూడిన విద్యుత్ కార్యకలాపాల యందు లోపాలనూ, సవాళ్ళనూ అధిగమించాల్సి ఉంది.

## ప్రస్తుత పరిస్థితి

తెలంగాణకు ప్రస్తుతం వివిధ వనరుల నుంచి విద్యుత్ లభ్యత (2014-15 ఆర్థిక సంవత్సరంలో) పటం.1లో వివరించిన ప్రకారం 45795ఎం.యు. టిఎస్‌జెన్‌కో, ఎపిజెన్‌కో కేంద్రాలనుంచి తెలంగాణకు 53.89% కేటాయింపు జరుగుతోంది. పిపిఎల కాలవ్యవధి ముగిసిన తర్వాత, ఎపిజెన్‌కో స్టేషన్ల నుంచి విద్యుత్ సామర్థ్యమేదీ అందుబాటులో ఉండదు, అప్పుడు టిఎస్‌జెన్‌కో ప్లాంట్ల నుంచి 100% సామర్థ్యం లభిస్తుంది.

**వివిధ వనరుల ద్వారా ప్రణాళికాబద్ధమైన విద్యుత్ ఉత్పత్తి**




ఆధారం : టి.ఎస్.ఎస్.ఎల్.డి.సి. అన్ని విలువలూ ఎం.యూలలో

రాబోయే అయిదేళ్ళలో డిమాండ్ సరఫరా అంచనాలను పట్టికలో వివరంగా చూడవచ్చు. వ్యవసాయ వినియోగదారులకు 7 గంటల విద్యుత్ సరఫరాకు ఇచ్చిన హామీని కూడా పరిగణనలోకి తీసుకుని విద్యుత్ అవసరాలను అంచనా వేయడం జరిగింది. ఏటా వ్యవసాయ విక్రయాలు 6% పెరుగుతున్నాయి, అలాగే, ఇతర వినియోగదారులందరికీ 24×7 విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంది. రాజధాని నగరమైన హైదరాబాద్‌లో పట్టణాభివృద్ధి పనులతో పాటుగా, హైదరాబాద్ మెట్రో రైల్, హైదరాబాద్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ (ఐటిఐఆర్), హైదరాబాద్- నాగపూర్ పారిశ్రామిక కారిడార్, ఎత్తిపోతల పథకాలు లాంటి రాబోయే భారీ ప్రాజెక్టులతోపాటుగా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి ఇతర కేంద్రాల్లో కూడా పట్టణీకరణకు ప్రణాళికలు వేస్తున్న నేపథ్యంలో అదనపు విద్యుత్ అవసరమవుతుంది.

**పట్టిక 29 : గిరాకీ - సరఫరాల అంచనా చిత్రణ (ఎం.యు)**

| | | తెలంగాణ గిరాకీ - సరఫరాల సారాంశ పట్టిక (ఎం.యు) | | | | |
|---|---|---|---|---|---|---|
| క్ర.సం. | అంశం | ఆ.సం.14-15 | ఆ.సం.15-16 | ఆ.సం.16-17 | ఆ.సం.17-18 | ఆ.సం.18-19 |
| ఎ | అవసరమైన విద్యుచ్ఛక్తి | 54,998 | 63,047 | 67,902 | 77,164 | 84,496 |
| బి | ఇప్పుడున్న వనరుల నుంచి అందుబాటులో నున్న విద్యుచ్ఛక్తి | 47,795 | 45,034 | 44,030 | 43,896 | 43,754 |
| **సి=ఎ-బి** | **విద్యుచ్ఛక్తి లోటు / మిగులు** | **-9,203** | **-18,009** | **-23,872** | **-33,268** | **-40,742** |

2013-14 ఆర్థిక సంవత్సరంలో ప్రసార మార్గంలో జరిగే విద్యుత్ నష్టాలు 3.59% కాగా, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ లభ్యత 99.94%. అయినప్పటికీ, రాష్ట్ర అంతర్గత స్థాయిలో, అంతర్-రాష్ట్ర స్థాయిలో విద్యుత్ ప్రసార మౌలిక సదుపాయాల్ని అభివృద్ధిచేసి, పటిష్టపరచాల్సిన అవసరం ఉంది. దీనిలో విఫలమైతే విద్యుత్ సరఫరా మెరుగుపడదు.

టిఎస్ఎస్‌పిడిసిఎల్, టిఎస్ఎన్‌పిడిసిఎల్ అనే రెండు పంపిణీ సంస్థలు తెలంగాణలోని వినియోగదారులకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాయి. ఈ పంపిణీ సంస్థలు 1.22 కోట్ల మంది వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. వినియోగదారుల విభజన ఈ క్రింద పేర్కొన్న విధంగా ఉంది.

**పట్టిక 30 : వినిమయదారుల విభాగాలు**

| విభాగం | వినిమయ విభాగం |
|---|---|
| గృహ అవసరాలు | 73% |
| వ్యవసాయ అవసరాలు | 17% |
| పారిశ్రామిక అవసరాలు (ఎల్.టి. & హెచ్.టి.) | 1% |
| వాణిజ్య అవసరాలు (ఎల్.టి. & హెచ్.టి.) | 8% |
| ఇతరాలు | 1% |

ఎంపిక చేసిన రాష్ట్రాలైన - తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రలలో విద్యుత్ ప్రసార, పంపిణీ నష్టాలతో పోల్చి చూసినప్పుడు తెలంగాణ డిస్కంలలో విద్యుత్ పంపిణీ, ప్రసార నష్టాలు తక్కువ. అలాగే ఉద్యోగుల సంఖ్యను, అక్కడ జరుగుతున్న విద్యుత్ విక్రయాలతో పోల్చి చూసినప్పుడు, ఉద్యోగుల సంఖ్య తెలంగాణ డిస్కంలలోనే తక్కువ.

## కీలకమైన సవాళ్ళు

**డిమాండ్ సరఫరా అంతరం:** తెలంగాణకు సుమారు 5% విద్యుత్ లోటు వారసత్వంగా సంక్రమించింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ అవసరాలు 47,428 ఎం.యులు కాగా, వివిధ వనరుల ద్వారా సమకూరిన విద్యుత్ కేవలం 44,946 ఎం.యులు మాత్రమే. రానున్న సంవత్సరాల్లో వృద్ధి కోసం రాష్ట్రం ప్రణాళికలు వేస్తున్న నేపథ్యంలో, అభివృద్ధి ప్రోత్సాహకాలకు ఇంధనంగా నిలిచేందుకు అపారమైన విద్యుత్ అవసరం అవుతుంది.

**సంప్రదాయేతర విద్యుత్ సమీకరణ:** సంప్రదాయేతర ఇంధనాల నుంచి విద్యుత్ ఉత్పత్తిని పెంచే విషయంలో తెలంగాణ గట్టి ఆసక్తితో ఉంది. చుట్టూ భూభాగాలు ఆవరించుకుని ఉన్న రాష్ట్రమైన తెలంగాణలో పవన విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశాలు పరిమితం. అందువల్ల వివిధ రకాల విద్యుదుత్పత్తి వనరుల సమ్మేళనాన్ని మెరుగుపరిచే అవకాశాలను రాష్ట్రం అన్వేషిస్తోంది. సౌర విద్యుత్తును, ఇతర సంప్రదాయేతర విద్యుచ్ఛక్తిని సమీకరించడానికి ఎదురు చూస్తోంది.

**ట్రాన్స్‌మిషన్ కారిడార్ అభివృద్ధి:** ఉత్పత్తి చేసిన విద్యుచ్ఛక్తికి ప్రసార సదుపాయం చాలా ముఖ్యం. కొత్తగా వస్తున్న విద్యుదుత్పత్తి కేంద్రాల నుంచి విద్యుత్తును ఎప్పటికప్పుడు తరలించేలా సకల చర్యలూ తీసుకోవడంలో అతి ముఖ్యమైన భాగం ప్రసార కారిడార్ విస్తరణే. అందువల్ల ట్రాన్స్‌మిషన్ కారిడార్ విస్తరణను క్రియాశీలకంగా పర్యవేక్షించడం ద్వారా భవిష్యత్ విద్యుదుత్పత్తికి రంగాన్ని సిద్ధం చేయడం జరుగుతుంది.

**డిస్కం సవాళ్ళు:** విద్యుత్ పంపిణీలో సాంకేతిక, వాణిజ్య నష్టాలను తగ్గించడం, వ్యవస్థాగత మౌలిక సదుపాయాల్లో అంతరాయాలనూ, బ్రేక్‌డౌన్లనూ తగ్గించడం, కొత్త కనెక్షన్ల విడుదల, ఫిర్యాదుల పరిష్కారాల్లో వినియోగదారుల అంచనాలను అందుకోవడం కీలకమైన సవాళ్ళు. మీటరింగ్ మినహాయింపులు, వసూళ్లలో, బిల్లింగ్‌లో సామర్థ్యం తక్కువగా ఉండడం, ప్రభుత్వ విభాగాలు చెల్లించని బకాయిలు, వ్యవసాయ సబ్సిడీ మీద ఆధారపడడం లాంటి వాటి ఫలితంగా నగదు రూపాంతరీకరణ వృత్తం సుదీర్ఘంగా ఉండడంతో టిఎస్‌డిస్కంలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వ్యవసాయ ఫీడర్‌ని వేరు చేయాల్సిన అవసరం ఉంది. దీనివల్ల వ్యవసాయ కనెక్షన్ల వినియోగాన్ని ఇదమిత్థంగా గ్రహించే వీలవుతుంది.

## అదనపు సామర్థ్యాలకు ఉద్దేశించిన చర్యలు

రానున్న అయిదేళ్ళ కాలంలో 4240 మెగావాట్ల (సంచిత) గణనీయ సామర్థ్యాన్ని అదనంగా పెంచేందుకు టిఎస్‌జెన్‌కో ప్రణాళిక రూపొందించింది. అయితే, విద్యుత్ లోటును తీర్చేందుకు టిఎస్‌జెన్‌కో అదనంగా జతచేసే ఈ సామర్థ్యాలు మాత్రమే సరిపోవు, కాబట్టి విద్యుత్ లభ్యతను పెంచడానికి ఇతర వనరుల నుంచి విద్యుత్ సేకరించాల్సిన అవసరం ఉంది.

విద్యుత్ సరఫరా పరిస్థితిని మెరుగుపరచడానికి కుడిగి, ట్యూటీకారన్, నైవేలీ, కల్పాక్కం, శ్రీకాళీలతో సహా కొన్ని విద్యుత్ కేంద్రాల ద్వారా రానున్న అయిదేళ్ళలో 7000 ఎం.యుల విద్యుత్ సమకూరుతుంది, అలాగే త్వరలో ఏర్పాటు కానున్న ఎపిజెన్‌కో ప్లాంట్లు, థర్మల్ పవర్‌టెక్ లాంటి ప్రైవేట్ విద్యుత్ ప్లాంట్లు మరో 10,000 ఎం.యులకు పైగా అందిస్తాయి.

దీర్ఘకాల ప్రాతిపదికన 2000 మెగావాట్ల విద్యుత్ సేకరించడం కోసం పోటీ బిడ్డింగ్‌ని టిఎస్‌డిస్కంలు చేపట్టాయి. ట్రాన్స్‌మిషన్‌లో ఎలాంటి అవరోధాలూ లేకుండా ఎస్ఆర్ జనరేటర్ల ద్వారా 6000 మెగావాట్ల అదనపు విడి సామర్థ్యం సమకూరుతుంది. విద్యుత్ మిశ్రమాన్ని మెరుగుపరచడం కోసం, టిఎస్‌డిస్కంలు ఇప్పటికే బిడ్ ప్రక్రియను పూర్తి చేశాయి, 505 మెగావాట్ల సౌర విద్యుత్‌కు ఒప్పందం చేసుకున్నాయి. మరో 500 మెగావాట్ల కొనుగోలు కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పెంచి, పటిష్ఠపరచడం కోసం టిఎస్‌ట్రాన్స్‌కో సూర్యాపేట నుంచి నందివనపర్తి, శంకర్‌పల్లి (825 మెగావాట్లు/సికెటి) చేపట్టిన లైన్ పనులు జరుగుతున్నాయి. అంతేకాకుండా, 765 కెవి-వార్ధా-నిజామాబాద్-మహేశ్వరం లైన్ కోసం, 400 కెవి ఎస్ఎస్ ఏర్పాటు ద్వారా దిగువ ప్రాంతాన్ని బలోపేతం చేయడానికీ, మహేశ్వరం వద్ద అసోసియేటెడ్ లైన్‌కీ పనులు చేపట్టారు. 765కెవి-వరోరా-వరంగల్-హైదరాబాద్-కర్నూల్ లైన్ కోసం వరంగల్, హైదరాబాద్ మధ్య నెట్‌వర్క్‌ను పటిష్టపరచాలని ప్రతిపాదించడం జరిగింది. అలాగే వేమగిరి నుంచి ముందుకు ట్రాన్స్‌మిషన్ చేయడం కోసం కలపాక నుంచి ఖమ్మం లైన్‌ను పటిష్టపరిచే ప్రతిపాదన ఉంది.

రాష్ట్రంలో మెగా సౌర విద్యుత్ పార్కుల ఏర్పాటుకూ, 5000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికీ తెలంగాణ ప్రణాళికలు వేస్తోంది.

## భవిష్యత్ పథం

రాష్ట్రంలో వినియోగదారులందరికీ సమృద్ధిగా విద్యుత్ అందించడం కోసం ఉత్పత్తి-ట్రాన్స్‌మిషన్-పంపిణీ వాల్యూచైన్ పొడవునా తీసుకోవలసిన చర్యల పరంపరను టిఎస్ విద్యుత్ కంపెనీలు గుర్తించాయి. గుర్తించిన కీలక ప్రయత్నాలలో కొన్నిటిని దిగువన చూడవచ్చు:

## విద్యుదుత్పత్తి

రానున్న కొన్నేళ్ళలో టిఎస్‌జెన్‌కో భారీగా అదనపు సామర్థ్యాల్ని చేకూర్చుకోనుంది. కాబట్టి సాధ్యాసాధ్యాలపై అధ్యయనాలు, భూసేకరణ, అవసరమైన అన్ని అనుమతులనూ పొందే ప్రక్రియను వేగవంతం చేయడం టిఎస్‌జెన్‌కోకు తప్పనిసరి. డి6 బేసిన్ నుంచి గ్యాస్ లభ్యతను బట్టి శంకర్‌పల్లి గ్యాస్ విద్యుత్ ప్లాంట్‌ను పునరుద్ధరించే విషయం పరిగణనలో ఉంది. డిపిఆర్ సిద్ధమయింది, ఈ ప్రాజెక్ట్‌కు 4.62 ఎంఎంఎస్‌సిఎండి సహజ వాయువును కేటాయించాల్సిందిగా భారత ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. బొగ్గు ఆడిటింగ్, టిఎస్‌జెన్‌కో ప్లాంట్ల దగ్గర మూడో పార్టీ ద్వారా మూడు స్థాయిల్లో- లోడింగ్, రవాణా, అన్‌లోడింగ్ (ఈ కార్యకలాపాలను నిర్వహించేందుకు కన్సల్టెంట్లు/ ఆడిటర్లను గుర్తించే ప్రక్రియను ఎస్ఇఆర్‌సి చేపట్టింది), విద్యుత్ ప్లాంట్లలో బొగ్గు జీవిసిని పెంచడం కోసం మిశ్రమ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లాంటి సమర్థతను పెంచే చర్యల్ని చేపట్టడం, బొగ్గు నిల్వల లభ్యత, బొగ్గు కొరత, బొగ్గు లింకేజి అమలు తదితరాల పర్యవేక్షణకోసం ఐటి సహాయక కోల్ ట్రాకింగ్ యంత్రాంగాన్ని ప్రవేశపెట్టడం కూడా కార్యాచరణ అంశాల్లో ఉన్నాయి.

ఏకగవాక్ష అనుమతుల యంత్రాంగం ఏర్పాటు, టిఓడి గంటల్లో ఎలాంటి నియంత్రణలూ లేని బ్యాంకింగ్, క్రాస్ సబ్సిడీ సర్‌ఛార్జి మినహాయింపు అందించడం, సౌర విద్యుత్ పైకప్పులకు విధానపరమైన మద్దతు అందించడం, నెట్ మీటరింగ్, సౌర విద్యుదుత్పత్తికి వికేంద్రీకృత పంపిణీ ఉత్పత్తి నమూనాను ప్రోత్సహించడం, సౌర విద్యుత్ కోసమే ప్రత్యేకంగా వర్తించే విధానాన్ని సిద్ధం చేయడం లాంటి కీలకమైన చర్యల ద్వారా సంప్రదాయేతర ఇంధన (ఎన్‌సిఇ) వ్యవస్థాపక సామర్థ్యాన్ని పెంచి, తద్వారా మరింత నిలకడైన ఇంధన మిశ్రమాన్ని సమకూర్చుకోవాల్సి ఉంది.

## ప్రసరణ

సిజిఎస్, విద్యుత్ ప్లాంట్ల నుంచి విద్యుత్ తరలింపు కోసం అవసరమైన ట్రాన్స్‌మిషన్ మౌలిక సదుపాయాలను టిఎస్‌ట్రాన్స్‌కో సమకూర్చుకోవాల్సి ఉంది. అంచనా వేసిన విద్యుత్ అవసరాలను అందుకోవడం కోసం ప్రస్తుత 400 కెవి లైన్లను పెంచడం, కొత్త 400 కెవి/ 765 కెవి నెట్‌వర్క్ ఏర్పాటు, భారత ప్రభుత్వ నిధుల ఆధారంగా టారిఫ్ ఆధారిత పోటీ బిడ్డింగ్, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) ద్వారా నిర్మించబోయే ట్రాన్స్‌మిషన్ లైన్లు/ప్రాజెక్టులను గుర్తించడం, అలాగే ఎక్కువ నష్టాలకు కారణమవుతున్న లైన్లను గుర్తించడం, ఆ తర్వాత అభివృద్ధి పనుల్ని చేపట్టడం లాంటివి కీలకమైన కార్యాచరణ అంశాలు.

## పంపిణీ

డిస్కంలు 4 ప్రధాన కార్యాచరణ అంశాలపై దృష్టి కేంద్రీకరిస్తాయి. అవి: నష్టాలు తగ్గించడం, ఆధారపడే యోగ్యతను పెంచుకోవడం, పునరుత్పాదకాల వ్యాప్తిని పెంచుకోవడం, వినియోగదారులలో మరింత సంతృప్తిని చూడడం.

నష్టాలను తగ్గించడంలో వాణిజ్యపరమైన కార్యాచరణ ప్రణాళిక, సాంకేతికమైన కార్యాచరణ ప్రణాళిక రెండూ ఇమిడి ఉంటాయి. లోతైన తనిఖీలమీదా, మీటరింగ్, బిల్లింగ్, వసూళ్ళ సామర్థ్యాలను పెంచేందుకు సమాచార విశ్లేషణల మద్దతు ద్వారా ఎంబిసి మినహాయింపులను తగ్గించడం మీదా, వాణిజ్యపరమైన కార్యాచరణ ప్రణాళిక దృష్టి కేంద్రీకరిస్తుంది. సాంకేతిక కార్యాచరణ ప్రణాళికలో రూ. 1458 కోట్ల అంచనా పెట్టుబడితో వ్యవసాయ ఫీడర్లను వేరు చేసే కార్యక్రమం, పంపుసెట్‌కు రూ. 43,780 అంచనా పెట్టుబడితో 19.1 లక్షల వ్యవసాయ వినియోగదారులకు వర్తించేలా హెచ్‌విడిఎస్‌ను దశలవారీగా అమలు చేయడం, డిటిఆర్‌లు, ఫీడర్ల మీటరింగ్‌ని మెరుగుపరచడం, వినియోదగారుల వద్ద ఉన్న పాత మెకానికల్ మీటర్లను దశలవారీగా తొలగించడం తదితరాలు ఉంటాయి.

ఆధారపడే యోగ్యతను పెంచుకోవడంలో కీలకమైన, వాణిజ్య, భద్రతా, అత్యవసర సేవా సంస్థలకోసం అనువైన పరిహార పథకాలను అందించడం, ఎస్‌సిఎడిఎని 11 కెవి ఫీడర్ల స్థాయిలో అన్ని జిల్లా కేంద్రాల దగ్గరా రూ. 300 కోట్ల అంచనా పెట్టుబడితో అమలు చేయడం, ప్రస్తుతం ఉనికిలో ఉన్న 16 లక్షల త్రీఫేజ్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను రూ. 1100 కోట్ల అంచనా వ్యయంతో అమర్చడం లాంటివి ఉంటాయి. ప్రభుత్వ విధానం ప్రకారం, సమర్థమైన మీటరింగ్, సమాచార సేకరణ ద్వారా వ్యవసాయ విద్యుత్ సరఫరా పర్యవేక్షణ కూడా దీనిలో భాగమవుతాయి.

సోలార్ రూఫ్-టాప్ విద్యుత్ ప్లాంట్లకు నెట్ మీటరింగ్‌ను అమలు చేయడం ద్వారా, సాధ్యపడిన చోట్ల సగటు నీటి మట్టానికి పైన సోలార్ పంపు సెట్లను అమర్చడం ద్వారా పునరుత్పాదక వ్యాప్తిని మెరుగుపరుచుకోవడం జరుగుతుంది. జిల్లాలోని వినియోగదారులందరినీ గుర్తించడం ద్వారా, ప్రతి జిల్లాలో వినియోగదారుల సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారుల సంతృప్తిపై డిస్కంలు దృష్టి కేంద్రీకరిస్తాయి.





## సౌర విద్యుత్ కార్యక్రమం

తెలంగాణ రాష్ట్రంలో అంచనా వేసిన సౌర విద్యుత్ సామర్థ్యం 20.41 గిగావాట్లు. రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన విద్యుత్‌ను, ప్రత్యేకించిఎంపిక చేసిన ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. రాష్ట్రంలో సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు సమగ్రమైన సౌరవిద్యుత్ విధానాన్ని తీసుకురావాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది.

గ్రిడ్ సరఫరా మీద వత్తిడిని తగ్గించడం కోసం భారత ప్రభుత్వ సబ్సిడీతో రాష్ట్రంలో సోలార్ రూఫ్ టాప్ నెట్ మీటరింగ్ సిస్టమ్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భారత ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీకి అదనంగా, గృహ రంగంలో 4,200 మంది సభ్యులతో కూడిన ఒక కిలోవాట్ గ్రిడ్ సిస్టమ్‌కి 30% సబ్సిడీని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయరంగంలో రైతులకు మద్దతుగా, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించడం కోసం భారీ ఎత్తున సోలార్ సెట్లను ఏర్పాటు చేసే నిమిత్తం ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంది. ఈ మేరకు, 28-01-2015 నాటికి రాష్ట్రంలో 396.775 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటయ్యాయి.

## రహదారులు, భవనాలు

### రహదారులు

రవాణా వ్యవస్థలోని ప్రాథమిక సాధనాల్లో రహదారులు ఒకటి, అలాగే ఇది మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైన ప్రాధాన్యం కలిగిన ఓ రంగం కూడా. అభివృద్ధికోసం, ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం పుంజుకోవడం కోసం ముందస్తు అవసరాల్లో ముఖ్యమైన వాటిలో ఒకటి ప్రణాళికాబద్ధంగా రోడ్లను అభివృద్ధి చేయడం. ఆర్థిక వ్యవస్థ సేవారంగం మీదే ఆధారపడిన, తన భవిష్యత్తు కోసం ఉత్పాదక రంగాన్ని ఎంచుకున్న, రైళ్ళ అనుసంధానత తక్కువగా ఉన్న, గ్రామీణ ప్రాంతాలకు రైల్వే వ్యవస్థ అందుబాటు ఎక్కువగా లేని తెలంగాణ లాంటి రాష్ట్రంలో రహదారులకు మరింత ప్రాధాన్యం ఉంది. ఎక్కడ రవాణా వ్యవస్థలు సమర్థవంతంగా ఉంటే, అక్కడ ప్రజలకు అత్యుత్తమ ఆర్థిక అవకాశాలూ, సులభంగా రాకపోకలు సాగించే వీలూ కలుగుతాయి.

సులభంగా రాకపోకలు కలిగించే వీలును కల్పించే రాష్ట్రాలు సాధారణంగా అభివృద్ధి కోసం ఉత్తమమైన అవకాశాలు కలిగినవై ఉంటాయి. అత్యుతమమైన, చక్కని అనుసంధానత కలిగిన రవాణా సౌకర్యాల వల్ల కలిగే ప్రత్యక్ష ప్రయోజనాల్లో అత్యుత్తమైన ఆర్థిక కార్యకలాపాలూ, ఉపాధి అవకాశాలూ కూడా ఉన్నాయి. బహుళమైన ప్రభావాల ద్వారా ఒనగూరే పరోక్ష ప్రయోజనాలు కూడా అనేకం. అటు ఆర్థికమైన, ఇటు సామాజికమైన అభివృద్ధికి మెరుగైన రవాణా సౌకర్యం ఓ ఉత్ప్రేరకం.

దేశీయ రవాణా వ్యవస్థలలోని విభిన్నమైన సాధనాల్లో, 80 శాతం సరుకులు, ప్రయాణికుల రాకపోకలను రోడ్డు రవాణాయే నెరవేరుస్తోంది. ప్రత్యేకించి గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు అనుసంధానమయ్యే రహదారుల వ్యవస్థ సరుకులు, సేవల రాకపోకలను వేగవంతం చేస్తుంది, అత్యధిక వృద్ధి ధోరణులకూ, సామాజిక సమగ్రతకూ, సమాజ శ్రేయస్సుకూ దోహదపడుతుంది. రోడ్డు రవాణా ఉత్పాదకత, సామర్థ్యాలకు రహదారుల వ్యవస్థ అందుబాటు, నాణ్యతలతో ప్రత్యక్ష అనుబంధం ఉంది.

వ్యవసాయ కార్యకలాపాల్లో అత్యున్నత సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుంటే, రహదారుల వ్యవస్థలో భారీ పెరుగుదల ఉంది. రాష్ట్రంలో

26,837 కిలోమీటర్ల రహదారి వ్యవస్థ మొత్తాన్ని రహదారులు, భవనాల శాఖ నిర్వహిస్తోంది. రాష్ట్రంలో ఆర్ అండ్ బి నెట్‌వర్క్ సాంద్రత గురించి చెప్పుకోవాలంటే, చదరపు కిలోమీటర్‌కు 0.23 కిలోమీటర్లు, 1,000 మంది ప్రజలకు 0.86 కిలోమీటర్లు.

**పట్టిక 31 : రోడ్ల అనుసంధానం స్థాయి**

| | |
|---|---|
| జాతీయ రహదారులు | 2,592 కి.మీ.లు |
| రాష్ట్ర రహదారులు | 3,152 కి.మీ.లు |
| ప్రధాన జిల్లా రహదారులు | 12,079 కి.మీ.లు |
| గ్రామీణ రోడ్లు | 9,014 కి.మీ.లు |
| మొత్తం రోడ్ల పొడవు కి.మీ.లలో | 26,837 కి.మీ.లు |
| రాష్ట్ర రోడ్లు (జాతీయ రహదారులను మినహాయించి) | 24,245 కి.మీ.లు |
| కోర్ నెట్ రోడ్లు | 4,020 కి.మీ.లు |

**పట్టిక 32 : విభాగాల వారీగా రోడ్ల వివరాలు**

| వరుస సంఖ్య | రోడ్ల వర్గీకృత నామం | నాలుగు వరుసలు & అంతకు మించి | రెండు వరుసల దారి | మధ్యస్థాయి దారి | సన్నదారి | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| 1 | జాతీయ రహదారులు | 964 | 1264 | 153 | 211 | 2592 |
| 2 | రాష్ట్ర రహదారులు | 377 | 2484 | 88 | 203 | 3152 |
| 3 | ప్రధాన జిల్లా రోడ్లు | 281 | 3274 | 478 | 8046 | 12079 |
| 4 | ఇతర జిల్లా రోడ్లు | 10 | 335 | 53 | 8616 | 9014 |
| | మొత్తం | 1632 | 7357 | 772 | 17076 | 26837 |

**పట్టిక 33 : రోడ్ల నాణ్యత**

| క్ర.సం. | రోడ్ల వర్గీకరణ నామం | సి.సి | తారు రోడ్లు | కంకర వేసినవి | కంకర వేయనివి | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| 1 | జాతీయ రహదారులు | 1 | 2591 | 0 | 0 | 2592 |
| 2 | రాష్ట్ర రహదారులు | 5 | 3147 | 0 | 0 | 3152 |
| 3 | ప్రధాన జిల్లా రోడ్లు | 75 | 11846 | 36 | 122 | 12079 |
| 4 | ఇతర జిల్లా రోడ్లు | 173 | 8410 | 249 | 182 | 9014 |
| | మొత్తం | 254 | 25994 | 285 | 304 | 29837 |

## ప్రణాళికా పనులు

కేవలం మౌలికమైన పనులను ఈ కేటగిరీలో చేపట్టడం జరిగింది. వీటిలో నిర్వహణ పనులను చేర్చలేదు. కొత్త రోడ్లు వేయడం, కొత్త వంతెనల నిర్మాణం, ఉనికిలో ఉన్న రోడ్లను ప్రస్తుత ట్రాఫిక్ స్థాయిల మేరకు వెడల్పు చేయడం, పటిష్టపరచడం మీద ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడం జరుగుతోంది. వంతెనలు లేని క్రాసింగ్‌ల దగ్గర, శిథిలమైన వంతెనలున్న ప్రాంతాల్లో వంతెనల నిర్మాణం, వంతెనలు వెడల్పు చేయడం కూడా దీనిలో భాగమే.

1. వివిధ మండల కేంద్రాలకూ, జిల్లా కేంద్రాలకూ మధ్య అనుసంధానతను మెరుగుపరచడం కోసం ఒక వరుస రహదారులను రెండు వరుసల రహదారులుగా వెడల్పు చేసే పనులు చేపట్టడం. ఈ పథకం కింద, 149 మండలాల్లో 1,996 కిలోమీటర్ల పొడవైన 143 పనులను రూ. 2,585.00 కోట్లతో చేపట్టారు.

2. మొత్తం రాష్ట్రంలో అనుసంధానతను పెంచాలనే లక్ష్యంతో ఇతర ముఖ్యమైన ఒక వరుస రహదారుల్ని రెండు వరుసల రహదారుల కింద వెడల్పు చేయడం. ఈ పథకం కింద 2,721 కిలోమీటర్ల పొడవైన 260 పనుల్ని రూ. 3,704.00 కోట్ల

అంచనా వ్యయంతో చేపట్టారు.

3. శిథిలమైన/ ఇరుకుగా ఉన్న వంతెనల స్థానంలోనూ, వంతెనలు లేని క్రాసింగ్‌ల దగ్గరా, కృష్ణా, గోదావరి నదుల పొడవునా వంతెనలను నిర్మించడం వల్ల ట్రాఫిక్ భద్రత మెరుగుపడుతుంది. ఈ పథకం కింద, రూ. 1,947.00 కోట్ల అంచనా వ్యయంతో 389 పనుల్ని చేపట్టారు.

4. నాలుగు వరుసల రహదారుల ద్వారా రాష్ట్ర రాజధానికి జిల్లా కేంద్రాలను అనుసంధానించడం.

5. జిల్లా కేంద్రాలకూ, ముఖ్యమైన పట్టణాలకూ రింగు రోడ్లు ఏర్పాటు చేయడం. ముఖ్యమైన పట్టణాలకు ఈ సదుపాయాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వాహనాలు వేగంగా వెళ్లడానికి, ట్రాఫిక్ సజావుగా సాగడానికి వీలుగా అనుసంధానత మెరుగవుతుంది.

## పనుల నిర్వహణ

ఆస్తులను అభివృద్ధి చేస్తే చాలదు. వాటి విలువను సరిగా కాపాడుకోవడానికి, వాటి గరిష్ఠ ప్రయోజనాన్ని పొందడానికి వాటిని సరైన ఆకృతిలో నిర్వహించవలసి ఉంటుంది. గడచిన అనేక సంవత్సరాలుగా నిర్వహణ పనులను అవసరమైన స్థాయిలో చేపట్టలేదు. దశలవారీగా 10,000 కిలోమీటర్ల మేర రూ. 2,400 కోట్ల అంచనా వ్యయంతో నిర్వహణ పనులను ప్రభుత్వం చేపట్టింది, వీటిలో గోతుల్ని పూడ్చడం, బీమ్స్‌ను విభజించడం, చెట్లను తొలగించడం, వంతెనలు/ తూములు/ సిడి పనులు తదితరాల నిర్వహణ, పైన బిటి పొరలను వేయడం లాంటి చర్యల ద్వారా రోడ్ల మరమ్మత్తు, నియమిత కాలవ్యవధిలో చేపట్టే మరమ్మతు కార్యక్రమం లాంటివి సాధారణ నిర్వహణ పనుల్లో ఉన్నాయి.

## రహదారి భద్రతా ఇంజనీరింగ్ పనుల (ఆర్ఎస్ఇడబ్ల్యూ) పథకం

రహదారి భద్రతా ఇంజనీరింగ్ పనులు ప్రస్తుతం ఉన్న రహదారుల భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రత్యేకంగా ఉద్దేశించినవి. ఈ పథకం కింద 37 పనులను చేపట్టారు.

## రైల్వే భద్రతా పనులు

ప్రస్తుతం ఉన్న లెవెల్ క్రాసింగ్‌ల దగ్గర చేపట్టేందుకు రైల్వే భద్రతా పనులు మంజూరయ్యాయి. ట్రాఫిక్ ఘర్షణను, ప్రమాదాలనూ తగ్గించడం, వాహనాల రాకపోకల్లో ఆటంకాలను తగ్గించడం ఈ పనుల లక్ష్యం

## ప్రజలకు చేకూరే మొత్తం ప్రయోజనాల్లో కొన్ని:

- వాహనాల నిర్వహణ ఖర్చు తగ్గుతుంది
- ప్రయాణ సమయం తగ్గుతుంది
- ప్రమాదాలు/ మరణాల సంఖ్య తగ్గుతుంది
- మార్కెట్/ వ్యాపార కేంద్రాలకు అందుబాటు పెరుగుతుంది, వేగవంతమవుతుంది
- వృద్ధి రేటు వేగం పుంజుకుంటుంది
- వృద్ధి వికేంద్రీకరణ జరుగుతుంది

## జాతీయ రహదారులు

రహదారులు, భవనాల శాఖ జాతీయ రహదారుల (ఎన్‌హెచ్) విభాగం తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, నిర్వహణను అమలుచేసే ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, నిర్వహణ కోసం ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల కింద నిధులను భారత ప్రభుత్వం కేటాయిస్తోంది. 2015 జనవరి 30వ తేదీ నాటికి, తెలంగాణలో 16 జాతీయ రహదారులున్నాయి, రాష్ట్ర వ్యాప్తంగా 2592 కిలోమీటర్ల పొడవున ఇవి వ్యాపించి ఉన్నాయి. దీనికి అదనంగా, 3 కొత్త జాతీయ రహదారులను (సుమారు 285 కిలోమీటర్లు) భారత ప్రభుత్వం ప్రకటించింది.

జాతీయ రహదారుల సాంద్రతలో జాతీయ సగటు 100 చదరపు కిలోమీటర్ల ప్రాంతానికి 2.82 కిలోమీటర్లు కాగా, తెలంగాణలో ఈ సగటు 100 చదరపు కిలోమీటర్లకు 2.25 కిలోమీటర్లు. రాష్ట్రంలోని 2592 కిలోమీటర్ల జాతీయ రహదారుల్లో, 768 కిలోమీటర్ల మొత్తం విస్తీర్ణాన్ని ఎన్‌హెచ్‌డిపి కింద అభివృద్ధి కోసం ఎన్‌హెచ్ఎఐకి అప్పగించడం జరిగింది. 2014-15లో, రూ. 356.00 కోట్ల

విలువైన రోడ్లు పనుల్నీ, రూ. 64.20 కోట్ల విలువైన వంతెనల పనుల్నీ రహదారి రవాణా, హైవేల మంత్రిత్వశాఖ (ఎంఓఆర్‌టిహెచ్) ఆమోదించింది.

### ఎన్‌హెచ్‌డిపి 4

జాతీయ రహదారుల అభివృద్ధి కార్యక్రమం కింద (నాలుగో దశ), 8 పనుల్ని (చదును చేసిన అంచులతో రెండు వరుసల్లో) 473 కిలోమీటర్ల పొడవున రూ. 1732 కోట్లతో చేపట్టడం జరిగింది, వీటిలో 6 పనులు పురోగతిలో ఉన్నాయి.

### ఇపిసి - కారిడార్ అప్రోచ్

కారిడార్ అప్రోచ్ కింద 4 పనుల్ని 174.9 కిలోమీటర్ల మేర రూ. 373 కోట్ల వ్యయంతో చేపట్టడం జరిగింది.

### సిఆర్‌ఎఫ్ పనులు

రహదారి రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ (ఎంఓ ఆర్‌టిఅండ్‌హెచ్) తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర రహదారి నిధుల కింద రెండు దశల్లో రూ. 615.75 కోట్ల విలువైన 58 పనుల్ని మంజూరు చేసింది. అన్ని పనులూ ఆరంభమై, వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.

### వామపక్ష తీవ్రవాద ప్రభావిత (ఎల్.డబ్ల్యు.ఇ) ప్రాంత అభివృద్ధి పథకం

ఎల్.డబ్ల్యూ.ఇ పథకం ఒకటో దశ, రెండో దశల కింద సుమారు 29 పనులను చేపట్టడం జరిగింది. వీటిలో 23 పనులు పూర్తయ్యాయి. వీటి ద్వారా రూ. 683.69 కోట్ల ఖర్చుతో మొత్తం 508.94 కిలోమీటర్ల పొడవున రహదారి పనులు జరిగాయి. కాగా, రూ. 396.54 కోట్ల వ్యయంతో 89.13 కిలోమీటర్ల మేర చేపట్టిన రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి.

### ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి)

### హెచ్‌కెఆర్ (హైదరాబాద్ - కరీంనగర్ - రామగుండం) రహదారి

మొత్తం 206.85 కిలోమీటర్లలో 190.19 కిలోమీటర్ల పొడవున వాణిజ్య కార్యకలాపాలు 01-06-2014న మొదలయ్యాయి.

ఎన్ఎఎం (నార్కెట్‌పల్లి - అద్దంకి - మేదరమెట్ల) రహదారి

మొత్తం 212.50 కిలోమీటర్లలో 190.38 కిలోమీటర్ల పొడవున వాణిజ్య కార్యకలాపాలు 11-03-2014న మొదలయ్యాయి.

కాగా, ఈ క్రింద పేర్కొన్న ఏడు రహదారులనూ పిపిపి-బిఓటి పద్ధతిలో చేపట్టాలనే ప్రతిపాదనలున్నాయి. సాధ్యాసాధ్యాలపై అధ్యయనాలు ముందంజలో ఉన్నాయి.

**పట్టిక 34 : పి.పి.పి. - బి.ఒ.టి. విధానం కింద ప్రతిపాదించిన రోడ్ల వివరాలు**

| క్ర.సం. | రోడ్డు పేరు | పొడవు కి.మీ.లలో |
|---|---|---|
| 1 | సంగారెడ్డి - నాగ్‌పూర్ - తూప్రాన్ - గజ్వేల్ - భోన్‌గిరి - చిట్యాల రోడ్డు | 164.00 |
| 2 | మహబూబ్‌నగర్ - నల్గొండ రోడ్డు (కి.మీ. 0/0 నుండి కి.మీ. 163/2 వరకు) | 163.20 |
| 3 | హైదరాబాద్ - నర్సాపూర్ రోడ్డు | 28.00 |
| 4 | జనగాం - చేర్యాల - దుద్దెడ రోడ్డు | 46.40 |
| 5 | జనగాం - సూర్యాపేట రోడ్డు | 84.40 |
| 6 | సూర్యాపేట్ - మోతే - ఖమ్మం రోడ్డు | 58.30 |
| 7 | హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డు (కి.మీ. 23/6 నుండి 60/0 - మన్నెగూడ వరకు) | 36.40 |

### పంచాయితీ రాజ్ రహదారులు

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అవసరమైన ప్రణాళిక, రూపకల్పన, అమలు, నిర్వహణ కార్యక్రమాలను పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం చేపడుతుంది, గ్రామీణ రహదారుల నిర్మాణం, నిర్వహణ, గ్రామీణ అంతర్గత రహదారుల అభివృద్ధి, జెడ్‌పిపి, ఎంపిపి, జిపి, సామాజిక భవనాలు లాంటి భవనాలను వివిధ పథకాల కింద నిర్మాణం లాంటి పనుల్లో స్థానిక సంస్థలకు సహకారం అందిస్తుంది.

రాష్ట్రంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో 01.04.2014 నాటికి ఉన్న గ్రామీణ రహదారుల మొత్తం పొడవు 64046 కిలోమీటర్లు.

### వివరాలు కింది విధంగా ఉన్నాయి:

- సిసి అండ్ బిటి రహదారులు 20282 కిలోమీటర్లు
- డబ్ల్యూబిఎం రహదారులు 14146 కిలోమీటర్లు
- కంకర రోడ్లు 14734 కిలోమీటర్లు
- మట్టి రోడ్లు 14884 కిలోమీటర్లు

రహదారులను సిడి పనులతో సహా బిటి ప్రమాణానికి పెంచడం కోసం 2014-15లో, 1409 పనుల్ని రూ. 1952.22 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టడం జరిగింది. దీనితోపాటుగా, బిటి పునరుద్ధరణలు, సిడి పనుల మరమ్మతుల నిమిత్తం రూ. 1766.92 కోట్లతో 3,426 పనులు చేపట్టడం జరిగింది.

### భవనాలు

రాష్ట్రంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్, నాన్-రెసిడెన్షియల్ భవనాల నిర్మాణ వైశాల్యం వరుసగా 38.85 లక్షల చదరపు అడుగులు, 12.27 లక్షల చదరపు అడుగులు ఉంది. 2014-15లో రూ. 14,384 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన 46 భారీ పనులు పురోగతిలో ఉన్నాయి. అలాగే, 2014-15లో రూ. 8643.45 లక్షల అంచనా వ్యయంతో 29 భారీ పనుల్ని చేపట్టడం జరిగింది.

### రవాణా

రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో రోడ్డు రవాణా ముఖ్య భూమిక పోషిస్తోంది. డ్రైవర్లకు లైసెన్సులు జారీ చేయడంలో, మోటారు వాహనాల రిజిస్ట్రేషన్‌లో, మెటార్ పర్మిట్ల లెవీని జారీ చేయడంలో, మోటారు వాహనాల పన్ను వసూలులో, వాహన అతిక్రమణలను అదుపుచేయడంలో రవాణా శాఖ కీలక పాత్ర పోషిస్తోంది, రహదారి భద్రతకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది.

రాష్ట్రంలో, 01-02-2015 నాటికి 77 లక్షలకు మించి వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. రహదారుల మీద ప్రయాణించే వాహనాల్లో 74% ద్విచక్ర వాహనాలే, ఆ తరువాతి స్థానం కార్లది, రహదార్లపై ప్రయాణించే, రిజిస్టర్ అయిన మోటారు వాహనాల వివరాలను ఈ క్రింద చూడవచ్చు:

**పట్టిక 35 : తెలంగాణా రాష్ట్రంలో నమోదైన మోటారు వాహనాలు**

| క్ర.సం. | వాహనం | 31.01.2015న ఉన్న ప్రకారం |
|---|---|---|
| 1 | ఆటో రిక్షాలు | 291354 |
| 2 | కాంట్రాక్ట్ క్యారేజీ వాహనాలు | 6466 |
| 3 | విద్యాసంస్థల వాహనాలు | 20243 |
| 4 | సరకు రవాణా వాహనాలు | 328087 |
| 5 | మాక్సి క్యాబ్‌లు | 18978 |
| 6 | మోపెడ్‌లు, మోటార్ సైకిళ్ళు | 5722894 |
| 7 | మోటార్ కార్లు | 924778 |
| 8 | మోటార్ క్యాబ్‌లు | 62590 |
| 9 | ప్రైవేట్ సేవల వాహనాలు | 2482 |
| 10 | స్టేజీ క్యారేజ్ వాహనాలు | 15572 |
| 11 | ట్రాక్టర్లు, ట్రైలర్లు | 285581 |
| 12 | ఇతరాలు | 42090 |
| | **మొత్తము** | **7721115** |

డ్రైవింగ్ లైసెన్సుల జారీ, రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు, పన్నుల ద్వారా ఆదాయాలను రవాణా శాఖ వసూలు చేస్తుంది. ఆదాయంలో వృద్ధిని ఈ క్రింద చూడవచ్చు:

**పట్టిక 36 : రవాణాశాఖ ఆదాయం**

| సంవత్సరము | మొత్తం రాబడి (కోట్ల రూ.లలో) |
|---|---|
| 2010-11 | 1294.73 |
| 2011-12 | 1517.40 |
| 2012-13 | 1768.00 |
| 2013-14 | 1753.72 |
| 2014-15 (31.01.2015 వరకు) | 1579.76 |

రవాణా శాఖలోని అన్ని సేవలనూ పూర్తిగా కంప్యూటరీకరించారు. శాఖ కార్యకలాపాల్లో పారదర్శకతకోసం, వినియోగదారులకు అందుబాటులో ఉండడం కోసం శాఖకు సంబంధించిన కార్యాలయాలతో పాటుగా ఇంటర్‌నెట్, మీ-సేవ కేంద్రాల ద్వారా తన సేవలను అనేక మార్గాల్లో ఈ శాఖ అందిస్తోంది. ఇప్పుడు పౌరులు ఇ-సేవ కౌంటర్ల ద్వారా లేదా ఇంటర్‌నెట్ ద్వారా లేదా రవాణా శాఖ కార్యాలయాల ద్వారా పన్నులు చెల్లించవచ్చు. మరియు లెర్నర్ లైసెన్సులకోసం, డ్రైవింగ్ లైసెన్సులకోసం స్లాట్లు బుక్ చేసుకోవచ్చు.

మొత్తం 15 చెక్‌పోస్టులు, 11 ఎంవిఐ కార్యాలయాలు కూడా మూడంచెల నిర్మాణానికి అనుసంధానమయ్యాయి. ఈ రోజున, రాష్ట్రంలోని మొత్తం 66 ప్రదేశాలూ మూడంచెల సాఫ్ట్‌వేర్‌లోకి మారాయి. రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల ద్వారా రోజూ సగటున 29,000 లావాదేవీలు జరుగుతున్నాయి. మోటారు వాహనాల డీలర్లందరూ ప్రతి వాహనాన్నీ విక్రయించిన సమయంలోనే పన్నును ఆన్‌లైన్‌లో చెల్లించడంద్వారా తమ లావాదేవీలను (ఓ కొత్త వాహనానికి టిఆర్ జారీ) కేంద్ర సర్వర్‌లో అప్‌డేట్ చేస్తున్నారు. ఎల్‌ఎల్‌ఆర్ పరీక్ష, డిఎల్ పరీక్ష కోసం స్లాట్లు బుక్ చేసుకోవాలనుకునే దరఖాస్తుదారులందరూ వెబ్ ద్వారా ఎక్కడినుంచయినా వివిధ ప్రదేశాల్లో స్లాట్లు బుక్ చేసుకోవచ్చు. కేంద్రీకృత ఎంఐఎస్ సహాయంతో, ప్రధాన కార్యాలయంలో వాస్తవిక సమయంలోనే వివిధ లావాదేవీలను పర్యవేక్షించడం, కనుక్కోవడం సాధ్యమవుతుంది.

## తెలంగాణ రాష్ట్ర రహదారి రవాణా సంస్థ

తెలంగాణ రాష్ట్ర రహదారి రవాణా సంస్థ పరిధిలో 3 జోన్లు, 10 రీజియన్లు, 94 డిపోలు ఉన్నాయి. మొత్తం వాహన శ్రేణిలో 10,342 బస్సులున్నాయి, 2013-14 సంవత్సరం చివరి నాటికి 0.58 లక్షలమంది ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్నారు. 2013-14లో ఇంధన సామర్థ్యం లీటరుకు 5.18గా ఉంది. ఈ సంస్థ 34.17 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు నడుపుతోంది. రోజూ 83.15 లక్షలమంది ప్రయాణికులను గమ్యాలకు చేరవేస్తోంది. సగటు వాహన ఉత్పాదకత రోజుకు 331 కిలోమీటర్లు.

## విమానాశ్రయాలు

### హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జిఐఎ)కు సొంతదారే కాకుండా నిర్వహణ బాధ్యతలు కూడా వహిస్తోంది. ఇదో పిపిపి ప్రాజెక్ట్. విమానాశ్రయ నిర్మాణంలో తొలిదశకు మొత్తం పెట్టుబడి రూ. 2920 కోట్లు. ఆర్‌జిహెచ్‌ఐఎల్ ఓ జాయింట్ వెంచర్ కంపెనీ. దీనికి జిఎంఆర్ గ్రూప్ (63%) ప్రమోటర్ కాగా, మలేసియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్ బెర్‌హద్ (ఎంఎహెచ్‌బి (11%), రాష్ట్ర ప్రభుత్వం (13%), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (13%) ఇతర కన్సార్టియం భాగస్వాములు. 2014 డిసెంబర్ 31 నాటికి, ఆర్‌జిహెచ్‌ఐఎల్‌లో 485 మంది ఉద్యోగులున్నారు.

### అనుసంధానత

విమానాశ్రయాన్ని చేరుకోడానికి రెండు ప్రధాన మార్గాలున్నాయి, పశ్చిమ దిశనుంచి జాతీయ రహదారి ఎన్‌హెచ్-7, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) మీదుగా ఉన్న మార్గం ఒకటి కాగా, తూర్పు వైపు నుంచి శ్రీశైలం రాష్ట్ర రహదారి రెండవది. ఓఆర్‌ఆర్ మొదటి దశ విమానాశ్రయానికి సైబరాబాద్‌ను అనుసంధానిస్తోంది. ఈ తరహాలో ఇదే మొదటిదైన 11.8 కిలోమీటర్ల ఎలివెటెడ్ ఎక్స్‌ప్రెస్ వే (పివిఎన్‌ఆర్) ఎన్‌హెచ్-7 ద్వారా నగరం మధ్య నుంచి విమానాశ్రయానికి కేవలం 30 నిమిషాల లోపునే ప్రయాణికులు చేరుకునేందుకు

దోహదపడుతోంది. వీటితోపాటుగా, మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్ (ఎంఎంటిఎస్), మోనో రైల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఆర్‌టిఎస్), ఇతర ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను రాష్ట్రప్రభుత్వ భాగస్వామ్యంతో చురుగ్గా అన్వేషించడం జరుగుతోంది.

### రాకపోకల్లో ప్రధానాంశాలు

### ప్రయాణికుల రాకపోకలు

2014-15 (ఏప్రిల్ 14- డిసెంబర్ 14) సంవత్సరంలో, దేశీయ ప్రయాణికుల్లో వృద్ధి సంవత్సరం నుంచి సంవత్సరానికి (వైఓవై) 20% నమోదయింది. అదే సమయంలో అంతర్జాతీయ ప్రయాణికుల్లో వృద్ధి 13%గా ఉంది. మొత్తం ప్రయాణికుల రాకపోకల్లో 18% వైఓవై వృద్ధి కనిపించింది. అదే కాలవ్యవధిలో 77 లక్షల 50వేల మంది ప్రయాణికులకు ఈ విమానాశ్రయం సేవలందించింది.

### ఎయిర్ ట్రాఫిక్ మూవ్‌మెంట్స్ (ఎటిఎం)

2014-15 (ఏప్రిల్ 14- డిసెంబర్ 14) సంవత్సరంలో, దేశీయ ఎటిఎం వృద్ధి సుమారు 9% వైఓవై కాగా, అంతర్జాతీయ ఎటిఎం వృద్ధి 7%గా ఉంది. మొత్తం ఎటిఎంలో వృద్ధి 9% వైఓవైగా కనిపించింది. అదే కాలవ్యవధిలో, ఈ విమానాశ్రయం 71,308 ఎటిఎం నిర్వహించింది.

### సరుకుల రవాణా

2014-15 (ఏప్రిల్ 14- డిసెంబర్ 14) సంవత్సరంలో, దేశీయ కార్గోలో వృద్ధి సుమారు 18% వైఓవై, కాగా, అంతర్జాతీయ కార్గో పరిమాణం 13%కి పెరిగింది. మొత్తం కార్గోలో 15% వృద్ధి కనిపించింది. అదే కాలవ్యవధిలో, ఈ విమానాశ్రయం 77,226 టన్నుల కార్గోను నిర్వహించింది.

### ఆర్‌జిఐఎలో నూతన పరిణామాలు (ఏప్రిల్ - డిసెంబర్, 2014)

- ఖతార్ ఎయిర్‌వేస్ కార్గో వారానికి రెండురోజుల సరుకు రవాణా కార్యకలాపాలు ఆరంభించింది.
- టర్కిష్ కార్గో వారానికోసారి సరుకు రవాణా కార్యకలాపాలను ఆరంభించింది.
- ఎయిర్ ఏసియా మలేసియా నేరుగా ప్రయాణికుల విమాన సేవలను కౌలాలంపూర్‌కి ప్రారంభించింది.
- గల్ఫ్ ఎయిర్ నేరుగా ప్రయాణికుల విమానాలను బహ్రైన్ నుంచి ప్రారంభించింది.
- ప్రయాణికుల అనుభవాన్నీ, రిటైల్ ఎంపికలనూ పెంచడం కోసం ఇంటర్నేషనల్ సెక్యూరిటీ హోల్డ్ ఏరియాలో రిటైల్ సౌకర్యాలను ఉన్నతీకరించడం జరిగింది.
- రాష్ట్రంలో పర్యాటకరంగ కార్యకలాపాలను ప్రోత్సహించడం కోసం విమానాశ్రయంలో తెలంగాణ టూరిజం కోసం ప్రత్యేకించిన కౌంటర్ ప్రారంభమయింది.
- సందర్శకులు వచ్చిన తర్వాత వీసా తీసుకునే వెసులుబాటు (టూరిస్ట్ వీసా ఆన్ ఎరైవల్ - టివిఓఎ)ను ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్ (ఇటిఎ)తో పాటుగా 43 దేశాల వారికోసం ఆర్‌జిఐఎలో 2014 డిసెంబర్ 1 నుంచి ఆరంభించి అమలు చేస్తున్నారు.
- ఏరోస్పేస్ పార్క్‌లో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజన్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కోసం యునైటెడ్ టెక్నాలజీస్ కార్పొరేషన్ ఇండియా లీజు ఒప్పందం మీద సంతకాలు చేసింది. నిర్మాణ పనుల ప్రారంభానికి సూచికగా శంకుస్థాపన జరిగింది.
- ఆర్‌జిఐఎ ఏరోస్పేస్ పార్క్ లోపల అత్యాధునిక విమాన విడిభాగాల బ్యాంక్ ఏర్పాటుకోసం గ్లోబల్ ఏరో టెక్ ఇండియాతో లీజు ఒప్పందం మీద సంతకాలు జరిగాయి.

### వరంగల్ విమానాశ్రయం

ప్రస్తుతం 748.02 ఎకరాల ప్రదేశంలో ఉన్న విమానాశ్రయం ఇది. అదనంగా మరో 438 ఎకరాలు కావాలని ఎఎఐ కోరింది.

### ప్రాంతీయ విమానాశ్రయాలు

ప్రాంతీయ విమానాశ్రయాల అభివృద్ధి కోసం 'వైమానిక విధానం' రూపొందించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. కన్సల్టెంట్ అయిన హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ) ఓ వైమానిక విధాన ముసాయిదాను సమర్పించింది. ఈ

విధానంపై ఆర్థిక, టిఆర్ అండ్ బి, హోం, ఎంఎ అండ్ యుడి విభాగాలు తమ అభిప్రాయాలను తెలియజేశాయి. ఈ విధానం ఖరారయ్యే ప్రక్రియలో ఉంది.

## సాగునీరు

వ్యవసాయ రంగానికీ, తద్వారా సామాజిక-ఆర్థిక అభివృద్ధికీ సాగునీరు అపారమైన సేవలను అందిస్తోంది. తెలంగాణలో సాగునీరు ఎక్కువగా గోదావరి, కృష్ణా నదులు, ఉపనదులూ, చెరువులూ, కుంటల్లోని నీటి వినియోగం మీద ఎక్కువగా ఆధారపడి ఉంది. అతి పెద్ద చెరువులనుంచి, నీటిని వడగట్టే తటాకాలతో సహా చిన్న చెరువులవరకూ వివిధ రకాల జల సంరక్షణ నిర్మాణాలు సుమారు 46,000 వరకూ ఉన్నాయి. ఈ జల సంరక్షణ నిర్మాణాలన్నీ కలసి సాగునీరు, వాణిజ్య, ఇతర గృహావసరాలను తీర్చే ప్రధాన వనరుగా ఉన్నాయి.

సాగునీటి ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రాన్ని ఓ నిలకడైన మార్గంలో అభివృద్ధి చేయడానికి ఆ రెండు నదుల నీటినీ వినియోగించుకునేందుకు గట్టిగా ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న, ప్రతిపాదనల్లో ఉన్న భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల పనుల్ని వేగవంతం చేయడం ద్వారా ఈ ప్రయత్నం దిశగా చర్యలు అమలవుతున్నాయి. తెలంగాణకు మొత్తం కేటాయించిన నీటిని సరైన రీతిలో ఉపయోగించుకునేందుకు దీనివల్ల వీలవుతుంది. గోదావరి, కృష్ణా నదుల్లో ప్రణాళికాబద్ధమైన వినియోగం కృష్ణా బేసిన్‌లోని వరదనీటితో సహా లెక్క చూస్తే వరుసగా 933.70 టిఎంసిలు, 298 టిఎంసిలు.

అద్భుతమైన సాగునీటి సాంకేతికత ద్వారా వర్షపునీటిలో ప్రతి బొట్టునూ సద్వినియోగం చేసుకున్న కాకతీయుల నాటి సాగునీటి వ్యవస్థ నిలకడగా కరువు నివారణ చర్యలను పునరుద్ధరించడానికి అతి చక్కని నమూనాను అందిస్తోంది. సుమారు 11,975 హెక్టార్ల ఆయకట్టు మేర విస్తరించి, 5,872 ఎంసిఎఫ్‌టి నీటిని అందిస్తున్న నాలుగు ప్రధాన చెరువులు- పాకాల, రామప్ప, లక్నవరం, ఘనాపూర్‌లతో పాటు ఒక్కొక్కటీ 100 ఎంసిఎఫ్‌టి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన మరో 5,000 చెరువులు కూడా ఉన్నాయి. 2012-13, 2013-14 సంవత్సరాల్లో భారీ సాగునీటి చెరువులకు చేపట్టిన మరమ్మతులు, ఆధునికీకరణ, పునరుద్ధరణల వల్ల 3,908 హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ జరిగింది.

చిన్నతరహా సాగునీటి చెరువులు తెలంగాణకు జీవనరేఖగా ఉన్నాయి. రానున్న అయిదేళ్ళ కాలంలో జిఓఐ, జెఐసిఎ, ఎఐబిపి, ప్రపంచబ్యాంకు నిధులతో, సాధారణ రాష్ట్ర ప్రణాళిక ద్వారా తన ప్రతిష్ఠాత్మక కార్యక్రమమైన 'మిషన్ కాకతీయ' కింద చిన్నతరహా సాగునీటి రంగంలోని గొలుసు కట్టు చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. భూగర్భ జలమట్టాలను స్థిరీకరించేందుకు కూడా ఈ కార్యకలాపాలు దోహదం చేస్తాయి. సులభంగా తరలించగలిగే స్థాయిల్లో సూక్ష్మ, చిన్న తరహా సాగునీటి వనరుల్లో నీటిని సమీకరించడంకోసం చేపట్టే వాననీటి సంరక్షణ కూడా అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న మరో అంశం.

**పట్టిక 37 : కృష్ణా, గోదావరి బేసిన్‌లలో ప్రాజెక్టుల స్థాయి**

| నది | ప్రాజెక్టు తరహా | ప్రాజెక్టుల సంఖ్య | సామర్థ్యం టి.యం.సి.లలో | మాగాణం చేసే సత్తా (లక్షల ఎకరాలలో) |
|---|---|---|---|---|
| గోదావరి | గోదావరి బేసిన్‌లో పెద్ద, మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులు | 27 | 455 | 30.54 |
| | పెద్ద, మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులు | 22 (నిర్మాణంలో ఉన్నవి) | 395 | 35.4650 |
| | తలపెట్టిన కొత్త ప్రాజెక్టులు | 16 | 62.422 | 66.09 |
| | జలవిద్యుత్ ప్రాజెక్టులకు గోదావరిలో నిర్ణయించిన నీరు | | 21.453 | |
| కృష్ణా | పెద్ద, మధ్య తరహాఇరిగేషన్ ప్రాజెక్టులు | 13 | 89.15 | 21.494 |
| | పెద్ద, మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులు | 5 (నిర్మాణంలో ఉన్నవి) | 23.90 (నికర జలాలు) 77.0 (వరద నీరు) | 11.63 |

భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టుల్ని దశల వారీగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది, తద్వారా 99.136 లక్షల ఎకరాల సాగునీటి సామర్థ్యాన్ని సృష్టించవచ్చు.

**పట్టిక 38 : నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు**

| ప్రాజెక్టు పేరు | వివరాలు |
|---|---|
| డా॥ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు | ● ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించే విషయాన్ని భారత ప్రభుత్వం చురుగ్గా పరిశీలిస్తుంది.<br>● 16.40 లక్షల ఎకరాల సాగు సామర్థ్యాన్ని (ఐ.పి.) సృష్టించగలదని తలపోస్తున్నారు.<br>● గోదావరి నదిలో 180 టి.ఎం.సి. నికర జలాలు ఉపయోగించుకుంటున్న 7 జిల్లాలకు లబ్ధి చేకూర్చగలదని అంచనా.<br>● మంచినీటి అవసరాలు, పరిశ్రమల నీటి అవసరాలు తీర్చగలదు. |
| యాక్సెలరేటెడ్ ఇరిగేష్ బెనిఫిట్ ప్రోగ్రాం (ఏ.ఐ.బి.పి) | ● భారత ప్రభుత్వ ఏ.ఐ.బి.పి. కింద 13 పెద్ద, మధ్య తరహా సేద్యపు నీటి ప్రాజెక్టులు ఉన్నాయి.<br>● భారత ప్రభుత్వం ఇప్పటికి రూ. 2078.71 కోట్లను విడుదల చేసింది. బకాయిలు రూ. 859.17 కోట్లను విడుదల చేయవలసి ఉంది. |

**నూతన భారీ సాగునీటి పథకాలు, ప్రాజెక్ట్‌లు**

ప్రతి నియోజకవర్గంలోనూ పట్టణ ప్రాంతాలను మినహాయించి, లక్ష ఎకరాలకు సాగునీటి సౌకర్యాన్ని రానున్న అయిదేళ్ళలో సృష్టించేందుకు ఓ సర్వతోముఖమైన వ్యూహం తెలంగాణ ప్రభుత్వానికి ఉంది. ఈ క్రమంలోనే 2 భారీ ప్రాజెక్ట్‌లనూ, వరదనీటిని తరలించే ఒక కాలువనూ నిర్మించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. దీనివల్ల 13.41 లక్షల ఎకరాలకు సాగునీరు అందడం ద్వారా, వర్షాకాలంలో వరదలకు అడ్డుకట్ట పడడంద్వారా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్ జిల్లాలు ప్రయోజనం పొందుతాయి.

**పట్టిక 39 : కొత్తగా చేపట్టిన ఇరిగేషన్ పథకాలు, ప్రాజెక్టుల వివరాలు**

| ప్రాజెక్టు పేరు | వివరాలు |
|---|---|
| పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం | ● హైదరాబాద్‌కు త్రాగునీటిని అందించడానికి ఉద్దేశించిన పథకం.<br>● జూరాల ప్రాజెక్ట్ సమీపంలో కృష్ణానది వరద నీటి నుంచి మహబూబ్‌నగర్‌లో 7 లక్షల ఎకరాలకు, రంగారెడ్డిలో 2.7లక్షల ఎకరాలకు, నల్గొండ జిల్లాలో 0.3 లక్షల ఎకరాలకు 70 టి.ఎం.సి.లను ఎత్తి పోస్తుంది.<br>● అంచనా వ్యయం రూ. 25,000 కోట్లు |
| నక్కలగండి ప్రాజెక్ట్ | ● చిరకాలంగా ఫ్లోరైడ్ కాలుష్యంతో, కరువుతో విలవిల్లాడుతున్న నల్గొండ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాలో కొంతభాగాలలో 3.41 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి పథకం వేశారు.<br>● శ్రీశైలం ప్రాజెక్టు నుంచి తవ్వుతున్న ఎస్.ఎల్.బి.సి. సొరంగం నుంచి 30 టి.ఎం.సి.ల వరదనీటిని వినియోగించే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 6,000 కోట్లు. |
| జూరాల - పాకాల వరద ప్రవాహ కాలువ | ● జూరాల ప్రాజెక్టు ముందరి ఒడ్డు నుంచి జూరాల-పాకాల వరద ప్రవాహకాలువను తవ్వే ప్రతిపాదన పరిశోధనలో ఉంది.<br>● జూరాల వద్ద +311.000 స్థాయిలో వేసిన మేట, వరంగల్ జిల్లా పాకాల జలాశయం వరకు ఉంది.<br>● దుర్భిక్షానికి ఆలవాలమైన మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్ జిల్లాలలో వరద నీటి రోజుల్లో 35 రోజుల పాటు దాదాపు 700 చెరువులకు 75 టి.ఎం.సి.లకు గానూ 24,000 క్యూసెక్కుల నీటిని మళ్లించగలదు. |

## చిన్న నీటి పారుదల

సుమారు 18.71 లక్షల ఎకరాల ఆయకట్టుకు సేవలందిస్తున్న చెరువులు 35,974 ఉన్నాయి. వీటిలో 31,196 పంచాయతీ రాజ్ శాఖ చెరువులు 6.68 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నాయి. చెరువులద్వారా అందే సాగునీరు ఎక్కువగా వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో కేంద్రీకృతమై ఉంది. చిన్న నీటిపారుదల కింద, 2013-14 సంవత్సరంలో రూ. 488.46 కోట్ల వ్యయంతో 37,300 ఎకరాలకు సాగునీటి సామర్థ్యాన్ని సృష్టించడం జరిగింది, 19,700 ఎకరాలకు సాగునీటి సామర్థ్యాన్ని వినియోగించుకోవడం జరిగింది. తెలంగాణ సామాజిక ఆధారిత చెరువుల నిర్వహణ ప్రాజెక్ట్ సహకారంతో ప్రపంచబ్యాంకు నిధులతో చిన్న నీటిపారుదల పథకాల పునరుద్ధరణ కార్యక్రమం సాగుతోంది. మొత్తం 1182 చెరువులను మెరుగుపరచాలన్నది ఈ పథకం ఉద్దేశం కాగా, ఇప్పటికి 762 చెరువుల పనులు పూర్తయ్యాయి.




*చెరువు సేద్యం కింద జిల్లా వారీగా పంపిణీ అయిన విస్తీర్ణం*

1990 నుంచి, రాష్ట్రంలో సాగునీటి బావుల పరిమాణం నిలకడగా పెరిగింది, అదే సమయంలో సాగునీటి చెరువుల సంఖ్య స్థిరంగా తగ్గుతూ వస్తోంది. వనరుల నిలకడ విషయంలోనూ, భూగర్భ జలాలను తోడడం కోసం విద్యుత్‌కు పెరుగుతున్న డిమాండ్ విషయంలోనూ ఆందోళనలు పెరగడానికి ఇది కారణమవుతోంది. ఉపరితల, భూగర్భ జలాల నిర్వహణకూ, తెలంగాణ రాష్ట్రంలోని తొమ్మిది కరువు బాధిత రాష్ట్రాల్లో సుమారు 11.5 లక్షలమంది రైతులకు ప్రయోజనం కలిగించేందుకు రాష్ట్రంలోని చెరువుల సాగునీటి సామర్థ్యంలో నెలకొన్న 63% లోటును భర్తీ చేయడానికీ సంబంధించి ఓ సమగ్ర దృక్పథాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది. దీనికోసం చెరువుల పునరుద్ధరణకూ, సాగునీటి సామర్థ్యానికి జవజీవాలు అందించడానికీ ఓ సమగ్ర పథకం కీలకం.

సాగునీటి చెరువుల ద్వారా గ్రామీణ ఉపాధి కల్పన, పేదరికం తగ్గింపు, వ్యవసాయ వృద్ధి సాధ్యమవుతాయి. సాగునీటి చెరువుల కింద చిన్న సైజు ఆయకట్టు కూడా భారీ వ్యవసాయ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పరుస్తుంది, మార్కెట్ లింకేజి ద్వారా వాణిజ్య వ్యవసాయానికి ఓ కీలకమైన అవకాశం అందిస్తుంది.

## మిషన్ కాకతీయ - ఓ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం

తెలంగాణలో వందలాది సంవత్సరాలుగా చెరువులే ప్రధాన సాగునీటి వనరులుగా ఉన్నాయి. చాలాకాలం పాటు, సరైన నిర్వహణ లేనందున, పూడికలు తీయనందునా వీటిలో చాలా చెరువులు పూడుకుపోయాయి లేదా నిరర్థకంగా మిగిలిపోయాయి. ఉపరితల జలాల లభ్యత తగ్గిపోవడం వల్ల అందుబాటులో ఉన్న భూగర్భ జల వనరులపై భారీగా వత్తిడి పెరిగింది.

ఋతుపవన వర్షాలు అన్నిచోట్లా ఒకేలా కురవడం లేదు, కాగా రాష్ట్రంలో 85% సాగు భూమి వర్షాధారంగానే ఉంది. తెలంగాణ నైసర్గిక స్వరూపం, వర్షపాత నమూనా కారణంగా ఈ ప్రాంతంలో సాగునీటి చెరువులే నీటిపారుదలకూ, నీటి నిల్వకూ, వ్యవసాయ వినియోగం కోసం నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకూ శ్రేష్టమైనవిగా నిలుస్తున్నాయి. చెరువుల నిర్మాణంలో కాకతీయులు, కుతుబ్‌షాహీ,

అసఫ్‌జాహీ రాజులు పోషించిన కీలకమైన పాత్రను చెరువుల దగ్గరా, ఆలయాల దగ్గరా బయటపడిన అసంఖ్యాకమైన శాసనాలు చాటిచెబుతున్నాయి. రాష్ట్రంలో, 46,531 సాగునీటి వనరులున్నాయి, ఇవి మొత్తం 10.17 లక్షల హెక్టార్లకు సాగునీరు అందిస్తున్నాయి.

రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి చెరువుల వ్యవస్థ కీలకమైనది. భూసార, జల సంరక్షణ, వరదల నియంత్రణ, కరువు నివారణ, పశు గణం, గృహ వినియోగాలు, భూగర్భ జలాలను పెంచడం, శీతోష్ణస్థితి, పర్యావరణ పరిరక్షణలకు ఇది దోహదపడుతుంది. పేద ప్రజలకు సాగునీటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండడం వల్ల తమ పంటల ఉత్పాదకతను వారు పెంచుకోగలుగుతారు. తమ ఆదాయ మూలాల్లో వైవిధ్యమైన అవకాశాలను విస్తృతం చేసుకోగలుగుతారు. ఋతు సంబంధిత వాతావరణ మార్పుల వల్ల తలెత్తే ముప్పులకు వారు సులభంగా గురయ్యే ప్రమాదం తగ్గుతుంది.

అనేక రకాల పంటలు సాగుచేస్తున్న తెలంగాణలో విస్తృత వ్యవసాయ వైవిధ్యం ఉంది. ఈ పంటల్లో ఆహార, ఉద్యానవన, వాణిజ్య పంటలు ఉన్నాయి. మొత్తం భూభాగంలో సాగు భూమి సుమారు 67%, కాగా దీనిలో 60% మేర ఆహార పంటలు పండిస్తున్నారు. వరి ప్రధానమైన ఆహార పంట, సాగుభూమిలో 25% మేర దీన్ని పండిస్తున్నారు. పప్పు ధాన్యాల సాగు 18% కాగా, ఆ తర్వాతి స్థానంలో, 14% సాగుభూమిలో జొన్న, మొక్క జొన్న పండుతున్నాయి. వేరుశెనగ, పత్తి, ఆముదం, పొద్దుతిరుగుడు, నువ్వులు, చెరకు రాష్ట్రంలో సాగుచేసే ఇతర ప్రధాన పంటలు.

సాగునీటి చెరువులకు సంబంధించి పైన పేర్కొన్న విషయాలను పరిగణనలోకి తీసుకొని, తెలంగాణ ప్రభుత్వం సామాజిక భాగస్వామ్యంతో వికేంద్రీకరణ నమూనాలో "మిషన్ కాకతీయ" (మన ఊరు- మన చెరువు) పేరిట 46,531 చిన్న తరహా సాగునీటి వనరుల పునరుద్ధరణ కోసం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. రానున్న అయిదేళ్ళలో రూ. 20,000 కోట్ల అంచనా వ్యయంతో అన్ని చెరువుల పునరుద్ధరణనూ పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం




- చెరువుల పునరుద్ధరణలో ఈ క్రింది అంశాలు భాగంగా ఉంటాయి.
- పూడిక తొలగింపు, పూడిక మట్టి పునర్వినియోగం
- చెరువులకు సంబంధించిన పిల్లకాలువల పునరుద్ధరణ (చెరువుల గొలుసుకట్టులో భాగం)
- గట్లు, అడ్డుకట్టలు, తూములకు మరమ్మతులు
- సాగునీటి కాలువల రీ-సెక్షనింగ్, సిఎం, సిడి పనులకు మరమ్మతులు
- అవకాశం/ అవసరం ఉన్న చోట ఎఫ్‌టిఎల్‌ని పెంచడం.

**పట్టిక 40 : చెరువుల పునరుద్ధరణకు జిల్లాల వారీ, ఏడాది వారీ ప్రణాళిక**

| వరుస సంఖ్య | జిల్లా | జలవనరుల సంఖ్య | ఏడాదిలో ప్రతిపాదించిన చెరువుల సంఖ్య | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | | 2014-15 | 2015-16 | 2016-17 | 2017-18 | 2018-19 |
| 1 | కరీంనగర్ | 5,939 | 1,188 | 1,210 | 1,220 | 1,200 | 1,121 |
| 2 | ఆదిలాబాద్ | 3,951 | 790 | 800 | 800 | 800 | 761 |
| 3 | వరంగల్ | 5,839 | 1,168 | 1,170 | 1,180 | 1,200 | 1,121 |
| 4 | ఖమ్మం | 4,517 | 903 | 910 | 920 | 930 | 854 |
| 5 | నిజామాబాద్ | 3,251 | 650 | 650 | 650 | 650 | 651 |
| 6 | మెదక్ | 7,941 | 1,588 | 1,590 | 1,600 | 1,610 | 1,553 |
| 7 | రంగారెడ్డి | 2,851 | 570 | 500 | 570 | 600 | 611 |
| 8 | మహబూబ్‌నగర్ | 7,480 | 1,496 | 1,500 | 1,510 | 1,510 | 1,464 |
| 9 | నల్గొండ | 4,762 | 952 | 978 | 980 | 980 | 872 |
| | **మొత్తం** | **46,531** | **9,305** | **9,308** | **9,430** | **9,480** | **9,008** |

2014-15 నుంచి మొదలయ్యే అయిదేళ్ళ కాలంలో, ఏడాదికి 1/5 భాగం చెరువుల చొప్పున, మొత్తం 46,531 ట్యాంకుల పునరుద్ధరణ పూర్తి చేయాలని ప్రతిపాదించడం జరిగింది. రానున్న అయిదేళ్ళ కాలంలో దశలవారీగా అన్ని సాగునీటి చెరువులనూ పునరుద్ధరించడానికి రాష్ట్రం చిత్తశుద్ధితో ఉంది.

## ఆయకట్టు అభివృద్ధి

మూడు ప్రధాన ఆయకట్టులైన నాగార్జున సాగర్ ఎడమ కాలువ ఆయకట్ట, శ్రీరామ్ సాగర్ ఆయకట్ట, జూరాల ప్రాజెక్ట్ ఆయకట్టల కింద నీటిపారుదల శాఖ అధ్యయనాలను ఈ క్రింది అంశాలపై చేపట్టింది:

- ఇప్పటికే బురద ఎక్కువై, నిరుపయోగంగా మిగిలిపోయిన ప్రాంతాల గుర్తింపు
- ఉపరితల, భూగర్భ జలాల విషయంలో సిఫార్సు చేసిన సంయోజక వినియోగం
- ఉత్పాదకతను పెంచడానికి సూచించిన ఇతర దిద్దుబాటు చర్యలు

## భూగర్భ జలాలు

రాష్ట్రంలో సాగునీటికి సంబంధించిన ప్రధాన వనరుల్లో భూగర్భజలాలు ఒకటి. జల వృత్తంలో ఓ ముఖ్యమైన, సమగ్ర భాగంగా ఉన్న భూగర్భ జలం లభ్యత వర్షపాతం మీదా, ఖర్చయిన నీరు తిరిగి భర్తీ అయ్యే పరిస్థితులమీదా ఆధారపడి ఉంటుంది.

సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ నీటికి గిరాకీ పెరుగుతోంది, ఇది ప్రపంచంలో చాలా సంవత్సరాలుగా నీటి కొరతకు దారి తీస్తోంది. భూగర్భ జలాలను వెలికితీయడం పెరుగుతూండడంతో అనేక ప్రాంతాల్లో జలమట్టం గత రెండు దశాబ్దాలుగా వేగంగా పడిపోతోంది. అటు ఆహార, ఇటు వాణిజ్య పంటలకు సాగు నీరు అందించడానికి తవ్వుతున్న బోరు బావుల సంఖ్య కూడా బాగా పెరిగిపోయింది. వ్యవసాయ, పారిశ్రామిక , గృహావసర రంగాల్లాంటి వాడకందారుల మధ్య పోటీ తీవ్రతరం కావడంతో భూగర్భ జలాలకు డిమాండ్ పెరిగిపోయింది.  ఫలితంగా భూగర్భ జలాల మట్టం తరిగిపోతోంది.

2010-11లో భూగర్భ జల వనరుల సమాచార నిధి ఆధారంగా వేసిన అంచనాల మేరకు, రాష్ట్రాన్ని 494 వాటర్‌షెడ్లుగా (జల సేకరణ ఆవరణలుగా) విభజించారు. వీటినే భూగర్భ జలాల బేసిన్లు లేదా అంచనా యూనిట్లు అంటారు. భూగర్భ జలాల అభివృద్ధి, నీటిని పైకి తోడేస్తున్న స్థాయిల ఆధారంగా వర్గీకరించిన వాటర్‌షెడ్లు/ మండలాలు/ గ్రామాల వివరాలను అనుబంధంలో చూడవచ్చు.

## తెలంగాణ సామాజిక ఆధారిత చెరువుల నిర్వహణ ప్రాజెక్ట్

వర్షపాతం, ఉపరితల జలవనరులతో తిరిగి నింపిన, సాగునీటి ప్రాంతాల నుంచి తిరిగి వచ్చిన నీటిని, పంపిణీ చేయడం ద్వారా గతిశీలమైన భూగర్భ జలవనరులను వివేకవంతంగా నిర్వహించుకోవడం కోసం, చెరువుల ప్రభావిత మండలంలో భూగర్భ జల వినియోగదారులకు సాధికారత కల్పించడం, భాగస్వామ్య భూగర్భ జల నిర్వహణ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్ కింద, భాగస్వామ్య భూగర్భ జల నిర్వహణ కార్యకలాపాలకోసం 7 జిల్లాల్లోని 78 మండలాల పరిధిలో మొత్తం 172 చెరువులను ఎంపిక చేయడం జరిగింది.

పీజోమీటర్ల డ్రిల్లింగ్, పిహెచ్ఎం పరికరాల ఏర్పాటు, శిక్షణలు, సమాచార విశ్లేషణ, సమాచార ప్రచారం తదితరాలతో కూడిన పిహెచ్ఎం పరికరాల ఏర్పాటు ఈ కార్యకలాపాల్లో భాగం. తెలంగాణ రాష్ట్రంలో ఈ ప్రాజెక్ట్‌ను ఏడేళ్ళ కాలవ్యవధిలో (2007-14) రూ. 16.24 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. 2013-14 సంవత్సరంలో రూ. 887.60 లక్షలను రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ విడుదల చేశారు. రూ. 413.30 లక్షలు ఖర్చు చేశారు.

## తెలంగాణ నీటి రంగ అభివృద్ధి ప్రాజెక్ట్

ప్రస్తుత భూగర్భ జల నిర్వహణ వ్యవస్థ పరిమితులను పరిగణనలోకి తీసుకున్నప్పుడు, ప్రస్తుతం ఉనికిలో ఉన్న నిర్వహణ వ్యవస్థకు స్వయంగా ఉన్న పరిమితులను గుర్తించి, సమాజం ద్వారా జలాశయాల స్థాయి భూగర్భజల నిర్వహణకు సిఫార్సులు చేసే ఓ సరికొత్త భూగర్భ జల నిర్వహణ నమూనాను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఆరేళ్ల కాలవ్యవధి కోసం (2010 నుంచి 2018) రూ. 14.93 కోట్ల అంచనా వ్యయంతో ఆ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. రెండు పైలెట్ ప్రాజెక్టులను నీటిపారుదల శాఖ నిర్వహిస్తోంది.

- నల్గొండలో వినియోగదారులు కేంద్రంగా జలాశయాల స్థాయి భూగర్భ జలాల నిర్వహణ ప్రాజెక్ట్
- ఖమ్మంలోని ఎన్ఎస్ఎల్‌సిసిఎన్‌లో ఉపరితల, భూగర్భ జలాల సంయుక్త వినియోగ పైలెట్ ప్రాజెక్ట్‌లు

ఈ ప్రాజెక్ట్ కింద, 2014-15 సంవత్సరంలో బడ్జెట్ అంచనా రూ. 669.10 లక్షలు కాగా, విడుదలచేసిన బడ్జెట్ రూ. 76.67 లక్షలు, వ్యయం రూ. 13.25 లక్షలు.

ఇంకా, అతిగా నీటిని తోడేస్తున్న ప్రాంతాలకు నోటిఫికేషన్ కోసం తెలంగాణ జల, భూ, వృక్షాల చట్టం (టిడబ్ల్యూఎఎల్‌టిఎ) కింద 1,057 గ్రామాల్ని గుర్తించడం జరిగింది. ఈ గ్రామాల్లో తాగునీటి అవసరాలు మినహా భూగర్భజలాలను నిరంతరం వెలికితీయడంపై నిషేధం విధించారు. పరిమాణం విషయానికొస్తే, రాష్ట్రంలో మొత్తం భూగర్భ జలాల లభ్యత 13,674 మిలియన్ క్యూబిక్ మీటర్లు (ఎంసిఎం). దీనిలో 7,502 ఎంసిఎంలను వివిధ అవసరాలకోసం ఉపయోగిస్తుండగా, మిగిలిన 5,805 ఎంసిఎంలను విడిచిపెట్టారు. మొత్తం భూగర్భ జలాభివృద్ధి స్థితి 58%. ఏర్పాటైన మొత్తం అదనపు బావుల సంఖ్య 2,33,529.



*హుస్సేన్‌సాగర్ వద్ద సూర్యాస్తమయ సౌందర్యం*

# 4.2 నూతన పారిశ్రామిక విధానం

> *"నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా మీరు, మీ ఆర్థిక వ్యవస్థను ఉప్పొంగించే కొత్త పరిశ్రమలను సృష్టిస్తారు." - నీల్ డిగ్రాస్ టైసన్*

బల్క్ డ్రగ్స్, ఫార్మస్యూటికల్స్, వ్యవసాయాప్రాసెసింగ్, సిమెంట్, ఖనిజాఆధారిత పరిశ్రమలు, సమున్నత నిర్దుష్టతా ఇంజనీరింగ్, జౌళి, తోలు, ఇనుము, ఉక్కు, రత్నాలు, ఆభరణాలు, బయోటెక్నాలజీ, రక్షణ లాంటి భారీ ఉత్పాదక పరిశ్రమలకు నిలయం తెలంగాణ రాష్ట్రం. దేశంలోని ప్రధాన పారిశ్రామిక రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. పరిశ్రమలపరంగా 6వ స్థానంలో, పరిశ్రమల నుంచి సమకూరే స్థూల విలువ ఆధారిత అంశాలపరంగా 8వ స్థానంలో ఉంది. తెలంగాణ రాష్ట్రం అటు విదేశీ, ఇటు దేశీయ పెట్టుబడిదారులకు తెలంగాణను పెట్టుబడులకుఆకర్షణీయమైన గమ్యస్థానంగా మలచడానికి, సానుకూలమైన పారిశ్రామిక వాతావరణానికి తోడుగా నాణ్యమైన మౌలిక సదుపాయాలను సృష్టించడం కోసం ప్రోత్సాహపూరితమైన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకూ, షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలకూ (ఎస్‌టి) చెందినవారికీ అనుకూలమైన సాధికారతా వాతావరణాన్ని సృష్టించడానికి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటోంది.

## పారిశ్రామిక రంగ వృద్ధి

తెలంగాణలో పారిశ్రామిక రంగ వృద్ధి ఆకర్షించే విధంగా ఉంది. స్థిరమైన (2004-05) ధరలు ప్రామాణికంగా 2013-14లో 0.13 శాతం ఉన్న పారిశ్రామిక వృద్ధి 2014-15 సంవత్సరంలో (ముందస్తు అంచనాల ప్రకారం) 4.1 శాతానికి చేరుకుంది. 2014లో కొత్త ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధాన చట్టం కింద అందించిన ప్రోత్సాహకాల వల్లనే ఇది సాధ్యమయింది.

2004-05 నుంచి 2014-15 వరకు గల దశాబ్ద కాలంలో రాష్ట్రం స్థిరమైన (2004-05) ధరల దగ్గర 7.8% సగటు వృద్ధిని నమోదుచేసుకుంది. అయితే, భారతదేశం మొత్తం ఎదుర్కొన్నట్లే రాష్ట్ర అభివృద్ధి పథం కూడా అప్పట్లో మరిన్ని ఒడిదుడుకులను ఎదుర్కొంది. జిల్లాల వ్యాప్తంగా ఉత్పాదక రంగం వృద్ధి మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్ కాకుండా మిగిలిన ఏడు జిల్లాల్లో నిర్దిష్టమైన వ్యూహాలూ, విధానపరమైన జోక్యాలు అవసరమనే విషయాన్ని సూచిస్తోంది. రిజిస్టర్ కాని ఉత్పాదక రంగం పతనమవుతున్న విషయాన్ని ఉపరంగాల వృద్ధి సూచిస్తోంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమలు, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, నిర్మాణాలు ఈ రిజిస్టర్ కాని ఉత్పాదక రంగానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. స్థూల రాష్ట్ర ఉత్పత్తి (జిఎస్‌డిపి)లో పారిశ్రామిక ఉప రంగం వాటాను ఈ క్రింద సూచించడం జరిగింది.

**పట్టిక 41 : జి.ఎస్.డి.పి.లో పరిశ్రమల, ఉపరంగాల భాగం (%) వర్తమాన ధరల ప్రకారం**

| ఉప-రంగం | 2004-05 | 2014-15 (ఎ.ఇ.) |
|---|---|---|
| 1. గనులు, తవ్వకాలు | 4.8 | 2.9 |
| 2. వస్తూత్పత్తి | | |
| ఎ. నమోదైనవి | 10.0 | 9.9 |
| బి. నమోదు కానివి | 3.2 | 1.6 |
| 3. విద్యుచ్ఛక్తి, గ్యాస్ & నీటి సరఫరా | 2.8 | 2.0 |
| 4. నిర్మాణాలు | 7.5 | 8.6 |
| 5. జి.ఎస్.డి.పికి పారిశ్రామిక రంగం అందించిన వాటా | 28.3 | 25.0 |

## పరిశ్రమల వార్షిక సర్వే

భారత ప్రభుత్వ గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ నిర్వహించిన వార్షిక పారిశ్రామిక సర్వే (ఎఎస్ఐ) పరిశ్రమలపై గణాంక సమాచారాన్ని అందిస్తోంది. సంఘటిత ఉత్పాదక రంగంలో వృద్ధి, సంవిధానం, నిర్మాణాలకు సంబంధించిన గణాంకాలను తెలుసుకొని, వాటిలో మార్పులను విశ్లేషించడానికీ, ఉత్పాదక ప్రక్రియ, మరమ్మతు సేవలు, గ్యాస్, నీటి సరఫరా, శీతల గిడ్డంగులకు సంబంధించిన కార్యకలాపాలను పోల్చి చూడడానికీ వీలవుతుంది.

## ఎఎస్ఐలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ప్రధానాంశాలు

2011-12, 2012-13 ఎఎస్ఐ ఫలితాలలో తెలంగాణ రాష్ట్రం గురించి ప్రస్తావనకు వచ్చిన గుర్తించదగిన అంశాలు ఈ విధంగా ఉన్నాయి:

- 2011-12లో 9005 వరకు ఉన్న కర్మాగారాల సంఖ్య 2012-13 నాటికి 13,656కు పెరిగింది (ఎఎస్ఐ 2012-13, ఎఎస్ఐ 2011-12 తాత్కాలిక ఫలితాల ప్రకారం)
- 2012-13 నాటికి ఈ ఫ్యాక్టరీలు మొత్తం 7,01,110 మందిని నియమించుకున్నాయి (ఎఎస్ఐ 2012-13 తాత్కాలిక ఫలితాలు)
- దేశంలోని ప్రధాన పారిశ్రామిక రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. తోడైన స్థూల విలువ (జివిఎ) ప్రకారం రూ. 36,475.65 కోట్లతో 8వ స్థానంలో ఉంది (ఎఎస్ఐ 2011-12)
- 2010-11 నుంచి 2011-12 వరకూ పారిశ్రామిక వృద్ధి తోడైన స్థూల విలువ పరంగా 17.53% కాగా, నికర విలువ ఆధారితంగా 16.76% (ఎఎస్ఐ 2011-12)

## తెలంగాణలోని కీలక పరిశ్రమలు

సమాచార సాంకేతికత ఆధారిత సేవలు (ఐటిఇఎస్), ఫార్మా, ఇంజనీరింగ్ కంపోనెంట్స్ లాంటి విజ్ఞాన ఆధారిత పరిశ్రమలకు తెలంగాణలో బలమైన ఉనికి ఉంది. వీటిలో ఎక్కువ శాతం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెలకొని ఉన్నాయి. వీటికి ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్), నిపుణులైన కార్మికుల లభ్యత, పరిశోధన సంస్థల్లాంటి ఘనమైన మౌలిక సదుపాయాలు, సహాయక వ్యవస్థలు ఉన్నాయి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలు ఎక్కువగా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నాయి. ఆ జిల్లాల్లో పారిశ్రామికాభివృద్ధి జరగాల్సిన అవసరముంది.

జిల్లాలను వాటి పారిశ్రామిక బలాల ఆధారంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ ఊహాత్మక ప్రణాళికను ఈ క్రింది చిత్రం వివరిస్తుంది.

**జిల్లా స్థాయి అభివృద్ధికి ప్రణాళికా భావనలు**



## జిల్లా పరిశ్రమల కేంద్రాలు

జిల్లా పారిశ్రామిక కేంద్రాలు ఏక గవాక్ష విధానం కింద పరిశ్రమలు స్థాపించుకునేందుకు అవసరమైన అన్ని ఆమోదాలనూ/ అనుమతులనూ అందించే మధ్యంతర కేంద్రాలు. అవసరమైన రుణాలను సమకూర్చడంలో వివిధ ఆర్థిక సంస్థలతో ఫలప్రదమైన అనుసంధానకర్తగా వ్యవహరించడంతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) అభివృద్ధి చట్టం, 2006ను ఇవి అమలు చేస్తాయి, ఎంఎస్ఎంఇలకు పారిశ్రామిక ఆధారపత్రా (వ్యవస్థాపక పత్రం - ఇఎం)లను జారీ చేస్తాయి.

## సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (ఎంఎస్ఎంఇడి) చట్టం, 2006ను ప్రవేశపెట్టడం ద్వారా పెట్టుబడి పరిమితులను సడలించడం జరిగింది. 15% వార్షిక వృద్ధి రేటును సాధించడానికీ, ఉపాధి కల్పనను పెంచడం, సానుకూలమైన, ఎలాంటి అవరోధాలూ లేని వాతావరణాన్ని సృష్టించడం, కొత్త సాంకేతికతలనూ, నైపుణ్యాలనూ అందిపుచ్చుకోవడంలో చిన్న తరహా పరిశ్రమలకు (ఎస్ఎస్ఐ) సహాయపడడం, ఎగుమతి సామర్థ్యాన్ని పెంచడానికీ, భారీ, చిన్న రంగాల మధ్య అనుసంధానతను ప్రోత్సహించడం, ఖాయిలా పడిన పరిశ్రమలను పునరుద్ధరించేందుకు తగిన సంస్థాగత యంత్రాంగాలను ప్రోత్సహించడం లాంటి లక్ష్యాలతో సూక్ష్మ, మధ్య తరహా పరిశశ్రమలకు అనువైన ఓ విధానాన్ని భారత ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

2001 - 2015 మధ్య (2015 జనవరి వరకూ) రూ. 22520.63 కోట్ల పెట్టుబడితో 40,894 ఎంఎస్ఎంఇలు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డాయి, ఇవి 5,65,496 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

**పట్టిక 42 : తెలంగాణాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎం.ఎస్.ఎం.ఇ.లు) వాటి ద్వారా ఉపాధి కల్పన, పెట్టుబడుల పెరుగుదల**

| | 2001-05 | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 | 2012-13 | 2013-14 |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఎం.ఎస్.ఎం.ఇల సంఖ్య | 3,807 | 731 | 1,319 | 2,645 | 2,828 | 2,759 | 5,374 | 5,561 | 5,125 | 6,844 |
| ఉపాధి పొందిన వ్యక్తులు ('00లలో) | 499 | 75 | 190 | 481 | 538 | 474 | 635 | 773 | 712 | 832 |
| పెట్టుబడి (రూ. లక్షలలో) | 311 | 84 | 553 | 1,358 | 1,559 | 4,576 | 3,301 | 3,033 | 2,674 | 3,111 |

తెలంగాణలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఖ్య, వాటిలో ఉద్యోగం పొందిన వ్యక్తుల సంఖ్య 2001-05, 2013-14ల మధ్య ముచ్చటైన రీతిలో పెరిగింది. ఈ రంగంలో పెట్టుబడి కూడా చక్కగా పెరిగింది. వీటి వివరాలు దిగువ రేఖా పటంలో చూపిస్తున్నాము:

**తెలంగాణాలో ఎం.ఎస్.ఎం.ఇ రంగం వికాస ధోరణులు**



## భారీ, మధ్య తరహా పరిశ్రమలు

2015 జనవరి నాటికి, రూ. 45393.33 కోట్ల పెట్టుబడితో 2091 భారీ పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఇవి 6,67,499 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

## 2014-15లో ఆమోదం పొందిన యూనిట్ల సంఖ్య

2014-15లో ఏక గవాక్ష విధానం కింద దాదాపు 1496 మంది ఔత్సాహికులు (వ్యాపారోత్సాహులు) పరిశ్రమల అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 1173 పరిశ్రమలకు అనుమతులు జారీ అయ్యాయి.

## నూతన పారిశ్రామిక విధానం

తెలంగాణలో ఆర్థిక వృద్ధికీ, అభివృద్ధికీ అనుసరించాల్సిన కీలక వ్యూహం పారిశ్రామికీకరణ. యువతరానికి ఉద్యోగాల కల్పన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధన, అందుబాటులో ఉన్న వనరులను ఆదర్శవంతంగా వినియోగించుకోవడం ద్వారా వృద్ధి అవకాశాలను పెంచడం, ప్రజల ప్రతిభను, నైపుణ్యాలనూ వినియోగించుకోవడం, ప్రతి ఇంట్లో సంపదను సృష్టించడం లాంటి అంశాల్లో కొత్త రాష్ట్రం ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మీద అత్యంత భారీ ఆకాంక్షలున్నాయి. తెలంగాణ ప్రజల్లో నెలకొన్న ఈ ఆకాంక్షలను నెరవేర్చే సామర్థ్యం పారిశ్రామికీకరణకు ఉంది.

ఈ దిశలోనే, ప్రభుత్వం నూతన 'పారిశ్రామిక విధాన చట్టం 2014'ను ప్రవేశపెట్టింది.

'నవ్యావిష్కరణల కోసం పరిశోధన, పరిశ్రమలకోసం నవ్యావిష్కరణ, సంపద కోసం పరిశ్రమలు' అనేది తెలంగాణ పారిశ్రామికీకరణ విషయంలో ప్రభుత్వ దార్శనిక దృక్పథం. 'ఇన్ తెలంగాణ- ఇన్నోవేట్, ఇన్‌క్యూబేట్, ఇన్‌కార్పొరేట్' (తెలంగాణలో నవ్యావిష్కరణలు చేయండి, నూతన పరిశ్రమలకు శ్రీకారం చుట్టండి, సువ్యవస్థిత పరిశ్రమగా అవతరించండి) అనే నినాదం పారిశ్రామిక విధాన నిర్మాణానికి చోదక శక్తి. కరచాలనం చేసుకున్నంత సులువుగా వ్యాపారాన్ని సాగించే ఓ వ్యాపార నియంత్రణ వాతావరణాన్ని కల్పించడం విధాన నిర్మాణం ఉద్దేశం. నవ్యావిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమలను ముందుకు నడిపిస్తాయి.

## మౌలిక విలువలు

నూతన విధానం దిగువ పేర్కొన్న నిర్దిష్టమైన మౌలిక విలువలపై ఆధారపడి ఉంది:

- ప్రభుత్వ నియంత్రణ చట్టం పారిశ్రామిక వృద్ధికి దోహదపడాలి.
- పారిశ్రామికవేత్తలు ప్రశాంతమైన, సురక్షితమైన, ప్రగతిశీలమైన వ్యాపార నియంత్రణ వాతావరణంలో అభివృద్ధి సాధించాలి.
- పారిశ్రామికాభివృద్ధి భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పనకు తద్వారా స్థానిక యువతరానికి ప్రయోజనాలను అందించేందుకూ దారితీయాలి.
- పారిశ్రామికీకరణ సమ్మిళితంగా ఉండాలి. సామాజిక సమానత్వానికి దోహదపడాలి.
- పారిశ్రామికీకరణ ప్రయోజనాలు రాష్ట్రంలోని అట్టడుగు, సామాజికంగా అణగారిన వర్గాల వారికి చేరాలి.
- పర్యావరణాన్ని పరిరక్షించాలి మరియు సంభవించగల ప్రభావాలను తగ్గించాలి.

## లక్ష్యాలు

నూతన విధానం లక్ష్యాలు :

- ప్రస్తుతం ఉన్న పరిశ్రమలను మరింత పోటీపడేలా తీర్చిదిద్దడం.
- పారిశ్రామిక రంగంలోకి కొత్త అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం.
- పట్టణ, గ్రామీణ యువతరం కోసం ఉపాధి అవకాశాలు సృష్టించడానికి కీలకమైన ఉత్పాదక రంగాలపై దృష్టి కేంద్రీకరించడం.
- అత్యంత పోటీ ధరలకు అత్యున్నత స్థాయి వస్తువుల్ని ఉత్పత్తి చేయడం.
- భారీస్థాయిలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా 'మేడ్ ఇన్ తెలంగాణ - మేడిన్ ఇండియా'ను ఓ బ్రాండ్‌గా నెలకొల్పడం.

- అవినీతి నిర్మూలన. లంచగొండితనాన్ని ఏమాత్రం ఉపేక్షించకపోవడం.
- విధాన నిర్ణయాలను పారదర్శకంగా తీసుకోవడం.
- పర్యవేక్షణను తగ్గించడం, సౌలభ్యాన్ని పెంచడం.

## ప్రోత్సాహకాలు

తెలంగాణ ప్రభుత్వం నూతన పారిశ్రామిక ప్రోత్సాహక పథకం టి-ఐడియా, 2014 (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్)ను సాధారణ కేటగిరీ పారిశ్రామిక వేత్తల కోసం మరియు టి-ప్రైడ్, 2014 (తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ రాపిడ్ ఇన్‌క్యూబేషన్ ఆఫ్ దళిత్ ఇంటర్‌ప్రెన్యూర్స్)ను దళిత పారిశ్రామికవేత్తల షెడ్యూల్డ్ కులాలు/ షెడ్యూల్డ్ తెగల ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ప్రకటించింది, ఎంఎస్ఎంఇ, భారీ పరిశ్రమల వర్గాలకు వివిధ ప్రోత్సాహకాలను విస్తరించింది.

## సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఇలు) ప్రోత్సాహకాలు

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

- పారిశ్రామిక వినియోగం నిమిత్తం కొనుగోలు చేసిన భూమి కోసం ఆ పరిశ్రమ చెల్లించిన స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీల మొత్తం 100% తిరిగి చెల్లింపు.
- భూమి/ షెడ్/ భవనాల లీజు, అలాగే తనఖా, తాకట్టులపై 100% స్టాంప్ డ్యూటీ తిరిగి చెల్లింపు.
- పారిశ్రామిక వాడలు/ పారిశ్రామిక పార్కుల్లో భూమి విలువపై రూ. 10.00 లక్షల పరిమితితో 25 శాతం తగ్గింపు.
- పారిశ్రామిక వినియోగానికి 25% భూమి మార్పిడి ఛార్జీలు.
- వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 5 ఏళ్ళ పాటు యూనిట్‌కు రూ. 1.00 వంతున స్థిర విద్యుత్ ధర తిరిగి చెల్లింపు.
- స్థిరమైన మూలధన పెట్టుబడి మీద గరిష్ఠంగా రూ. 20.00 లక్షల పరిమితితో 15% పెట్టుబడి సబ్సిడీ.
- వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 5 ఏళ్ళ పాటు నికర వ్యాట్/ సిఎస్‌టి లేదా రాష్ట్ర వస్తు, సేవల పన్ను (ఎస్‌జిఎస్‌టి)లపై 100% తిరిగి చెల్లింపు.
- నూతన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థిర మూలధన పెట్టుబడిపై పావలా వడ్డీ పథకం కింద తీసుకున్న నియమితకాల రుణాలపై వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 5 ఏళ్ళ పాటు ఏడాదికి కనిష్టంగా 3% నుంచి గరిష్ఠంగా 9% వరకూ వడ్డీ రాయితీ.
- తొలితరం పారిశ్రామికవేత్తలు సూక్ష్మ తరహా పరిశ్రమల్ని ఏర్పాటు చేయడానికి వీలుగా యంత్రాల కొనుగోలు ఖర్చులో మూలధన సమీకరణలో 10% సహాయం. దీనిని అర్హమైన పెట్టుబడి సబ్సిడీ నుంచి తగ్గిస్తారు.
- నైపుణ్యాలను పెంచుకోవడానికీ, స్థానిక కార్మికులకు శిక్షణ ఇవ్వడానికీ అయ్యే ఖర్చులో వ్యక్తికి రూ. 2,000 పరిమితికి లోబడి 50% తిరిగి చెల్లింపు.
- నాణ్యత ధ్రువీకరణకు/ పేటెంట్ల నమోదుకు అయ్యే ఖర్చులో రూ. 2.00 లక్షల పరిమితికి లోబడి 50% సబ్సిడీ.
- నిర్దిష్టమైన పరిశుభ్రమైన ఉత్పత్తి చర్యలపై రూ. 5.00 లక్షల పరిమితికి లోబడి 25% సబ్సిడీ.
- రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్ల పరిధుల్లో ఏర్పాటైన పరిశ్రమలకు సంబంధించి గుర్తించిన సేవల కార్యకలాపాలపై అమలులో ఉన్న నిర్దిష్ట విధానం ప్రకారం పెట్టుబడి సబ్సిడీ పొడిగింపు.

## భారీ, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

భారీ, మధ్య తరహా పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

- పారిశ్రామిక వినియోగం నిమిత్తం కొనుగోలు చేసిన భూమి కోసం పరిశ్రమ చెల్లించిన స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీల మొత్తం 100% తిరిగి చెల్లింపు.

- తనఖా, తాకట్టుతో సహా భూమి/ షెడ్/ భవనాల లీజులపై 100% స్టాంప్ డ్యూటీ తిరిగి చెల్లింపు.
- పారిశ్రామిక వాడలు/ పారిశ్రామిక పార్కుల్లో భూమి విలువపై రూ. 10.00 లక్షల పరిమితితో 25 శాతం తగ్గింపు.
- పారిశ్రామిక వినియోగానికి భూమి మార్పిడి చేయడానికి చెల్లించిన ఛార్జీల్లో రూ. 10.00 లక్షల పరిమితికి లోబడి మధ్యతరహా పరిశ్రమలకు 25% తగ్గింపు.
- వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 5 ఏళ్ళ పాటు యూనిట్‌కు రూ. 1.00 చొప్పున స్థిర విద్యుత్ ధర తిరిగి చెల్లింపు.
- మధ్య తరహా పరిశ్రమలు వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 7 ఏళ్ళ కాల పరిమితి లేదా 100% స్థిర మూలధన పెట్టుబడి వసూలు కావడాల్లో ఏది ముందు పూర్తయితే అప్పటివరకూ 75% నికర వ్యాట్/ సిఎస్‌టి లేదా రాష్ట్ర వస్తు, సేవల పన్ను (ఎస్‌జిఎస్‌టి) తిరిగి చెల్లింపు.
- భారీ పరిశ్రమలు వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 7 ఏళ్ళ కాల పరిమితి లేదా 100% స్థిర మూలధన పెట్టుబడి వసూలు కావడాల్లో ఏది ముందు పూర్తయితే అప్పటివరకూ 50% నికర వ్యాట్/ సిఎస్‌టి లేదా రాష్ట్ర వస్తు, సేవల పన్ను (ఎస్‌జిఎస్‌టి) తిరిగి చెల్లింపు.
- నైపుణ్యాలను పెంచుకోవడానికీ, స్థానిక కార్మికులకు శిక్షణ ఇవ్వడానికీ అయ్యే ఖర్చులో వ్యక్తికి రూ. 2,000 పరిమితికి లోబడి 50% తిరిగి చెల్లింపు. కేవలం మధ్య తరహా పరిశ్రమలకు మాత్రమే నాణ్యత ధ్రువీకరణకు / పేటెంట్ల నమోదుకు అయ్యే ఖర్చులో రూ. 2.00 లక్షల పరిమితికి లోబడి 50% సబ్సిడీ.
- నిర్దిష్టమైన క్లీనర్ ఉత్పత్తి చర్యలపై రూ. 5.00 లక్షల పరిమితికి లోబడి 25% సబ్సిడీ.
- పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఐఐడిఎఫ్) ద్వారా మౌలిక సదుపాయాల ఖర్చులో 50% సమకూరుస్తూ పరిశ్రమల స్వయం సమృద్ధి యూనిట్ల ముంగిటికే రోడ్లు, విద్యుత్, నీరు లాంటి మౌలిక సదుపాయాలను సమకూర్చడం జరుగుతుంది. దీని పరిమితి రూ. 1.00 కోటి కాగా అది ఈ అంశాలకు లోబడి ఉంటుంది: (ఎ) పరిశ్రమ ప్రదేశం ప్రస్తుతం నడుస్తున్న పారిశ్రామిక వాడలు/ ఐడిఎలకు 10 కిలోమీటర్లకు మించిన దూరంలో ఉండాలి. కేటాయించడానికి ఖాళీ భూమి/ షెడ్లు ఉండాలి. (బి) పరిశ్రమలో పెట్టిన అర్హమైన స్థిర మూలధన పెట్టుబడిలో మౌలిక సదుపాయాల ఖర్చు 15%కి పరిమితమై ఉండాలి.

### మహిళల యాజమాన్యంలోని పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన యూనిట్లకు అందించే ప్రోత్సాహకాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి :

- ఎంఎస్‌ఇలకు రూ. 10.00 లక్షల గరిష్ట పరిమితికి లోబడి, స్థిర మూలధన పెట్టుబడి మీద 10% అదనపు సబ్సిడీ.
- సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు లభించే ఇతర అన్ని ప్రయోజనాలూ వర్తిస్తాయి.

### మెగా ప్రాజెక్ట్‌లకు ప్రోత్సాహకాలు

మెగా ప్రాజెక్ట్‌లకు అందించే ప్రోత్సాహకాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి: (మెగా ప్రాజెక్ట్ అంటే రూ. 200 కోట్లు లేదా అంతకు మించిన పెట్టుబడితో ఏర్పాటైన, లేదా 1000 మందికి పైగా వ్యక్తులకు ఉపాధిని సృష్టించిన పారిశ్రామిక యూనిట్)

- ప్రతి పరిశ్రమకూ దాని ప్రత్యేకమైన పెట్టుబడి అవసరాలకు సరిపడే అనువైన ప్రయోజనాలను మెగా ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం దేనికి దానికి నిర్ణయించి, అందిస్తుంది.

### మౌలిక సదుపాయాల మద్దతు

మౌలిక సదుపాయాల మద్దతుకు సంబంధించి విధానంలో పొందుపరచిన అంశాలు ఈ విధంగా ఉన్నాయి:

- పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (ఐఐడిఎఫ్) పథకం కింద రోడ్లు, విద్యుత్, నీరు, వ్యర్థాల నిర్వహణ తదితర నాణ్యమైన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ. 100.00 కోట్లు కేటాయింపు.

- రాష్ట్రం లోపల విలువను పెంపొందించేందుకు భారత ప్రభుత్వం చేపడుతున్న చర్యల వల్ల చేకూరే బలాలను ప్రయోజనకరమైన అవకాశంగా మలచుకునేందుకు జాతీయ రహదారుల పొడవునా జాతీయ ఉత్పాదక పెట్టుబడుల జోన్ (ఎన్ఎంఐజెడ్)లకు ప్రోత్సాహం.
- వనరులను గరిష్టంగా వినియోగించుకోవడం కోసం ఇప్పుడున్న బలాల నుంచి సానుకూలత పొందడానికి పారిశ్రామిక కారిడార్లను ప్రోత్సహించడం.
- తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టిఎస్ఐఐసి) ద్వారా భవిష్యత్తులో అభివృద్ధి చేసే పారిశ్రామిక వాడల్లో ఎంఎస్ఎంఇలకోసం 30-40% భూమిని రిజర్వ్ చేయడం.
- కొత్త పారిశ్రామిక వాడల్లో షెడ్యూల్డ్ కులాల పారిశ్రామికవేత్తలకు 15.44% స్థలాలు, షెడ్యూల్డ్ తెగల పారిశ్రామిక వేత్తలకు 9.34% స్థలాలు కేటాయింపు. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక వాడల్లో ఎస్సీ/ఎస్టీలకు కేటాయింపుల్లో ప్రాధాన్యం.
- కొత్త పారిశ్రామిక వాడల్లో మహిళా పారిశ్రామికవేత్తలకు 10% స్థలాల కేటాయింపు.

## పరిశ్రమలకు సహకారం

ప్రస్తుత ఏకగవాక్ష అనుమతుల విధానాన్ని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్ట్ అనుమతులు, స్వీయ ధ్రువీకరణ విధానం (టిఎస్-ఐపాస్) ద్వారా పటిష్ఠం చేయాలనే యోచన ఉంది.

## సమర్థవంతమైన ఏక గవాక్ష యంత్రాంగం

రాష్ట్రంలో వ్యాపారం చేయడాన్ని అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలోనూ, అంతకు మించి సులభతరం చేసేందుకు, ఓ అంతర్గత అనుసంధాన వ్యవస్థను సృష్టించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

"తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక ప్రాజెక్ట్ అనుమతులు, స్వీయ ధ్రువీకరణ విధాన (టిఎస్-ఐపాస్) చట్టం, 2014" (2014 చట్టం సంఖ్య 3)ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఎపి పారిశ్రామిక ఏక గవాక్ష అనుమతుల చట్టం 2002 ను ఎత్తివేసి, పారిశ్రామికవేత్త స్వీయ ధ్రువీకరణ ఆధారంగా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, పారిశ్రామిక నిర్వహణ సంస్థలను ఏర్పాటు చేయడానికి అవసరమయ్యే వివిధ లైసెన్సులు, అనుమతులు, సర్టిఫికెట్ల జారీ, అలాగే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావణాన్ని అందించడం కొత్త చట్టం ఉద్దేశం.

## అభివృద్ధి చెందుతున్న కీలక రంగాలు

పురోగమిస్తున్న కీలక రంగాలుగా 14 రంగాలను ప్రభుత్వం గుర్తించింది, వీటిలో పెట్టుబడులకు మిగిలినవాటికన్నా అత్యధికమైన ప్రాధాన్యాన్ని ఇవ్వడం జరుగుతుంది.

**పట్టిక 43 : పెట్టుబడులకు ప్రాధాన్య రంగాలు**

| క్ర.సం. | ప్రాధాన్య రంగం | వ్యాఖ్యలు |
|---|---|---|
| 1. | జీవశాస్త్రాలు - ముడిమందులు, ఔషధ రూపకల్పనలు, టీకాలు, ఔషధాల తయారీ, జీవశాస్త్ర సంబంధ పరిశ్రమలు, ఇన్‌క్యుబేషన్ కేంద్రాలు, పరిశోధన-అభివృద్ధి సదుపాయాలు, వైద్యసామాగ్రి తయారీతో సహా | ముడి మందులు, టీకాల పరిశ్రమలో భారతదేశానికే రాజధాని హైదరాబాద్, అత్యవసర ప్రాణరక్షక ఔషధాలు, కొత్త కొత్త టీకాలు, జీవోత్పత్తుల పరిశోధన, తయారీలలో కొత్త అవకాశాలు ఎన్నో వెల్లువెత్తాయి. ఈ రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం బాగా ఉంది. |
| 2. | ఐ.టి. హార్డ్‌వేర్ - జీవవైద్య సాధనాలు, ఎలక్ట్రానిక్స్, సెల్యులర్ కమ్యూనికేషన్లు, ఫాబ్‌లతో సహా. | హైదరాబాద్‌లో ఐ.టి. పెట్టుబడుల ప్రాంతాన్ని భారత ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించింది. దీనితో పాటు రెండు ఎలక్ట్రానిక్ వస్తూత్పత్తి సముదాయాలను కూడా ఆమోదించింది. జీవ వైద్య సాధనాలకు, వైద్య ఎలక్ట్రానిక్స్ కు ఆరోగ్య పరిశ్రమ అండదండలనిస్తుంది. |

| | | |
|---|---|---|
| 3. | ప్రెసిషన్ ఇంజనీరింగ్ - విమానయానం, గగన, రోదసి సంబంధమైన సాంకేతిక విషయాలు, రక్షణ పరిశ్రమలతో సహా | రక్షణ, వైమానిక సంస్థలు, రక్షణ పరిశోధన ప్రయోగ శాలలు పెద్ద సంఖ్యలో ఉండడంతో పాటు గగన రోదసి, జి.ఎం.ఆర్, ఎం.ఆర్.ఓలలో టాటా సంస్థలు అయిదు భారీ పెట్టుబడులు పెట్టాయి. రక్షణ రంగంలో 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చిన కారణంగా, ఆ రంగంలో భారీ పెట్టుబడులకు అవకాశాలు సిద్ధంగా ఉన్నాయి. |
| 4. | ఆహారోత్పత్తులు, పోషక సాధనాలు - పాడి ఉత్పత్తులు, కోళ్లు, మాంసం, మత్స్య ఉత్పత్తులతో సహా | కోళ్ల పరిశ్రమ, విత్తనాల వ్యాపారాలలో అగ్రగామి కావడమే కాక, వ్యవసాయోత్పత్తులలో కూడా తెలంగాణ ఒక పెద్ద ఉత్పత్తిదారు. వ్యవసాయోత్పత్తులకు కొత్త రూపమిచ్చి, జాతీయ ఆహారోత్పత్తి ఉద్యమంలో భాగస్వామి కావలసిన అవసరం సిద్ధంగా ఉంది. |
| 5. | ఆటోమొబైల్స్, రవాణా వాహనాలు, ఆటో-విడిభాగాలు, ట్రాక్టర్లు, వ్యవసాయ సాధనాలు | ఆటోమొబైల్ పరిశ్రమ సంబంధాలు ఇంజనీరింగ్‌కి చెందిన చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బాగా ఊత మిస్తాయి. ఎం అండ్ ఎం ట్రాక్టర్ కర్మాగారం, ఆటో-విడి భాగాలు ఎస్.ఎం.ఇలు వీటికి బాసటగా నిలుస్తాయని గుర్తించారు. |
| 6. | జౌళి, దుస్తులు, తోళ్లు, తోళ్లతో తయారయ్యే పాదరక్షలు, పర్సులు, సంచులు, కృత్రిమ నూలు కలిసే వస్త్రాలు, కాగితం, కాగితం ఉత్పత్తులు. | పొడుగు పింజ పత్తి ఉత్పత్తిలో తెలంగాణాది అగ్రగామి. కాగితం పరిశ్రమకు కావలసిన గట్టి పునాది ఈ రాష్ట్రంలో ఉంది. కాగితానికి, కాగితం ఉత్పత్తులకు గిరాకీ బాగా పెరుగుతున్న కారణంగా ఈ పరిశ్రమలకు అవకాశాలు విస్తృతంగా ఉన్నాయి. |
| 7. | ప్లాస్టిక్‌లు, పాలిమర్‌లు, రసాయనిక పదార్థాలు, పెట్రో-రసాయనాలు, గాజు, పింగాణీ పరిశ్రమలు | ప్లాస్టిక్కులు, పాలిమర్‌లు, దిగువ స్థాయి పెట్రో-రసాయన పరిశ్రమలు ప్రధానంగా ఎం.ఎస్.ఎం.ఇ రంగంలోకి వస్తాయి. ఇది విస్తృతంగా ఉపాధి కల్పించగల రంగం. |
| 8. | ఎఫ్.ఎం.సి.జి, గృహోపయోగ సాధనాలు | భారతదేశం నడిబొడ్డున నెలకొని ఉన్న రాష్ట్రంగా తెలంగాణ, రవాణా ఖర్చులను ఆదా చేయడానికి అనువుగా ఉంది. పరిశ్రమ ఖర్చులో రవాణా వ్యయం కీలక పాత్ర వహిస్తుందని అందరికీ తెలిసిన విషయమే. |
| 9. | ఇంజనీరింగ్ మరియు క్యాపిటల్ వస్తువులు - పోతపోసిన వస్తువులు, ఫౌండ్రీ, ఫెర్రోఎల్లాయెస్, ఇతర లోహపరిశ్రమలతో సహా | ఆటోమొబైల్, గగన-రోదసీ, పెట్రో-రసాయనాలు, గృహోపయోగ సాధనాలు, కాగితం, జౌళి రంగాలలో విలువను జోడించే ఉత్పత్తుల శ్రేణిని రాష్ట్రం సంపూర్ణంగా పుణికిపుచ్చుకోవాలి. |
| 10. | మణులు, ఆభరణాలు | సంప్రదాయకమైన ఉత్పత్తులకు వన్నెచిన్నెలు చేర్చడం ద్వారా, మణులు, ఆభరణాల తయారీలో కొత్తపుంతలు తొక్కడం ద్వారా స్థానిక నిపుణులకు, చేతి వృత్తుల వారికి ఎంతగానో అవసరమైన కొత్త అవకాశాలను ఇతోధికంగా కల్పించగలుగుతాం. |
| 11. | వ్యర్థాలను సద్వినియోగం చేసే విధానాలు, కాలుష్యాన్ని నివారించే సాంకేతిక ప్రక్రియలు. | వ్యర్థ నిర్వహణలో ఎస్.పి.వి/జె.వి ప్రయత్నాల ఆచరణాత్మక నమూనాలు తెలంగాణ రాష్ట్రానికి ఉన్నాయి. |
| 12. | పునరుత్పాదక విద్యుత్ వనరులు, సౌరశక్తి ఉత్పత్తి నిలయాలు | సంప్రదాయేతర, పునరుత్పాదక ఇంధన వనరులను నెలకొల్పడానికి బాగా అనువైన విస్తారమైన నేల ఈ రాష్ట్రంలో అందుబాటులో ఉంది. |
| 13. | ఖనిజ-ఆధారిత, కలప-ఆధారిత పరిశ్రమలు | రాష్ట్రంలో స్వల్పంగా లభిస్తున్న ఖనిజ సంపదలో అధిక భాగం ముడిరూపంలోనే ఎగుమతి అయిపోతోంది. ఇక్కడ జరిగే ప్రాసెసింగ్ చాలా తక్కువగా ఉంటోంది. |
| 14. | ప్రయాణ / సరుకుల రవాణా / నదీ రేవులు / కంటైనర్ డిపోలు | దేశం నడిబొడ్డున ఉన్న రాష్ట్రం కావడంతో ప్రయాణాలకు, రవాణాకు ప్రధాన కూడలిగా అభివృద్ధి చెందే అవకాశముంది. |

## ఎస్సీ/ ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేక సహకారం

రాష్ట్రంలోని ప్రస్తుత పారిశ్రామిక యూనిట్లలో ఎస్సీ/ ఎస్టీ పారిశ్రామికవేత్తల యాజమాన్యంలో ఉన్న వాటి నిష్పత్తి చాలా తక్కువగా ఉంది. వ్యవస్థాగతమైన అవరోధాలు అనేకం ఉండడమే దీనికి కారణం.

సామాజిక న్యాయం హామీ పునాదిగా నూతన రాష్ట్రమైన తెలంగాణ ఏర్పాటయినందున, నూతన తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక విధానం ఎస్సీ/ ఎస్టీల్లో పారిశ్రామికవేత్తలను పెంచడానికి ఉద్దేశించిన అనేక అదనపు సహకార చర్యలను టిఎస్-ప్రైడ్-- తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ రాపిడ్ ఇన్క్యూబేషన్ ఆఫ్ దళిత్ ఎంటర్‌ప్రెన్యూర్స్ పథకం కింద చేపడుతోంది.

## పారిశ్రామిక భూమి నిధి

- పారిశ్రామిక వినియోగం కోసం సుమారు 2.50 లక్షల ఎకరాల బంజరు భూమిని గుర్తించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టిఎస్ఐఐసి) సహకారంతో ఓ పారిశ్రామిక ల్యాండ్ బ్యాంక్ అభివృద్ధి కానుంది.
- కీలక రంగాలకు పత్ర్యేకమైన పారిశ్రామిక పార్కుల్ని టిఎస్ఐఐసి ఏర్పాటు చేస్తుంది.
- రెడ్ కేటగిరీ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి సురక్షితమైన ప్రదేశాల్లో ప్రత్యేకమైన పారిశ్రామిక పార్కుల ఏర్పాటు.
- బహుళ-రంగ కార్యకలాపాలకు, సాధారణ వస్తూత్పత్తి యూనిట్లకు కూడా కొన్ని పారిశ్రామిక పార్కులు అనుమతిస్తాయి.

## పారిశ్రామిక జలాలు

- అందుబాటులో ఉన్న, నూతన సాగునీటి పనరుల నుంచి 10%ని పారిశ్రామిక వినియోగం కోసం ప్రత్యేకంగా రిజర్వు చేస్తారు. ప్రతిపాదిత వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ద్వారా నీటి లైన్లను వాటికి సమకూరుస్తారు.

## పారిశ్రామిక విద్యుత్

- ప్రతి పారిశ్రామిక పార్కులో నాణ్యమైన విద్యుత్, నిరంతరాయమైన విద్యుత్ సరఫరాలను ఏర్పాటు చేస్తారు.
- విద్యుత్ ఎక్స్చేంజిలు ఎంఎస్ఎంఇలతో సహా అన్ని రకాల పరిశ్రమలకూ అందుబాటులో ఉండేందుకు “ఓపెన్ యాక్సెస్” విద్యుత్ ఆంక్షలను తొలగించడం జరుగుతుంది.
- పారిశ్రామిక అవసరాల కోసం సంప్రదాయేతర ఇంధన వినియోగానికి ప్రోత్సాహం లభిస్తుంది.
- భారీ పారిశ్రామిక పార్కుల్లో ప్రైవేట్ మర్చెంట్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సహకారం లభిస్తుంది.
- చైనా, సింగపూర్‌లకు చెందిన పెట్టుబడిదారుల ద్వారా 300-500 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లు రానున్నాయి. పారిశ్రామిక వినియోగదారులూ, విద్యుదుత్పత్తి దారులూ ధరల విషయంలో సంప్రతింపులు జరుపుకోవచ్చు. రవాణా, ట్రాన్స్‌మిషన్ బాధ్యతలను టిఎస్‌ట్రాన్స్‌కో నిర్వర్తిస్తుంది.

## ప్రైవేటు భూముల్లో పారిశ్రామిక అభివృద్ధి

## ప్రభుత్వ విధులు

- హెచ్ఎండిఎ, తెలంగాణలోని ఇతర పట్టణాభివృద్ధి సంస్థల స్థల వినియోగ ప్రణాళికలో పారిశ్రామిక వినియోగం కోసం గుర్తించిన ప్రైవేటు భూములను పరిశ్రమలకు కేటాయించడాన్ని ప్రోత్సహిస్తుంది.
- టిఎస్ఐఐసి ప్రమాణాల మేరకు చక్కని మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయడం కోసం తమ భూముల్ని సమకూర్చుకునే ప్రైవేటు పారిశ్రామిక పార్కుల డెవలపర్లను ప్రోత్సహిస్తుంది.
- భూమి వినియోగం తీరును మార్చుకోడానికి అనుమతిస్తుంది.

## నైపుణ్యాల అభివృద్ధి

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి మిషన్ పరిధి కింద సాధారణంగానూ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ చేపట్టిన తెలంగాణ రాష్ట్ర యాక్సెలరేటెడ్ ఎస్ఎస్ఐ నైపుణ్యాల శిక్షణ (టి-అసిస్ట్) కార్యక్రమం ద్వారానూ పారిశ్రామిక రంగ ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది.

## రాష్ట్రం విధులు

- ప్రవేశ స్థాయి ఉద్యోగాలను పొందడానికి వీలైన శిక్షణను యువతకు అందిస్తుంది. పరిశ్రమల అవసరాలకోసం నిపుణులైన ఉద్యోగులు అందుబాటులో ఉండేలా చూస్తుంది.
- పరిశ్రమలను సంప్రదించి, వాటి అవసరాలకు సరిపడేలా ప్రస్తుత ఉద్యోగులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి కార్యక్రమాలను రూపొందిస్తుంది.
- మెగా పరిశ్రమలు తమ పారిశ్రామిక పార్కుల్లోనే సొంతంగా నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది.
- నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో, అమలులో పారిశ్రామిక ప్రాంత సొసైటీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

టి-ఐడియా (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్). తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకోసం ఈ క్రింది అంశాల్లో టి-ఐడియా (తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్ అడ్వాన్స్‌మెంట్) ప్రోత్సాహక పథకం కింద ప్రోత్సాహకాలను అందించాలని నిర్ణయించింది.

- స్టాంప్ డ్యూటీ తిరిగి చెల్లింపు
- భూమి ధరలో తగ్గింపు
- భూ మార్పిడి ధర
- విద్యుత్ ఖర్చులు తిరిగి చెల్లింపు
- పెట్టుబడి సబ్సిడీ
- వ్యాట్ తిరిగి చెల్లింపు
- వడ్డీ సబ్సిడీ
- మొదటి తరం పారిశ్రామికవేత్తలకోసం మూలధన సమీకరణ
- శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధి ఖర్చు తిరిగి చెల్లింపు
- నాణ్యత/ పేటెంట్లకు సహకారం
- స్వచ్ఛమైన ఉత్పాదక చర్యలు
- మౌలిక సదుపాయాల అభివృద్ధి ఖర్చులు తిరిగి చెల్లింపు

## పారిశ్రామిక కారిడార్లు

- హైదరాబాద్ నుంచి వరంగల్‌ను కలిపే ముఖ్యమైన జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారుల పొడవునా పారిశ్రామిక కారిడార్లను ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది.
- అభివృద్ధి చేసిన కారిడార్లు ఆ తర్వాత డిఎంఐసి లేదా పిసిపిఐఆర్ లాంటి ప్రత్యేక పెట్టుబడి మండళ్ళకు నమూనాలుగా నిలుస్తాయి.
- రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రాన్నీ హైస్పీడ్ రైలు, రోడ్డు వ్యవస్థతో అనుసంధానించడం జరుగుతుంది.

  ప్రాథమికంగా అభివృద్ధి చేయబోయే పారిశ్రామిక కారిడార్లు: (ఎ) హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్, (బి) హైదరాబాద్-నాగపూర్ పారిశ్రామిక కారిడార్, (సి) హైదరాబాద్-బెంగళూర్ పారిశ్రామిక కారిడార్. రెండో దశలో, అభివృద్ధి చేసే కారిడార్లలో, (ఎ) హైదరాబాద్- మంచిర్యాల పారిశ్రామిక కారిడార్, (బి) హైదరాబాద్- నల్గొండ పారిశ్రామిక కారిడార్, (సి) హైదరాబాద్- ఖమ్మం పారిశ్రామిక కారిడార్ ఉంటాయి.

## హైదరాబాద్ పరిశోధన, ఆవిష్కరణ సర్కిల్ (ఆర్.ఐ.సి.హెచ్)

నూతనావిష్కరణలనూ, పారిశ్రామిక స్ఫూర్తినీ పెంపొందించే నిమిత్తం పరిశ్రమకూ, పరిశోధన/విద్యా సంస్థలకూ, వెంచర్ క్యాపిటలిస్టులకూ మధ్య అవసరమైన అనుసంధానతను ఏర్పాటు చేయడం కోసం 'విపణి పరిశోధన' నిధిని అందించడం జరుగుతుంది.

## 2014-15 కోసం నిర్దిష్టమైన చర్యలు

విధాన చట్టాల్లో పొందుపరచిన ఇతర ఆదేశాలకు అదనంగా, క్రింద పేర్కొన్న నిర్దిష్ట చర్యలను తీసుకునే యోచన ఉంది.

- వ్యర్థాల నిర్వహణతో సహా చక్కగా అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలతో నూతన ఫార్మా సిటీ, కెమికల్ సిటీ.
- హైదరాబాద్- వరంగల్ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి.
- తెలంగాణకు జౌళి కేంద్రంగా వరంగల్ అభివృద్ధి.
- ఫుడ్ ప్రాసెసింగ్, విత్తన ఉత్పత్తికి చొరవ.
- పారిశ్రామిక పార్కులకు అనుబంధంగా మినీ పారిశ్రామిక టౌన్‌షిప్‌లు.
- దళిత పారిశ్రామికవేత్తలకు నేరుగా రుణ సౌకర్యాలు.
- ఒక వెంచర్ క్యాపిటల్/ ఏంజిల్ ఫండ్ సృష్టి.
- పారిశ్రామిక పెట్టుబడులు, ఉత్పుత్తులపై అంతర్రాష్ట్ర వ్యాట్ హేతుబద్ధీకరణ.
- కార్మిక చట్టాలతో సహా అన్ని పాతకాలపు పారిశ్రామిక రంగ నియంత్రణలపై సమీక్ష, సంస్కరణ.

## షెడ్యూల్డు కులాలు / షెడ్యూల్డ్ తెగల యాజమాన్యంలోని పరిశ్రమలు

ఎస్సీ/ ఎస్టీ యాజమాన్యంలోని పరిశ్రమలంటే, వారి పూర్తి యాజమాన్యంలో ఏర్పాటైనవి లేదా వారికి స్థిరంగా 100% వాటా ఉన్న భాగస్వామ్య/ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు. ఈ విధానం ద్వారా ప్రోత్సాహకాలను తమకోసం వినియోగించుకోవడం కోసం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగల పారిశ్రామికవేత్తలు వివిధ తరహా కార్యకలాపాలను సాగించే సంస్థల్ని ఏర్పాటు చేసుకోవచ్చు.

- పారిశ్రామిక వినియోగం నిమిత్తం కొనుగోలు చేసిన భూమి కోసం పరిశ్రమ చెల్లించిన స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీల మొత్తం 100% తిరిగి చెల్లింపు.
- భూమి/ షెడ్/ భవనాల లీజు, అలాగే తనఖా, తాకట్టులపై 100% స్టాంప్ డ్యూటీ తిరిగి చెల్లింపు.
- పారిశ్రామిక వాడలు/ పారిశ్రామిక పార్కుల్లో భూమి విలువపై రూ. 10.00 లక్షల పరిమితితో 33.33% తగ్గింపు.
- పారిశ్రామిక వినియోగానికి 25% భూమి మార్పిడి ఛార్జీలు.
- వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 5 ఏళ్ళ పాటు యూనిట్‌కు రూ. 1.50 చొప్పున స్థిర విద్యుత్ ధర తిరిగి చెల్లింపు.
- తొలితరం పారిశ్రామికవేత్తలు సూక్ష్మ తరహా పరిశ్రమల్ని ఏర్పాటు చేయడానికి వీలుగా యంత్రాల కొనుగోలు ఖర్చులో మూలధన సమీకరణలో 20% సహాయం. దీనిని అర్హమైన పెట్టుబడి సబ్సిడీ నుంచి తగ్గిస్తారు.
- ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలు ఏర్పాటు చేసే సూక్ష్మ, చిన్న తరహా పరిశశ్రమలకు స్థిర మూలధన పెట్టుబడిలో 35 శాతం సబ్సిడీని, రూ. 75.00 లక్షల పరిమితికి లోబడి అందజేస్తారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసే యూనిట్లకు అదనంగా 5% పెట్టుబడి సబ్సిడీని, రూ. 75.00 లక్షల పరిమితికి లోబడి అందజేస్తారు.
- చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలకు అవి వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 5 ఏళ్ళ కాలవ్యవధిలో 100% నికర వ్యాట్/ సిఎస్‌టి లేదా రాష్ట్ర వస్తు, సేవల పన్ను (ఎస్‌జిఎస్‌టి) తిరిగి చెల్లింపు.
- మధ్య తరహా పరిశ్రమలు వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 7 ఏళ్ళ కాల పరిమితి లేదా 100% స్థిర మూలధన పెట్టుబడి వసూలు కావడాల్లో ఏది ముందు పూర్తయితే అప్పటివరకూ 75% నికర వ్యాట్/ సిఎస్‌టి లేదా రాష్ట్ర వస్తు, సేవల పన్ను (ఎస్‌జిఎస్‌టి) తిరిగి చెల్లింపు.
- భారీ స్థాయి పరిశశ్రమలు వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 7 ఏళ్ళ కాల పరిమితి లేదా 100% స్థిర మూలధన పెట్టుబడి వసూలు కావడాల్లో ఏది ముందు పూర్తయితే అప్పటివరకూ 50% నికర వ్యాట్/ సిఎస్‌టి లేదా రాష్ట్ర వస్తు, సేవల పన్ను (ఎస్‌జిఎస్‌టి) తిరిగి చెల్లింపు.
- నూతన సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల స్థిర మూలధన పెట్టుబడిపై పావలా వడ్డీ పథకం కింద తీసుకున్న నియమితకాల

రుణాలపై వాణిజ్య ఉత్పత్తి ఆరంభించిన తేదీ నుంచి 5 ఏళ్ళ పాటు ఏడాదికి కనిష్ఠంగా 3% నుంచి గరిష్ఠంగా 9% వరకూ వడ్డీ రాయితీ. ఈ పథకం కింద సేవా రంగంలో ఏర్పాటు చేసే యూనిట్లకు కూడా ఈ ప్రయోజనం వర్తిస్తుంది.

- నైపుణ్యాలను పెంచుకోవడానికీ, స్థానిక కార్మికులకు శిక్షణ ఇవ్వడానికీ అయ్యే ఖర్చులో వ్యక్తికి రూ. 2,000 పరిమితికి లోబడి 50% తిరిగి చెల్లింపు.
- సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు నాణ్యత ధ్రువీకరణకు/ పేటెంట్ల నమోదుకు అయ్యే ఖర్చులో రూ. 3.00 లక్షల పరిమితికి లోబడి 50% సబ్సిడీ.
- నిర్దిష్టమైన పారిశుధ్య ఉత్పత్తి చర్యలపై రూ. 5.00 లక్షల పరిమితికి లోబడి 25% సబ్సిడీ.
- షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసే సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ఐఐడిఎఫ్ ద్వారా మౌలిక సదుపాయాల ఖర్చులో 50% సమకూరుస్తూ పరిశ్రమల స్వయంసమృద్ధి యూనిట్ల ముంగిటికే రోడ్లు, విద్యుత్, నీరు లాంటి మౌలిక సదుపాయాలను సమకూర్చడం జరుగుతుంది. దీని పరిమితి రూ. 1.00 కోటి. కాగా అది ఈ అంశాలకు లోబడి ఉంటుంది: (ఎ) పరిశ్రమ ప్రదేశం ప్రస్తుతం నడుస్తున్న పారిశ్రామిక వాడలు/ఐడిఎలకు 10 కిలోమీటర్లకు మించిన దూరంలో ఉండాలి. కేటాయించడానికి ఖాళీ భూమి/షెడ్లు ఉండాలి. (బి) పరిశ్రమలో పెట్టిన అర్హమైన స్థిర మూలధన పెట్టుబడిలో మౌలిక సదుపాయాల ఖర్చు 15%కి పరిమితమై ఉండాలి, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసే యూనిట్ల విషయంలో సమకూర్చే మౌలిక సదుపాయాల ఖర్చును 50% నుంచి 75%నికి పెంచుతారు.
- తవ్వకం యంత్రాలద్వారా చేపట్టే కార్యకలాపాలకు సంబంధించి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన పారిశ్రామికవేత్తల విషయంలో అర్హత కింద ప్రత్యేకమైన సందర్భం కింద పరిగణిస్తారు. సేవా కార్యకలాపాల కింద ప్రోత్సాహకాన్ని అందిస్తారు.

## జాతీయ పెట్టుబడి, వస్తూత్పత్తి మండళ్ళు (ఎన్ఐఎంజెడ్)

మెదక్ జిల్లాలో 5,000 నుంచి 6,000 ఎకరాల్లో జాతీయ పెట్టుబడి, వస్తూత్పత్తి మండలి (ఎన్ఐఎంజెడ్) ఏర్పాటు చేసేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జాతీయ ఉత్పాదక విధానంలో ఎన్ఐఎంజెడ్ భావన ఒక భాగం. జిడిపిలో ఉత్పాదక రంగ జిడిపిని 6% నుంచి 25%కి పెంచడం దీని లక్ష్యం. అధునాతనమైన మౌలిక సదుపాయాలతో, జోనింగ్ మీద ఆధారపడే భూ వినియోగంతో, పరిశుభ్రమైన, ఇంధన సామర్థ్యం కలిగిన సాంకేతికతల వినియోగంతో, అవసరమైన సామాజిక మౌలిక సదుపాయాలు, నైపుణ్య అభివృద్ధి సౌకర్యాలతో సమగ్ర పారిశ్రామిక టౌన్‌షిప్‌లుగా ఎన్ఐఎంజెడ్ అభివృద్ధి చేస్తుంది. ప్రతి ఎన్ఐఎంజెడ్‌లో అంచనా పెట్టుబడి సుమారు రూ.30,000 కోట్లుగా భావిస్తున్నారు. కాగా ప్రతి ఎన్ఐఎంజెడ్ ఉద్యోగ కల్పన సామర్థ్యం 3 లక్షలని అంచనా. జాతీయ పెట్టుబడి, ఉత్పాదక మండలి ఏర్పాటు కోసం మెదక్ జిల్లాలో భూ సేకరణ జరుగుతోంది.

## పారిశ్రామిక మౌలిక సదుపాయాలు

### ప్రత్యేక ఆర్థిక మండళ్ళు

ఐటి/ఐటిఇలు, ఏరోస్పేస్, బయోటెక్, ఫార్ములేషన్స్ రంగాల్లో ఆరు సెజ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి చేశారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటి పార్కుల్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చొరవలో భాగంగా, వరంగల్ జిల్లా మడికొండ (గ్రామం)లో సెజ్‌ను రాష్ట్ర ఐఐసి అభివృద్ధి చేసింది.

### నూతన పారిశ్రామిక పార్కుల ఏర్పాటు కోసం భూమి గుర్తింపు

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టిఎస్ఐఐసి) 10 జిల్లాల్లో సుమారు 74133.18 ఎకరాల్లో విస్తరించి ఉన్న 150 పారిశ్రామిక పార్కులను గుర్తించింది. ప్రస్తుతం ఈ పార్కుల్లో 13165 యూనిట్లు (పరిశ్రమలు) ఉనికిలో ఉన్నాయి. మొత్తం 74133.18 ఎకరాల భూమిలో పరిశ్రమలకు కేటాయించడానికి 917.30 ఎకరాల భూమి అందుబాటులో ఉంది.

టిఎస్ఐఐసి 2.5 లక్షల ఎకరాల వ్యర్థమైన/ బంజరు భూమిని సర్వే చేసి, పారిశ్రామిక వినియోగానికి సిద్ధంగా ఉన్న 234064.35 ఎకరాలను గుర్తించింది.

## మహిళా పారిశ్రామిక పార్కు అభివృద్ధి

మహిళా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసేందుకు మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల హరిత పారిశ్రామిక పార్కులో, మెదక్ జిల్లాలోని సుల్తాన్‌పూర్‌లో 50 ఎకరాలను కేటాయించింది. అంతేకాకుండా, తెలంగాణలోని ప్రతి జిల్లాలో పచ్చదనం కోసం చేపట్టే కార్యకలాపాలకోసం మహిళా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలనే నిర్ణయాన్ని కూడా సంస్థ తీసుకుంది.

## వాణిజ్యానికి, ఎగుమతులకు ప్రోత్సాహం

సిఐఎస్ డైరెక్టర్ జనరల్ వెల్లడించిన వాణిజ్య గణాంకాల ప్రకారం, ఎగుమతులకు సంబంధించి దేశంలోని అగ్రశ్రేణి పది రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. అలాగే, ఐటిఇ అండ్ సి విభాగం, ఎస్‌టిపిఐ ఎగుమతుల గణాంకాల ప్రకారం, సాఫ్ట్‌వేర్, సామర్థ్య సేవారంగం తదితరాల్లో భారీ ఎగుమతిదారుగా ఘనతను దక్కించుకుంది. 2013-14 సంవత్సరంలో రూ. 57,000 కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్, సామర్థ్య సేవలను రాష్ట్రం ఎగుమతి చేసింది.

## గనులు మరియు భూగర్భ వనరులు

రాష్ట్ర వృద్ధికి ఖనిజాలు భారీస్థాయిలో దోహదపడుతున్నాయి. ప్రణాళికాబద్ధంగా సహజవనరులను వెలికితీయడం మీదా, చట్టపరమైన కీలక సమస్యల్ని పరిష్కరించడంతో పాటుగా, ఒక స్వేచ్ఛాయుతమైన పాలనా విధానంతో వృద్ధిని వేగవంతం చేసి, తద్వారా గనుల రంగంలో సర్వతోముఖాభివృద్ధి సాధించడం కోసం జాతీయ గనుల విధానం, 2008కి అనుగుణంగా లక్ష్యాలనూ, వ్యూహాలనూ రూపొందించడంపై రాష్ట్రం దృష్టి కేంద్రీకరించింది.

## గనుల తవ్వకం

బంగారం, వజ్రాలు, సాధారణ లోహాల కోసం 3 భూపరిశీలన పర్మిట్లు, 18 ఖనిజాన్వేషణ లైసెన్సులు, ప్రధాన లోహాల (పారిశ్రామిక లోహాల) కోసం 521 తవ్వకం లీజులు, గ్రానైట్ పలకను కోసి, మెరుగుపెట్టేందుకు 1186 క్వారీ లైసెన్సులు, చిన్నతరహా ఖనిజాల (భవన నిర్మాణ ఖనిజాల)కోసం 1429 క్వారీ లైసెన్సులను వరుసగా 535805 హెక్టార్లు, 5633 హెక్టార్లు, 79478 హెక్టార్లు, 2764 హెక్టార్లు, 3611 హెక్టార్ల మేర జారీ చేయడం జరిగింది.

బొగ్గు, సున్నపురాయి గనుల తవ్వకాలు భారీ తరహా వాణిజ్య రంగం కిందికి వస్తాయి, గ్రానైట్, డోలోమైట్, క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్, క్లేస్, బైరెట్స్ తదితరాలు సెమీ యాంత్రీకృత మధ్యతరహా రంగం కిందికి వస్తాయి. మిగిలిన ఖనిజాలు సెమీ వాణిజ్య చిన్న తరహా రంగం కిందికి వస్తాయి. దాదాపు 90% గనులు చిన్న తరహా రంగం కింద, మిగిలినవి మధ్య, భారీ తరహా రంగాల కింద ఉన్నాయి.

## ఖనిజాలు, పరిశ్రమలపై దృష్టి

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు భారీ, మధ్య తరహా ఖనిజ ఆధారిత రంగాలు పరిశ్రమలను ఏర్పాటు చేశాయి. సిమెంట్, ఉక్కు, స్పాంజి ఐరన్, ఫెర్రో-ఎల్లాయిస్, గాజు, సిరామిక్స్, రిఫ్రాక్టరీలు, రసాయనాలను ఉత్పత్తి చేసేందుకు గ్రానైట్, మార్బుల్, సున్నపురాయి కోత, పాలిషింగ్ యూనిట్లు, పలకలను కోసే యునిట్లు, రత్నాలను కోసి, సానపెట్టే యూనిట్లు, గ్రానైట్ విశిష్ట నిర్మాణ యూనిట్లు, పల్వరైజింగ్ యూనిట్లు, స్టోన్ క్రషర్లు, మొజాయిక్, సిరామిక్ పెంకుల యూనిట్లు, సున్నపు బట్టీలు, ఇసుక తయారీ యూనిట్లు వీటిలో ఉన్నాయి.

వృద్ధికి చోదకశక్తుల్లో ఒకటిగా గనుల రంగాన్ని గుర్తించడం జరిగింది. గనుల రంగంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించడం కోసం దృష్టి కేంద్రీకరించాల్సిన పరిశ్రమగా దీన్ని గుర్తించారు. ఈ క్రమంలో సిమెంట్, థర్మల్ ప్లాంట్లు, గ్రానైట్‌ను కోసి, మెరుగుపెట్టడం, ఉక్కు, స్పాంజి ఐరన్ లాంటి పరిశ్రమలకోసం సున్నపురాయి, బొగ్గు, ఇనుప ఖనిజం, వజ్రాలు, డోలోమైట్, యురేనియం, గార్నెట్, గ్రానైట్ లాంటి ఖనిజాలను ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సినవిగా గుర్తించారు.

## ఖనిజాల ఉత్పత్తి, విలువ

వివిధ పరిశ్రమలను ప్రోత్సహించడం వల్ల, ఖనిజ ఆధారిత ఉత్పత్తుల తయారీ వల్లా ఖనిజాల వినియోగం పెరిగింది. రాష్ట్రం సుమారు 33 మిలియన్ టన్నుల పారిశ్రామిక ఖనిజాలనూ, 50 నుంచి 55 టన్నుల బొగ్గునూ, 54 మిలియన్ క్యూబిక్ మీటర్ల పరిమాణాత్మక రాళ్లూ, భవన నిర్మాణ సామగ్రినీ ఉత్పత్తి చేస్తోంది.

స్థిరమైన అభివృద్ధి కోసం మైనింగ్ జోన్లుగా ప్రకటించడానికి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, మెదక్ జిల్లాల్లోని ప్రత్యేక మైనింగ్ జోన్లను గుర్తించారు. భౌగోళికంగా ఖనిజాల విస్తరణ, వినియోగానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ దిగువన అందజేశాం:

**పట్టిక 44 : రాష్ట్రంలో ఖనిజసంపద విస్తరణ, వినియోగం తీరుతెన్నులు**

| ప్రధాన ఖనిజాలు | విస్తరణ | ఖనిజాధార పరిశ్రమలు |
|---|---|---|
| అమెథిస్ట్ | మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, వరంగల్ | ఆభరణాలు |
| బరైట్స్ | ఖమ్మం | డ్రిల్లింగ్, పెయింట్లు, టైర్ల ఫిల్లర్, రబ్బరు వస్తువులు, కాగితం, రసాయనిక పదార్థాలు |
| ఫైర్ క్లే | ఆదిలాబాద్ | రిఫ్రాక్టరీ, ఫెర్రో-ఎల్లాయెస్ |
| బొగ్గు | ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ కరీంనగర్ | ఇనుము, ఉక్కు, థర్మల్ విద్యుత్ కర్మాగారాలు, సిమెంట్, రైల్వేలు, ఇళ్లలో వంట ఇంధనం |
| కొరండమ్ | ఖమ్మం | ఎబ్రేసివ్‌లు, ఆభరణాలు |
| డోలొమైట్ | ఖమ్మం | ఇనుము, ఉక్కు, ఫెర్రో ఎల్లాయెస్, ఎరువులు, గాజు, ఫౌండ్రీ, సౌందర్య సాధనాలు |
| ఫెల్డ్‌స్పార్ | మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం | సెరామిక్స్, గాజు, అబ్రేజివ్, ఎనామెల్స్, విద్యుత్, రిఫ్రాక్టరీలు |
| ఫుల్లర్స్ ఎర్త్ | రంగారెడ్డి | వంటనూనెల రంగు తొలగించే సాధనం, చమురుశుద్ధి కర్మాగారాలు |
| ముడి ఇనుము, హెమటైట్, మాగ్నెటైట్ | వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ | ఉక్కు, పెల్లటైజేషన్, స్పాంజ్ ఐరన్, పిగ్ ఐరన్ |
| క్యానైట్ | ఖమ్మం | అబ్రేజివ్, రిఫ్రాక్టరీ |
| లాటరైట్ | మహబూబ్‌నగర్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ | సిమెంట్ |
| సున్నపురాయి | రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ | సిమెంటు, కార్బైడ్, ఇనుము, ఉక్కు, సోడాయాష్, రసాయనాలు, చక్కెర, కాగితం, ఎరువులు, గాజు |
| మాంగనీస్ | ఆదిలాబాద్ | పొటాషియం పర్మాంగనేట్, ఫెర్రోఎల్లాయెస్, ఇనుము, ఉక్కు, బ్యాటరీలు, రసాయనిక పదార్థాలు, పింగాణీ, గాజు పరిశ్రమ |
| క్వార్ట్జ్ | రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఖమ్మం నిజామాబాద్ | గాజు, ఫౌండ్రీ, ఇనుము, ఉక్కు, రిఫ్రాక్టరీ, పింగాణీ, విద్యుత్, అబ్రేసివ్, పెయింట్లు, ఎలక్ట్రానిక్స్ |
| స్టియటైట్ | ఖమ్మం | కాగితం, జౌళి, రబ్బర్, పింగాణీ, సబ్బులు, డిటర్జెంట్‌లు, ఎరువులు |
| స్టోవింగ్ శాండ్ | ఖమ్మం | సిరామిక్స్, ఫౌండ్రీ, రిఫ్రాక్టరీ |
| అల్పఖనిజాలు | వివిధ ప్రాంతాలలో అక్కడక్కడ | ఖనిజాధార పరిశ్రమలు |
| చలువరాయి | ఖమ్మం | ఫ్లోరింగ్, అలంకరణ సాధనం, ప్యానళ్లు |
| సున్నపురాయి పలకలు | రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ | ఫ్లోరింగ్, కాలిబాటలు |
| గ్రానైట్ | వరంగల్, ఖమ్మం, కరీంనగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, నిజామాబాద్ | కటింగ్ అండ్ పాలిషింగ్ పరిశ్రమ, అలంకరణ, ప్యానళ్లు విశిష్ట నిర్మాణాలు, గచ్చు, ప్యానళ్లు |
| కట్టడపు రాళ్లు | తెలంగాణాలోని అన్ని జిల్లాలు | నిర్మాణ సామగ్రిలో భాగంగా నిర్మాణ ప్రయోజనాల నిమిత్తం |

## చేనేత, జౌళి

చేనేత, జౌళి పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం విశేషమైన ప్రాధాన్యం ఇస్తోంది. ఈ పరిశ్రమకు భారత ప్రభుత్వం కూడా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తోంది.

## ప్రాథమిక సొసైటీలు

రాష్ట్రంలో సుమారు 200 ప్రాథమిక చేనేత కార్మికుల సహకార సొసైటీలు ఉన్నాయి. రాష్ట్రంలోని 41,491 మంది చేనేత కార్మికులు వీటిలో సభ్యులుగా ఉన్నారు. 2012-13లో ఈ సొసైటీలద్వారా రూ. 5,923 లక్షల విక్రయాలు జరిగాయి.

కార్యక్రమాలపరంగా, ఈ శాఖ పథకాలు, కార్యక్రమాలు సహకార సంఘాల సంస్థాగత వ్యవస్థను క్రమబద్ధీకరించడం, మార్కెటింగ్ మద్దతు, నిర్వహణకు పెట్టుబడి సమకూర్చడం, మగ్గాల ఆధునికీకరణ, శిక్షణలు, చేనేత కార్మికుల సంక్షేమం, విద్యుత్ సబ్సిడీ లాంటి ప్రోత్సాహకాలు తదితర అంశాలమీద దృష్టి పెడుతుంది.

## దుస్తుల ఎగుమతి పార్కులు, టెక్స్‌టైల్ పార్కులు

తెలంగాణ రాష్ట్రంలో ఈ క్రింది పార్కుల్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

- దుస్తుల ఎగుమతి పార్కు, గండ్లపోచంపల్లి, రంగారెడ్డి జిల్లా
- టెక్స్‌టైల్ పార్కు, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లా
- టెక్స్‌టైల్ పార్కు, పాశమైలారం, మెదక్ జిల్లా
- టెక్స్‌టైల్ పార్కు, మల్కాపూర్, నల్గొండ జిల్లా

సూరత్, కోయంబత్తూర్ తరహాలో వరంగల్ నగర శివార్లలో ఓ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు ప్రతిపాదన ఉంది.

## పారిశ్రామిక సంబంధాలు

పరిశ్రమల వృద్ధికి, అభివృద్ధికి ముందుగా అవసరమైన అంశం పారిశ్రామిక ప్రశాంతత. యజమానులు, కార్మికుల మధ్య తలెత్తే పారిశ్రామిక వివాదాల కారణంగా పనులు ఆగిపోవడం, కొంతకాలం పాటు వరుసగా పనిదినాలు వ్యర్థమవడం లాంటివి పరిశ్రమల్లోని కార్మిక- యాజమాన్య సంబంధాలకు ముఖ్యమైన సూచిక అవుతుంది. వివాదాలను సామరస్యంగా పరిష్కరించేందుకు, పారిశ్రామిక శాంతిని పెంపొందించేందుకు, సానుకూలమైన పని వాతావరణాన్ని నెలకొల్పేందుకు తన సర్దుబాటు యంత్రాంగం ద్వారా ప్రభుత్వం ప్రయత్నాలు చేపడుతుంది. పరిశ్రమల్ని మరింత పోటీతత్వంతో తీర్చిదిద్దేందుకు శాఖకు చెందిన సర్దుబాటు అధికారులు ఉత్పాదకత-సంబంధమైన రాజీ కోసం ప్రయత్నాలు చేస్తారు.

## సేవల రంగం

అభివృద్ధి చెందుతున్న దశలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతోంది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి ఊపందుకుంటున్న దశలో, పారిశ్రామిక వాటా కన్నా సేవల రంగం అందించే వాటా వేగంగా పెరుగుతోంది. సేవా రంగం "స్పర్శకందని ఉత్పత్తులైన" సేవలను అందిస్తోంది. విస్తారమైన వ్యవసాయ, పారిశ్రామిక రంగ విభాగాలను మినహాయిస్తే రాష్ట్రం ఆర్థిక వ్యవస్థలోని అన్ని సామాజిక, ఆర్థిక రంగాల్లోకి ఈ సేవలు విస్తరించాయి. వ్యవసాయ లేదా పారిశ్రామిక వస్తువులను ఉత్పత్తి చేయడానికి అవసరమైనవాటికన్నా సాపేక్షంగా తక్కువ సహజ మూలధనం, ఎక్కువ మానవ వనరుల పెట్టుబడి ఈ సేవలను ఉత్పత్తిచేసేందుకు అవసరమవుతాయి.

సేవల రంగ సమ్మేళనంలో వాణిజ్యం, హోటళ్ళు, రెస్టారెంట్లు, రవాణా, నిల్వ, కమ్యూనికేషన్లు, బ్యాంకింగ్, బీమా, రియల్ ఎస్టేట్, నివాస స్థలాల యాజమాన్యం, వ్యాపార సేవలు, రైల్వేలు, పౌర పరిపాలన, ఇతర సేవల్లాంటి ఉప రంగాలు ఉంటాయి. అభివృద్ధి మార్గం నుంచి, ఆర్థికరంగంలోని వ్యవస్థాగతమైన మార్పు నుంచీ సేవల ద్వారా లభించే వృద్ధి స్పష్టంగా కనిపిస్తుంది. ఓ ఆర్థిక వ్యవస్థ తాలూకు భౌతికమైన ఉత్పాదకత నిర్మాణం, సమ్మేళనంలో మార్పుల ద్వారా వ్యవస్థాగత మార్పును వివరించవచ్చు. 2014-15లో వాస్తవ కోణంలో జిఎస్‌డిపిలో ఆకర్షణీయమైన 57.1 శాతం వాటాను అంచనా వేస్తున్నందున, రానున్న సంవత్సరాల్లో ఆర్థిక వ్యవస్థలో ప్రధానమైన విస్తృత రంగంగా సేవల రంగం కొనసాగనుంది. గత దశాబ్ద కాలంగా 9 శాతానికి మించిన పటిష్టమైన వార్షిక సగటు వృద్ధి రేటును ఈ రంగం నమోదు చేసింది.

## సేవల రంగం వాటా

2014-15 సంవత్సరానికి సంబంధించి ప్రస్తుత ధరల ప్రకారం సేవల రంగ సమ్మేళనాన్ని ఆ రంగం తాలూకు వివిధ విభాగాల కింద చూసినట్టయితే, ముందస్తు అంచనాల మేరకు రియల్ ఎస్టేట్, నివాస స్థలాల యాజమాన్యం, వ్యాపార సేవలు 15.6 శాతం వాటాతో అగ్రగామి ఉప రంగంగా నిలుస్తున్నాయి. 13.1 శాతంతో "వాణిజ్యం, హోటళ్ళు, రెస్టారెంట్లు", 9 శాతంతో ఇతర సేవలు, 6.6 శాతంతో బ్యాంకింగ్, బీమా, కమ్యూనికేషన్లు, 6.3 శాతంతో ఇతర పద్ధతులద్వారా రవాణా, నిల్వ, 4.6 శాతంతో పౌర పరిపాలన, 1.5 శాతంతో కమ్యూనికేషన్లు, 0.5 శాతంతో రైల్వేలు తరువాతి స్థానాల్లో ఉన్నాయి.

ప్రతి ఉప-రంగం తాలూకు వాటా నేరుగా జిఎస్‌డిపికి అది అందిస్తున్న వాటాను ప్రతిఫలిస్తున్నప్పటికీ, వాటిలో కొన్ని పరోక్షమైన వాటానూ, బహుళమైన ప్రభావాలనూ కూడా కలిగి ఉన్నాయి. ఉదాహరణకు, "రవాణా, కమ్యూనికేషన్లు" మౌలిక సదుపాయాలకు దోహదకారులవుతున్నాయి. ఇది ఏ ఆర్థిక వ్యవస్థకైనా అత్యంత ప్రధానం. లిక్విడిటీని అందించడం ద్వారా, "బ్యాంకింగ్, బీమా, ఆర్థిక సేవలు" వ్యాపారాలకు మద్దతునందిస్తున్నాయి, ఆర్థిక కార్యకలాపాలకు "ఇంజన్లు"గా వ్యవహరిస్తున్నాయి. విస్తృతమైన అర్థంలో, వీటిని మౌలిక సదుపాయాలుగా కూడా పరిగణించవచ్చు. నిర్మాణాలు వాస్తవిక పెట్టుబడి నిల్వలకు తోడవుతున్నాయి. అది వివిధ రంగాల్లో ఉత్పాదకత వృద్ధికి ఓ భారీ పెట్టుబడి.

**పట్టిక 45 : జి.ఎస్.డి.పిలో సేవా రంగం తరపున ఉప-విభాగాల వారీ జమ, వర్తమాన ధరల ఆధారంగా**

| ఉప-విభాగాలు | 2004-05 | 2014-15 (ఏ.ఇ) |
|---|---|---|
| వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు | 13.0 | 13.1 |
| రైల్వేలు | 1.9 | 0.5 |
| ఇతర సాధనాలు ద్వారా రవాణా, నిల్వ సదుపాయం | 4.1 | 6.3 |
| కమ్యూనికేషన్‌లు | 2.0 | 1.5 |
| బ్యాంకింగ్, బీమా | 4.5 | 6.6 |
| స్థిరాస్తులు, నివాసాల యాజమాన్యం, వ్యాపార సేవలు | 13.9 | 15.6 |
| ప్రజా పరిపాలన | 4.7 | 4.6 |
| ఇతర సేవలు | 9.7 | 9.0 |
| జి.ఎస్.డి.పికి సేవారంగం జమ | 53.8 | 57.1 |

## సేవల రంగంలో జిల్లాలవారీ తులనాత్మక పరిశీలన

మొత్తం సేవల రంగం జిల్లాలవారీగా స్థూల రాష్ట్ర ఉత్పత్తికి అందిస్తున్న వాటాను ఈ క్రింది పట్టికలో చూడవచ్చు. 2013-14 (ఎఫ్ఆర్ఇ)లో హైదరాబాద్, రంగారెడ్డి లాంటి జిల్లాలు మొత్తం సేవల జిఎస్‌డిపిలో వరుసగా 26.2, 17.5 శాతం వాటాను అందించిన సంగతిని ఈ పట్టిక ద్వారా గ్రహించగలుగుతాము.

2013-14లో ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే డిఎస్‌డిపికి జిల్లాలవారీగా సేవల రంగం అందించిన వాటా (%)




ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాద్.

అదే విధంగా స్థూల జిల్లా ఉత్పత్తి (జిడిడిపి)కి రంగాల వారీగా సమకూరిన వాటాలను క్రింది పట్టికలో చూడవచ్చు. ఆసక్తికరమైన సంగతేమిటంటే, తెలంగాణలోని చాలా జిల్లాల్లో జిడిడిపికి ప్రధానమైన వాటాను సేవల రంగం అందిస్తోంది. ఉదాహరణకు హైదరాబాద్‌ను తీసుకుంటే, 2013-14లో హైదరాబాద్ జిడిడిపిలో 81.6 శాతాన్ని సేవల రంగం సమకూర్చింది. అలాగే, రంగారెడ్డి, నిజామాబాద్‌ల విషయానికొస్తే, సేవల రంగం వరుసగా 56.3 శాతం, 52.5 శాతం వాటాను అందించింది.

2013-14లో ప్రస్తుత ధరల ప్రకారం చూస్తే డిఎస్‌డిపికి జిల్లాలవారీగా వివిధ రంగాలు అందించిన వాటా (%)

**జి.డి.డి.పికి 2013-14లో జిల్లావారీగా, రంగాలవారీగా లభించిన జమ (%) వర్తమాన ధరల వద్ద**




ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాద్.

## సమాచార సాంకేతికత, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ (ఐటిఇ అండ్ సి)

తెలంగాణను అత్యంత వాంఛనీయమైన ఐటి గమ్యంగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని సాధించేందుకు, రాష్ట్రంలో ఐటి రంగం వృద్ధికోసం సామర్థ్యాన్ని పెంపొందించేందుకు, ఐసిటి విధానం 2010-2015 అమలులోకి వచ్చింది.

## విధానం లక్ష్యాలలో ప్రధానాంశాలు



- రాష్ట్రంలో ఎటువంటి అవరోధాలూ లేని వాతావరణంలో తమ కార్యకలాపాలను అత్యంత పోటీ తత్వంతో ఏర్పాటు చేసుకొని, వృద్ధి సాధించి, నిలదొక్కుకోవడం కోసం ఐటి కంపెనీలకు అనుగుణమైన పారిశ్రామిక అనుకూలమైన, ప్రగతిశీలమైన వాతావరణాన్ని అందించడం.
- అన్ని ప్రాంతాల్లో సమాజంలోని అన్ని వర్గాల్లో విద్యావంతులైన యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడం.
- ఉత్పాదకతను పెంచడం, స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (డిఎస్‌డిపి)ని వృద్ధి చేసి, తద్వారా అత్యధిక స్థాయిలో ఎగుమతుల టర్నోవర్ సాధించడం.
- రాష్ట్రంలోని ప్రతి మారుమూల ప్రాంతానికీ ఐటిని విస్తరించడం
- రాష్ట్రంలో సామాజిక - ఆర్థిక వృద్ధికి ఒక సాధనంగా సమాచార సాంకేతికత సామర్థ్యాన్ని వినియోగించుకోవడం

ఐసిటి విధానం 2010-2015 అత్యుత్తమమైన ప్రోత్సాహకాలనూ, సౌకర్యాలనూ అందిస్తోంది. స్టార్టప్‌లు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వేగంగా విస్తరిస్తున్న, ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఇంజనీరింగ్ సేవలు, ఉత్పత్తి/ ఆర్ అండ్ డి కంపెనీలు, యానిమేషన్, గేమింగ్ లాంటి రంగాల వృద్ధికి కృషి చేస్తోంది.

## దేశవ్యాప్తంగా ఐటి వృద్ధి, అవలోకనం

- దేశవ్యాప్తంగా ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టుల్లో మార్గదర్శిగా నిలిచిన తొలి రాష్ట్రం
- జాతీయ ఐటి ఎగుమతుల్లో తెలంగాణ రాష్ట్ర ఐటి ఉత్పత్తుల వాటా 10.5%
- 2013-14 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎగుమతి అయిన మొత్తం ఐటి ఉత్పత్తుల విలువ రూ. 57,257.97 కోట్లు
- ఐటి రంగం ప్రత్యక్షంగా 3,27,444 ఉద్యోగాలను సృష్టించింది.




- కొత్తగా నమోదైన/ ఆమోదం పొందిన యూనిట్లు 36
- మైక్రోసాఫ్ట్, గూగుల్, ఐబిఎం, ఒరాకిల్, డెల్, మోటరోలా, డెలాయిట్, కన్వర్జెస్, యుబిఎస్, కంప్యూటర్ అసోసియేట్స్, అమెజాన్, ఎఎండి, ఎన్‌విడియా, క్యాప్ జెమిని, కంప్యూటర్ సైన్స్ కార్పొరేషన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా, హెచ్ఎస్‌బిసి, హనీవెల్, సీమెన్స్, జెపి మోర్గాన్, యునైటెడ్ హెల్త్ గ్రూప్, ఫేస్‌బుక్ తదితర భారీ ఎంఎన్‌సి ఐటి దిగ్గజాలు, ఫార్చ్యూన్ 500 కంపెనీలకు, అలాగే ఇన్ఫోసిస్, విప్రో, టిసిఎస్, పోలారిస్, టెక్ మహీంద్రా, సియెర్రా అట్లాంటిక్, ఇన్ఫోటెక్ ఎంటర్‌ప్రైజెస్, హెచ్‌సిఎల్, కాగ్నిజెంట్ తదితర ఐటి దిగ్గజాలకు నిలయం.

## సమాచార సాంకేతికత పెట్టుబడుల రీజియన్ (ఐటిఐఆర్)

హైదరాబాద్‌లో సమాచార సాంకేతికత పెట్టుబడుల రీజియన్ (ఐటిఐఆర్) ఏర్పాటు చేస్తున్నట్టు భారత ప్రభుత్వం ప్రకటించింది. డిపిఆర్ ప్రకారం, ఐటిఐఆర్ వల్ల ఈ క్రింది ప్రయోజనాలు చేకూరుతాయి:

- సుమారు రూ. 310.849 కోట్ల ప్రత్యక్ష రాబడులు
- ఐటి పెట్టుబడుల సామర్థ్యం రూ. 219.440 కోట్లకు పెరుగుతుంది
- ఐటి ఎగుమతులు రూ. 235,000 కోట్లకు చేరుతాయి
- ప్రత్యక్ష ఉపాధి అవకాశాల అంచనా దాదాపు 15 లక్షలు
- పరోక్ష ఉపాధి అవకాశాల అంచనా సుమారు 53 లక్షలు
- రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయంలో పెరుగుదల సుమారు రూ. 30,170 కోట్లు

## ఎలక్ట్రానిక్ వస్తూత్పాదనల క్లస్టర్లు (ఇఎంసి)

ఎలక్ట్రానిక్ ఉత్పాదనల పరిశ్రమ వృద్ధిని పెంచడంకోసం భారత ప్రభుత్వ విధానం చేసిన తీర్మానం ప్రకారం, రెండు ఎలక్ట్రానిక్ ఉత్పాదనల క్లస్టర్లను (ఇఎంసి) ఏర్పాటు చేసేందుకు భారత ప్రభుత్వం అనుమతించింది. - ఉదాహరణకు ఇ-సిటీ (602 ఎకరాల్లో), అలాగే హైదరాబాద్ (తెలంగాణ)లోని మహేశ్వరంలో (310 ఎకరాల్లో). ఈ ఇఎంసిలు సుమారు 2.50 లక్షల మంది వ్యక్తులకు (ప్రత్యక్షంగా 0.40 లక్షల మందికి, పరోక్షంగా 2.10 లక్షల మందికి) ఉపాధి అవకాశాలను సృష్టించగలవని అంచనా.

## గేమింగ్, యానిమేషన్

గేమింగ్, యానిమేషన్ పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా 42 బిలియన్ అమెరికన్ డాలర్లు/ భారతదేశంలో 900 మిలియన్ అమెరికన్ డాలర్ల సామర్థ్యం ఉంది. యానిమేషన్, గేమింగ్, విజువల్/ స్పెషల్ ఎఫెక్ట్స్, డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను వేగంగా విస్తరిస్తున్న, ఉజ్వల భవిష్యత్తు ఉన్న రంగంగా గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో ఏనిమేషన్, గేమింగ్ రంగం వృద్ధికోసం ఈ క్రింది చర్యలను చేపట్టింది, దీనికోసం 'గేమ్' (జి.ఏ.ఎం.ఇ) విధానాన్ని రూపొందించింది.

- హైదరాబాద్‌లోని రాయదుర్గంలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టిఎస్ఐఐసి)కు చెందిన భూమి సుమారు 30 ఎకరాలను గేమింగ్ అండ్ ఏనిమేషన్ పార్కుకు ఇప్పటికే కేటాయించింది.
- గేమింగ్ అండ్ ఏనిమేషన్ పార్కులో నిర్మాణాల అభివృద్ధికి అనుకూలమైన స్థలం, భాగస్వామ్య స్టూడియోలు, ప్రోసెసింగ్ ల్యాబ్‌లు, మీడియా సెంటర్, సమావేశ సౌకర్యాలు, ట్రాన్సిట్ కార్యాలయం/ బిజినెస్ సెంటర్ తదితరాలు ఉంటాయి.
- గేమింగ్ అండ్ ఏనిమేషన్ రంగంలో అర్హులైన విద్యార్థులను ఉపాధికోసం సిద్ధం చేసేందుకు ప్రఖ్యాత గేమింగ్, ఏనిమేషన్ సంస్థల భాగస్వామ్యంతో గేమింగ్ అండ్ ఏనిమేషన్ అకాడమీని ప్రారంభించడం జరుగుతుంది.

## టి-హబ్

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఐఐఐటి క్యాంపస్‌లో "టి-హబ్" పేరిట నవ్యావిష్కరణలకోసం ఓ సంస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సాంకేతికమైన స్టార్టప్‌లను అందించడం ద్వారా "నవ పరిశ్రమలను కాచే నవ పరిశ్రమ"గా ఈ టి-హబ్ సేవలందిస్తుంది. నాణ్యమైన మౌలిక సదుపాయాలు, మార్గదర్శకులు, నిధి దాతలు, నెట్‌వర్క్‌తో కూడిన అనుసంధానక వ్యవస్థ నవ పరిశ్రమలకు ఈ టి-హబ్‌తో అందుబాటులోకి వస్తుంది. అంకురార్పణ స్థాయి నుంచి పరిణతి సాధించే వరకూ మొత్తం అభివృద్ధి చక్రం పొడవునా స్టార్టప్‌లు ప్రయాణించడానికి ఇవి దోహదం చేస్తాయి. ఈ ప్రాంతంలో విభిన్నమైన నవ పరిశ్రమలను అనుసంధానించేందుకు టి-హబ్ సాయపడుతుంది. వాటికి అవసరమైన మద్దతు అందేలా చూస్తుంది. టి-హబ్ వ్యవస్థాపక భాగస్వాములు ఐఎస్‌బి, ఐఐఐటి-హెచ్, నల్సార్. ఈ సమగ్ర వ్యవస్థలోకి వ్యాపార, సాంకేతిక, న్యాయ నైపుణ్యాలను అవి తమతో తీసుకొస్తాయి. టి-హబ్ స్టార్టప్‌లలో కీలకమైన పురోగామి విభాగాలుగా విద్యా సాంకేతికతలు, ఆరోగ్య సంరక్షణ సాంకేతికతలు, రిటైల్ రంగ సాంకేతికతలు, క్లౌడ్ కంప్యూటింగ్, ఐటి, ఐటిఇఎస్, మొబైల్ అప్లికేషన్లు ఉన్నాయి. వీటి అంచనా వ్యయం రూ. 35 కోట్లు.

ద్వితీయశ్రేణి టి-హబ్‌గా వరంగల్ పట్టణాన్ని గుర్తించడం జరిగింది. అక్కడ ఐటి కంపెనీలకోసం అవి తమ కార్యకలాపాలను వచ్చిన వెంటనే ఆరంభించుకునే రీతిలో అనువైన మౌలిక సదుపాయాలను నిర్మించడం కోసం 15,000 చదరపు అడుగులను టిఎస్ఐఐసి ద్వారా కేటాయించారు.

## వై-ఫై సౌకర్యం

పరిపాలననూ, కార్యనిర్వాహక సామర్థ్యాన్నీ మెరుగుపరచడం కోసం హైదరాబాద్‌లో ఓ వై-ఫై కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. పౌరులతో సులభంగా సంబంధ బాంధవ్యాలను నెరపడంలో కూడా వై-ఫై ఎంతో ఉపయోగపడుతుంది. డిజిటల్ విధానంలో పౌరులను మమేకం చేయడాన్ని ఈ వై-ఫై కేంద్రం ప్రయత్నం ప్రోత్సహిస్తుంది. మొబైల్ పరిపాలన, వ్యక్తిగతీకరించిన అప్రమత్తతలను అందించడం, వాతావరణ హెచ్చరికలు, ట్రాఫిక్ అప్రమత్తతలు లాంటి సమాచారాన్ని వాస్తవిక సమయంలో వ్యాప్తి చేయడం దీని లక్ష్యం.

## తెలంగాణ రాష్ట్ర డాటా కేంద్రం

రాష్ట్ర ప్రభుత్వ శాఖలన్నిటికీ సమాచారాన్ని భద్రపరిచే స్థలాన్నీ, ఆధునిక సర్వర్లనూ అంకిత ప్రాతిపదికన సమకూర్చడం ద్వారా వాటి అవసరాలను తీర్చడం కోసం మణికొండలో ఒక రాష్ట్ర సమాచార నిధి కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించింది. అనువర్తనల నిర్వహణతో సహా సమాచార నిధి సేవలన్నిటినీ నిర్వహించడంలో ఈ కేంద్రం అత్యున్నత స్థాయికి చేరగలదని అంచనా. డాటా కేంద్రానికి సంబంధించిన కొన్ని ప్రధాన అంశాలను ఈ క్రింద చూడవచ్చు:

మొత్తం భవన మౌలిక సదుపాయాల విస్తీర్ణం 9000 చదరపుటడుగులు. దీనిలో మొదటి దశ సర్వర్ ఏర్పాటయ్యే ప్రదేశం (దీనికి ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతికతల శాఖ నిధులను సమకూరుస్తోంది) 1585 చదరపుటడుగుల్లో, 35 ర్యాక్‌ల సామర్థ్యంతో

ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చే నిధులతో ఏర్పాటయ్యే రెండో దశ సర్వర్ ఏర్పాటయ్యే విస్తీర్ణం 962 చదరపుటడుగుల్లో 24-ర్యాక్‌ల సామర్థ్యంతో ఉంటుంది.

టిఎస్‌డిసి నిర్మాణ డిజైన్ ద్వితీయ శ్రేణి ప్లస్ (టిఐఎ-942 ప్రమాణాలు)

ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుంది.

దీని కనీస క్రియాశీల సమయం 99.749%

రిడండెంట్ మోడ్‌లో ఎస్‌టిఎం1 లింక్ (155 ఎంబిపిఎస్)తో టిస్వాన్, టిస్కాన్‌లకు టిఎస్‌డిసి అనుసంధానమై ఉంటుంది.

ఎన్‌కెఎన్ నుంచి 1 జిబిపిఎస్ ఇంటర్నెట్ బ్యాండ్‌విడ్త్, మరో రెండు ఐఎస్‌పిలనుంచి 84 ఎంబిపిఎస్ ఇంటర్నెట్ బ్యాండ్ విడ్త్ ఏర్పాటు.

విద్యుత్, ఎసి, యుపిఎస్, జనరేటర్‌లు, నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలు, భద్రతా మౌలిక సదుపాయాలు, యాజమాన్య మౌలిక సదుపాయాలు, విపత్తులనుంచి పునరుద్ధరించే వ్యవస్థ, కంప్యూటర్ మౌలిక సదుపాయాలు, నిల్వకు సంబంధించిన మౌలిక సదుపాయాలు తదితర సహకార మౌలిక సదుపాయాల ఏర్పాటు.

తెలంగాణ ప్రభుత్వంలోని వివిధ శాఖల ప్రధాన సేవలనూ, ఇ-గవర్నెన్స్ అనువర్తనలనూ,"హోస్టెడ్ నమూనా", "కో-లోకేటెడ్ నమూనా" అనే రెండు రకాల హోస్టింగ్ నమూనాలతో పటిష్ఠం చేయడం.

## టి-స్కాన్ (తెలంగాణ సచివాలయ క్యాంపస్ ఏరియా నెట్‌వర్క్)

డాటా కోసం నెట్‌వర్క్ మీద 500 నోడ్స్‌తో అనుసంధానించేందుకు సచివాలయంలో తెలంగాణ సచివాలయ క్యాంపస్ ఏరియా నెట్‌వర్క్ ఏర్పాటయింది. ఓ డాటా పోర్ట్ ద్వారా ప్రతి పని ప్రదేశం పరస్పరం అనుసంధానమవుతాయి. ఆప్టికల్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సి) మీద 10 జిబి ఈథర్‌నెట్‌పై దీని ప్రధాన వ్యవస్థ అనుసంధానమై ఉంది. దీనికి ఒకే బ్లాక్‌లో, ఓఎఫ్‌సి/యుటిపి గిగా బైట్ ఈథర్‌నెట్‌తో ఇంటర్-ఫ్లోర్ అనుసంధానత ఉంటుంది.

ప్రస్తుతం సచివాలయంలో, నెట్‌వర్క్‌కు సుమారు 3000 కంప్యూటర్లు అనుసంధానించి ఉన్నాయి. డి-బ్లాక్ మొదటి అంతస్థులో ఒక సచివాలయ నెట్‌వర్క్ యూనిట్ (ఎస్‌ఎన్‌యు) ఉంది. ఇక్కడినుంచే నెట్‌వర్క్ నిర్వహణ, పర్యవేక్షణ జరుగుతాయి. ఇంటర్‌నెట్, ఇంట్రానెట్, ఇ-మెయిల్, వెబ్ సేవలు తదితర నెట్‌వర్క్ సేవల్ని అందించేందుకు విండోస్, లైనక్స్‌లతో సర్వర్లు ఏర్పాటయ్యాయి. ఇది వాణిజ్య పన్నులు, హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బిల కోసం ఒక డిఆర్ సైట్‌గా కూడా పనిచేస్తుంది.

## స్వాన్ (రాష్ట్ర వ్యాప్త ఏరియా నెట్‌వర్క్)

రాష్ట్ర ప్రధాన కేంద్రాన్ని (ఎస్‌హెచ్‌క్యూ) జిల్లా కేంద్రాలు (డిహెచ్‌క్యూ), మండల కేంద్రాలతో (ఎంహెచ్‌క్యూ) జి2జి స్వాన్ అనుసంధానిస్తోంది. దీనిని బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ స్థానంలో డిఐటితో అమలు చేస్తున్నారు. భారత ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్న డిఐటి రూ. 249.76 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఆమోదించింది. టెండర్ల ప్రక్రియ ద్వారా దీనికి సర్వీస్ ప్రొవైడర్ కింద మెసర్స్ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఎంపికయింది. 10 డిహెచ్‌క్యూలను ఎస్‌హెచ్‌క్యూతో, 464 ఎంహెచ్‌క్యూలను సంబంధిత డిహెచ్‌క్యూలతో అనుసంధానించడం ద్వారా ఈ ప్రాజెక్ట్ అమలవుతోంది. పాక్షిక ఆమోద పరీక్ష (పిఎటి) పూర్తయింది. పిఎటి అనుమతి 26.11.2010 నుంచి లభించింది. టిపిఎ (థర్డ్ పార్టీ ఆడిట్) కూడా పూర్తయింది. 464 పాప్‌లకు అనుమతి లభించగా, 463 ఎంహెచ్‌క్యూలు పనిలో ఉన్నాయి.

పాత స్వాన్‌తో అనుసంధానమై ఉన్న ప్రస్తుత ప్రభుత్వ కార్యాలయాలను కొత్త స్వాన్‌కు మార్చే పని పూర్తయింది. స్వాన్‌కు హారిజంటల్ కనెక్టివిటీ కోసం టెండర్ ప్రక్రియ ద్వారా సర్వీస్ ప్రొవైడర్ల ఎంపిక జరిగింది. ఒప్పందాలపై సంతకాలు జరిగాయి, ఇ-సేవ, ఐజిఆర్ఎస్, ఆర్‌టిఎ, రెవెన్యూ విభాగాలకు సంబంధించిన అవసరాలపై ఆయా విభాగాలు తెలియజేసిన అవసరాల మేరకు స్వాన్ కనెక్షన్ల కోసం ఉత్తర్వులు జారీ అయ్యాయి. హారిజంటల్ కనెక్టివిటీ ప్రక్రియ సాగుతోంది. మొత్తం 1535 హారిజాంటల్ లింక్‌లు పూర్తయ్యాయి. ఎస్‌హెచ్‌క్యూ- డిహెచ్‌క్యూ మధ్య బ్యాండ్‌విడ్త్‌ను 8 ఎంబిపిఎస్ నుంచి 12 ఎంబిపిఎస్ స్థాయికి పెంచారు. అలాగే 1527 డిహెచ్‌క్యూ-ఎంహెచ్‌క్యూ బ్యాండ్‌విడ్త్‌ను 2 నుంచి 4 ఎమ్‌బిపిఎస్‌కు ఉన్నతీకరించారు.

## శాప్‌నెట్

2002 నుంచి ఒక భూతల కేంద్రం (ఎర్త్ స్టేషన్) పని చేస్తోంది. అది కెయు బ్యాండ్‌ను వాడుతూ ఇన్శాట్-3 బి ఉపగ్రహ సేవలను వినియోగించుకుంటోంది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సొసైటీ శాప్‌నెట్ ఈ కార్యకలాపాలను నిర్వహిస్తోంది. ఎర్త్ స్టేషన్‌కు 5 వీడియో ఛానెళ్ళు, ఒక డాటా ఛానెల్ సామర్థ్యం ఉంది. అత్యాధునికమైన ఓ డిజిటల్ స్టూడియో కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రత్యక్ష సంభాషణల ఛానెల్ వినియోగం కూడా పెరిగింది.

ప్రస్తుతం 4 ఛానెళ్ళు పని చేస్తున్నాయి. ప్రత్యక్ష సంభాషణలతో బోధన కోసం, విద్యా కార్యక్రమాల ప్రసారం కోసం ఛానెల్ 1ని పాఠశాల, కళాశాల, సాంకేతిక, వైద్య విద్యా శాఖలు వినియోగించుకుంటున్నాయి. దీనికి తోడు వ్యవసాయ శాఖ, ఇందిరా క్రాంతి పథం, పోలీస్ తదితర శాఖలు కూడా ఈ ఛానెల్‌ను తమ చర్చల వీడియో సమావేశాల కోసం ఉపయోగిస్తున్నాయి. ఛానెల్ 2, చానెల్ 3లను హెచ్‌ఆర్‌డి, సామాజిక రంగ కార్యక్రమాలకోసం, ఛానెల్ 4ను పాఠశాలలు, టాస్క్ కోసం కేటాయించారు.

## ఇ-గవర్నెన్స్ ప్రాజెక్టులు

దేశంలో ఇ-గవర్నెన్స్ దీర్ఘకాలిక అభివృద్ధి కోసం పునాదులు వేయాలనీ, కొత్త ఊతం ఇవ్వాలనీ భారత ప్రభుత్వ జాతీయ ఇ-గవర్నెన్స్ ప్రణాళిక (ఎన్ఇజిపి) కోరుకుంటోంది. ఇది సరైన పరిపాలన, సంస్థాగత యంత్రాంగాలను సృష్టించడంపై సమాచారం అందిస్తుంది. కీలకమైన మౌలిక సదుపాయాలనూ, విధానాలను ఏర్పాటు చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర, సంఘటిత సేవా స్థాయిల్లో అనేక ఉద్యమ తరహా ప్రాజెక్టులను అమలు చేస్తుంది.

దీనిలో భాగంగా ఉన్న అధికారుల మార్గదర్శకత్వంలో ఎన్ఇజిపి అమలుపై పర్యవేక్షణ, సమన్వయం కోసం తగిన ఏర్పాట్లను కూడా దృఢంగా తీసుకోవడం జరుగుతుంది. ప్రమాణాలు, విధానపరమైన మార్గదర్శకాలకు రూపకల్పన/ స్థిరీకరణ చేయడం, సాంకేతిక సహకారాన్ని అందించడం, నిర్వహణ సామర్థ్యాన్ని నిర్మించడం, అర్ అండ్ డితో ఈ కార్యక్రమం ప్రమేయం కలిగి ఉంటుంది.

వివిధ శాఖల్లో చేపట్టనున్న కొత్త ప్రాజెక్టులు, పైలెట్ ప్రాజెక్ట్, ఐటి ఆడిట్స్, లక్ష్యసాధన మార్గ నివేదికలు, డిపిఆర్ ప్రజెంటేషన్, మొబైల్‌సర్వీస్ డెలివరీ గేట్‌వే (ఎంఎస్‌డిజి), ఇ-గవర్నెన్స్ అప్లికేషన్లు, జి2సి అప్లికేషన్ల కోసం ఇంటర్‌ఫేస్ సామగ్రిని సమకూర్చుకోవడం, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించడం లాంటి ఇ-గవర్నెన్స్ కిందికి వచ్చే అంశాల కోసం రాబోయే 2015-16 బడ్జెట్‌లో రూ. 300 లక్షల మొత్తాన్ని కేటాయించాలని ప్రతిపాదించారు.

## మీ-సేవ

''మీ-సేవ' అనే తెలుగు సమాసానికి అర్థం పౌరులకోసం ఉద్దేశించిన సేవ అని. ''పౌర సేవలు ఇంటికి చేరువలో'' అనే జాతీయ ఇ-గవర్నెన్స్ దృక్పథం అంతర్భూతమైన చక్కని పరిపాలనాపరమైన చొరవ ఇది. మొత్తం జి2సి, జి2బి శ్రేణి కోసం సింగిల్ ఎంట్రీ పోర్టల్‌ను ఇది సమకూరుస్తుంది. సురక్షితమైన స్టేషనరీలో డిజిటల్ సంతకాలను ఉపయోగించి పౌరులకు ప్రభుత్వ సేవలు అందించే సేవా పోర్టల్ మీ-సేవ. రాష్ట్రవ్యాప్తంగా పౌరులకు ప్రతిఫలాన్ని అందించేందుకు, పౌర-కేంద్రీకృతంగా ఉన్న అన్ని సేవలనూ మీ-సేవ కిందికి తీసుకువచ్చేందుకూ మీ-సేవ ద్వారా చేసే ప్రయత్నం ఇది.

రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ఉన్న 3715కు పైగా ఉన్న ఉమ్మడి సేవా కేంద్రాల (సిఎస్‌సిలు) ద్వారా 34 శాఖలకు చెందిన 311 పౌర కేంద్రీకృత సేవలను మీ-సేవ ప్రస్తుతం అందిస్తోంది. మీ-సేవ మొత్తం 3,54,10,913 లావాదేవీలను పూర్తి చేసింది. వీటిలో 1,70,15,448 లావాదేవీలు కేటగిరి ఎ కిందికీ, 1,83,95,350 లావాదేవీలు కేటగిరి బి కిందికి వస్తాయి. ఆన్‌లైన్ విధానం ద్వారా వివిధ శాఖలకు చెందిన 50 సేవలను కూడా మీ-సేవ అందిస్తోంది. పౌరుడు కియోస్క్ కేంద్రానికి వెళ్ళనవసరం లేదు. అతను ఏ సమయంలోనైనా ప్రభుత్వ శాఖల సేవలను ఆన్‌లైన్ విధానం ద్వారా వినియోగించుకోవచ్చు.

## తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)

తెలంగాణలో ప్రతిబంధకంగా నిలిచిన నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడానికి ఈ అకాడమీ ఏర్పాటయింది. సంసిద్ధంగా ఉన్న ఉద్యోగార్హులైన పట్టభద్రులను తగిన సంఖ్యలో వారి నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా సమకూర్చడం/ తయారు చేయడం కోసం టాస్క్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడం జరిగింది. వివిధ భాగస్వామ్య కళాశాలల్లో సుశిక్షిత మార్గదర్శులను నియమించడం ద్వారా ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు సమాచార నైపుణ్యాలు, ఉద్యోగార్హమైన నైపుణ్యాలు, ఉద్యోగార్హమైన నైపుణ్యాల్లో శిక్షణను టాస్క్ అందిస్తుంది.

ఈ విషయమై అనేక బహుళజాతి కంపెనీలతో టాస్క్ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఐబిఎం, ఒరాకిల్, ఇన్ఫోసిస్, టిసిఎస్, ఆటోడెస్క్, గూగుల్, కాగ్నిజెంట్, హెచ్‌సిఎల్ తదితర సంస్థలతో సన్నిహితంగా పనిచేస్తోంది. ఇన్ఫోసిస్, సిటిఎస్, టిసిఎస్, ఐబిఎం, టెక్ మహీంద్రా లాంటి వివిధ ఎంఎన్‌సి దిగ్గజాల నుంచి ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం నైపుణ్య అభివృద్ధి శిక్షణ నిర్వహించేందుకు రిజిస్టర్ అయింది.

తాము చేపట్టే సిఎస్‌ఆర్ చర్యల్లో భాగంగా సాఫ్ట్‌స్కిల్స్ అభివృద్ధి మీద టాస్క్ దృష్టి సారించింది. పట్టభద్రులకు శిక్షణ ఇవ్వడంలో టాస్క్‌కు సహకరించేలా నాస్కామ్‌తో ఓ ఎంఓయుపై తెలంగాణ ప్రభుత్వం సంతకాలు చేసింది. కళాశాల విద్యార్థుల్లో పారిశ్రామికతత్వాన్ని, ఆర్ అండ్ డిని ప్రోత్సహించే ఓ కార్యక్రమాన్ని కూడా టాస్క్ ఆరంభించింది.

"టాస్క్"ను తదుపరి స్థాయిల్లోకి, అంటే తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, మండలాల స్థాయిల్లోకి తీసుకువెళ్ళేందుకు కొత్త ప్రభుత్వం ఆశావహమైన ప్రణాళికలు వేస్తోంది.

## పర్యాటక రంగం

పర్యాటక రంగం ఎన్నో అవకాశాలున్న ఒక పరిశ్రమ. రాష్ట్రంలో సామాజిక-ఆర్థిక వృద్ధికి ఇది గణనీయంగా దోహదం చేస్తోంది. పర్యాటక పరిశ్రమకు అనేక అవకాశాలను ప్రభుత్వం అందిస్తోంది. తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా, విభిన్న తరహాల పర్యాటక ప్యాకేజిలను/ సేవలను అమలు చేసేందుకు, దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకూ వినూత్నమైన పద్ధతులను ప్రవేశపెట్టడానికి చర్యలు తీసుకుంటోంది.

"ప్రపంచంలో అత్యుత్తమమైన, 2015లో మీరు చూడాల్సిన 20 ప్రదేశాలు" జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. నేషనల్ జియోగ్రాఫిక్ ట్రావెలర్ మ్యాగజైన్ వార్షిక గైడ్‌లో ఈ జాబితా ప్రచురితమయింది. హైదరాబాద్‌లోని వారసత్వ ప్రదేశాలు పర్యాటకులకు సుసంపన్నమైన సాంస్కృతిక వైవిధ్యాన్ని అందిస్తాయి. హైదరాబాద్‌ను సందర్శించే వివిధ రకాల పర్యాటకుల ఆకాంక్షలకు చక్కగా సరిపోయే ప్యాకేజిలను రూపొందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫలక్‌నుమా, చౌమహల్లా ప్యాలెస్‌లను దర్శింపజేసే నిజాం ప్యాలెస్‌ల పర్యాటక ప్యాకేజినీ, గోల్కొండ కోటలో, తారామతి బరాదరీలో సౌండ్ అండ్ లైట్ షోను దర్శింపజేసే విధంగా ప్రతిరోజూ హైదరాబాద్ రాత్రి పర్యటననూ టిఎస్‌టిడిసి ప్రవేశపెట్టింది. కేంద్ర బడ్జెట్ సందర్భంగా ప్రకటించిన మేరకు, భారత ప్రభుత్వ సహకారంతో కుతుబ్ షాహీ సమాధుల పరిరక్షణ, సుందరీకరణకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. ప్రసిద్ధమైన సమాధుల పరిరక్షణ ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వంతో అగా ఖాన్ ట్రస్ట్ ఇప్పటికే భాగస్వామి అయింది.



ఫలక్‌నుమా ప్యాలెస్

హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అభివృద్ధి చేసిన అంతర్జాతీయ గోల్ఫ్ కోర్సు సమీపంలో గోల్ఫ్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి కూడా అవకాశం ఉంది. ఈ అసోసియేషన్ ఇటీవలనే గోల్కొండ మాస్టర్స్ పిజిటిఐ టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇచ్చింది. హైదరాబాద్‌లో ఇలాంటిది జరగడం ఇదే మొదటిసారి. ఎంఐసిఇ (సమావేశాలు, ప్రోత్సాహకాలు, సదస్సులు, ప్రదర్శనలు) పర్యాటకానికి కూడా కేంద్రంగా హైదరాబాద్ ఆవిర్భవించింది. ఈ విషయంలో భారతదేశంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలు కలిగిన నగరంగా

చాటుకునే అవకాశాన్ని సంపాదించింది. హైదరాబాద్ సదస్సులు, సందర్శకుల బ్యూరో (హెచ్‌సివిబి) భారతదేశంలో ఏర్పడిన ఈ తరహా సంస్థల్లో మొట్టమొదటిది. సంబంధిత అంశాల్లో మార్కెటింగ్ ప్రయత్నాలను ఇది సమన్వయపరుస్తోంది.

తెలంగాణ జిల్లాల్లో తక్కువ ప్రాచుర్యం పొందిన పర్యాటక గమ్యాలను తగిన సౌకర్యాలతో అభివృద్ధి చేయడం ద్వారా, అనువైన ప్యాకేజిలను ప్రవేశపెట్టడం ద్వారా పర్యాటకులను ఆకర్షించే ప్రయత్నాలమీద దృష్టి కేంద్రీకరించడం జరుగుతోంది. నాగార్జున సాగర్, కరీంనగర్, రామప్ప, కిన్నెరసాని, కొత్తగూడెం, గజ్వేల్ ప్రాంతాల్లో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం భారత ప్రభుత్వ నేతృత్వంలోని నీతి అయోగ్ రూ. 33.00 కోట్ల నిధులను కేటాయించింది. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడానికి సమగ్ర జిల్లా ప్రణాళికలు తయారవుతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక అందమైన ఆలయాలు, చారిత్రకమైన ఆరాధనా ప్రదేశాలూ ఉన్నాయి. అవి ఇప్పుడు ప్రసిద్ధ యాత్రా కేంద్రాలుగా రూపుదిద్దుకున్నాయి. హైదరాబాద్‌కు సమీపంలోని ఉస్మాన్ సాగర్ తీరాన ఉన్న చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించేలా అటువంటి సర్క్యూట్‌లలో ఒకదాన్ని టిఎస్‌టిడిసి ప్రారంభించింది. ఖమ్మం జిల్లాలోని భద్రాచలంలో సీతారామచంద్ర స్వామి ఆలయాన్నీ,ఆదిలాబాద్ జిల్లాలో బాసరలోని సరస్వతి ఆలయాన్నీ, నల్గొండ జిల్లా యాదగిరిగుట్ట లోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్నీ సందర్శించడంకోసం ఇదే విధమైన ప్యాకేజి టూర్లను కూడా అందిస్తోంది. కరీంనగర్ జిల్లాలోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, కొండగట్టులోని హనుమాన్ ఆలయం, ధర్మపురిలోని నరసింహ స్వామి ఆలయం, వరంగల్ జిల్లా పాలంపేటలోని రామప్ప ఆలయం, మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయాల దగ్గర పర్యాటకులకోసం సౌకర్యాల అభివృద్ధి పనులను చేపట్టడం కూడా జరిగింది.



*వేములవాడ దేవాలయం, కరీంనగర్*



*వేయిస్థంబాల గుడి, వరంగల్*



*కొలనుపాక జైన మందిరం, నల్గొండ*



*జోగులాంబ ఆలయం, ఆలంపూర్, మహబూబ్‌నగర్*

## గ్రామీణ పర్యాటకం

అసంఖ్యాక వర్ణాలతో మైమరపించే ప్రకృతి దృశ్యాలు, సంస్కృతులు, ఆచారాలు కలిగిన తెలంగాణలో గ్రామీణ పర్యాటకానికి అద్భుతమైన అవకాశం ఉంది. అత్యంత ప్రాచీనమైన జీవన సంస్కృతికి బహుశా, హస్తకళలు ప్రాతినిధ్యం వహిస్తాయి. తెలంగాణలో

కొన్ని విలువైన హస్తకళా వనరులున్నాయి. భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వశాఖ తెలంగాణలో గ్రామీణ పర్యాటకం కింద ప్రధానంగా గుర్తించిన వాటిలో నల్గొండలో పోచంపల్లి గ్రామీణ పర్యాటక ప్రాజెక్ట్, ఆదిలాబాద్‌లో నిర్మల్ గ్రామీణ పర్యాటక ప్రాజెక్ట్, వరంగల్ జిల్లాలో చేర్యాల గ్రామీణ పర్యాటక ప్రాజెక్ట్, పెంబర్తి గ్రామీణ పర్యాటక ప్రాజెక్ట్ ఉన్నాయి.



పోచంపల్లి చేనేతవస్త్రాలు



చేర్యాల్ వర్ణచిత్రాలు

## వన్యప్రాణి, పర్యావరణ పర్యాటకం

తెలంగాణలో సుసంపన్నమైన అడవులు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు ఉన్నాయి. ఇవి పర్యావరణ-పర్యాటకం, వన్యప్రాణి పర్యాటకాలకుచక్కని అవకాశం కల్పిస్తున్నాయి. వీటిలో నిజామాబాద్‌లోని అలీ సాగర్ లేళ్ళ ఉద్యానవనం, వరంగల్ జిల్లాలోని ఏటూరు నాగారం సంరక్షణ కేంద్రం, పాకాల వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, ఆదిలాబాద్ జిల్లాలోని కవల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, జన్నారం, ప్రాణహిత వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, శివారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, హైదరాబాద్‌లోని మహావీర్ హరిత వనస్థలి జాతీయ ఉద్యానవనం, నెహ్రూ జంతు ప్రదర్శన శాల, సంగారెడ్డిలోని మంజీరా పక్షుల వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, మెదక్‌లోని పోచారం సంరక్షణ కేంద్రం, రంగారెడ్డిలోని షామీర్ పేట లేళ్ళ ఉద్యానవనం ఉన్నాయి.

## వారసత్వ సంపద, సాంస్కృతిక పర్యాటకం

అనేక కోటలతో వర్ధిల్లుతున్న ఓ చారిత్రక భూమి తెలంగాణ. సంప్రదాయకమైన సాంస్కృతిక పర్యాటకాన్ని అభివృద్ధి చేసే అవకాశాలను ఇవి అందిస్తున్నాయి. పర్యాటకులకోసం సౌకర్యాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ ప్రాజెక్టుల్ని చేపట్టిన కొన్ని ప్రసిద్ధమైన కోటల్లో గోల్కొండ కోట, మెదక్ కోట, ఖమ్మం కోట, నిజామాబాద్ కోట, ఎలగందుల కోట, కరీంనగర్, భువనగిరి కోటలు. నల్గొండ కోట ఉన్నాయి. వరంగల్ కోట, గోల్కొండ కోటల్లో సౌండ్ అండ్ లైట్ షోలు నిర్వహిస్తున్నారు. ఇవి అత్యద్భుతమైన గత కాలానికి సందర్శకులను తీసుకువెళ్తాయి. చాలా ప్రదర్శనలు తెలంగాణకు సంబంధించిన ఘన వారసత్వాన్ని చాటిచెబుతాయి. పైన పేర్కొన్న పర్యాటక ప్యాకేజిలను తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టిఎస్‌టిడిసి) ఏర్పాటు చేస్తోంది. పొరుగు రాష్ట్రాలతో కూడా అనుసంధానిస్తోంది. వివిధ ప్రాంతాల్లో హరిత గొలుసుకట్టు హోటళ్ళనూ, మార్గమధ్య సౌకర్యాలనూ, నదీ ప్రయాణాలు, జల విహారాలకు పడవలను కూడా టిఎస్‌టిడిసి నిర్వహిస్తోంది. ప్రఖ్యాతమైన హైదరాబాద్ బిరియానీ, ఖుర్బానీ-కా -మీఠా, హలీం, ఇరానీ టీలతో సహా హైదరాబాద్ వంటకాలను రుచి చూడకపోతే తెలంగాణ రాష్ట్రంలో జరిపే ఏ పర్యటన అయినా అసంపూర్ణమే.



భువనగిరి కోట, నల్గొండ



కుంతాల జలపాతాలు, ఆదిలాబాద్

## వైద్య పర్యాటకం

ప్రపంచ వైద్య పర్యాటకానికి ఓ కేంద్రంగా ఆవిర్భవించే సామర్థ్యం హైదరాబాద్‌కు ఉంది. ఎందుకంటే నగరంలో ఏర్పాటైన ప్రముఖ ఆసుపత్రులు అందుబాటు ధరలకే ప్రపంచ స్థాయి చికిత్సలు అందిస్తున్నాయి. ఈ అంశంపై ఒక సమగ్రమైన ప్రణాళిక రూపొందించడానికీ, విదేశాల్లో రోడ్ షోలు నిర్వహించడానికీ చర్యలు తీసుకోవడం జరుగుతోంది.

## బతుకమ్మ

తెలంగాణ సాంస్కృతిక అస్థిత్వానికి చిహ్నం బతుకమ్మ. ఈ ఉత్సవాన్ని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించారు. దేశంలోని అన్ని ప్రాంతాలనుంచీ పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగిన విశిష్టమైన ఈ తెలంగాణ పూల పండగ ఓ వార్షిక అంశంగా మారింది. 2014లో ఈ ఉత్సవ నిర్వహణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు విడుదల చేసింది. ఏటా ఈ ఉత్సవాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించింది. బతుకమ్మ పండగ సందర్భంగా పర్యాటక ప్యాకేజిలను టిఎస్‌టిడిసి ప్రారంభించింది, ఈ విశిష్టమైన పూల పండగకు దేశంలోని అన్ని ప్రాంతాల పర్యాటకులనూ ఆకర్షించడానికి చర్యలు చేపడుతున్నారు.



*ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మ సంబురాలు, 2014*

## బోనాలు

బోనాలును కూడా ఓ రాష్ట్ర ఉత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయం, లాల్ దర్వాజా దగ్గరున్న మైసమ్మ ఆలయాలకు హైదరాబాద్ బోనాలు వారాంత ప్యాకేజి టూర్లను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రారంభించింది. ఈ పర్యటనలను ప్రతి సంవత్సరమూ నిర్వహించాలన్న ప్రణాళిక ఉంది. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా న్యూఢిల్లీలోని రాజ్‌పథంలో మొదటిసారిగా ప్రదర్శించిన తెలంగాణ రాష్ట్ర శకటాన్ని బోనాలు పండగను ప్రతిబింబించేలా వర్ణభరితంగా అలంకరించారు.



*బోనాలు ఉత్సవాలు, 2014*

## సమ్మక్క సారలమ్మ జాతర

మేడారం జాతరగా కూడా ప్రసిద్ధి చెందిన ఈ ఉత్సవాన్ని వరంగల్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో వేడుకగా నిర్వహిస్తారు. కుంభమేళా తరువాత, దేశంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే ఉత్సవం మేడారం జాతరేనన్న విశ్వాసం ఉంది. 2014లో జరిగిన జాతర సందర్భంగా కోటి మందికి పైగా భక్తులు మేడారాన్ని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాన్ని ప్రతి రెండేళ్ళకూ ఒకసారి నిర్వహిస్తారు. తదుపరి ఉత్సవం 2016లో జరుగుతుంది.

## కళల గ్రామం - శిల్పారామం

కళాత్మక వస్తువుల గ్రామమైన శిల్పారామం భారతీయ సాంస్కృతిక వారసత్వానికి ఒక నివాళి. భారతదేశపు వైభవోపేతమైన పూర్వ సంస్కృతిని ప్రోత్సహించి, పునరుద్ధరించి, వర్ధిల్లజేయడం ఈ సంస్థ ప్రాథమిక లక్ష్యం. హస్త కళాకారులూ, ప్రదర్శన కళాకారులూ తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఒక ఉమ్మడి వేదికను ఇది అందిస్తోంది.



శిల్పారామం

తెలంగాణలో మెదక్ జిల్లాలోని సంగారెడ్డి, వరంగల్ లాంటి ఉతర ప్రదేశాలకు కూడా శిల్పారామాన్ని విస్తరించే ప్రక్రియ సాగుతోంది.

## సరికొత్త ప్రయత్నాలు

- వివిధ ప్రభుత్వ విధానాలు, పథకాల గురించిన సమాచారాన్ని ప్రచారం చేయడానికీ, అలాగే తెలంగాణకే సొంతమైన అద్వితీయ సాంస్కృతిక అస్తిత్వం తమకు గర్వకారణమనే భావనను ప్రజల్లో పెంపొందించడానికీ "తెలంగాణ సాంస్కృతిక సారథి" పేరిట ప్రత్యేకమైన రాష్ట్రస్థాయి సంస్థను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- నల్గొండ- రంగారెడ్డి సరిహద్దులోని రాచకొండలో సుమారు 2000 ఎకరాల విస్తీర్ణంలో మెగా సినిమా సిటీని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.
- సంస్కృతిని ప్రోత్సహించేందుకూ, ప్రపంచ స్థాయి వసతులు కల్పించేందుకూ హైదరాబాద్‌లో "తెలంగాణ కళా భారతి", వరంగల్‌లో "కాళోజీ కళా కేంద్రం" నిర్మించేందుకు ప్రభుత్వం ప్రతిపాదన చేసింది.

- టిటిడి తరహాలో యాదగిరిగుట్ట దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు రూ. 100 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రాజెక్ట్ కింద నరసింహ అభయారణ్యాన్ని 400 ఎకరాల్లో అభివృద్ధి చేయడంతో పాటు మరో 1600 ఎకరాల్లో ఉద్యానవనాలు, కళ్యాణ మండపాలు, ధ్యాన మందిరాలు, వేద పాఠశాల, కాటేజీలను నిర్మించాలని యోచిస్తోంది.




*యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం*

# అధ్యాయం 5

# విశ్వనగరంగా హైదరాబాద్

# 5.1 విశ్వ నగరం - ఒక దార్శనికత

> *"విశ్వనగరం అనే మాటని ఉపయోగించాలని నేను మొట్టమొదట అనుకున్నప్పుడు నాకు ఒక సంగతి స్పష్టంగా తెలుసు. దానితో నేను ఒక విస్పష్టమైన వ్యత్యాసాన్ని చూపించదలచుకున్నాను. అది సమకాలీన చరిత్ర నిర్మాణానికి 'విశ్వ' భావనను పునాదిగా చేయడం."*
>
> *- ప్రొఫెసర్ సాస్కియా ససేన్*

విశ్వ ఆర్థిక వ్యవస్థకు ఆయువుపట్లు అయిన కేంద్రాలలో ఒకటిగా హైదరాబాద్ నగరాన్ని పెంచి, పోషించడంలో ఉత్ప్రేరకాలుగా పాత్ర వహిస్తున్న రంగాలు సమాచార సాంకేతిక విప్లవం, ఆర్థిక పరమైన ప్రపంచీకరణ, రాజకీయ నాయకత్వాలను చెప్పుకోవాలి. గడచిన దశాబ్దాలు హైదరాబాద్‌ను అత్యంత వేగవంతంగా పరివర్తన చేశాయి. ఐటి వృద్ధి హైటెక్ నగరంగా రూపుదిద్దుకోడానికి దారి తీసింది. ఐటి వ్యాపార ఔత్సాహిక సంస్థల కూడలులు భారీ స్థాయిలో సేవలందించడానికి, ఉపాధి కల్పనకు, పెట్టుబడి అవకాశాలకు ఈ నగరం వేదిక అయింది. ఏమైనప్పటికీ, వేగవంతమైన అభివృద్ధి, దేశంలోని ఇతర ప్రాంతాల నుండి ఉవ్వెత్తున తరలి రావడం కారణాలుగా అభివృద్ధి ఒక చోట ఒక స్థాయిలో, మరో చోట మరో స్థాయిలో అన్నట్లుగా జరిగింది. హైదరాబాద్‌లో సుమారు కోటి మంది జనాభా ఉండగా, అక్కడ మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కొరవడ్డాయి. విశ్వనగరం కావాలన్న నగర ఆకాంక్షలు నెరవేరాలంటే నగర మౌలిక సదుపాయాలను, నగర సౌకర్యాలను మెరుగుపరచడం మీద బాగా శ్రద్ధ వహించడం అనివార్యం.

## విశ్వ నగరానికి దార్శనిక పత్రం

"హైదరాబాద్‌ను విశ్వ నగరంగా చేయడానికి అవసరమైన దార్శనిక పత్రాన్ని" తయారు చేసే ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వం నిమగ్నమై ఉంది. ఈ పత్రం బాధ్యతను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ రీజియన్ (హెచ్.ఎం.డి.ఏ)కు అప్పగించారు. ఈ పని ఇప్పుడు ప్రతిపాదన దశలో ఉంది. విశ్వ నగర ప్రణాళికతో పాటు దార్శనిక పత్రం వివిధ నూతన ప్రయత్నాలను, భౌతికమైన, సామాజికమైన సదుపాయాల అభివృద్ధులను కూడా పొందుపరుస్తుంది.

## బృహత్ ప్రణాళికల విలీనీకరణ

రాష్ట్ర రాజధానిని విశ్వ నగరంగా పరివర్తన చేసే ప్రయత్నంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్ (హెచ్.ఎం.ఆర్)కి సంబంధించిన మొత్తం అయిదు నోటిఫైడ్ బృహత్ ప్రణాళికలనూ, మాండలిక నియంత్రణలనూ విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, ప్రస్తుత అయిదు మాండలిక బృహత్ ప్రణాళికలనూ సమన్వయీకరించి, ఒకే బృహత్ ప్రణాళికగా సిద్ధం చేయాలని ప్రతిపాదించారు. పరిపాలనాధికారులు మెరుగైన రీతిలో ప్రణాళికలు వేయడానికీ, సామాన్య ప్రజలు కూడా సులభంగాఅర్థం చేసుకోవడానికీ వీలుగా ఈ కొత్త బృహత్ ప్రణాళికను సిద్ధం చేయాలని తలపెట్టారు.

## నూతన పారిశ్రామిక విధానం 2014లో హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ పారిశ్రామిక పరిస్థితిని పునరుజ్జీవింపజేయాల్సిన అవసరం ఉన్నదని నూతన పారిశ్రామిక విధాన చట్టము గుర్తిస్తోంది. రాష్ట్రంలో మందగమనంలో ఉండిపోయిన పారిశ్రామికాభివృద్ధికి తిరిగి ఊపు తేవడానికి 14 అతి ముఖ్య రంగాలను నూతన పారిశ్రామిక

విధానం గుర్తించింది. హైదరాబాద్ పారిశ్రామిక జీవావరణ వ్యవస్థను పునరావిష్కరించవలసిన అవసరాన్ని ఈ విధానం నొక్కి చెప్పింది. మొత్తం రాష్ట్రం అభివృద్ధి చెందడానికి వీలుగా హైదరాబాద్‌ను వృద్ధి సారథిగా ఉపయోగించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడం జరిగింది.

## హైదరాబాద్ సందడి

హైదరాబాద్‌ను అసలు సిసలు అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో 'హ్యాపెనింగ్ హైదరాబాద్' పేరుతో ఒక వార్షిక ప్రచారోద్యమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. ఆ ఉద్యమంలో నగరంలో ఏడాది విశేష సంఘటనలను చాటుతారు. కళలు, సంస్కృతి, క్రీడలు, వ్యాపారోత్సాహం మొదలైన వాటిలో సమాజాన్ని మరింతగా నిమగ్నం చేయడానికీ, మాటామంతీ నెరపడానికీ ఉద్దేశించిన కార్యక్రమాలకు అండదండనివ్వడమే ఈ హైదరాబాద్ సందడి ఉద్దేశ్యం.

## సురక్షితమైన విశ్వనగరం

నేరాలను నిరోధించడం ద్వారా పౌరులకు రక్షణను, భద్రతను కల్పించడం రాష్ట్రం ప్రధాన కర్తవ్యం. రాష్ట్రంలో స్థానిక పెట్టుబడులను మాత్రమే కాక, విదేశీ పెట్టుబడులను కూడా ఆకర్షించడానికి శాంతి భద్రతలు ఇంతకింతగా దోహదం చేస్తాయి. ఈ నేపథ్యంలో సునిశితమైన నిఘా, అవసరమైన చోటికి శీఘ్రంగా పోలీసులు తరలి వెళ్ల గలిగే శక్తి చాలా కీలకమైనవి. హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులకు 4,433 వాహనాలను కొనుగోలు చేయడానికి వర్తమాన సంవత్సరంలో ప్రభుత్వం రూ. 271 కోట్లను మంజూరు చేసింది. వీటిలో ఆధునిక సాంకేతిక సదుపాయాలు కలిగిన 3,883 వాహనాలను ఇప్పటికే కొనడం జరిగింది. రాష్ట్రంలో తక్కిన తొమ్మిది జిల్లాలకూ కలిపి కొనుగోలు చేయడానికి అనుమతించిన వాహనాలు 550. ఫిర్యాదు గానీ, టెలిఫోన్ పిలుపు గానీ అందుకున్న 10 నిముషాల లోపున స్పందించడానికి వీలుగా 1500 మోటార్ సైకిళ్లను సైబరాబాద్ పోలీసులకు సమకూర్చడం జరిగింది. ఇది ఒక అపూర్వమైన చొరవ. పోలీస్ స్టేషన్‌లలో చాలా భాగానికి కనీస సదుపాయాలు లేవు. నగరంలో, జిల్లా ప్రధాన కార్యాలయంలో, గ్రామంలో ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్‌కు ప్రభుత్వం వరుసగా రూ. 75,000, రూ. 50,000, రూ. 25,000 కేటాయించింది.

కొత్తగా చేపట్టిన సి.సి.టి.వి ప్రాజెక్టులో భాగంగా 2015-16లో హైదరాబాద్ నగరంలో లక్ష సి.సి.టి.వి కెమేరాలను నెలకొల్పే ప్రణాళికను ప్రభుత్వం చేపట్టింది. ప్రతిపాదిత కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు ఈ కెమేరాలన్నింటినీ అనుసంధానం చేస్తారు. ట్రాఫిక్ నియంత్రణలను ఉల్లంఘించిన వారికి విధించిన జరిమానాల చెల్లింపులకు హైదరాబాద్ పోలీస్ వ్యవస్థ ఇప్పటికే ఇ-చలాను విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఈ విధానానికి వాహన యజమానుల నుంచి ఇబ్బడిముబ్బడిగా మద్దతు లభించింది. ఇక హైదరాబాద్ / సైబరాబాద్ పరిధుల లోని అన్ని పోలీస్ స్టేషన్‌లలోనూ ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థల అండదండ కలిగిన రిసెప్షన్ సెంటర్ - కమ్ - సహాయక కేంద్రాలను నెలకొల్పడం జరిగింది. ఈ చర్యలన్నీ పోలీసు శాఖ క్రియాశీల సామర్థ్యాన్ని ఇప్పటికే కీలకమైన స్థాయిలో మలుపు తిప్పాయి. అవసరమైన చోటికి శీఘ్రంగా చేరుకోవడం ద్వారా, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పౌరులకు స్నేహశీలమైన సంస్థగా పోలీసు శాఖను తీర్చిదిద్దడంలో ముందుకు నడిపించాయి.

## సమాచార సాంకేతికరంగ పెట్టుబడి ప్రాంతం

- నగరంలో సమాచార సాంకేతిక పరిశ్రమను అభివృద్ధి చేయడానికీ, పటిష్ఠం చేయడానికీ బాటను సుగమం చేస్తూ, 202 చదరపు కిలోమీటర్ల పరిధిలో సమాచార సాంకేతికరంగ పెట్టుబడి ప్రాంతాన్ని నెలకొల్పడానికి కేంద్రం ఇప్పటికే ఆమోదం తెలిపింది. హైదరాబాద్‌లోనూ, చుట్టుపక్కల వ్యాపించి ఉండే ఈ ప్రాంతంలో 2.19 లక్షల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు ప్రవహించే అవకాశము, ప్రత్యక్షంగా 15 లక్షల ఉద్యోగాలను కల్పించే అవకాశము ఉన్నాయి.
- గచ్చిబౌలి, మాదాపూర్‌లతో సహా సైబరాబాద్ అభివృద్ధి ప్రాధికార సంస్థ (సి.డి.ఏ), మామిడిపల్లి, రావిర్యాల్, ఆదిబట్ల, మహేశ్వరం ప్రాంతాలతో సహా హైదరాబాద్ విమానాశ్రయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (హాడా), ఉప్పల్, పోచారం ప్రాంతాలతో సహా అనేక ప్రాంతాలు ఐ.టి.ఐ.ఆర్‌లో భాగం.

ఐ.టి.ఐ.ఆర్ కింద విధాన స్థాయిలో తెలంగాణ ప్రభుత్వం అనేక ప్రయోజనాలనూ, ప్రోత్సాహకాలను సృష్టించింది. వీటిలో పెట్టుబడులను వేగవంతం చేయడానికి దోహదకరంగా జోనింగ్ నియంత్రణల నుంచి మినహాయింపు, కన్వర్షన్ చార్జీల నుంచి మినహాయింపు, ఎఫ్ఏఎస్ / ఎఫ్ఎస్ఐ సడలింపు, సమర్థంగా ఆమోదాలు తెలిపే వ్యవస్థ, చట్టబద్ధమైన ఆమోదాలు మొదలైనవి వీటిలో భాగం.

## హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్

సదుపాయకరమైన, సమర్థమైన ప్రజా రవాణా వ్యవస్థ లోపించిన నేపథ్యంలో నగరంలో రాకపోకల రద్దీ, రవాణా సదుపాయాల పరిస్థితిపై ఆందోళన చెందవలసిన అవసరముంది. నగరంలో సుమారు 80 లక్షల మోటారు ప్రయాణాలు జరిగేతే, వాటిలో ప్రజా రవాణా వ్యవస్థ భాగం బొత్తిగా 44 శాతం మాత్రమే. ప్రస్తుతం 30 లక్షలకు పైగా వాహనాలు నగరంలో సంచరిస్తుండగా, ఏటా మరో 2 లక్షల వాహనాలు వాటికి కొత్తగా తోడవుతున్నాయి. వీటివల్ల రహదారుల మీద రాకపోకలు స్థంభించడమే కాక, నగరంలో కాలుష్యం పెరిగిపోతోంది.



మెట్రో స్టేషన్

72 కిలోమీటర్ల నిడివితో చేపట్టిన హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు, ప్రపంచంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పి.పి.పి) విధానంలో చేపట్టిన అతి పెద్ద జన రవాణా ప్రాజెక్టు. వాస్తవానికి చాలా నగర రవాణా ప్రాజెక్టులు ఆర్థికంగా విజయవంతం కాలేదు. అయితే, ఆర్థికంగా గిట్టుబాటు చేసేలా నవ్యావిష్కరణతో గావించిన రూపకల్పన ఈ హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు. మెట్రో స్టేషన్‌లలోనూ, మెట్రో డిపోలలోనూ వాహనాలను నిలిపి ఉంచే, జనసమ్మర్దం కలిగే ఆవరణలలో వాణిజ్య అవకాశాలను కల్పించడం ద్వారా, స్థిరాస్తుల అభివృద్ధి ద్వారా ఈ ప్రాజెక్టును ఆర్థికంగా గిట్టుబాటు చేయగలమని ఆశిస్తున్నారు. ప్రయాణికుల రవాణా చార్జీల ద్వారా 55 శాతం రాబడిని, స్థిరాస్తుల అభివృద్ధి ద్వారా 40 శాతం రాబడిని, వాణిజ్య ప్రకటనలు తదితర మార్గాల ద్వారా 5 శాతం రాబడిని ఈ ఆర్థిక నమూనా అంచనా వేస్తోంది. నిర్మాణానికి పట్టే అయిదేళ్ల కాలవ్యవధితో కలిపి, 35 ఏళ్ల కాలాన్ని ప్రాజెక్టుకు రాయితీ వ్యవధిగా అనుమతించారు. దీనిని మరో 25 ఏళ్ల పాటు పొడిగించే అవకాశం కూడా ఉంది.

ఆర్థికంగా గిట్టుబాటు కావడానికి దోహదం చేసేలా, భూమికి కొంత ఎత్తున రవాణా సాగించేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దీని వల్ల నగరంలో కర్బన ఉద్గారాల కాలుష్యం కూడా తగ్గిపోతుంది. పెద్ద రైళ్లతో, బస్సు డిపోలతో, రాకపోకల పరిధిలో తిరిగే బస్సులతో, సమీపంలోని నివాస ప్రాంతాలకు, వాణిజ్య సముదాయాలకు కలిపేలా ఎత్తైన మెట్రో బాటకు దిగువన స్కై-వాక్‌లతో, సైకిల్ ప్రయాణానికి ఇతర మోటారేతర రవాణా సదుపాయాల (ఎన్.ఎం.టి)తో, కాలినడకన వెళ్లే వారికి, వీధి అరుగులకు కల్పించే సదుపాయాలతో అనుసంధానం ఈ ప్రాజెక్టులో భాగం. ఏతావతా ఈ ప్రాజెక్టు కేవలం ప్రజా రవాణా వ్యవస్థ కాదు. ప్రజలకు సహాయకరమైన, హరితభరితమైన నగరంగా హైదరాబాద్‌కు తిరిగి రూపకల్పన గావించే ఒక అవకాశం. భూమికి కొంత ఎత్తున నెలకొంటున్న స్టేషన్‌లను ప్రకృతి హితమైనవిగానూ, కనువిందు చేసేవిగానూ రూపుదిద్దుతున్నారు.

## హెచ్.ఎం.ఆర్ ప్రాజెక్టు కీలకమైన అంశాలు

- ప్రతి 30 మీటర్లకు (100 అడుగులకు) ఒకటి వంతున 2 మీటర్లు (7 అడుగుల) నేల మీద నిర్మించిన స్థంభాలపై ఆకాశ మెట్రో రైలు మార్గం నిర్మాణమవుతోంది.
- ముందుకు వెళ్లే రైలుకు, వెనుకవైపు వచ్చే రైలుకు రెండింటికీ చెరో రైలు మార్గంతో 10 మీటర్లు (33 అడుగులు) ఎత్తున ఆకాశ బాటను నిర్మిస్తున్నారు.
- సగటున ప్రతి కిలోమీటరు దూరానికి ఒక స్టేషన్ చొప్పున, మొత్తం 63 తావులలో 66 స్టేషన్‌లను నిర్మిస్తున్నారు. వీటిలో 3 పెద్ద స్టేషన్‌ల నుంచి మారే స్టేషన్‌లు.
- కారిడార్ - 1 : మియాపూర్ - ఎల్.బి. నగర్ (29 కి.మీ, 27 స్టేషన్‌లు)
  కారిడార్ - 2 : జూబిలీ బస్ స్టేషన్ - ఫలక్‌నుమా (15 కి.మీ, 16 స్టేషన్‌లు)
  కారిడార్ - 3 : నాగోల్ - శిల్పారామం (28 కి.మీ, 23 స్టేషన్‌లు)
- ఉన్నత భద్రతా ప్రమాణాలతో అత్యాధునిక సిగ్నల్ వ్యవస్థలు - సి.బి.టి.సి (కమ్యూనికేషన్ ఆధారిత ట్రెయిన్ నియంత్రణా వ్యవస్థ) సాంకేతిక పరిజ్ఞానాన్ని భారతదేశంలో మొదటి సారిగా వినియోగంలోకి తెస్తున్న ప్రాజెక్టు.
- మెరుగైన భద్రత కోసం కోచ్‌లలో వీడియో కెమేరాలు, స్టేషన్‌లలో సి.సి.టి.విలు.
- రైలు పెట్టెల ఆటోమేటిక్ తలుపులు కేవలం ప్లాట్‌ఫారాల మీద మాత్రమే తెరుచుకునే కట్టడి. విశాలమైన, తేలికపాటి అయిన, ఎయిర్ - కండిషన్ చేసిన రైలుపెట్టెలు. తాకించాల్సిన అవసరం లేని స్మార్ట్ కార్డుల సాయంతో అత్యాధునికమైన ప్రవేశ, నిర్గమన ద్వారాలు.

## ప్రయోజనాలు

- తక్కువ విద్యుచ్ఛక్తి వినియోగం (రోడ్డు వాహనాలతో పోలిస్తే అయిదో వంతు), వాయు, శబ్ద కాలుష్యాలలో గణనీయమైన తగ్గుదల.
- నగర ఆవరణ వినియోగంలో అత్యున్నత సామర్థ్యం. భూమి స్థాయిలో కేవలం 2 మీటర్లు ( 7 అడుగుల) వెడల్పును తీసుకుంటుంది. ఒక రైల్ లేన్ ఏడు బస్ లేన్‌లతో లేదా 24 కార్ లేన్‌లతో దీటుగా ఉంటుంది.
- మూడు పెట్టెల (కోచ్‌ల) బండి 1000 మంది ప్రయాణికులను తీసుకువెళ్తుంది. 6 పెట్టెల బండి 2000 మంది ప్రయాణికులను తీసుకువెళుతుంది. గంటలో, ఒక దిశలో హైదరాబాద్ మెట్రో రైలు చేరవేసే ప్రయాణికుల సంఖ్య 50,000 పైమాటే.
- గంటకు 80 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో, సగటున గంటకు 34 కిలోమీటర్ల వేగంతో (ఇది రోడ్డు మీద వాహనాలు ప్రయాణించే వేగానికి మూడింతలు).
- రైల్ టెర్మినళ్లు, బస్ డిపోలు, ఎం.ఎం.టి.ఎస్ స్టేషన్‌లు, సమీపంలోని కాలనీలకు, వాణిజ్య కూడలులకు, కార్యాలయాలకు 'మెర్రీ గో రౌండ్' బస్సు సేవలతో సాఫీ అయిన ప్రయాణ సదుపాయాలు.
- రద్దీ వేళలలో ప్రతి 2 నుంచి 5 నిముషాల మధ్య వ్యవధిలో నడిచే ఒక్కొక్క రైలు, ప్రయాణ రుసుము పరంగా సామాన్య మానవుడు భరించగలిగే రీతిలో సరసమైన ఖర్చులో ప్రయాణ సదుపాయం కల్పిస్తుంది.

ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు, ఈ ప్రాజెక్టు నగరంలోని పాత భాగాలను పునరుజ్జీవింపజేయడం మీద దృష్టి పెడుతుంది. ప్రజలకు సహాయకారి అయిన హరిత నగరంగా, ప్రపంచ వాణిజ్యానికి, పెట్టుబడులకు కేంద్రంగా హైదరాబాద్ నగరానికి కొత్త రూపురేఖలు దిద్దడం ఈ ప్రాజెక్టు ఆశయం.



తొలి పరీక్ష పరుగులలో మెట్రో రైలు

# 5.2 ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాల అభివృద్ధి

> *"ప్రపంచంతో కలసి ఉన్న ప్రతి ఒక్కరితోనూ ఒక పెద్ద అవసరమూ, ఒక పెద్ద అవకాశమూ ముడిపడి ఉన్నాయి. అవేమిటంటే ప్రతి ఒక్కరికీ ఒక గళాన్నివ్వడానికి, భవిష్యత్తు కోసం సమాజాన్ని మలచడానికి." - మార్క్ జుక్కర్‌బెర్గ్*

## హైదరాబాద్ మహానగరాభివృద్ధి ప్రాధికార సంస్థ

మారుతున్న అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా, ప్రణాళికాబద్ధమైన పరివర్తన ప్రక్రియ ద్వారా, కాలక్రమంలో మౌలిక సదుపాయాలను అధునాతనంగా తీర్చిదిద్దడమే విశ్వ నగరం కావడానికి ముఖ్యమైన షరతు. ఈ లక్ష్యం దిశగా హైదరాబాద్ నగర పాలక సంస్థలు సమీకృత కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నాయి.

ప్రణాళికా రచన, సమన్వయం, పర్యవేక్షణ, హైదరాబాద్ మహానగర ప్రాంతం ప్రణాళికా బద్ధమైన అభివృద్ధికి మద్దతు సంపాదించడం, సాధించడాలను హైదరాబాద్ మహానగరాభివృద్ధి ప్రాధికార సంస్థ (హెచ్.ఎం.డి.ఏ) లక్ష్యంగా పెట్టుకుంది. హెచ్.ఎం.డి.ఏ అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాలు:

## హుస్సేన్ సాగర్ సరస్సు, పరీవాహ ప్రాంతం మెరుగుదల ప్రాజెక్టు

హుస్సేన్ సాగర్ లేక్ అండ్ కాచ్‌మెంట్ ఏరియా ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్టు (హెచ్.సి.ఐ.పి) పేరుతో రూ. 370.00 కోట్ల ప్రాజెక్టును హెచ్.ఎం.డి.ఏ చేపట్టింది. హుస్సేన్ సాగర్ సరస్సులో ఏడాది పొడవునా నీటి నిల్వ ఉండేలా చూడడం, సరస్సు జలాల నాణ్యతను మెరుగుపరచడం, దీనికి గానూ సరస్సులోకి కాలుష్యాలు ప్రవేశించకుండా నిరోధించడం, నిర్ణీత స్థానాలలోనూ, ఇతర స్థానాలలోనూ కూడా కాలుష్యాల ప్రవేశాన్ని అడ్డుకోవడం, సరస్సుతో నాలాలు కలిసే సంగమాలలో 500 మీటర్ల పరిధిలో పోషక పదార్థాలు ఇతోధికంగా ఉన్న పూడికను తొలగించడం, వానలు పడని రోజుల్లో వచ్చి చేరే నీటిని అడ్డుకోవడం, సరస్సుకు దూరంగా దారి మళ్లించడం, సరస్సు మొత్తం వాతావరణాన్ని, దాని పరిసరాలను మెరుగుపరచడం, జీవవైవిధ్యం సుసంపన్నం కావడానికి దోహదం చేయడం, సరస్సు ప్రాంతంలో జీవావరణ పర్యాటక అవకాశాలను పెంచడం - ఇవన్నీ ఈ ప్రాజెక్టులోని అంశాలు.

## నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్

హైదరాబాద్ నగరంలో తెలంగాణ ప్రభుత్వం పెద్ద స్థాయిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని చేపట్టింది. వాటిలో ఔటర్ రింగ్ రోడ్డు (ఒ.ఆర్.ఆర్) ఒకటి. 158 కిలోమీటర్ల నిడివి కలిగిన ఒ.ఆర్.ఆర్ పటాన్‌చెరు (ముంబైకి దారి తీసే ఎన్.హెచ్ - 65పైన ఉంది) - మేడ్చల్ సమీపంలోని కండ్లకోయి (నాగపూర్ వైపు వెళ్లే ఎన్.హెచ్ - 44 పైన ఉంది) - షామీర్ పేట (రాజీవ్ రహదారిపై ఉంది) - ఘట్‌కేసర్ (వరంగల్‌కు దారి తీసే ఎన్.హెచ్ - 163 మీద ఉంది), పెద్ద అంబర్ పేట (విజయవాడ వైపు వెళ్లే ఎన్.హెచ్-65 మీద ఉంది) - షంషాబాద్ (శ్రీశైలం వైపు వెళ్లే ఎన్.హెచ్ - 44 మీద ఉంది) - పటాన్‌చెరు (ముంబయ్ వైపు వెళ్లే ఎన్.హెచ్ - 65 మీద ఉంది)ల మీదుగా తిరుగుతుంది. ఈ విధంగా ఇది వివిధ జాతీయ రహదారులకు, రాష్ట్ర రహదారులకు, ఎం.డి.ఆర్‌లకు దారి కలుపుతుంది. ఎనిమిది బాటలతో ఆగమన నిర్గమనాలపై అదుపుతో ఒ.ఆర్.ఆర్‌ను చేపట్టడం జరిగింది. మొత్తం ప్రాజెక్టును రూ. 6,696 కోట్ల వ్యయంతో మూడు దశలలో అమలు చేయడం జరుగుతోంది.

## రేడియల్ రోడ్ల అభివృద్ధి

- ఇన్నర్ రింగ్ రోడ్డును, ఔటర్ రింగ్ రోడ్డును కలపడానికి 33 రేడియల్ దారులను గుర్తించారు. వీటిని అభివృద్ధి చేయడం వల్ల దారుల అనుసంధానం మెరుగవుతుంది.
- ఈ 33 రేడియల్ దారులలో 53.72 కిలోమీటర్ల నిడివి కలిగిన మొత్తం ఏడింటిని సుమారు రూ. 341.17 కోట్ల ఖర్చుతో పూర్తి చేయడం జరిగింది. 4 / 6 బాటలుగా వెడల్పు పెంచిన ఈ రేడియల్ దారులు ఒ.ఆర్.ఆర్ పశ్చిమ, దక్షిణ విభాగాలను ఐ.ఆర్.ఆర్‌తో కలుపుతాయి.
- ఒ.ఆర్.ఆర్ ఉత్తర, పశ్చిమం భాగాలను కలుపుతూ రూ. 287.51 కోట్ల అంచనా వ్యయంతో 54.45 కిలోమీటర్ల పొడవున 5 రోడ్లను మెరుగుపరచే పని అమలులో ఉంది. జపాన్ ఇంటర్నేషనల్ కోపరేషన్ ఏజన్సీ (జె.ఐ.సి.ఏ) రుణ సహాయంతో ఈ పని అమలు జరుగుతోంది.
- సుమారు 180 కిలోమీటర్ల నిడివి కలిగిన తక్కిన 16 రేడియల్ రోడ్ల మెరుగుదల పనులను కూడా చేపట్టడానికి ప్రభుత్వం రూ. 304.90 కోట్లు మంజూరు చేసింది.

## మౌలిక సదుపాయాల అభివృద్ధి

రంగారెడ్డి జిల్లాలో ఉప్పల్ భగత్ (వి), ఉప్పల్ (ఎం)ల వద్ద 413.32 ఎకరాల విస్తీర్ణంలో రూ. 143.51 కోట్లతో నివాస గృహ సముదాయాల లే-అవుట్‌ల అభివృద్ధిని హెచ్.ఎం.డి.ఏ చేపట్టింది. ఈ లే-అవుట్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రంగం సిద్ధమైంది.

## ఇంటర్ సిటీ బస్ టెర్మినల్

మియాపూర్‌లో హెచ్.ఎం.డి.ఏకు చెందిన 55 ఎకరాల భూమిలో ఇంటర్ సిటీ బస్ టెర్మినల్‌ను ప్రతిపాదించారు. ప్రయాణికులకు, ప్రైవేట్, ప్రభుత్వ బస్ ఆపరేటర్‌లకు ప్రాథమిక అవసరాలను కూర్చే 'ఇంటెగ్రేటెడ్ వన్ స్టాప్ ఫెసిలిటీ'గా దీనికి రూపమిచ్చారు. ప్రభుత్వపరంగా పెట్టుబడి ఏమీ పెట్టనక్కర్లేకుండానే దీనిని అభివృద్ధి చేయడం జరుగుతుంది.

## లాజిస్టిక్స్ పార్క్స్

విజయవాడ హైవే (ఎన్.హెచ్ 9) మీద బాటసింగారం వద్ద 40.0 ఎకరాలలోనూ, నాగార్జున సాగర్ హైవే మీద మంగళపల్లి వద్ద 22.0 ఎకరాలలోనూ లాజిస్టిక్స్ పార్క్‌ల నిర్మాణాన్ని హెచ్.ఎం.డి.ఏ చేపట్టింది. దీనిలో కూడా ప్రభుత్వపరంగా పెట్టుబడి ఏమీ అవసరం ఉండదు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో రూపకల్పన చేసిన ఈ ఇంటెగ్రేటెడ్ వన్ స్టాప్ సదుపాయంలో సరకు రవాణా నిర్వాహకులకు, థర్డ్ పార్టీ లాజిస్టిక్ (3పిఎల్) సర్వీస్ ప్రొవైడర్లకు, రవాణా నిర్వహణ కంపెనీలకు, ట్రక్కు డ్రైవర్లకు, గిడ్డంగులకు, పార్కింగ్ మొదలైన వాటికి అవకాశం కల్పిస్తారు.

## గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్

రాజధాని నగరము, తెలంగాణలో అతి పెద్ద నగరము కూడా అయిన హైదరాబాద్‌లో నగర సౌకర్యాలను కల్పించడం, నిర్వహించడం గావించే నగర ప్రణాళికా కార్యకలాపాలను చూసే వ్యవస్థ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్.

5 రూపాయలకు భోజన పథకం లాంటి అనేక సంక్షేమ పథకాలను జి.హెచ్.ఎం.సి అమలు చేస్తుంది.

## క్రీడాకారులకు ఫెలోషిప్‌లు

హైదరాబాద్‌ను విశ్వ నగరంగా అభివృద్ధి చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం జి.హెచ్.ఎం.సి తోడ్పాటుతో హైదరాబాద్‌ను మురికి వాడలు లేని నగరంగా తీర్చిదిద్దడానికి కంకణం కట్టుకుని ఉంది. దీనికి గానూ ఇప్పుడున్న మురికి వాడలలో జీవన పరిస్థితులను మెరుగుపరుస్తుంది. కొత్త మురికి వాడలు పుట్టిపెరగకుండా నిరోధిస్తుంది. వ్యూహాత్మకమైన రహదారి అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్.ఆర్.డి.పి)ని అమలు చేయడం ద్వారా హైదరాబాద్‌ని తొక్కిసలాట లేని నగరంగా మలుస్తుంది. హరిత హారాన్ని అమలు చేస్తుంది. తద్వారా హైదరాబాద్‌ని ప్రపంచ శ్రేణి నగరంగా చేయడానికి కృతనిశ్చయురాలై ఉంది. ఈ స్థాయిని సాధించడానికి తగిన భాగస్వాములతో అనేక కొత్త ప్రయత్నాలను చేపట్టింది. వాటిలో కొన్నింటిని ఇక్కడ ఇవ్వడం జరిగింది.

## మురికివాడలు లేని నగరం హైదరాబాద్

హైదరాబాద్‌ను మురికివాడలు లేని నగరంగా చేసే లక్ష్యంతో స్లమ్ ఫ్రీ సిటీ హైదరాబాద్ ప్రాజెక్టును ప్రారంభించడం జరిగింది. ఇప్పుడున్న మురికివాడలలో జీవన పరిస్థితులను మెరుగుపరచి, కొత్త మురికివాడలు పెరగకుండా నిరోధించడం దీని విధానం. ఈ

ప్రాజెక్టు కింద రెండు పడక గదులు, హాలు, వంటగది కలిగిన అపార్ట్‌మెంట్లను కట్టి, మురికి వాడలలో నివసిస్తున్న కుటుంబాలకు ఇవ్వడం జరుగుతుంది. ప్రాథమిక ప్రయత్నం కోసం హైదరాబాద్‌లో 10 కాలనీలను గుర్తించారు. అక్కడ ఈ ప్రాజెక్టు వడివడిగా ముందుకు సాగుతోంది.

## తొక్కిసలాటలేని నగరంగా హైదరాబాద్ - వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్.ఆర్.డి.పి)

రాకపోకలలో ఇప్పుడున్న రద్దీని, వచ్చే సంవత్సరం నాటికి పెరగగల రద్దీని దృష్టిలో పెట్టుకుని, సాఫీగా రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు ఎస్.ఆర్.డి.పి. దీని కింద రూ. 21,684 కోట్ల అంచనా వ్యయంతో ఆకాశదారులు, పెద్ద పెద్ద కారిడార్‌లు-రోడ్లు, ఫ్లై ఓవర్‌ల నిర్మాణాన్ని తలపెట్టారు.

## జీవావరణ నగరం

జీవ వైవిధ్యం పరంగా నగరాన్ని సుసంపన్నమైనదిగా చేయడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలను మొదలు పెట్టింది.

## హరిత హారం

'హరిత హారం' ప్రాజెక్టు కింద 2015లో 50 లక్షల మొక్కలను నాటే కార్యక్రమాన్ని జి.హెచ్.ఎం.సి చేపట్టింది. 10,000 ఎకరాలను హరిత భరితం చేయాలనీ, చెరువుల అభివృద్ధి ద్వారా హైదరాబాద్‌లో చెరువులను సంరక్షించాలనీ, స్మశానాలను అభివృద్ధి చేయడం వంటి మరిన్ని పనులు గావించాలనీ తలపెట్టారు.

నగరంలో చేపట్టిన వినూత్న ప్రయత్నాలలో చెప్పుకోవలసినది 'గ్రీన్ టాయిలెట్స్' భావన. దుర్గంధాన్ని నిర్మూలించే జీవావరణ ఆధారిత మరుగుదొడ్లను మద్రాస్ ఐ.ఐ.టి అభివృద్ధి చేయగా, నగరంలో చాలా అవసరమైన ప్రాంతాలను గుర్తించి, అక్కడ వీటిని నెలకొల్పడం మొదలయింది. బహిరంగ ప్రదేశాలలో, ముఖ్యంగా బస్ స్టాండ్ల వద్ద, రైల్వే స్టేషన్‌ల వద్ద, ముఖ్యమైన బహిరంగ స్థలాల వద్ద పూర్తిగా మహిళల కోసం మొట్టమొదటి సారిగా షీ-టాయిలెట్‌లను ఏర్పాటు చేయాలని తలపెట్టారు. అదే విధంగా ఎక్కువ మంది బాలికలున్న పాఠశాలలకు ప్రాధాన్యమిస్తూ, ప్రభుత్వ పాఠశాలలలో కూడా 100 మరుగుదొడ్లను నిర్మించాలని తలపెట్టారు.

## గ్రీన్ కర్టెన్

ఇంతకు ముందు చర్చించిన హరిత హారం పథకానికి తోడు, ప్రభుత్వం నగరాన్ని హరిత భరితం చేసే లక్ష్యసాధనలో 'గ్రీన్ కర్టెన్' అనే పథకాన్ని కూడా చేపట్టింది. ఈ ప్రాజెక్టు కింద 1,000 కిలోమీటర్లకు పైగా పరిధిలో చెట్లను పెంచాలని తలపెట్టారు. ఇందుకు 50 తావులను గుర్తించగా, వాటిలో 15 తావులలో మొక్కలు నాటడం పూర్తయింది.

## హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా మరియు మురుగు నీటిపారుదల బోర్డు

ప్రస్తుతం 8,31,163 వినియోగదారుల కనెక్షన్‌ల ద్వారా, 913 సంచార ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. తక్కువగా నెలకు 152 రూపాయల ధరతో, మురికి పారుదల సెస్సుతో కలుపుకుని మరియు గృహ వినియోగం నిమిత్తం 5కెఎల్ సంచార ట్యాంకర్‌కు రూ. 400 ధరతో నీటి సరఫరా గావిస్తున్నారు.

## గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు - ఒకటో దశ

ప్రధాన పథకానికి రూ. 3,375 కోట్ల ఖర్చుతో, రింగ్ మెయిన్స్ ప్రాజెక్టుకు రూ. 350 కోట్లతో, వెరసి రూ. 3,725 కోట్ల రూపాయల వ్యయంతో 172 ఎం.జి.డిల నీటిని పంపిణీ చేయడానికి గోదావరి తాగునీటి సరఫరా పథకం ఒకటో దశను హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బి చేపట్టింది. మొత్తం 186 కిలోమీటర్ల నిడివి గల గొట్టపు నీటి మార్గాన్ని వేసే పనిలో సుమారు 175 కిలోమీటర్ల భాగం పూర్తయింది. అన్ని సివిల్ పనులూ, డబ్ల్యు.టి.పి, పంప్స్ అండ్ మోటార్స్ మొదలైన పనులన్నీ పురోగతిలో ఉన్నాయి. గోదావరి రింగ్ మెయిన్స్ ప్రాజెక్టు కూడా పురోగతిలో ఉంది. 67.23 కిలోమీటర్ల మొత్తం నిడివిలో ఇప్పటికి 35.38 కిలోమీటర్లు వేయడం పూర్తయింది. ప్రధాన ప్రాజెక్టు, రింగ్ మెయిన్స్ ప్రాజెక్టు పూర్తి కావడంతోటే నగరానికి అదనంగా 172 ఎం.జి.డిల శుద్ధి చేసిన జలం అందుబాటులోకి వస్తుంది. దీనితో జి.హెచ్.ఎం.సి పరిధిలో తలసరి నీటి సరఫరా మెరుగవుతుంది.

## కృష్ణా తాగునీటి సరఫరా పథకం మూడో దశ

కృష్ణా నది నుంచి, నాగార్జున సాగర్ జలాశయం నుంచి రూ. 1,670 కోట్ల వ్యయంతో 90 ఎం.జి.డిల నీటిని సమకూర్చడం కోసం కృష్ణా తాగునీటి సరఫరా పథకం మూడో దశ ప్రాజెక్టు ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రాజెక్టు 2015 జూన్‌కల్లా

పూర్తయ్యే అవకాశముంది. దీనితో నగరానికి అదనంగా 90 ఎం.జి.డిల నీరు అందుతుంది. దీనివల్ల శుద్ధి చేసిన జలాలు నగరంలోని కీలకమైన ప్రదేశాలలో రోజూ నికరంగా అందుతాయి. జి.హెచ్.ఎం.సి శివారు ప్రాంతాలలో నీటి సరఫరా మెరుగవుతుంది.

## జాతీయ నదీ పరిరక్షణ ప్రాజెక్టు

'మూసీ నది కాలుష్యం తొలగింపు'నకు ఉద్దేశించిన ప్రాజెక్టును ఎన్.ఆర్.సి.డి కింద రూ. 335.66 కోట్లతో చేపట్టిన హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బి, ఇప్పటికే ప్రాజెక్టు మొదటి దశను విజయవంతంగా పూర్తి చేసింది. సుమారు 600 ఎం.ఎల్.డిల మురుగును శుద్ధి చేసే వ్యవస్థను జాతీయ నదీ సంరక్షణ ప్రణాళిక కింద ప్రారంభించింది. తదుపరి ప్రాజెక్టు రెండో దశకు ప్రతిపాదనలకు రూపకల్పన జరిగింది. మరో 610 ఎం.ఎల్.డిల మురుగును రూ. 923 కోట్ల ఖర్చుతో కొత్త ఎస్.టి.పిల ద్వారా శుద్ధి చేయడానికి ఉద్దేశించిన ఈ ప్రతిపాదనలను జాతీయ నదీ సంరక్షణ ప్రాజెక్టుకు, పర్యావరణ-అడవుల మంత్రిత్వ శాఖకు, భారత ప్రభుత్వానికీ ఆమోదాల నిమిత్తం పంపారు. ఈ ప్రాజెక్టును అమలు చేయడం వల్ల హైదరాబాద్ నగర మధ్యంలో మూసీ నది పొడవునా ఆరోగ్య పరిస్థితులు, పరిసరాలు చాలావరకు మెరుగుపడతాయి.

## మల్కాజ్‌గిరి నీటి సరఫరా ప్రాజెక్టు

జి.హెచ్.ఎం.సిలో మల్కాజ్‌గిరి సర్కిల్ కోసం సమగ్రమైన నీటి సరఫరా సేవల మెరుగుదల ప్రాజెక్టును 338.54 కోట్ల రూపాయల ఖర్చుతో చేపట్టారు. మొత్తం మల్కాజ్‌గిరికి నీటి నిల్వకు అవసరమైన జలాశయాలను సృష్టించడానికి, నీటికి రాక, పోక, పంపిణీ యంత్రాంగాల కల్పన, మీటర్ల అమర్చుట మొదలైన పనులు ఈ ప్రాజెక్టులో ఉంటాయి.

## శివారు ప్రాంతాలకు కొత్త నీటి సరఫరా ప్రాజెక్టులు

జెఎన్.ఎన్.యు.ఆర్.ఎం కింద హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బి చేతిలో రూ. 1,632.32 కోట్లు ఖర్చయ్యే 7 నీటి సరఫరా పథకాలున్నాయి. ఇవి రామచంద్రాపురం, పటాన్‌చెరు, ఎల్.బి.నగర్, శేరిలింగంపల్లి, అసిఫ్‌నగర్, క్రాప్రా, కూకట్‌పల్లి ప్రాంతాలలో శ్రీకారం చుట్టుకునే దశలో ఉన్నాయి.

## విశ్వవ్యాప్తమైన గుర్తింపు:

భారతదేశంలో మరింత సంప్రదాయకమైన వ్యాపార కేంద్రాలైన ముంబయ్, బెంగుళూరు నగరాలను ఇప్పుడు వెనుక వరుసకు నెట్టి, నివసించడానికి దేశంలోకెల్లా ఉత్తమ నగరంగా ముత్యాల నగరమైన హైదరాబాద్ ముందు వరుసలోకి వచ్చింది. రాజకీయ, సామాజిక వాతావరణం, వైద్య, ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు, ప్రజా సేవలు, విశ్రాంతి సదుపాయాలు, సహజమైన పరిసరాలు మొదలుగా అనేక అంశాలను లెక్కలోకి తీసుకుని, 'జీవన నాణ్యతా నివేదిక - 2015' అనే అంశంపై సలహా సంస్థ మెర్సర్ నిర్వహించిన ప్రపంచ వ్యాప్త సర్వేలో హైదరాబాద్ ఆణిముత్యంగా తేలింది.

ఆర్థిక రంగం, జీవావరణం, సమానతలలో ప్రపంచ శ్రేణికి చెందిన అత్యుత్తమ అభ్యాసాలను తెలంగాణ రాజధానిలో ప్రతిఫలించడం నేడు ప్రభుత్వం ఆర్తితో గావిస్తున్న ప్రయత్నం. విశ్వనగరంగా హైదరాబాద్ పరివర్తన అంతా పైన తెలిపి అనేక అంశాల సమాహారం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. క్రియాశీలమైన విధాన నిర్ణయాలతో ఈ ప్రక్రియకు అవకాశం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం.



*హుస్సేన్ సాగర్*

# గణాంకాలలో తెలంగాణ

## గణాంకాలలో తెలంగాణ


| వరుస సంఖ్య | విషయం | పుట |
|---|---|---|
| | **వృద్ధి చిత్రణ** | |
| 1. | తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వర్తమాన ధరలలో | 157 |
| 2. | తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేట్లు వర్తమాన ధరలలో | 158 |
| 3. | తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి, 2004-05 ప్రామాణిక ధరల ఆధారంగా | 159 |
| 4. | తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేట్లు, 2004-05 ప్రామాణిక ధరల ఆధారంగా | 160 |
| 5. | తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వర్తమాన ధరలలో (తన వంతు శాతాలుగా) | 161 |
| 6. | ఆర్థిక కార్యకలాపాల ద్వారా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువ, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, వర్తమాన ధరల ప్రాతిపదిక ఆధారంగా | 162 |
| 7. | ఆర్థిక కార్యకలాపాల ద్వారా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువ వృద్ధి రేట్లు, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, వర్తమాన ధరల ప్రాతిపదిక ఆధారంగా | 163 |
| 8. | ఆర్థిక కార్యకలాపాల ద్వారా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువ, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, స్థిరమైన 2011-12 ధరల ప్రాతిపదికగా | 164 |
| 9. | ఆర్థిక కార్యకలాపాల ద్వారా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువ వృద్ధి రేట్లు, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, స్థిరమైన 2011-12 ధరల ప్రాతిపదికగా | 165 |
| 10. | ఆర్థిక కార్యకలాపాల ద్వారా ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, వర్తమాన ధరల ప్రాతిపదిక ప్రకారంగా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువలో పరిశ్రమవారీ శాతం వాటా | 166 |
| 11. | తెలంగాణ స్థాయిలోనూ, జాతీయ స్థాయిలోనూ నికర జాతీయ ఉత్పత్తులు (ఎన్.ఎస్.డి.పి) మరియు తలసరి ఆదాయాలు, వర్తమాన, స్థిర ధరల ప్రాతిపదిక ప్రకారంగా | 167 |
| 12. | తెలంగాణ జిల్లాల స్థూల ఉత్పత్తి, వర్తమాన ధరల ప్రాతిపదిక ప్రకారంగా | 168 |
| 13. | తెలంగాణ జిల్లాల స్థూల ఉత్పత్తి, 2004-05 ధరల స్థూల ప్రాతిపదికపై | 169 |
| 14. | వర్తమాన ధరల వద్ద ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో జిల్లాల తలసరి ఆదాయం | 170 |
| 15. | స్థిరమైన 2004-05 ధరల వద్ద, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో జిల్లాల తలసరి ఆదాయం | 171 |
| | **వ్యవసాయం, తత్సంబంధిత రంగాల ప్రక్షాళన** | |
| 16. | భూమి వినియోగం వివరాలు | 172 |
| 17. | ఋతువుల వారీగా వర్షపాతం | 173 |
| 18. | సేద్యపు నీటితో సాగవుతున్న స్థూల విస్తీర్ణం, జలాధారాల వారీగా | 174 |
| 19. | సేద్యపు నీరు లభిస్తున్న నికర విస్తీర్ణం, జలాధారాల వారీగా | 174 |
| 20. | ఆహార ధాన్యాలను పండించిన విస్తీర్ణం మరియు పంట | 175 |
| 21. | జాతీయ వ్యవసాయ బీమా పథకం | 176 |

| | | |
|---|---|---|
| 22. | 2013-14లో ఉద్యాన వన పంటలు, పండించిన విస్తీర్ణం | 177 |
| 23. | సేద్యానికి సూక్ష్మ జలవనరు సదుపాయాల అవకాశాలు, ప్రస్తుత స్థాయి | 178 |
| 24. | పశుగణాభివృద్ధి లక్ష్యాలు, విజయాలు | 178 |
| 25. | చేపలు, రొయ్యల ఉత్పత్తి | 179 |
| 26. | జిల్లాల వారీగా భూవిస్తీర్ణం, అటవీ విస్తీర్ణం | 179 |
| 27. | అటవీ ఉత్పత్తుల ద్వారా లభించిన ఆదాయం | 180 |
| 28. | వన్యప్రాణి ఆశ్రయాలు, పులుల సంరక్షణ కేంద్రాలు, జాతీయ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు | 181 |
| | **ఆర్థికపరమైన మౌలిక సదుపాయాలు మరియు పారిశ్రామిక విధానం** | |
| 29. | జిల్లాల వారీగా పెద్ద పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి కల్పన | 182 |
| 30. | జిల్లాల వారీగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి కల్పన | 183 |
| 31. | 2014-15లో (2014 డిసెంబర్ వరకు) జరిగిన ఖనిజాల ఉత్పత్తి, విలువ | 184 |
| 32. | 2014-15లో (2014 డిసెంబర్ వరకు) ఖనిజాలపై ప్రభుత్వ రాబడి, జిల్లాల వారీగా | 185 |
| 33. | 30.09.2014 తేదీ నాటికి జిల్లాల వారీగా బ్యాంకు శాఖల సంఖ్య | 185 |
| | **సంక్షేమ, సాంఘిక రంగాల అభివృద్ధి** | |
| 34. | 1961 నుంచి 2011 వరకు జనాభా | 186 |
| 35. | దశాబ్దాల మధ్య జనాభా, ఆడ-మగ నిష్పత్తి హెచ్చుతగ్గుల శాతం | 187 |
| 36. | మొత్తం జనాభాలో పట్టణ జనాభా శాతం, జన సాంద్రత | 187 |
| 37. | అక్షరాస్యులు (7 ఏళ్లు, ఆ పైన వయసు కలిగిన జనాభాలో అక్షరాస్యుల శాతం) | 188 |
| 38. | పాఠశాలలలో పిల్లల చేరిక | 189 |
| 39. | పాఠశాల చదువును అర్ధాంతరంగా మానివేస్తున్న బాలల భాగం | 189 |
| 40. | ఆరోగ్యశ్రీ ఆరోగ్య సంరక్షణ ట్రస్టు పరిధిలో నిర్వహించిన ఆరోగ్య శిబిరాలు జిల్లాల వారీగా | 190 |

## 1. తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వర్తమాన ధరలలో

(కోట్ల రూపాయలలో)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2004-05 | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 (టి.ఆర్.ఇ) | 2012-13 (ఎస్.ఆర్.ఇ) | 2013-14 (ఎఫ్.ఆర్.ఇ) | 2014-15 (ఎ.ఇ) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 1. | వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్స్యసేకరణ | | | | | | | | | | | |
| 1.1ఏ | వ్యవసాయం | 9806 | 13733 | 14222 | 19743 | 23726 | 20837 | 35218 | 32801 | 40725 | 48649 | 39930 |
| 1.1బి | జీవోత్పత్తులు | 4205 | 5126 | 5381 | 6303 | 8394 | 9824 | 11732 | 19554 | 23777 | 25989 | 30584 |
| 1.2 | అటవీ ఉత్పత్తులు, కలప | 1689 | 1865 | 1947 | 2092 | 2177 | 2191 | 2767 | 3110 | 3323 | 3570 | 3869 |
| 1.3 | మత్స్య సేకరణ | 412 | 411 | 498 | 628 | 864 | 820 | 829 | 1400 | 1655 | 2337 | 2677 |
| | **వ్యవసాయ రంగం** | **16112** | **21135** | **22048** | **28766** | **35162** | **33672** | **50545** | **56866** | **69480** | **80544** | **77061** |
| 2 | గనులు, తవ్వకాలు | 4275 | 4796 | 4986 | 6071 | 7244 | 8682 | 9620 | 12273 | 13494 | 13408 | 12456 |
| 3 | వస్తూత్పత్తి | | | | | | | | | | | |
| 3.1 | నమోదైనవి | 8954 | 10668 | 15402 | 16068 | 22685 | 22106 | 32065 | 36398 | 36465 | 38424 | 42669 |
| 3.2 | నమోదు కానివి | 2909 | 3228 | 3631 | 4038 | 4359 | 4798 | 5250 | 6401 | 6366 | 6344 | 6850 |
| 4. | విద్యుచ్ఛక్తి, గ్యాస్ నీటి సరఫరా | 2510 | 2967 | 3026 | 3924 | 4012 | 5057 | 7072 | 8228 | 6143 | 7790 | 8611 |
| 5 | నిర్మాణాలు | 6785 | 8942 | 11176 | 14498 | 18909 | 20723 | 23605 | 26249 | 30092 | 32755 | 36942 |
| | **పారిశ్రామిక రంగం** | **25433** | **30601** | **38221** | **44599** | **57209** | **61367** | **77612** | **89548** | **92559** | **98721** | **107528** |
| 6 | వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు | 11689 | 14549 | 17376 | 20555 | 26313 | 26031 | 36607 | 40120 | 45787 | 50790 | 56410 |
| 7 | రవాణా, నిల్వ సదుపాయం, సమాచార సంబంధాలు | | | | | | | | | | | |
| 7.1 | రైల్వేలు | 1707 | 1733 | 2033 | 2270 | 2485 | 2777 | 2822 | 1662 | 1902 | 2082 | 2301 |
| 7.2 | ఇతర మార్గాల ద్వారా రవాణా, నిల్వచేయడం | 3718 | 4736 | 6133 | 7225 | 9191 | 10705 | 13986 | 16301 | 21274 | 24792 | 27042 |
| 7.3 | సమాచార సంబంధాలు | 1784 | 1939 | 2019 | 2274 | 2622 | 3356 | 3292 | 4406 | 4888 | 5487 | 6292 |
| 8 | రుణసహాయం, బీమా, స్థిరాస్తులు, వ్యాపార సేవలు | | | | | | | | | | | |
| 8.1 | బ్యాంకు సేవలు, బీమా | 4073 | 4373 | 5294 | 6566 | 8579 | 9361 | 11964 | 19269 | 21697 | 23751 | 28322 |
| 8.2 | స్థిరాస్తులు, నివాస గృహాల యాజమాన్యం, వ్యాపార సేవలు | 12534 | 14828 | 17523 | 21365 | 25881 | 30110 | 35543 | 41493 | 48696 | 57134 | 67106 |
| 9 | సామూహిక, సామాజిక, వ్యక్తి స్థాయి సేవలు | | | | | | | | | | | |
| 9.1 | ప్రజా పరిపాలన | 4206 | 4256 | 5054 | 5870 | 7148 | 8552 | 9164 | 11073 | 12477 | 15109 | 19839 |
| 9.2 | ఇతర సేవలు | 8690 | 10183 | 11270 | 12960 | 14792 | 17578 | 22361 | 24884 | 28322 | 33341 | 38698 |
| | **సేవల రంగం** | **48401** | **56598** | **66702** | **79086** | **97011** | **108470** | **135741** | **159209** | **185043** | **212486** | **246010** |
| | **రాష్ట్ర స్థూల ఉత్పత్తి** | **89946** | **108335** | **126971** | **152452** | **189382** | **203508** | **263898** | **305622** | **347082** | **391751** | **430599** |

టి.ఆర్.ఇ: మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటి సారి సవరించిన అంచనాలు, ఏ.ఇ: ముందస్తు అంచనాలు

సంఖ్యలను దగ్గరి పూర్ణత్వానికి సరిచేసిన కారణంగా, మొత్తాలు సమంగా రాకపోవచ్చు.

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాద్.

## 2. వర్తమాన ధరలలో తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేట్లు

(క్రితం ఏడాదిపై వచ్చిన మార్పు శాతాలలో)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 (టి.ఆర్.ఇ) | 2012-13 (ఎస్.ఆర్.ఇ) | 2013-14 (ఎఫ్.ఆర్.ఇ) | 2014-15 (ఏ.ఇ) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1. | వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్స్యసేకరణ | | | | | | | | | | |
| 1.1ఏ | వ్యవసాయం | 40.0 | 3.6 | 38.8 | 20.2 | -12.2 | 69.0 | -6.9 | 24.2 | 19.5 | -17.9 |
| 1.1బి | జీవోత్పత్తులు | 21.9 | 5.0 | 17.1 | 33.2 | 17.0 | 19.4 | 66.7 | 21.6 | 9.3 | 17.7 |
| 1.2 | అటవీ ఉత్పత్తులు, కలప | 10.4 | 4.4 | 7.5 | 4.0 | 0.6 | 26.3 | 12.4 | 6.8 | 7.4 | 8.4 |
| 1.3 | మత్స్య సేకరణ | -0.2 | 21.0 | 26.3 | 37.5 | +5.1 | 1.1 | 68.9 | 18.2 | 41.1 | 14.6 |
| | **వ్యవసాయ రంగం** | **31.2** | **4.3** | **30.5** | **22.2** | **-4.2** | **50.1** | **12.5** | **22.2** | **15.9** | **-4.3** |
| 2 | గనులు, తవ్వకాలు | 12.2 | 3.9 | 21.8 | 19.3 | 19.9 | 10.8 | 27.6 | 10.0 | -0.6 | -7.1 |
| 3 | వస్తూత్పత్తి | | | | | | | | | | |
| 3.1 | నమోదైనవి | 19.1 | 44.4 | 4.3 | 41.2 | -2.6 | 45.0 | 13.5 | 0.2 | 5.4 | 11.0 |
| 3.2 | నమోదు కానివి | 11.2 | 12.5 | 11.2 | 8.0 | 10.1 | 9.4 | 21.9 | -0.5 | -0.3 | 8.0 |
| 4. | విద్యుచ్ఛక్తి, గ్యాస్ నీటి సరఫరా | 18.2 | 2.0 | 29.7 | 2.2 | 26.0 | 39.9 | 16.3 | -25.3 | 26.8 | 10.5 |
| 5 | నిర్మాణాలు | 31.8 | 25.0 | 29.7 | 30.4 | 9.6 | 13.9 | 11.2 | 14.6 | 8.8 | 12.8 |
| | **పారిశ్రామిక రంగం** | **20.3** | **24.9** | **16.7** | **28.3** | **7.3** | **26.5** | **15.4** | **3.4** | **6.7** | **8.9** |
| 6 | వాణిజ్యం, హోటళ్ళు, రెస్టారెంట్లు | 24.5 | 19.4 | 18.3 | 28.0 | -1.1 | 40.6 | 9.6 | 14.1 | 10.9 | 11.1 |
| 7 | రవాణా, నిల్వ సదుపాయం, సమాచార సంబంధాలు | | | | | | | | | | |
| 7.1 | రైల్వేలు | 1.5 | 17.3 | 11.7 | 9.5 | 11.7 | 1.7 | -41.1 | 14.4 | 9.5 | 10.5 |
| 7.2 | ఇతర మార్గాల ద్వారా రవాణా, నిల్వసదుపాయం | 27.4 | 29.5 | 17.8 | 27.2 | 16.5 | 30.6 | 16.6 | 30.5 | 16.5 | 9.1 |
| 7.3 | సమాచార సంబంధాలు | 8.7 | 4.1 | 12.6 | 15.3 | 28.0 | -1.9 | 3.8 | 10.9 | 12.3 | 14.7 |
| 8 | రుణసహాయం, బీమా, స్థిరాస్తులు, వ్యాపార సేవలు | | | | | | | | | | |
| 8.1 | బ్యాంకు సేవలు, బీమా | 7.4 | 21.0 | 24.0 | 30.6 | 9.1 | 27.8 | 61.1 | 12.6 | 9.5 | 19.2 |
| 8.2 | స్థిరాస్తులు, నివాస గృహాల యాజమాన్యం, వ్యాపార సేవలు | 18.3 | 18.2 | 21.9 | 21.1 | 16.3 | 18.0 | 16.7 | 17.4 | 17.3 | 17.5 |
| 9 | సామూహిక, సామాజిక, వ్యక్తి స్థాయి సేవలు | | | | | | | | | | |
| 9.1 | ప్రజా పరిపాలన | 1.2 | 18.7 | 16.1 | 21.8 | 19.6 | 7.2 | 20.8 | 12.7 | 21.1 | 31.3 |
| 9.2 | ఇతర సేవలు | 17.2 | 10.7 | 15.0 | 14.1 | 18.8 | 27.2 | 11.3 | 13.8 | 17.7 | 16.1 |
| | **సేవల రంగం** | **16.9** | **17.9** | **18.6** | **22.7** | **11.8** | **25.1** | **17.3** | **16.2** | **14.8** | **15.8** |
| | **రాష్ట్ర స్థూల ఉత్పత్తి** | **20.4** | **17.2** | **20.1** | **24.2** | **7.5** | **29.7** | **15.8** | **13.6** | **12.9** | **9.9** |

టి.ఆర్.ఇ: మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటి సారి సవరించిన అంచనాలు, ఏ.ఇ: ముందస్తు అంచనాలు

సంఖ్యలను దగ్గరి పూర్ణత్వానికి సరిచేసిన కారణంగా, మొత్తాలు సమంగా రాకపోవచ్చు.

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాద్.

## 3. తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి, 2004-05 స్థిర ధరల ఆధారంగా

(కోట్ల రూపాయలలో)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2004-05 | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 (టి.ఆర్.ఇ) | 2012-13 (ఎస్.ఆర్.ఇ) | 2013-14 (ఎఫ్.ఆర్.ఇ) | 2014-15 (ఏ.ఇ) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 1. | వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్యసేకరణ | | | | | | | | | | | |
| 1.1ఏ | వ్యవసాయం | 9806 | 13125 | 12867 | 15547 | 16093 | 12623 | 16221 | 14535 | 16609 | 18767 | 14772 |
| 1.1బి | జీవోత్పత్తులు | 4205 | 4926 | 4974 | 5427 | 6107 | 6583 | 7099 | 8442 | 9181 | 9271 | 9811 |
| 1.2 | అటవీ ఉత్పత్తులు, కలప | 1689 | 1748 | 1773 | 1812 | 1851 | 1831 | 1906 | 1847 | 1886 | 1942 | 1994 |
| 1.3 | మత్స్య సేకరణ | 412 | 378 | 466 | 562 | 700 | 628 | 631 | 642 | 1050 | 1210 | 1348 |
| | **వ్యవసాయ రంగం** | **16112** | **20177** | **20079** | **23347** | **24751** | **21664** | **25858** | **25765** | **28726** | **31136** | **27926** |
| 2 | గనులు, తవ్వకాలు | 4275 | 4541 | 4737 | 5115 | 5405 | 5837 | 6244 | 6755 | 7103 | 6787 | 6139 |
| 3 | వస్తూత్పత్తి | | | | | | | | | | | |
| 3.1 | నమోదైనవి | 8954 | 10205 | 13957 | 13656 | 17996 | 17830 | 24293 | 25957 | 24759 | 25024 | 26943 |
| 3.2 | నమోదు కానివి | 2909 | 3138 | 3348 | 3547 | 3610 | 3735 | 3857 | 4434 | 4167 | 3926 | 4110 |
| 4. | విద్యుచ్ఛక్తి, గ్యాస్ నీటి సరఫరా | 2510 | 2818 | 2701 | 3331 | 3061 | 3362 | 4265 | 4684 | 3172 | 3285 | 3393 |
| 5 | నిర్మాణాలు | 6785 | 8234 | 9130 | 10405 | 11745 | 12005 | 11311 | 11012 | 11461 | 11703 | 12225 |
| | **పారిశ్రామిక రంగం** | **25433** | **28937** | **33874** | **36054** | **41816** | **42769** | **49969** | **52842** | **50661** | **50725** | **52810** |
| 6 | వాణిజ్యం, హోటళ్ళు, రెస్టారెంట్లు | 11689 | 13987 | 15883 | 17261 | 21064 | 19609 | 26319 | 27003 | 28579 | 29971 | 32199 |
| 7 | రవాణా, నిల్వ సదుపాయం, సమాచార సంబంధాలు | | | | | | | | | | | |
| 7.1 | రైల్వేలు | 1707 | 1762 | 1889 | 1988 | 2154 | 2148 | 2352 | 1351 | 1543 | 1675 | 1826 |
| 7.2 | ఇతర మార్గాల ద్వారా రవాణా, నిల్వచేయడం | 3718 | 4534 | 5607 | 6221 | 7107 | 7929 | 9623 | 10196 | 12250 | 13436 | 14456 |
| 7.3 | సమాచార సంబంధాలు | 1784 | 2079 | 2396 | 2899 | 3296 | 5762 | 7918 | 10112 | 10219 | 10823 | 12079 |
| 8 | ఋణసహాయం, బీమా, స్థిరాస్తులు, వ్యాపార సేవలు | | | | | | | | | | | |
| 8.1 | బ్యాంకు సేవలు, బీమా | 4073 | 4711 | 5852 | 7333 | 9128 | 9988 | 11854 | 18375 | 19397 | 20257 | 22485 |
| 8.2 | స్థిరాస్తులు, నివాస గృహాల యాజమాన్యం, వ్యాపార సేవలు | 12534 | 14192 | 15751 | 17841 | 19689 | 20095 | 21036 | 23238 | 24777 | 26034 | 28462 |
| 9 | సామూహిక, సామాజిక, వ్యక్తి స్థాయి సేవలు | | | | | | | | | | | |
| 9.1 | ప్రజా పరిపాలన | 4206 | 4142 | 4621 | 4982 | 5589 | 5981 | 5841 | 6378 | 6516 | 7191 | 8789 |
| 9.2 | ఇతర సేవలు | 8690 | 9711 | 10392 | 10692 | 11308 | 11630 | 13415 | 14008 | 14387 | 15180 | 16400 |
| | **సేవల రంగం** | **48401** | **55119** | **62390** | **69216** | **79335** | **83143** | **98358** | **110661** | **117668** | **124566** | **136696** |
| | **రాష్ట్ర స్థూల ఉత్పత్తి** | **89946** | **104233** | **116343** | **128618** | **145902** | **147577** | **174185** | **189269** | **197056** | **206427** | **217432** |

టి.ఆర్.ఇ: మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటి సారి సవరించిన అంచనాలు, ఏ.ఇ: ముందస్తు అంచనాలు

సంఖ్యలను దగ్గరి పూర్ణత్వానికి సరిచేసిన కారణంగా, మొత్తాలు సమంగా రాకపోవచ్చు.

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాద్.

## 4. తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేట్లు, 2004-05 ప్రామాణిక ధరల ఆధారంగా

(క్రితం ఏడాదిపై వచ్చిన మార్పు శాతాలలో)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 (టి.ఆర్.ఇ) | 2012-13 (ఎస్.ఆర్.ఇ) | 2013-14 (ఎఫ్.ఆర్.ఇ) | 2014-15 (ఏ.ఇ) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| **1.** | **వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్యసేకరణ** | | | | | | | | | | |
| 1.1ఏ | వ్యవసాయం | 33.8 | -2.0 | 20.8 | 3.5 | -21.6 | 28.5 | -10.4 | 14.3 | 13.0 | -21.3 |
| 1.1బి | జీవోత్పత్తులు | 17.1 | 1.0 | 9.1 | 12.5 | 7.8 | 7.8 | 18.9 | 8.8 | 0.4 | 6.5 |
| 1.2 | అటవీ ఉత్పత్తులు, కలప | 3.5 | 1.4 | 2.2 | 2.1 | -1.1 | 4.1 | -3.1 | 2.1 | 3.0 | 2.7 |
| 1.3 | మత్స్య సేకరణ | -8.2 | 23.1 | 20.7 | 24.6 | -10.3 | 0.5 | 49.2 | 11.4 | 15.3 | 11.4 |
| | **వ్యవసాయ రంగం** | **25.2** | **-0.5** | **16.3** | **6.0** | **-12.5** | **19.4** | **-0.4** | **11.5** | **8.4** | **-10.3** |
| 2 | గనులు, తవ్వకాలు | 6.2 | 4.3 | 8.0 | 5.7 | 8.0 | 7.0 | 8.2 | 5.1 | -4.4 | -9.6 |
| 3 | **వస్తూత్పత్తి** | | | | | | | | | | |
| 3.1 | నమోదైనవి | 14.0 | 36.8 | -2.2 | 31.8 | -0.9 | 36.2 | 6.8 | -4.6 | 1.1 | 7.7 |
| 3.2 | నమోదు కానివి | 7.9 | 6.7 | 5.9 | 1.8 | 3.4 | 3.3 | 15.0 | -6.0 | -5.8 | 4.7 |
| 4. | విద్యుచ్ఛక్తి, గ్యాస్ నీటి సరఫరా | 12.3 | -4.2 | 23.3 | -8.1 | 9.9 | 26.8 | 9.8 | -32.3 | 3.6 | 3.3 |
| 5 | నిర్మాణాలు | 21.4 | 10.9 | 14.0 | 12.9 | 2.2 | -5.8 | -2.6 | 4.1 | 2.1 | 4.5 |
| | **పారిశ్రామిక రంగం** | **13.8** | **17.1** | **6.4** | **16.0** | **2.3** | **16.8** | **5.7** | **-4.1** | **0.13** | **4.1** |
| 6 | వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు | 19.7 | 13.6 | 8.7 | 22.0 | -6.9 | 34.2 | 2.6 | 5.8 | 4.9 | 7.4 |
| 7 | **రవాణా, నిల్వ సదుపాయం, సమాచార సంబంధాలు** | | | | | | | | | | |
| 7.1 | రైల్వేలు | 3.2 | 7.2 | 5.2 | 8.4 | -0.3 | 9.5 | -42.6 | 14.2 | 8.6 | 9.0 |
| 7.2 | ఇతర మార్గాల ద్వారా రవాణా, నిల్వసదుపాయం | 21.9 | 23.7 | 11.0 | 14.2 | 11.6 | 21.4 | 6.0 | 20.2 | 9.7 | 7.6 |
| 7.3 | సమాచార సంబంధాలు | 16.6 | 15.2 | 21.0 | 13.7 | 74.8 | 37.4 | 27.7 | 1.1 | 5.9 | 11.6 |
| 8 | **రుణసహాయం, బీమా, స్థిరాస్తులు, వ్యాపార సేవలు** | | | | | | | | | | |
| 8.1 | బ్యాంకు సేవలు, బీమా | 15.7 | 24.2 | 25.3 | 24.5 | 9.4 | 18.7 | 55.0 | 5.6 | 4.4 | 11.0 |
| 8.2 | స్థిరాస్తులు, నివాస గృహాల యాజమాన్యం, వ్యాపార సేవలు | 13.2 | 11.0 | 13.3 | 10.4 | 2.1 | 4.7 | 10.5 | 6.6 | 5.1 | 9.3 |
| 9 | **సామూహిక, సామాజిక, వ్యక్తి స్థాయి సేవలు** | | | | | | | | | | |
| 9.1 | ప్రజా పరిపాలన | -1.5 | 11.6 | 7.8 | 12.2 | 7.0 | -2.4 | 9.2 | 2.2 | 10.4 | 22.2 |
| 9.2 | ఇతర సేవలు | 11.8 | 7.0 | 2.9 | 5.8 | 2.9 | 15.3 | 4.4 | 2.7 | 5.5 | 8.0 |
| | **సేవల రంగం** | **13.9** | **13.2** | **10.9** | **14.6** | **4.8** | **18.3** | **12.5** | **6.3** | **5.9** | **9.7** |
| | **రాష్ట్ర స్థూల ఉత్పత్తి** | **15.9** | **11.6** | **10.6** | **13.4** | **1.1** | **18.0** | **8.7** | **4.1** | **4.8** | **5.3** |

టి.ఆర్.ఇ: మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటి సారి సవరించిన అంచనాలు, ఏ.ఇ: ముందస్తు అంచనాలు

సంఖ్యలను దగ్గరి పూర్ణత్వానికి సరిచేసిన కారణంగా, మొత్తాలు సమంగా రాకపోవచ్చు.

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాద్.

## 5. తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వర్తమాన ధరలలో

(తన వంతు శాతాలుగా)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2004-05 | 2005-06 | 2006-07 | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 (టి.ఆర్.ఇ) | 2012-13 (ఎస్.ఆర్.ఇ) | 2013-14 (ఎఫ్.ఆర్.ఇ) | 2014-15 (ఏ.ఇ) |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 1. | వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్స్యసేకరణ | | | | | | | | | | | |
| 1.1ఏ | వ్యవసాయం | 10.9 | 12.7 | 11.2 | 13.0 | 12.5 | 10.2 | 13.3 | 10.7 | 11.7 | 12.4 | 9.3 |
| 1.1బి | జీవోత్పత్తులు | 4.7 | 4.7 | 4.2 | 4.1 | 4.4 | 4.8 | 4.4 | 6.4 | 6.9 | 6.6 | 7.1 |
| 1.2 | అటవీ ఉత్పత్తులు, కలప | 1.9 | 1.7 | 1.5 | 1.4 | 1.1 | 1.1 | 1.0 | 1.0 | 1.0 | 0.9 | 0.9 |
| 1.3 | మత్స్య సేకరణ | 0.5 | 0.4 | 0.4 | 0.4 | 0.5 | 0.4 | 0.3 | 0.5 | 0.5 | 0.6 | 0.6 |
| | **వ్యవసాయ రంగం** | **17.9** | **19.51** | **17.4** | **18.9** | **18.6** | **16.5** | **19.2** | **18.6** | **20.0** | **20.6** | **17.9** |
| 2 | గనులు, తవ్వకాలు | 4.8 | 4.4 | 3.9 | 4.0 | 3.8 | 4.3 | 3.6 | 4.0 | 3.9 | 3.4 | 2.9 |
| 3 | వస్తూత్పత్తి | | | | | | | | | | | |
| 3.1 | నమోదైనవి | 10.0 | 9.8 | 12.1 | 10.5 | 12.0 | 10.9 | 12.2 | 11.9 | 10.5 | 9.8 | 9.9 |
| 3.2 | నమోదు కానివి | 3.2 | 3.0 | 2.9 | 2.6 | 2.3 | 2.4 | 2.0 | 2.1 | 1.8 | 1.6 | 1.6 |
| 4. | విద్యుచ్ఛక్తి, గ్యాస్ నీటి సరఫరా | 2.8 | 2.7 | 2.4 | 2.6 | 2.1 | 2.5 | 2.7 | 2.7 | 1.8 | 2.0 | 2.0 |
| 5 | నిర్మాణాలు | 7.5 | 8.3 | 8.8 | 9.5 | 10.0 | 10.2 | 8.9 | 8.6 | 8.7 | 8.4 | 8.6 |
| | **పారిశ్రామిక రంగం** | **28.3** | **28.2** | **30.1** | **29.3** | **30.2** | **30.2** | **29.4** | **29.3** | **26.7** | **25.2** | **25.0** |
| 6 | వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు | 13.0 | 13.4 | 13.7 | 13.5 | 13.9 | 12.8 | 13.9 | 13.1 | 13.2 | 13.0 | 13.1 |
| 7 | రవాణా, నిల్వ సదుపాయం, సమాచార సంబంధాలు | | | | | | | | | | | |
| 7.1 | రైల్వేలు | 1.9 | 1.6 | 1.6 | 1.5 | 1.3 | 1.4 | 1.1 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 7.2 | ఇతర మార్గాల ద్వారా రవాణా, నిల్వచేయడం | 4.1 | 4.4 | 4.8 | 4.7 | 4.9 | 5.3 | 5.3 | 5.3 | 6.1 | 6.3 | 6.3 |
| 7.3 | సమాచార సంబంధాలు | 2.0 | 1.8 | 1.6 | 1.5 | 1.4 | 1.6 | 1.2 | 1.4 | 1.4 | 1.4 | 1.5 |
| 8 | ఋణసహాయం, బీమా, స్థిరాస్తులు, వ్యాపార సేవలు | | | | | | | | | | | |
| 8.1 | బ్యాంకు సేవలు, బీమా | 4.5 | 4.0 | 4.2 | 4.3 | 4.5 | 4.6 | 4.5 | 6.3 | 6.3 | 6.1 | 6.6 |
| 8.2 | స్థిరాస్తులు, నివాస గృహాల యాజమాన్యం, వ్యాపార సేవలు | 13.9 | 13.7 | 13.8 | 14.0 | 13.7 | 14.8 | 13.5 | 13.6 | 14.0 | 14.6 | 15.6 |
| 9 | సామూహిక, సామాజిక, వ్యక్తి స్థాయి సేవలు | | | | | | | | | | | |
| 9.1 | ప్రజా పరిపాలన | 4.7 | 3.9 | 4.0 | 3.9 | 3.8 | 4.2 | 3.5 | 3.6 | 3.6 | 3.9 | 4.6 |
| 9.2 | ఇతర సేవలు | 9.7 | 9.4 | 8.9 | 8.5 | 7.8 | 8.6 | 8.5 | 8.1 | 8.2 | 8.5 | 9.0 |
| | **సేవల రంగం** | **53.8** | **52.2** | **52.5** | **51.9** | **51.2** | **53.3** | **51.4** | **52.1** | **53.3** | **54.2** | **57.1** |
| | **రాష్ట్ర స్థూల ఉత్పత్తి** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** | **100.0** |

టి.ఆర్.ఇ: మూడోసారి సవరించిన అంచనాలు, ఎస్.ఆర్.ఇ: రెండోసారి సవరించిన అంచనాలు, ఎఫ్.ఆర్.ఇ: మొదటి సారి సవరించిన అంచనాలు, ఏ.ఇ: ముందస్తు అంచనాలు

సంఖ్యలను దగ్గరి పూర్ణత్వానికి సరిచేసిన కారణంగా, మొత్తాలు సమంగా రాకపోవచ్చు.

ఆధారం : సంచాలకులు, అర్థ గణాంకశాఖ, హైదరాబాద్.

## 5. ఆర్థిక కార్యకలాపాల ద్వారా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువ, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, వర్తమాన ధరల ప్రాతిపదిక ఆధారంగా

(కోట్ల రూపాయలలో)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2011-12 (ఎన్.ఎస్.) | 2012-13 (ఎన్.ఎస్.) | 2013-14 (ఎన్.ఎస్.) | 2014-15 (ఏ.ఇ.) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్స్య సేకరణ | 1553960 | 1729966 | 1951820 | 2059902 |
| | **వ్యవసాయ రంగం** | **1553960** | **1729966** | **1951820** | **2059902** |
| 2 | గనులు, తవ్వకాలు | 259371 | 283095 | 297067 | 294202 |
| 3 | వస్తూత్పత్తి రంగం | 1469005 | 1637302 | 1788986 | 1969604 |
| 4 | విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటిసరఫరా, ఇతర ఉపయుక్త సేవలు | 202395 | 218944 | 245624 | 278394 |
| 5 | నిర్మాణాలు | 769842 | 797274 | 864171 | 933262 |
| | **పారిశ్రామిక రంగం** | **2700613** | **2936615** | **3195848** | **3475462** |
| 6 | వాణిజ్యం, హోటళ్లు, రవాణా, సమాచార సంబంధాలు ప్రసారసంబంధ సేవలు | 1419356 | 1662022 | 1945319 | 2195398 |
| 7 | రుణ సదుపాయాలు, భీమా, స్థిరాస్తులు, వృత్తిపరమైన సేవలు | 1509686 | 1775020 | 2038838 | 2405223 |
| 8 | ప్రజా పరిపాలన, రక్షణ, ఇతర సేవలు | 1022783 | 1159515 | 1355247 | 1567003 |
| | **సేవల రంగం** | **3951825** | **4596557** | **5339404** | **6167624** |
| | **ఫ్యాక్టర్ కాస్ట్ వద్ద జి.వి.ఏ.** | **8206398** | **9263138** | **10487074** | **11702988** |

ఎన్.ఎస్. : సరికొత్త శ్రేణి అంచనాలు ఏ.ఇ. : ముందస్తు అంచనాలు.

సంఖ్యలను దగ్గర పూర్ణ స్థాయికి సరిచేసిన కారణంగా, మొత్తాలు సమానం కాకపోవచ్చు.

ఆధారం : కేంద్ర గణాంక కార్యాలయం, ఎం.ఓ.ఎస్.పి.ఐ. న్యూఢిల్లీ.

## 7. ఆర్థిక కార్యకలాపాల ద్వారా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువ వృద్ధి రేట్లు, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, వర్తమాన ధరల ప్రాతిపదిక ఆధారంగా

(క్రితం ఏడాదిపై వచ్చిన మార్పు శాతం)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2012-13 (ఎన్.ఎస్.) | 2013-14 (ఎన్.ఎస్.) | 2014-15 (ఏ.ఇ.) |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్స్య సేకరణ | 11.3 | 12.8 | 5.5 |
| | **వ్యవసాయ రంగం** | **11.3** | **12.8** | **5.5** |
| 2 | గనులు, తవ్వకాలు | 9.1 | 4.9 | -1.0 |
| 3 | వస్తూత్పత్తి రంగం | 11.5 | 9.3 | 10.1 |
| 4 | విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటిసరఫరా, ఇతర ఉపయుక్త సేవలు | 8.2 | 12.2 | 13.3 |
| 5 | నిర్మాణాలు | 3.6 | 8.4 | 8.0 |
| | **పారిశ్రామిక రంగం** | **8.7** | **8.8** | **8.7** |
| 6 | వాణిజ్యం, హోటళ్లు, రవాణా, సమాచార సంబంధాలు ప్రసారసంబంధ సేవలు | 17.1 | 17.0 | 12.9 |
| 7 | రుణ సదుపాయాలు, భీమా, స్థిరాస్తులు, వృత్తిపరమైన సేవలు | 17.6 | 14.9 | 18.0 |
| 8 | ప్రజా పరిపాలన, రక్షణ, ఇతర సేవలు | 13.4 | 16.9 | 15.6 |
| | **సేవల రంగం** | **16.3** | **16.2** | **15.5** |
| | **ఫ్యాక్టర్ కాస్ట్ వద్ద జి.వి.ఏ.** | **12.9** | **13.2** | **11.6** |

ఎన్.ఎస్. : సరికొత్త శ్రేణి అంచనాలు ఏ.ఇ. : ముందస్తు అంచనాలు.

సంఖ్యలను దగ్గర పూర్ణ స్థాయికి సరిచేసిన కారణంగా, మొత్తాలు సమానం కాకపోవచ్చు.

ఆధారం : కేంద్ర గణాంక కార్యాలయం, ఎం.ఓ.ఎస్.పి.ఐ. న్యూఢిల్లీ.

## 5. ఆర్థిక కార్యకలాపాల ద్వారా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువ, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, స్థిరమైన 2011-12 ధరల ప్రాతిపదికగా

(కోట్ల రూపాయలలో)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2011-12 (ఎన్.ఎస్.) | 2012-13 (ఎన్.ఎస్.) | 2013-14 (ఎన్.ఎస్.) | 2014-15 (ఏ.ఇ.) |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్స్య సేకరణ | 1553960 | 1580362 | 1640869 | 1659407 |
| | **వ్యవసాయ రంగం** | **1553960** | **1580362** | **1640869** | **1659407** |
| 2 | గనులు, తవ్వకాలు | 259371 | 260697 | 275093 | 279651 |
| 3 | వస్తూత్పత్తి రంగం | 1469005 | 1558893 | 1641285 | 1751041 |
| 4 | విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటిసరఫరా, ఇతర ఉపయుక్త సేవలు | 202395 | 206975 | 213069 | 225684 |
| 5 | నిర్మాణాలు | 769842 | 736239 | 754847 | 788553 |
| | **పారిశ్రామిక రంగం** | **2700613** | **2762804** | **2884294** | **3044929** |
| 6 | వాణిజ్యం, హోటళ్లు, రవాణా, సమాచార సంబంధాలు ప్రసారసంబంధ సేవలు | 1419356 | 1550174 | 1719867 | 1876682 |
| 7 | రుణ సదుపాయాలు, భీమా, స్థిరాస్తులు, వృత్తిపరమైన సేవలు | 1509686 | 1645071 | 1776156 | 2025588 |
| 8 | ప్రజా పరిపాలన, రక్షణ, ఇతర సేవలు | 1022783 | 1071106 | 1157256 | 1258642 |
| | **సేవల రంగం** | **3951825** | **4266350** | **4653279** | **5160912** |
| | **ఫ్యాక్టర్ కాస్ట్ వద్ద జి.వి.ఏ.** | **8206398** | **8609516** | **9178444** | **9865247** |

ఎన్.ఎస్. : సరికొత్త శ్రేణి అంచనాలు ఏ.ఇ. : ముందస్తు అంచనాలు.

సంఖ్యలను దగ్గర పూర్ణ స్థాయికి సరిచేసిన కారణంగా, మొత్తాలు సమానం కాకపోవచ్చు.

ఆధారం : కేంద్ర గణాంక కార్యాలయం, ఎం.ఓ.ఎస్.పి.ఐ. న్యూఢిల్లీ.

## 7. ఆర్థిక కార్యకలాపాల ద్వారా అఖిల భారత స్థాయి సంపదకు జమచేసిన స్థూల విలువ వృద్ధి రేట్లు, ఫ్యాక్టర్ కాస్ట్ స్థాయిలో, స్థిరమైన 2011-12 ధరల ప్రాతిపదికగా

(క్రితం ఏడాదిపై వచ్చిన మార్పు శాతం)

| వరుస సంఖ్య | పరిశ్రమ | 2012-13 (ఎన్.ఎస్.) | 2013-14 (ఎన్.ఎస్.) | 2014-15 (ఏ.ఇ.) |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | వ్యవసాయం, అటవీ ఉత్పత్తులు, మత్స్య సేకరణ | 1.7 | 3.8 | 1.1 |
| | **వ్యవసాయ రంగం** | **1.7** | **3.8** | **1.1** |
| 2 | గనులు, తవ్వకాలు | 0.5 | 5.5 | 1.7 |
| 3 | వస్తూత్పత్తి రంగం | 6.1 | 5.3 | 6.7 |
| 4 | విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటిసరఫరా, ఇతర ఉపయుక్త సేవలు | 2.3 | 2.9 | 5.9 |
| 5 | నిర్మాణాలు | -4.4 | 2.5 | 4.5 |
| | **పారిశ్రామిక రంగం** | **2.3** | **4.4** | **5.6** |
| 6 | వాణిజ్యం, హోటళ్లు, రవాణా, సమాచార సంబంధాలు ప్రసారసంబంధ సేవలు | 9.2 | 10.9 | 9.1 |
| 7 | రుణ సదుపాయాలు, భీమా, స్థిరాస్తులు, వృత్తిపరమైన సేవలు | 9.0 | 8.0 | 14.0 |
| 8 | ప్రజా పరిపాలన, రక్షణ, ఇతర సేవలు | 4.7 | 8.0 | 8.8 |
| | **సేవల రంగం** | **8.0** | **9.1** | **10.9** |
